# కథా కౌముది

## 2019 - Part 1



శ్రీ

కౌముది

మీ ముంగిళ్లలో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 204

# కౌముది మాసపత్రికలో

# 2019 జనవరి నుంచి జూన్ 2019

# వరకూ

# వచ్చిన కథలు



| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | క్షమించు నాన్నా! | ఉమా మహేష్ ఆచాళ్ళ | 4 |
| 2 | ఆత్మఘోష | డా.తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం | 8 |
| 3 | రబ్బరుబాండు | కొండపల్లి వివేకానంద | 11 |
| 4 | మంత్రం పరమార్థం | మూలా రవి కుమార్ | 16 |

| | | | |
|---|---|---|---|
| 5 | వ్యసనం | డి.వి.డి.ప్రసాద్ | 20 |
| 6 | పునాది | డా. సమ్మెట విజయ | 24 |
| 7 | దిద్దుకున్న తప్పు | అగస్త్యప్రగడ హేమంత | 28 |
| 8 | కొన్నతల్లి | రమేష్ బోడపాటి | 32 |
| 9 | నేను దొంగను కాను | దమ్మవళం శ్రీనివాస్ | 36 |
| 10 | అమ్మకాని(కో)అమ్మ | విరించి | 41 |
| 11 | ఎడం | ఛాయా మల్లిక్ | 47 |
| 12 | ఆ చోటు ఈ రోజు ఖాళీగా ఉంది | చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి | 50 |
| 13 | కనకపు సింహాసనమున | ఆకెళ్ల కృష్ణకుమారి | 52 |
| 14 | ఆలస్యపు లేఖ | ఎం.పద్మావతి | 54 |
| 15 | పాదరసం | పి.వి.శేషారత్నం | 55 |
| 16 | చిత్రపటం | శ్రీకళ అబ్బరాజు | 64 |
| 17 | పార్టీ టైమ్ | సోమ సుధేష్ణ | 68 |
| 18 | కాదంబరి కన్నీరు | ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 72 |
| 19 | మనసున మనసై | యలవర్తి అనురాధ | 75 |
| 20 | విలువలు | విద్యార్థి | 81 |
| 21 | అటు ఇటు కానీ.. | పద్మావతి దివాకర్ల | 87 |
| 22 | ఎవరు నేర్పేరమ్మ.. | బాడిశ హన్మంతరావు | 91 |
| 23 | వసంతకోకిల | కృపాకర్ పోతుల | 96 |
| 24 | పరీక్ష | రవి కొప్పరపు | 99 |
| 24 | బొమ్మ బొచ్చుకుక్క | ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 103 |
| 26 | గుండె గోస | మల్లికేశ్వర రావు కొంచాడ. మెల్బోర్న్, ఆస్ట్రేలియా | 107 |
| 27 | ఋణానుబంధం | డా. శేషు శర్మ. అట్లాంటా, జార్జియా | 116 |
| 28 | నిజాలెవరికి కావాలి! | రాధిక మంగిపూడి. సింగపూర్ | 124 |
| 29 | ఆత్మారామం | రాధిక నోరి. టల్లాసీ, ఫ్లోరిడా | 127 |
| 30 | తిరంగా ప్యార్ | రేష్మా మహమ్మద్. ఫ్రీమాంట్ , కాలిఫోర్నియా | 132 |
| 31 | ఎవరు హీరో? | మందడి శ్రీకాంత్. జోహాన్స్ బర్గ్, సౌత్ ఆఫ్రికా | 137 |

# క్షమించు నాన్నా! ఉమా మహేష్ ఆచాళ్ళ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"సర్, ఎం.డి గారు మిమ్మల్ని రమ్మంటున్నారు" పిలిచాడు అటెండర్. అకౌంట్స్ సెక్షన్ లో బిల్స్ చూస్తున్న ధరణి వెంటనే లేచి బిల్స్ ఎగిరిపోకుండా పేపర్ వెయిట్ పెట్టి ఎం.డి. గారి రూమ్ వైపు వెళ్ళాడు. తలుపు కొట్టి నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు. ముప్పై ఏళ్ళుంటాయి అతనికి. కానీ కళ్ళల్లో ఎంతో ప్రశాంతత వయసుకు మించిన పరిణతి కనిపిస్తోంది.

"రండి సర్ కూర్చోండి" అన్నాడు ఎమ్.డి కిరణ్. తన కింద పనిచేసే వాళ్లకి కూడా అతను ఇచ్చే మర్యాదని చూస్తే తెలుస్తుంది అంత పెద్ద బాధ్యత అంత చిన్న వయసులో ఎందుకు అప్పజెప్పారో.

"చెప్పండి బాబూ!" అన్నాడు ధరణి.

" సర్, మీరు ఈ కంపెనీ లో దాదాపు ముప్పై ఏళ్లుగా పనిచేస్తున్నారు. నాన్నగారు ఎప్పుడూ మీ గురుంచే చెప్తూ ఉంటారు. ఏదైనా సందేహాలుంటే మిమ్మల్నే అడగమంటారు" అన్నాడు నవ్వుతూ.

"అదంతా ఆయన అభిమానం బాబు , నాన్నగారు ఎలా ఉన్నారు?" అడిగాడు ధరణి.

"బాగానే ఉన్నారు. ఆమధ్య వచ్చిన గుండెపోటు తర్వాత పూర్తిగా ఇంటిదగ్గిరే ఉంటున్నారు కదా.. అందుకే ఇవన్నీ నేను చూసుకుంటున్నాను. మీలాంటి వాళ్ళ సహాయంతో నెమ్మదిగా పని నేర్చుకుంటున్నాను. " అన్నాడు హుందాగా.

"అదేంలేదు బాబు, మీరు నాన్నగారి లాగే మీరూ చాలా వేగంగా అన్నీ గ్రహిస్తారు , కార్మికుల కష్టాలతో సహా. అందుకే ఎప్పుడూ లాక్ అవుట్ లేకుండా నడుస్తోంది ఫ్యాక్టరీ " అన్నాడు ధరణి. నెమ్మదిగా నవ్వి తిరిగి చెప్పటం మొదలు పెట్టాడు కిరణ్ :

"అంకుల్, మీకు తెలుసుకదా, మన ఫెర్రో అల్లాయ్ ఫ్యాక్టరీ ఈ మధ్య కాలంలో నష్టాల్లో నడుస్తోంది. దీనికి ప్రధాన కారణం విద్యుత్ సరఫరా కొరత, చార్జీలు ఎక్కువగా ఉండటం. అందుకే ఈ ఏడాది బోనస్ కూడా ఇవ్వలేదు. నాన్నగారి కోరిక మీద లాక్ అవుట్ లేకుండా నడుపుతున్నాము". అన్నాడు కిరణ్

ఇవన్నీ నాకెందుకు చెబుతున్నారా అనుకుంటూ తల ఊపాడు ధరణి. ఇంతలో టీ వచ్చింది. టీ తాగుతూ చెప్పడం మొదలు పెట్టాడు కిరణ్

"అందుకే నాన్నగారితో మాట్లాడి ఒక ఆలోచన ప్రతిపాదించాను. బ్యాంకులు కూడా ఋణం ఇవ్వడానికి ఒప్పుకున్నాయి. అదేంటంటే మనమే సొంతంగా ఒక చిన్న పవర్ ప్లాంట్ (క్యాప్టివ్ పవర్ ప్లాంట్) పెడదామనుకుంటున్నాము. దీనివల్ల మనకి విద్యుత్ సరఫరా సమస్య ఉండదు. ఫ్యాక్టరీ నిరంతరం నడుస్తూ ఉంటుంది. ఉత్పత్తి బాగా పెరుగుతుంది." చెప్పాడు కిరణ్.

"చాలా మంచి ఆలోచన బాబూ. మా అందరికి కూడా చాలా సంతోషకరమైన వార్త ఇది" ఆనందంగా చెప్పాడు ధరణి.

“కానీ అంకుల్”, నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టాడు. “దీనికి కొంత భూమి కావాల్సి వస్తుంది. మన ఫ్యాక్టరీ కి ఆనుకొని మీ భూమి కొంత ఉందట కదా. నాన్నగారు చెప్పారు. ఈ ఫ్యాక్టరీ కట్టేటప్పుడు కూడా మీరు కొంత భూమి ఇచ్చారుట. అందుచేత నాన్నగారు సెంటిమెంటల్ గా ఈ పవర్ ప్లాంట్ కి కూడా మీరు మీ భూమి ఇస్తే మనం పని మొదలు పెట్టొచ్చు అన్నారు. మీకు మార్కెట్ రేటు కంటే ఎక్కువ మొత్తమే ఇమ్మని నాన్నగారు చెప్పారు . మీక్కూడా ఆ డబ్బు బ్యాంకు లో వేసుకుంటే మంచి వడ్డీ వస్తుంది. మీ రిటైర్మెంట్ తర్వాత ఉపయోగ పడుతుంది. పైగా ఆ పొలంలో ఏ పంట వేసినా పెద్దగా లాభాలు రావట్లేదని మీరు ఎవరితోనో చెప్పగా విన్నాను. మీరు ఓకే అంటే మిగతా పనులు మొదలు పెడతాము. ఏమంటారు?” అన్నాడు కిరణ్.

అప్పటివరకు ఎంతో ఉషారుగా ఉన్న ధరణికి ఒక్కసారి ఏదో తెలియని ఆందోళన. అతనికి ఆ క్షణం అమ్మ గుర్తుకు వచ్చింది. నాన్న చిన్నప్పుడే పోతే అమ్మ ఆ పొలాన్ని సాకిన తీరు గుర్తొచ్చింది. రోజుకి పద్దెనిమిది గంటలు అక్కడే గడిపేది. చివరికి అక్కడే కన్ను మూసింది.

ధరణి నెమ్మదిగా బదులు చెప్పడం మొదలు పెట్టాడు.

“బాబూ!, అప్పట్లో మా అమ్మ వైద్యానికి, కూతురి పెళ్ళికి , ఇల్లు గడవక, కొంత భూమి అమ్మిన మాట నిజమే. దానికి మీ నాన్నగారు మంచి వెలకట్టి తీసుకోవడమే కాక, నాకు ఉద్యోగం కూడా ఇచ్చారు. దానికి మా కుటుంబం మొత్తం మీకు ఎప్పుడూ రుణపడి ఉంటాము. కానీ, ఈ మిగిలిన చిన్న చెక్క, మా అమ్మ గుర్తుగా ఉంచుకోవాలని నా కోరిక. అందుకే రోజూ ఒక్కసారయినా ఆ పొలమంతా తిరిగి వస్తూ ఉంటాను. దాన్ని కూడా అమ్మడమంటే కొంచెం మనసుకి కష్టంగా ఉంది. ఇక పోతే ఫలసాయం, వడ్డీలు అంటారా. మీరు ఏమీ అనుకోక పోతే ఒక్క మాట. ఈ ఫ్యాక్టరీ పై మీరు దాదాపు ఏభై కోట్లు పెట్టి ఉంటారు. ఎప్పుడూ గొప్పగా లాభాలు చూసింది లేదు. పైగా ఈ మధ్య బాగా నష్టాలు కూడా వస్తున్నాయి. అదీకాక ఇంత పెద్ద ఫ్యాక్టరీ నడపటానికి మీరు ఎన్నో తలనొప్పులు భరించాలి. అయినా మీరెప్పుడూ, ఇది అమ్మేసి ఆ వడ్డీతో హాయిగా విదేశాల్లో స్థిరపడాలని అనుకోలేదు. ఎందుకంటే వందమందికి ఉపాధి కల్పించడంలో ఉన్న ఆనందం మీకు తెలుసు. అలాగే నా భూమిలో నేను వందమందికి సరిపడా వరి పండించగలననే ఒక ఆనందం. వర్షాలు పడకో, ఎక్కువైపోయో పంట పోవటం అనేది వేరే విషయం. ఇదంతా మనలాంటి వాళ్ళని నడిపించే ఒక వ్యసనం లాంటిది. కాకపోతే ఈ మరక మంచిదంతే. మీలాగే నేను కూడా వృత్తి అంటే ఉత్పత్తి అని నమ్ముతాను బాబు. దయచేసి ఏమీ అనుకోకండి. " ముగించాడు ధరణి కొంచెం వణుకుతున్న గొంతుతో. అతని కళ్ళల్లో సన్నటి నీటి పొర.

“అయ్యో అంకుల్ మీరు అంతగా చెప్పాలా, మరేం పర్వాలేదు. నాన్నగారు మీరు ఒప్పుకుంటేనే ఈ ప్రాజెక్ట్ ముందుకు తీసుకెళ్లామన్నారు. లేదంటే వేరే ప్రత్యామ్నాయం చూద్దాం. సారీ అంకుల్" నవ్వుతూ చెప్పాడు కిరణ్.

“నన్ను అర్థం చేసుకున్నందుకు చాలా సంతోషం బాబు” అంటూ బయటకు వచ్చాడు ధరణి. అతని మనసు ఇప్పుడు చాలా తేలికగా ఉంది. సాయంత్రం ఇంటికి వెళ్తూ, ఒకసారి పొలం అంత తిరిగి, అక్కడే ఉన్న పాకలో ఒక గంట కూర్చుని ఇంటికి వచ్చాడు.

ఆ మర్నాడు ఉదయం ఆ ఫ్యాక్టరీ లో ‘జూనియర్ ఎలక్ట్రికల్ ఇంజినీర్’ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు అవుతున్నాయి. రెండు పోస్టులకి 120 మంది ఇంజినీర్లు ఎదురు చూస్తున్నారు జీతం నెలకి 12,000/-. ఎం.డి కిరణ్ స్వయంగా ఒక్కొక్కరిని పిలిచి ఇంటర్వ్యూ చేస్తున్నాడు. తర్వాతి అభ్యర్థి వచ్చాడు. అతని బయో డేటా చూసాక, “మీరు మా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ధరణి గారి అబ్బాయా?” అడిగాడు ‘రవి’ని.

“అవును సర్,” వినయంగా చెప్పాడు రవి.

“నాన్నగారు ఎప్పుడూ చెప్పలేదే!?”, ఆశ్చర్యం గా అడిగాడు కిరణ్.

రవి ఏమి మాట్లాడలేదు.

“ ఓ.కే. మీ విద్యార్హత, మార్కులూ, చాలా సాధారణంగా ఉన్నాయి. పైగా ఎటువంటి అనుభవం లేదు. మీకు ఈ ఉద్యోగం ఎందుకు ఇవ్వాలి?” నవ్వుతూనే అడిగాడు కిరణ్.

"సర్, మా తల్లిదండ్రులతో ఇక్కడే ఉండాలని నా కోరిక. అందుచేత మీరు పొమ్మంటే తప్ప నా అంతేట నేను ఇక్కడనుంచి బయటకు పోను. ఇక ప్రతీ ఉద్యోగికీ ఉండవలసిన ముఖ్య లక్షణం నమ్మకం, అతనిపై ఆధారపడగలమనే ధీమా (డిపెండబిలిటీ). మీకు మా నాన్నగారి గురుంచి

తెలుసు. మీరు జన్యు శాస్త్రాన్ని నమ్మితే, నన్ను కూడా నమ్మొచ్చు. నాతో పాటే వచ్చిన వాళ్ళకి ఇవి లేవని కాదు. కానీ నా విషయంలో ఈ అర్హతలు పరీక్షించడానికి మీ విలువైన సమయాన్ని వృధా చేయనవసరం లేదు. ఇదొక్కటే నాకున్న అదనపు అర్హత సర్." నవ్వుతూ చెప్పాడు రవి.

"గుడ్" . అన్నాడు కిరణ్. "మరొక విషయం. మీ నాన్నగారికి నేను ఒక ప్రతిపాదన చెప్పాను. దానికి ఈ సంస్థలో పనిచేయబోయే ఉద్యోగిగా, నీ వంతు ప్రయత్నం నువ్వు చెయ్యాలి" నవ్వుతూ చెప్పాడు కిరణ్. మంచితనం వేరు. వ్యాపారం వేరు.

“అవును సర్. నిన్న మా ఇంట్లో ఈ ప్రస్తావన వచ్చింది. నాన్నగారితో నేను మాట్లాడి మిమ్మల్ని కలుస్తాను." అని చెప్పి రవి బయటకి వచ్చేసాడు.

ఆరోజు రాత్రి భోజనాల దగ్గర రవి నెమ్మదిగా మొదలు పెట్టాడు.

“నాన్నా, నేను మీకు ఒక విషయం చెప్పాలి. నేను సుధ అనే అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆ అమ్మాయి చాలా మంచిది. మా విషయం తను వాళ్ళ ఇంట్లో చెప్పింది. నాకు ఉద్యోగం ఉంటే వాళ్ళకి ఎటువంటి అభ్యంతరమం లేదట. మీకు చెప్పాను కదా, ఈరోజు మన ఫ్యాక్టరీలో ఇంటర్వ్యూకి వెళ్ళాను. మన పొలం ఇస్తే నాకు ఉద్యోగం ఇచ్చేటట్టు ఉన్నారు. మీకు తెలుసుగా నాన్నా, నా సెకండ్ క్లాస్ బి.టెక్ అదికూడా ఒక చిన్న ప్రైవేట్ కాలేజీలో , చదువుకి, నాకున్న అతి సాధారణమైన తెలివికీ ఉద్యోగం రావటం ఎంత కష్టమో. నాకు తెలుసు మీకు ఆ పొలంతో ఉన్న ప్రత్యేక అనుబంధం. కానీ, కాలంతో పాటు మనం కూడా మారాలి కదా నాన్నా. పైకెగిరిన ప్రతీ వాడు క్రింద పడక తప్పదన్నాడు న్యూటన్. "మేము తప్ప" అన్నారు రైట్ సోదరులు. దానర్థం న్యూటన్ తప్పని కాదు నాన్నా. మన భావోద్వేగాలన్నీ ప్రగతి అనే నిచ్చెనకి ఉండే మెట్లు లాంటివి. మనకి ఎంత ఉపయోగపడినా, ఒక్కో మెట్టునీ వదిలితేనే పై మెట్టుకి వెళ్ళగలం”. ఒక్క క్షణం ఆగి రవి మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు.

“నువ్వు చెప్పింది కూడా నిజమే నాన్నా, ఆ భూమితో మనం వందమందికి అన్నం పెట్టగలం. కానీ, ఆ వందమందీ, కేవలం అన్నంతోనే ఉండిపోలేరు కదా. ప్రతీ దానికీ ఒక ప్రత్యామ్న్యాయం ఉంటుంది నాన్నా. ఒకప్పుడు ఒక్కొక్కళ్ళు వంద గజాల స్థలంలో ఉండేవారు. ఇప్పుడు అదే స్థలంలో వందమంది ఒకరి మీద ఒకరు అంత కన్నా సౌకర్యంగా ఉంటున్నారు. అలాగే, వంద గజల్లో వందమందికి సరిపడా వరి పండించడమో, లేదా వంద గింజలతో వంద రోజులు బ్రతకగలిగే టెక్నాలజీ రావచ్చు. ఇదంతా డార్విన్ సిద్ధాంతమే. ఇవన్నీ కాకపోయినా, వాళ్ళు కూడా ఎంతో న్యాయం గానే అడుగుతున్నారు గా. వాళ్ళు కావాలంటే , ప్రభుత్వం ద్వారా మన భూమి న్యాయంగానే పొందగలరు. కానీ ఎంతో మర్యాదగా మనల్ని అడిగారు. ప్లీజ్ నాన్నా, కొంచెం ఆలోచించండి. " అన్నాడు రవి చాలా ఆర్తిగా.

ధరణికి ఏం మాట్లాడాలో తెలియలేదు. రవి చెప్పినదాంట్లో అతనికి ఏమీ తప్పు కానీ, స్వార్థం కానీ కనపడలేదు. పైగా ఎంతో పరిణతి ఉన్న వాడిలా మాట్లాడాడు. మరీ ఇంత చిన్న విషయాన్ని తాను భూతద్దంలో చూస్తున్నానా? అనిపించింది ధరణికి ఒక్కసారిగా.

“అలాగే రవీ. దానికి నువ్వు ఇంతలా చెప్పాలా ? అది నీదే కదా. నువ్వు చెప్పినట్టే చేద్దాం. ఇక పడుకో,” అన్నాడు ధరణి.

ఆ రోజూ ఆ తండ్రీ కొడుకులిద్దరికీ నిద్ర పట్టలేదు. నిద్రకి బాధా, సంతోషం రెండూ శత్రువులే కదా.

ఆ మర్నాడు రవి మొదట ఫ్యాక్టరీకి వెళ్లి ఎం.డి ని కలిసి ఈ విషయం చెప్పాడు. ఎం.డి కిరణ్ ఆనందంగా రవికి షేక్ హ్యాండ్ ఇచ్చి, “ఓకే రవీ, ఆ పని అవగానే నువ్వు ఉద్యోగంలో చేరొచ్చు. అన్నాడు. రవి “థాంక్ యు సర్” అని బయటకి వచ్చి, నేరుగా ‘సుధ’ని ఎప్పుడూ కలిసే చోట కలిసి, జరిగినదంతా చాలా ఉత్సాహంగా చెప్పాడు. తాను నాన్నని ఎంత గొప్పగా ఒప్పించిందీ చెప్పుకొచ్చాడు.

ఇంటికి వస్తూనే, అమ్మా, “నాన్న ఎక్కడమ్మా?” అడిగాడు.

“పొలానికి వెళ్లారురా” . చెప్పింది వాళ్ల అమ్మ.

“సరే అమ్మా.., నేను ఒకసారి పొలానికి వెళ్లి, నాన్నతో మాట్లాడి వస్తా” అంటూ, బయల్దేరాడు.

పొలం చేరుకునేసరికి, దూరంగా పాకలో నాన్న మడత కుర్చీలో కూర్చుని నిద్రపోతున్నారు. పక్కనే ఎప్పుడూ ఆయన వెంటే ఉండే చిన్న పుస్తకమూ, పెన్నూ. కాసేపు పోయాక లేపుదాం అనుకుంటూ, గాలికి ఎగిరిన ఆ పుస్తకాన్ని అందుకున్నాడు. అందులో బాగా పరిచయమైన నాన్న చేతి వ్రాత. తన పేరు కనబడటంతో ఉత్సాహంగా చదవటం మొదలుపెట్టాడు.

“ నాన్నా రవీ, రాత్రంతా నువ్వు చెప్పిందే ఆలోచించాను. నువ్వు చెప్పింది చాలా వాస్తవంగా అనిపించింది. అందుకే ఆఖరిసారిగా చూసి పోదామని ఇలా పొలం వరకు వచ్చాను. ఇవాళ ఆదివారం కదా. రోజంతా ఇక్కడే గడిపి రేపు ఉదయం ఎం.డి. గారికి పేపర్లు ఇచ్చేద్దామనుకున్నాను. కానీ ఇక్కడికి వచ్చాక ఏదో తెలియని బాధ. నీకు తెలియదు. నా ప్రతీ పుట్టినరోజుకి మా అమ్మ నాచేత ఒక మొక్క నాటించేది. ఆలా ఎదిగినవే మన పొలంలో ఉన్న చెట్లన్నీ. అందుకేనేమో వీటికీ, నాకు ఏదో తెలియని ఒక బంధం. ఇక్కడ పూల చెట్లన్నీ నా చెల్లెళ్ళూ, పళ్ళ చెట్లన్నీ నా తమ్ముళ్లు అనే భావన.

నువ్వు చెప్పింది నిజమే. డార్విన్ చెప్పినట్టు ఈ మార్పంతా జీవ పరిణామ సిద్ధాంతంలో భాగమే. కానీ, జిరాఫీ ఆహారం అందకపోతే మెడకి ఆపరేషన్ చేయించుకోలేదు. కొన్ని వందల సంవత్సరాలు తనతో తాను పోరాటం చేసి, కొన్ని తరాలు అంతరించిన తర్వాత అది ఆలా మారింది. నేను చెప్పేదేంటంటే జీవ పరిణామానికి కూడా ఒక క్రమం ఉంటుంది. బహుశా మా తరాన్ని ఇలా వదిలేస్తే బాగుండేదేమో. నిజమే, ఒక్క ఇల్లు ఉండే చోట ఇప్పుడు వంద మంది సౌకర్యంగా ఉంటున్నారు. కానీ, అందులో ఎంతమంది రోజూ సూర్యుణ్ణి ఇంట్లో చూడగల్గుతున్నారు ? ఎంతమంది విటమిన్ ‘డి’ ని మాత్రల రూపంలో తీసుకోవట్లేదు ?

మా తరంలో సినిమా కేవలం మొదటి ఆట, రెండో ఆట మాత్రమే ఆడేవి. ఎందుకంటే ఉదయం నించి సాయంత్రం వరకు పూర్తిగా "పని గంటలు" అని మేం నమ్మేవాళ్లం. కానీ ఇప్పుడు, ఉదయం ఎనిమిది గంటలకు సినిమా హాల్ దగ్గర వందల మంది యువతని చూస్తూ ఉంటే మనసుకి చాలా ఇబ్బందిగా ఉంటోంది. మీ 'ప్రగతి' లో ఇవేమీ కనబడవా ? నిజమే, పారిశ్రామికీకరణ కూడా అవసరమే. చెట్లు కొట్టి ప్రగతి మెట్లుగా మారుస్తామంటే ఎలా ? మన ఫ్యాక్టరీ దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఎన్ని వందల చెట్లు నరికేసి ఉంటారు. గేట్ దగ్గర ఒక చిన్న గడ్డితో పరుచుకున్న ‘లాన్’ ఉంటే అది పర్యావరణహిత (ఎకో ఫ్రెండ్లీ) లేదా గ్రీన్ ఫ్యాక్టరీ అయిపోతుందా ? వంద మొక్కలు పెంచిన వారికి మాత్రమే ఫ్యాక్టరీ పెట్టే అనుమతి ఇవ్వొచ్చుగా?

నీకు తెలుసుగా . నేను ఇప్పటికీ ఒక్క జ్వరం మాత్ర కూడా వేసుకోలేదు. కళ్ళజోడు వాడను. సైకిలే తొక్కుతాను. అప్పట్లో మేం ఎక్కడ నీరు కనబడితే అక్కడ త్రాగేవాళ్ళం. ఇప్పుడు నీళ్ల బాటిళ్ళూ పెరిగాయి, సెలైన్ బాటిళ్ళూ పెరిగాయి,

నిజమే, న్యూటన్ ని కాదని మనం పైకి ఎగురుతూనే ఉన్నాం. కానీ అక్కడే ఉండిపోలేదు కదా. అక్కడ ఉండటానికీ, భూమ్మీద ఉండటానికీ చిన్న తేడా "కళ్ళు తిరగటం" అనే అసౌకర్యం. అది భరించడం మా తరం వల్ల కావట్లేదు. జయింట్ వీల్ ఎక్కడం మీకు సరదా కావచ్చు. కానీ మాకు అది ప్రాణాలు అరచేత్తో పట్టుకోవడం.

మేము మందు వేసవిలో రాత్రిపూట మంచుకి దుప్పటీలు కప్పుకునేవాళ్ళం. మీరు ఏసీలు కనిపెట్టారు. కానీ అదే ఏసీలో మీకు ఎందుకు ఉక్కపోస్తోంది. నేను ఛాందస వాదిని కాదు. నెమ్మదిగా, ప్రకృతి సహజంగా ఎదగమని మాత్రమే చెబుతున్నాను.

ఇవన్నీ నేను అన్నం పెట్టే యజమానికి కానీ, కన్న కొడుకువైన నీకు గాని చెప్పలేను.

నాకు మా అమ్మ ఎంతో, నువ్వూ అంతే. అందుకే నువ్వు అడగ్గానే వెంటనే ఒప్పుకున్నాను.

కానీ, నిన్నటి నుంచి ఎందుకో ఒకటే ఆందోళన. ఛాతీలో సన్నగా మంట. నా నుంచి నేను వేరవటం నాకు తెలుస్తోంది. అందుకే ఇదంతా. నాకు ఏదైనా అయితే నా ఉద్యోగం నీకు ఇస్తారు. నా గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్ డబ్బులు నీకే వస్తాయ్. నువ్వు ఎప్పుడూ, సంతోషం గా ఉండాలి. అమ్మ జాగ్రత్త.

నాలో పనికొచ్చే అవయవాలన్నీ దానం చెయ్యి. మిగిలిన శరీరం ఇక్కడే పూడ్చెయ్యి. దాని మీద ఒక మొక్క నాటు. ఉంటాను.”

రవి కళ్ళల్లో నీళ్లు ధారల్లా కారుతున్నాయి. నాన్న మొహం నిర్మలంగా ఉంది. అమ్మ వొడిలో నిద్రపోతున్న చంటి పిల్లాడిలా. అక్కడున్న చెట్లన్నీ స్తబ్దంగా ఉన్నాయి. మౌనం పాటిస్తున్న సైనికుల్లా.

# ఆత్మఘోష

డా.తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ఇవాళ ఎందుకో అంతా సందడి గా ఉంది. అద్దె కున్న వాళ్ళు నిన్ననే సామాను మొత్తం తీసుకుని వెళ్ళి పోయారు. ఇదివరకు మూడు లేదా నాలుగు ఏళ్లు ఉండి పోయిన వాళ్ళలాగానే వీళ్ళు కూడా కనీసం వెనక్కి తిరిగి చూడకుండా పోయారు. అంతే వాళ్ళకు నాతో అనుబంధం . .

ఎవరో పని వాళ్ళు వచ్చారు. నిచ్చెన వేసుకుని పైకి ఎక్కి అటక మీద ఎన్నో ఏళ్లు గా వున్న వస్తువులు దింపుతున్నారు. నేను ఒంటరిగా ఉన్నాను.

అటక మీద నుండి దింపిన వాటిలో పాత కాలం నాటి నలుపు తెలుపులో వున్న రెండు ఫోటోలు చూడగానే ఎంతో కాలం క్రిందట పోగొట్టు కున్న ప్రియ మిత్రులను చూసినట్టు నా మనసు ఉప్పొంగింది. మంచి ఒడ్డు పొడుగు ఉండి స్పురద్రూపి అయిన ఆ ముసలి ఆయనకు నేనంటే చాలా ఇష్టం. ఆయన సాహచర్యం లో నేను నవ యవ్వనం లోని ఆనందాన్ని అనుభవించాను.

ఆయన సుఖాన్నీ, దుఖాన్ని నేను పంచుకున్నాను. ఆయన తన ప్రాణానికి ప్రాణ మైన సహచరిని పోగొట్టుకున్న బాధలో నిద్ర రాక అర్ధరాత్రి సిగరెట్ వెలిగించుకుని పచార్లు చేస్తూ , మనసులో రేగే జ్ఞాపకాల సుడి గాలిలో అసహాయం గా కొట్టుకు పోవడం చూసి నా హృదయం కరిగి పోయేది . .

ఆయనకు నేనంటే ఎంత ప్రేమో ఇంటి ముందు ఉన్న రెండు కొబ్బరి చెట్లు అన్నా అంతే ఇష్టం. స్నానం చేయాలంటే లోపలి నుండి బకెట్ లో నీళ్ళు మోసుకు వచ్చి ఆ చెట్టు మొదలు వద్ద బల్ల మీద కూర్చుని నీళ్ళు పోసుకునేవాడు. చెట్లకు క్రమం తప్పకుండా నీళ్ళు అందేవి.

పదవిలో వున్నప్పుడు దర్జాగా జీపులో తిరిగిన వాడు పదవీ విరమణ తరువాత సైకిల్ తొక్కడం మొదలు పెట్టాడు.

ప్రతీ శుక్రవారం రెండు మైళ్ళ దూరం పాత వూళ్ళో సంతకు సైకిల్ మీద వెళ్ళి కూరగాయలు కొని, ఆ బరువు సంచీలు సైకిల్ కు తగిలించుకుని ఆయాస పడుతూ తొక్కుతూ వస్తాడు.

ఇంటికి రాగానే " అమ్మా! లేత వంకాయలు తెచ్చాను! పొడి చల్లి కూర చెయ్యమ్మా !" అని కూతురుకు చెప్తాడు.

మేజిస్ట్రేటు గా పని చేసే రోజుల్లో రోజుకు ఒక గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ పేకెట్ తాగేవాడు కాస్తా ఇప్పుడు రోజుకు రెండు బర్కిలీ సిగరెట్లు కొనుక్కోవడం మొదలు పెట్టాడు..

రిటైర్ అయినాక , తన అర్ధ శరీరం తనను వదిలి పోయాక ఆయనతో నా స్నేహం మొదలయింది.

ఈ పొదుపు, జాగ్రత్త ఎందుకు అంటే అదిగో ఆ రెండో ఫోటోలో వున్న అయిదుగురు పిల్లలను పెంచి పైకి తీసుకు రావడానికి.

యాభై అయిదేళ్ళ వయసులో భార్య పోయిన మగవాడు ఎవడైనా ఆరు నెలలు తిరక్కుండానే మళ్లీ పెళ్లి చేసుకుంటాడు. అందులోనూ అందగత్తె ఆస్థిమంతురాలు అయిన ఒంటరి ఆడది సిద్ధంగా ఉన్నా మనసు చెదరని ధీమంతుడు ఆయన.

ఆయనకు నాతో పరిచయం కాక ముందే పెద్ద కూతురికి పెళ్లి చేసి పంపేసాడు. నేను చూస్తుండగానే రెండో పిల్లకు వివాహం జరిపించేసాడు.

ఇక మూడో కూతురు చదువుతాను అంటూ పట్టు బట్టింది . చదువు అయ్యింది. ఉద్యోగము వచ్చింది.అదిగో ఆ మేడ మీది గదిఆ పిల్ల

వాడుకుంటుంది. ఆయన పడక ఏమో మేడ మీది వరడాలో.

రాత్రి వేళ డాబా మీద ఒంటరిగా పడుకుని నక్షత్రాలను చూస్తూ తనని వదలి పోయిన తల్లిని తలచుకుని కుమిలి పోతూ కన్నీరు పెట్టుకునే మూడో కూతుర్ని వెదుకుతూ వెళ్ళి తల నిమిరి ఓదార్చే వాడు ఆయన

బయట ఏదో గోలగోల గా ఉంది . లారీ ఒకటి వచ్చి ఇంటి ముందు ఆగింది. ఈ సామానులు ఎక్కిస్తారేమో! వెనకాలే పెద్ద కారు కూడా వచ్చింది.

" ఆ దిగే వాళ్ళు ఎవరబ్బా? ముప్పై లలో వుంది ఆ ఇద్దరి వయసు. అన్నా చెల్లెళ్ళు ఏమో ! అరే ఆ కుర్రవాడు అచ్చంగా ఫొటో లోని ముసలాయన లాగానే వున్నాడు. ఆ అమ్మాయి ఏమో ఆయన అర్ధాంగి లా ఉంది. నిజంగా ఈ పోలికలు తర తరాలకు ఎలా వస్తాయో! "

వాళ్ళను చూస్తుంటే నా మనసు ముప్పై అయిదేళ్ళ క్రిందటి కి వెళ్లిపోయింది. నా పూర్వ వైభవం నాకు మళ్లీ వస్తుందా!

నా పొరుగు మిత్రుడి బాస్ వీళ్ళిద్దరితో ఏదో మాట్లాడు తున్నాడు. ఆయనతో వీళ్ళకి ఎందుకు పని? అసలే అతను గుండె లేని మనిషి అని విన్నాను. ఆయన కంటికి ఇల్లు అంటే నాలుగు గోడలు , ఇటుకలు సెమెంటు అట. పక్కా డబ్బు మనిషి .

ఇక్కడ వీళ్ళు అటక మీద నుంచి రోజ్ ఉడ్ మందాసనము దింపారు. ఆ ఇల్లాలు వెళ్ళి పోయినా ఆ మందాసనం నిండా వుండే దేవుళ్ళకు ఆమె మూడో కూతురు రోజూ దీపం పెట్టి పూజ చేసేది .

అమ్మ ఎక్కడ నొచ్చుకుంటుందో అన్నట్టు ప్రతి పండగ అమ్మ జరిపి నట్టే జరిపేది. సంక్రాంతికి ఇంటి ముందు ముగ్గులు వేసి చక్కెర పొంగలి చేసి దేవుడికి నైవేద్యం పెట్టేది. ఉగాది కి వేప పువ్వు పచ్చడి , పూర్ణం పోలీలు తప్పదు. దీపావళి కి కారప్పూస, రవ లడ్డు , ఇంటి ముందు ప్రమిదలలో దీపాలు వుండాల్సిందే. ఏ పండగ అయినా దేవుడి మందాసనము మామిడి ఆకులతో , మందార పూలతో కళకళ లాడాల్సిందే. ఇక కృష్ణాష్టమి వస్తే వీధి గుమ్మం నుండి దేవుడి గది దాకా కృష్ణ పాద ముద్రలు ముగ్గు వుండాల్సిందే. బాల కృష్ణుడికి పాలు ,వెన్న, అటుకులే కాకుండా చెగోడీలు, పాలకాయలు,వెన్న అప్పాలు వంటివి నైవేద్యానికి తప్పక చేసేది. బయట నిలబడిన ముసలాయన మనవడు మనవరాలు లోపలికి వస్తారేమో అని చూస్తూ వున్నా. అబ్బే నా పొరుగు మిత్రుడి బాస్ కి ఏవో కాగితాలు అందిస్తున్నారు.

"వాళ్ళు వచ్చింది ఎందుకు? తాతగారు నడిచిన నేల మీద నడిచి ఆ స్పర్శ అనుభవించడానికి కాదూ ? వాళ్ళ అమ్మలు తమ కౌమారాన్ని, యవ్వనాన్ని గడిపిన పరిసరాలలో ఆ పరిమళం పీల్చడానికే కదా ! వస్తారులే. "

ఆ ఫొటోలు మాత్రం కారు డిక్కీ లో పెట్టించారు. ఫరవాలేదు. మందాసనము లారీ లోకి ఎక్కించేశారు. ఫొటోలకు ఉన్న అద్దాలు పగిలి పోకుండా జాగ్రత్త గా పెట్టారో లేదో ఈ పిల్లలు చూడరే?

ఈ సారి అటక మీద నుండి హోమియోపతి మందులు పెట్టుకునే డబ్బాలు పెట్టే చిన్న చెక్క బీరువా దింపారు. మా సారు హోమియోపతినీ ఔపోశన పట్టారులే .

"నాన్నా! కాలిలో గుచ్చుకున్న ముల్లు రావడం లేదు అని కొడుకు అనడం తడవు " శైలీషియా ముప్పై ఒక డోసు వేసుకోరా దెబ్బకు బయటకు రావాల్సిందే. " అంటాడు.

ముక్కులో నీళ్ళు కారుతోందాఅలియం సీపా , గొంతులో నొప్పిగా వుందా ? హెపార్ సల్ఫ్, ఎడమ వైపు బాధనా? లాకేసిస్ ఉందిగా .పంటి నొప్పయితే ప్లాంటాగో రెండు వందలు పోటెన్సీ పడాలి ." ఈ మందుల పేర్లు ఆయన పిల్లలకే కాదు ఇంట్లోని గోడలకు, గుంజలకూ కంఠస్తమ్ వచ్చేశాయి. ఆ హోమియోపతి బీరువా ఇప్పుడు ఏం చేస్తారో!

బయట ఈ గలాభా ఏంటో... అరె ప్రొక్లైనర్ వచ్చింది . ఆ వెనకాల పదిమంది కూలీలు కూడా దిగారు . ఎందుకో?

ముసలాయన వున్నప్పుడు నన్ను ఎంత జాగ్రత్తగా చూసుకునేవాడు! వేరే వాళ్ళకు ఒప్పగించి వెళ్లే రోజు ఆయన హృదయ వేదన చూడలేక నాకూ కనబడని కన్నీళ్ళు వచ్చాయి.

ఆ తరువాత నా మూతి పగిలినా, ముక్కు సొట్ట పోయినా, రంగు మాసినా పట్టించుకునే వాడు ఎవడు? వాళ్ళ అవసరం కోసం కొన్నేళ్ళు ఉండి , వెళ్ళి పోయే వాళ్ళు . నా బాగోగుల గురించి ఎవరికీ పట్టలేదు.

మళ్లీ నాకు మంచి రోజులు వస్తున్నాయా? అందుకేనా ఈ పిల్లలు వచ్చింది? కళ్ల వాకిళ్ళ లోనుండి, గవాక్షాల నుండీ తొంగి చూస్తున్నా బయటకు .

లోపలికి వచ్చిన పనివాళ్ళు అటక మీది నుండి విరిగి పోయిన వీణదింపారు. ఈ వీణ మీదే ఆయన పెద్ద కూతురు సరిగమలు నేర్చుకుంది . వీణ మీద దంతంతో చేసిన నగిషీ పని చేసి వుంది. మాస్టరు గారికి ఒక వీణ, అమ్మాయికి ఒక వీణ– ఎదురు వీణ తో నేర్చుకున్నది. పెళ్లి అయ్యాక అత్తారింటికి వెళ్ళేటప్పుడు సారెలో వీణ కూడా వెళ్ళింది. అపర సరస్వతిలా వీణ వాయించేది. రెండు నెలలకు ఒకసారి తండ్రిని చూడడానికి వచ్చేది. అమ్మ పోయాక మిగతా పిల్లలను తానే తల్లిలా చేరదీసింది. ఆయనకు ఇష్టమయినవి వండి పెట్టడం, చెల్లెళ్లకు మంచి చెడు వివరించడం . రాత్రి తొమ్మిది గంటలకు నాన్న. ముందు కూర్చుని వీణ పట్టుకుంటే పదకొండు దాకా వాయించేది.

త్యాగరాజుపంచరత్న కీర్తనలలో ఒకటి అయిన " జగదానంద కారకా జయ జానకీ ప్రాణ నాయకా ను నాట రాగం ఆది తాళం లో పలికించినా, " సీతమ్మ మా యమ్మ, శ్రీ రాముడు మా తండ్రి" అని వసంత రాగం లో వాయించినా గుండె పులకించి పోవలసిందే .చుట్టూ వున్న తలుపులు ,కిటికీలు , నేల ,పైకప్పు కూడా రాగ రసానందం లో ఓల లాడ వలసిందే. ఇక్కడ ఉన్న చరాచరములు అన్నిటికీ సంగీత గంధం అంటుకుంది .

ఆఖరుగా పైనుండి ఏవో పాత పుస్తకాలు వున్న అట్ట పెట్టె , బొమ్మలున్న పేము బుట్ట దిగాయి. ఏవో హోమియోపతి పుస్తకాలతో బాటు ఒక తెల్ల కాగితాల పుస్తకం ...... తెల్ల కాగితాల పుస్తకం ఆల్బంగా రూపు మార్చుకున్నది. అది ముసలాయన ఒక్కగానొక్క కొడుకు తన ప్రియమైన సినిమా తార హేమమాలిని ఫోటోలు ఎక్కడెక్కడి నుండో సేకరించి అంటించుకున్న పుస్తకం.

ఒక్కడే కొడుకు అని వాడిని కొంచెం ఎక్కువ క్రమ శిక్షణ లో పెట్టడానికి ప్రయతించాడు పెద్దాయన.

పద్దెనిమిది ఏళ్లు వచ్చేసరికి తండ్రికి చెప్పకండా సిగరెట్ కాల్చడం, సినిమాలకు పోవడం మొదలు పెట్టాడు.

తండ్రిని ఎదిరించి మాట్లాడటం మొదలయ్యింది. ఆ ఫొటో తీసిన రోజు అలా పోట్లాడి విసురుగా బయటకు వెళ్ళిపోయాడు. అందుకే ఆ ఫోటోలో అయిదుగురు అక్కా చెల్లెళ్ళు మాత్రమే ఉన్నారు .

బయట టంగుటంగు మంటూ ఏవో శబ్దాలు వినబడు తున్నాయి. ఆ కూలీలు ఏమిటి గునపాలు ,పారలు పట్టుకుని ఇటువైపుకు వస్తున్నారు?

అయ్యో ఆ బొమ్మల పెట్టె భద్రంగా లారీ ఎక్కించండి. ఈ ఆడపిల్లలు ఎంతో ముచ్చటగా దసరాకు బొమ్మల కొలువు లో పెట్టుకునే చిలకలు, ద్రాక్ష గుత్తులు, తాజ్‌మహల్ , బుద్ధుడు, లక్ష్మీ దేవి, విష్ణుమూర్తి , రాధాకృష్ణులు, కొండపల్లి బొమ్మలు, సీతారామలక్ష్మణ ఆంజనేయులు,ఎన్నో బొమ్మలు వున్నాయి. బొమ్మల కాలు విరిగినా, సొట్ట బోయినా అపురూపం గా దాచుకునే వాళ్లే గానీ పారేయడం తెలియదు. ఇప్పటిలా ఈ రోజు మోజుపడి కొన్న వస్తువు రేపు బజారులో కొత్త మోడల్ వస్తే పాతది పారేసి కొత్తది కొనడం ఎరుగని రోజులు అవి.

ఆడపిల్లలను ఎలా జీవితం లో స్థిరపరచ గలనో అని ఆయన బెంగ పెట్టుకున్నాడు గానీ మూడో పిల్లకి పెళ్లి కుదిరే సరికి నాలుగో కూతురికి వరుడు తానే వెదుక్కుంటూ వచ్చాడు. ఆఖరి కూతురు గురించి ఎక్కువ దిగులు పెట్టుకున్నాడు ఆయన. రాత్రి వేళ అందరు పడుకున్నాక తాను రాసుకున్న జాతకాల పుస్తకం పట్టుకు కూర్చునే వాడు. ఆ పిల్ల జాతకం లో సప్తమ స్థానం లో కుజుడు ,శని ప్రభావం ఉందని, వివాహం అయినా విచ్ఛిన్న మయి పోతుందని పదే పదే పైకే అనుకునేవాడు. అందుకే ఆ అమ్మాయిని తన తలకు మించిన భారం అయినా మెడిసిన్ లో చేర్పించాడు. తన కాళ్ళ మీద తాను నిలబడుతుందన్న ఆశతో.

పేము పెట్టె లారీ లోకి చేరింది. " పాత సామాను కొనే అంగడి కి వేసేయండిరా" అని లారీ డ్రైవరుకు కు క్లీనరుకు చెప్పాడు పెద్దాయన మనవడు.

' ఇదేం ఘోరం ' అనుకునే లోగా పెద్ద ధూళి గాలిలోకి లేచింది. కూలీల గునపాలు ప్రహరీ గోడమీద దాడి చేస్తున్నాయి. గోడలు కూలి పోతున్నాయి.

"నాయనా, తల్లీ ! మీరేమిటి ఆలా పట్టనట్టు నిలబడ్డారు? ఇది మీ తాత ఎంతో ప్రేమగా కట్టుకున్న ఇల్లు! అయ్యో మీరిద్దరు కారెక్కి వెళ్ళి

పోతున్నారేమిటి? నేనంటే నాలుగు గోడలుకాదు ఇటుకలు, సిమెంటు, ఇసుక మాత్రమే కాదు. పదేళ్ళ సహవాసం మాది.

నా పొరుగు మిత్రుడి బాస్ పక్కనున్న కాంట్రాక్టరూ తో ఏదో అంటున్నాడు. " పక్కనే వున్న మా ఇంటి సైటు పన్నెండు సెంట్లు, ఇదొక పన్నెండు సెంట్లు. ఇరవై నాలుగు సెంట్ల స్థలం లో అయిదు అంతస్థులతో ఇరవై ఫ్లాట్ లు కట్ట వచ్చు. అంటే ఎనిమిది కోట్లు. ఈ కొబ్బరి చెట్లకు చోటు దండగ . కొట్టించేయి . "

పెద్ద శబ్దం తో ప్రొక్లైనర్ పని చేయడం మొదలయ్యింది. రాక్షసి లాటి మూతి తో రాళ్లు, మట్టి ఎత్తి పోస్తోంది.

" ముందు సింహ ద్వారం పని చూడండిరా " కొత్త యజమాని ఆజ్ఞ ఇచ్చాడు . కూలిన ప్రహరీ గోడలు దాటి లోపలికి వచ్చారు కూలీలు. ఒకే సారి నాలుగు గునపాలు నా గుండెను తాకాయి.

ఇంటి నంబరు 3/22 అని రాసి వున్న పలక టంగున చప్పుడు చేస్తూ క్రింద పడింది. “అయ్యో అదే నా గుర్తింపు , నా ఉనికి, నా అస్తిత్వం.” నా ఆత్మ ఘోషించింది .

మమకారాలు ,బంధాలు, అనుబంధాలు వేటికీ విలువ ఇవ్వని నేటి తరం ప్రతినిధులు వాళ్ళు. ఈ ఇంటితో పెన వేసుకున్న ఆ ముసలాయన అనుబంధం, ఆయన కష్ట సుఖాలే నావిగా చేసుకున్న నా ఆత్మీయత వాళ్ళ కళ్లకు బుద్ధిహీనతగా కనిపించ వచ్చు.

మరోసారి గునపాలు పైకిలేచి నా గుండెను తాకాయి . నా ఆత్మ ఘోష ఎవరికి వినబడుతుంది ?

## రబ్బరుబాండు

కొండపల్లి వివేకానంద

దాటుకుంటూ పోయే వీధి దీపాల వెలుతురులో చూసిన మొహమది. ఒకరోజు స్పష్టంగా గుర్తొస్తే ఇంకోరోజు అస్సలు కనబడదు. పదేళ్ల తర్వాత ఇవ్వాళ మొత్తం కనిపిస్తోంది. అదేదో నిన్నే జరిగినట్టు....

అవి కమలహాసన్ దశావతారం సినిమా రోజులు. నా వయసు 22. అప్పటికి అచంచలుణ్ణి. నాతోపాటు బస్సెక్కిన నా మిత్రుడికి పాతిక. అప్పటికే వాడు చాలా కాలం నుంచి చలిస్తున్నానని చాలా సార్లు చెప్పాడు. చదువుకునే రోజుల్లో మార్కులు నాకన్నా వాడికి తక్కువొచ్చేవి...కానీ నా కన్నా వాడే ఎక్కువ ఆకులు చదివాననేవాడు.

అసలిప్పుడు ఈ రాతంతా వీడి గురించి చెప్పడానిక్కాదు. అదిగో ఇంత రద్దీ బస్సు మధ్యలో నాకు ఐమూలగా ఓ ఇనపకమ్మికి తన మృదుత్వాన్నంతా అరగదీసుకుంటూ నిలుచున్న ఆ అలివేణి గురించి. స్త్రీలకు కేటాయించిన సీట్లలో స్త్రీలు నిండిపోవడంతో ఈ కోమలాంగి నిలబడాల్సి వచ్చింది. పోనీలే నా కంటపడింది. దివ్యసౌందర్యదర్శనం.

చాలామంది పురుషపుంగవులు త్యాగధనులై లేవబోయారు. కొందరితో వద్దని...కొందరితో అక్కర్లేదంది. నా ఒక్కడికి మాత్రం ఎందుకో లేవబుద్ధవ్వలేదు. నిజానికి పిలిచి ఒళ్లో కూర్చోబెట్టుకోవాలనిపించింది.

ఏం చేయను! చలించా. మొదటిసారి.

తనను చూస్తుంటే ఎంత హాయిగా ఉందో ప్రాణానికి.

ముంగురులంటే అవే అన్నమాట...భలే ఉన్నాయి బద్ధకంగా నొసటిపై పొర్లుతూ! దురదృష్టపు బొట్టుబిళ్ల ఎక్కడ జారిపోయిందో పిచ్చిది. కళ్లను చూద్దామంటే ధ్యానంలో ఉన్నట్టే మూసి ఉంచింది.

♪♫♪♫♬ మూసిన ముత్యాలకేలే మొరగులు ♪♫♪♫♬

డ్రైవరు బ్రేకేస్తే బావుండు...కళ్లు తెరుస్తుంది.

♪♫♪♫♬ ఆశల చిత్తానికేలే అలవోకలు ♪♫♪♫♬

అన్నమయ్య పాటలెందుకు పెట్టారో ఇప్పుడు.

ఎంత అందమైన ముక్కు. Sharp features. సంపెంగలతో ఎందుకు పోలుస్తారో...నాకైతే octopus లా ఉంటుందా పువ్వు. చిక్కటి పెదవులు...మొత్తం తేనే నిండినట్టున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ విగ్రహం నిండా తెలుగు కవులకు కావలిసినంత కాంతి విశేషము. ఆహా..!

కత్తిలా ఉంది కదా? [పక్కనుంచి నా చపలచిత్త మిత్రద్రోహి]

ఇంతసేపటి నా సౌందర్యారాధననంతా ఆ కత్తితో ఒక్క పోటు పొడిచాడు.

నేను: నువ్వూ చూస్తున్నావా?

వాడు: అందరికీ తనొక్కతే కనపడుతోంది.

నేను: కాసేపట్లో లైట్లు ఆర్పేస్తారు. అందరితో పాటు నువ్వు కూడా పడుకో...

వాడు: నువ్వేం చేస్తావ్?

నేను: తనని పిలిచి ఒళ్లో కూర్చోబెట్టుకుంటా... నీకెందుకురా...పడుకో...

వాడు: మంచిది. పడుకుంటున్నా. మనూరొచ్చాక లేపు. లేకపోతే నిన్నెవరైనా కొట్టడానికొచ్చినా లేపు...

వాడు నిద్రపోయాడు. నాకింక నిద్ర రాదు. తెలిసిపోయింది. ఇంకాసేపటికి లైట్లు బందయ్యాయి. హఠాత్తుగా చీకటి పెంచిన ఉద్రేకమేమో...నా కళ్లు కొత్త కొత్త భంగిమల్లో తనను చిత్రించుకుంటున్నాయి. ఊహలు కూడ చెమటలు పట్టించేస్తున్నాయి. కిటికీ తెరిచాను...చలి కాలపు గాలులు చాలడం లేదు.

“బాబూ కిటికీ మూసేయమ్మా” – వాడెవడికో చలేసినట్టుంది. మూసేసాను.

అమ్మాయి కూడ కదలడం కనిపించింది. Cell Phone తీసి ఏదో చూస్తోంది. ఆ చిన్న phone వెలుగులో కళ్ళెత్తి నావైపు చూసింది. నేను తల తిప్పలేదు. చీకటిచ్చిన ధైర్యం! సరిగ్గా ఇటే ఎందుకు చూసినట్టో అనుకున్నాను. గాలి చొరబడింది ఇటు నుంచే కదా అని సరిపుచ్చుకున్నాను. జేబులో నా phone మోగింది. తీసి చూస్తే నాన్న.

నాన్న: ఎక్కడ దాక వచ్చావ్ రా? బయలుదేరావా లేదా?

నేను: బయలుదేరాను నాన్నా city దాటిపోయాము. ఉదయం ఏడింటికల్లా దిగిపోతాం భద్రాచలంలో...

అని చెప్పి ముగించేసాను.

ఇప్పుడు బస్సులో రెండే వెలుగులు. ఒకటి తన చేతిలో...రెండోది నాది. తను phone లో ఏం చేస్తోందో గాని నేనైతే ఏదో చేస్తున్నట్టు నటిస్తున్నాను.

కావాలని చూపులతో కాసేపు ఆడుకున్నాము చీకటిమొటికిళ్ళు. తను చూసేటప్పుడు నేను కళ్లు తిప్పి...నేను చూసేటప్పుడు తను కళ్లు దించి. కానీ తను బాగా ఆడింది. తనను చూస్తుండగా దొరికిపోయి ఓడిపోయాను. నవ్వింది. తను ఎప్పుడు నవ్వు విసురుదామా అని ఎదురుచూస్తుంటే నేనే అనవసరంగా "పొడగంటిమయ్యా మిమ్ము" పాట మొత్తం విన్నాననిపించింది.

నేనూ నవ్వాను.

కాసేపటికి భక్తడ్రైవరు... అన్నమయ్య పాటల sound తగ్గించాడు.

నాకు నీ దగ్గరకు రావాలనుందని సైగ చేసాను. తను కూడా అలానే సైగ చేసింది. వెలుగు సైగల విన్యాసాలు బావున్నాయనిపించింది. అంత చురుగ్గా అప్పటివరకు నేను ఎప్పుడూ లేను. తను ఇంకో అడుగు ముందుకేసి నాకు తన number ఇవ్వాలనుకుంది. తన phone లో అంకెలు

పెద్దగా కనిపిస్తున్నాయి. ఒక్కటొక్కటిగా నాకు చూపించింది పది నెంబర్లు. తన శ్రావ్యమైన గొంతును ఎవరో గదిలో పెట్టి తాళం వేస్తే కిటికీ లో నుంచి నాకు తాళంచెవులు విసిరేసినట్టనిపించింది. Call చేసాను. China piece అనుకుంటూ పోలీస్ సైరన్ లా గట్టిగా మోగింది. ఇద్దరు లేచారు. ఒక పాప ఏడ్చింది. Conductor లైటు వేసి ఒకసారి బస్సులోకి చూసాడు...ఆ లైటుకి ఇంకో అరడజను మంది లేచారు. తను call cut చేసే లోపు బస్సు నాలుగైదు గుంతల్లోంచి పోయింది. కొన్ని నిముషాలు తను ధ్యానంలోకి నేను మౌనంలోకి వెళ్లిపోయాం. బస్సు పూర్వావస్థలోకి వచ్చాక...మళ్లీ call చేసాను. ఈసారి silent గా ఎత్తింది సఖి.

నేను: Hello...

తను: Hi...

నేను: నీ పేరేంటి?

తను: పేరెందుకు?

నేను: ఏమని పిలవాలి...

తను: పిలుద్దూలే...మాట్లాడు ముందు.

నేను: ఎక్కడికెళ్తున్నావు?

తను: మా ఊరికి?

నేను: ఎందుకు?

తను: ఊరికే!!!

నేను: ఇందాక బస్ మొత్తాన్ని లేపావుగా alarm పెట్టిన warden లా...

తను: నవ్వింది.

నేను: Number ఎందుకిచ్చావ్?

తను: నన్నెందుకు చూస్తున్నావో అడిగి తెలుసుకుందామని.

నేను: నువ్వు నిలబడితే నా కాళ్లు నొస్తున్నాయి. ఇది చెప్దామని...

తను: ఇలా ఎవరు నిలబడటం చూసినా నొస్తాయా కాళ్లు?

భలే నరికింది నా అబద్ధాన్ని అనుకున్నాను.

నేను: నువ్వు చాల నచ్చావు...అందుకే చూస్తున్నా...

తను: అంతేనా...ఇంకా పిలిచి సీటిస్తావేమో అనుకున్నాను. నీ పక్కన చోటుందా?

నా గుండె ఝల్లుమంది. ఇది ముగ్గురు కూర్చునే సీటు. ఒకటి నేను...రెండు వాడుగా కూర్చున్నాం. బస్సెక్కినపుడు ఒకాయన జరగమంటూ వస్తే కసిరి పంపాడు నా మిత్రుడు. వాడి స్వార్థం నాకు పనికొస్తుంటే సంతోషమేసింది.

నేను: ఉంది అన్నాను.

తను: పాపం మీ friend పడుకున్నాడు కదా?

నేను: వాడి మొహం... ఏం పరవాలేదు అటు తోసేద్దాం. వాడు సుషుప్తిలో ఉన్నాడు. నువ్వు రా...

తను: అంటే?

నేను: కోమా లాంటి నిద్ర. నువ్వు రా...

తనొస్తోంది. పరిమళం నా వైపు నడిచొస్తోంది. నా కాళ్లూ చేతులూ వొణికాయిగాని మనసు మాత్రం మట్టసంగా ఉంది. కోమా మిత్రుణ్ణి సీటు చివరికి జరిపాను. తనొచ్చి మధ్యలో కూర్చుంది. చున్నీ సర్దుకోవడం... గాజుల శబ్దం... ఊగే జుంకాలు...ఏం జరుగుతోందనిపించింది.

ఇంత అందమైన అమ్మాయిని ఎన్ని సార్లు చూసినా... ఇంత కన్నా అందమైన అమ్మాయిని ఇదే మొదటిసారి చూడ్డం. లోకంలో ఉన్న అందాలన్నింటితోనూ పోలికా...పోటీ...రెండూ తినే అయ్యింది నాకు.

నేను: నువ్వేం చదువుతున్నావ్? Engineering కదా...

అలా ఉన్నానా?

నేను: కాదా...మెడిసినా?

తను: నా సంగతెందుకు గాని...నువ్వేం చదువుతున్నావ్?

నేను: ఈ సంవత్సరమే Btech ఐపోయింది. మూడు నెలలయింది ఉద్యోగం వచ్చి.

తను: జీతమెంత?

మగాళ్లని జీతం ...ఆడవాళ్లని వయసు అని ఏదో సుత్తి చెబుతుండగా...

తను: నా వయసు 20

నేను: నా జీతం 20 వేలు.

బోలెడంత జీతం. ఏం చేస్తావ్ అన్ని డబ్బులు?

నేను: అవేం డబ్బులు. మా Manager కి నెలకి లక్ష.

అవునా...అంతేలే డబ్బులన్నీ మేనేజర్లే తీసుకుంటారు. మనకేమిస్తారు!!!

నేను: ఇంత అందంగా ఉండి రాత్రుళ్లు బస్సుల్లో తిరిగితే అబ్బాయిలు వెంటపడరా?

పడతారుగాని ధైర్యం చేసి సైగ చెయ్యరు!

నా ధైర్యాన్ని గుర్తించిన ముద్దబంతికి ఓ ముద్దివ్వాలనిపించిందిగానీ ధైర్యం రాలేదు.

నీ friend నా భుజం మీదికి ఒరుగుతున్నాడు.

నేను: వాణ్ని తొయ్యి అవతలికి. నేను మెలకువలో కుదురుగా ఉంటే...నిద్దట్లో ఉన్నా చూసావా వాడి కక్కుర్తి.

అంటూ వాణ్ణి దూరంగా జరిపాను.

తను: మెలకువలో కుదురుగా ఉండటం కష్టంగా ఉందా?

నేను: ఉండదా మరి?

తను: కష్టజీవులు!! ఎప్పటికి సుఖపడతారో కదా...

నేను: మరే!

అంటూ కొంచెం దగ్గరిగా జరిగాను. నా దగ్గర మాటలైపోతున్నాయి.

నేను: జీవితంలో నువ్వేమవుదామనుకుంటున్నావ్?

తను: ఒకవేళ నేను ఫలానాది అవుదామనుకున్నా...ఈ నాలుగ్గంటలు ఏమైనా చెయ్యగలనా...నీతో ఈ ప్రయాణం తప్ప!

వేడిగా తన భుజం రాసుకుంటున్న నాకు... నేనడిగే పప్పు ప్రశ్నల మీద తను చెప్పే గొప్ప సమాధానాల మీద ఆసక్తి ఆవిరైపోతోంది.

తను: ఉక్కగా లేదా నీకు?

నేను: ఉందేమో తెలీట్లేదు.

తను: నాకు తెలుస్తోంది. కొంచెం వర్షం కావాలి...కిటికీ తెరువు...

తెరిచాను. నిజంగానే జల్లు. చల్లగా మా మొహాలు తడిసాయి. నవ్వుకున్నాము ఒక్కసారిగా.

తను: నాకింకా వర్షం కావాలి.

నేను: ఒద్దొద్దు జలుబు చేస్తుందంటూ కిటికీ మూసాను.

తను: అబ్బ నిజంగానా!!! తెరవ్వోయి

అంటూ నా ఒళ్లోకొచ్చి కూర్చుని కిటికీ తెరిచి...జుట్టు విప్పుకుని... మొహం తడుపుకుంటూ అరచేతులు బయటపెట్టి ఆస్వాదిస్తోంది.

దాంతో...ఆఖరి సుత్తి దెబ్బకి గోడలోకి దిగబడిన మేకులా అయ్యాన్నేను. ఉలుకు లేదు...కాసేపు పలకనూ లేదు.

"బాబు మూసేయమ్మా"...ఇందాకెపుడో అరిచినవాడు మళ్లీ...

తను: ఆ...కిటికీ నాది. అటు తిరిగి పడుకోవయ్యా...

తన మోటు అరుపుకి వచ్చింది నాకు స్పృహ.

నా చేతులు వెనక నుంచి తనను గాఢంగా వాటేసుకున్నాయి.

నేను: నువ్వెందుకిలా చేస్తున్నావ్?

తను: ఎలా?

దిగిపోతుందని భయమేసి...

నేను: ఏం లేదులే...

జల్లు ఇంకా సన్నబడి వేగం పుంజుకున్నకొద్దీ అడవిలో లేళ్ళు, నెమళ్ళు పరవశించినట్టు ప్రవర్తిస్తోంది.

కాసేపయ్యాక సూర్యాపేట దాటింది బస్సు. చినుకులు అక్కడే దిగిపోయాయి. ఇప్పుడు వెన్నెలుంది కాని చంద్రుడు లేదు. ఈ పిల్ల లానే ప్రకృతి కూడా ఇష్టమొచ్చినట్టు ఆడుకుంటోంది.

నా ఒళ్లో అలానే నిక్షేపంగా కూర్చుని...

తను: బరువున్నానా...నిజం చెప్పు?

నేను: ఏం లేవు. మాట్లాడకుండా చంద్రుణ్ణి వెతుకు.

సాధారణంగా కాలచక్రం ఒకటనే అంటారు. ఈ బస్సుకి నాలుగున్నట్టున్నాయి...ఎంత వేగంగా గడిచిపోయిందో సమయం.

ఎన్నో విషయాలు మాట్లాడింది తను. ఆ పరిమళానికి, కౌగిలి వెచ్చదనానికి...ఏదో కొత్త ఆకలి కమ్ముకుంది నన్ను. ఇంతలో...

తను: నాకు ఆకలేస్తోంది. నీ దగ్గర తినడానికేమైనా ఉందా?

నేను: Apple ఉంది ఇవ్వనా...

తను ఊ కొట్టింది. Bag లో నుంచి తీసిచ్చాను.

నేను: భోంచేసి ఎక్కలేదా?

తను: లేదు. పొద్దున్నెపుడో తిన్నాను ఇడ్లీలు. అప్పటి నుంచి తిప్పుతూనే ఉన్నాడు మా మేనేజరు.

నేను: మేనేజరా??!! బస్సెక్కించి వెళ్లిపోయాడా?

తను: అంతలేదు. అడిగో ఆ last seat లో కూర్చున్నాడు చూడు. అతనే.

నేను కౌగిలి వదిలి వెనక్కి జరిగాను. తనేమనుకుందో...ఒడి దిగి పక్కన కూర్చుంది.

తను: మంచి నీళ్లున్నాయా?

ఇచ్చాను. తాగి Thanks చెప్పింది.

నేను: ఎటెళ్లినా మీ మేనేజరుతోనే వెళతావా?

తను: ఎటెళ్తున్నామో కూడా మేనేజరే చెప్తాడు.

తన phone తీసుకుని contacts list చూసాను. ఆ మేనేజరు నంబరొక్కటే ఉంది. ఏదో తెలిసిపోయిందని జాలిపడి తన ముందు అవివేకిని కాలేదు దేవుడి దయ వల్ల.

నేను: ఇవ్వాళ ఎక్కడికెళ్తున్నావ్?

తను: మా ఊరికి. మా అమ్మను చూడటానికి వెళ్తున్నా...నెలకోసారి వెళ్తాను.

నేను: మరేం తీసుకెళ్తున్నావ్ మీ అమ్మకి?

తను: ఎప్పటిలానే ఓ కబురు.. కొన్ని డబ్బులు.

నేను: ఏం కబురు?

తను: నేను మంచి ఉద్యోగమే చేస్తున్నాననీ...ఏవో పాడు పనులు చేసి డబ్బులు సంపాదిస్తున్నానని అనుకోవద్దనీ...త్వరలోనే మంచి ఇంట్లోకి తీసుకెళ్తాననీ...సరే సరే మా ఊరొచ్చింది. ఉంటాను.

నేను ఊ కొట్టాను. Conductor లైటు వేసాడు. తను బస్సు దిగింది. వెళ్ళిపోయింది. పేరు కూడ చెప్పకుండానే!

ఇంకో రెండు గంటలకి మా ఊరొచ్చింది. వాణ్ణి లేపాను. ఇద్దరం దిగి Auto ఎక్కాము. మొదట మా ఇల్లొచ్చింది. దిగి ఆటోవాడికి డబ్బిస్తుంటే...

మిత్రుడు: చేతికి ఆ Band ఏంటీ?? ఎవరి జళ్లోంచి లాగావ్ రాత్రి?

ఆటో వెళ్లిపోయింది. చెయ్యి చూసుకున్నాను. రాత్రి కిటికీ లోనుంచి కురిసే వానకి తను జుట్టు విరబోసుకుని దీన్ని ఇలా అలంకరించింది. నేనే గమనించలేదు. తను నన్ను వదిలేసి వెళ్లిపోయిందనుకుంటూనే తనని నేను పట్టుకొచ్చుకున్నా చేతికి తొడిగించుకుని.

ఇంట్లో నాలుగు రోజులుండి హైదరాబాదు వెళ్లిపోయా. అయిదేళ్లు ఉద్యోగం చేసాక పెళ్లి చేసుకున్నాను. ఇంకో అయిదేళ్లు కాపురం...ఇద్దరు పిల్లలు. అద్దింట్లోనుంచి సొంతింట్లోకి ... సొంతింట్లోనుంచి ఇంకా పెద్దింట్లోకి మారాను. ఇప్పుడు కమలహాసన్ రాజకీయాల్లోక్కూడా వచ్చాడు.

నాతోపాటే చాలా కాలం ప్రయాణించిందది. నా bag లో...suitcase లో...dressing table సొరుగులో...అల్మారాలో...

ఎలానో తెలీదు ఇవ్వాళ కంటపడింది ఆ కనకాంబరం రంగు రబ్బరుబాండు.

తెగిపోయి!

# మంత్రం పరమార్థం

మూలా రవి కుమార్

ఉదయాన్నే వార్తాపత్రిక చూస్తుంటే చరవాణి మోగింది. ఏదో కొత్త నెంబరు. "హలో" అన్నాను.

"హలో, సార్, నేను, చింతలవలస అప్పల నాయుణ్ణి. మన ఊరి నారన్నాయుడు మేష్టారు మీ ఫోన్నెంబరిచ్చేరు."

చింతలవలస అంటే నాలుగు తరాలుగా మా స్వగ్రామం. విజినారం జిల్లా. ఇప్పుడు నేనుంటున్న వైజాగ్ అనబడే విసాపట్నానికి తొంభై కిలోమీటర్లు. దాదాపు పాతికేళ్ళక్రితం నా పదోక్లాసుపూర్తికాగానే వదిలేసి, మరో పదేళ్ళతర్వాత ఉద్యోగం రాగానే, అమ్మానాన్నలుకూడా నాదగ్గరకొచ్చేసేకా మాస్వగ్రామం అని చెప్పుకోవటానికే అది మిగిలింది. ఇల్లు ఎప్పుడో శిధిలమయ్యింది.

ఊరిపేరు విని మనసు ఉరకలేసింది. కాకపోతే మాఊళ్ళోనాకుతెలిసి పదిహేను మందికి పైగా అప్పలనాయుళ్ళు ఉండే వారు. ఊళ్ళోవాళ్ళుకూడా వాళ్ళని బొజ్జప్పన్న (పెద్ద పొట్ట ఉండే అప్పలనాయుడు), ఎర్రప్పన్న (ఎరుపురంగులో ఉండే అప్పలనాయుడు), చించెట్టప్పన్న (చింతచెట్టు దగ్గర ఉండే అప్పలనాయుడు) మొదలైన వ్యావహారిక పేర్లే గానీ ఒక్కణ్ణి కూడా అప్పలనాయుడు అనిపిలిచే వారు కాదు. ఇప్పుడు నాకు వచ్చిన ఫోనులో భాషా యాసా, ఆపదిహేను మందిలో ఎవరిదీ కాదు.

"ఓకే, చాలా సంతోషం. అప్పలనాయుడు అంటే..." అని ఆగిపోయాను.

నాప్రశ్నబాగానే అర్థం అయినట్టుంది. "నేను సార్. దాసరపేట పోలయ్యకొడుకుని." ఇంక నాకు ఆధార్ నెంబరు చెప్పినంత స్పష్టత వచ్చేసింది. దాసరపేటపోలయ్య అంటే, మాఊరికి నాలుగుమైళ్ళవతల ఉన్న దాసరపేట ఊరివాడు. మాఊరికి ఇల్లరికం వచ్చినవాడు. అంటే ఇప్పుడు నాకుఫోను చేసిన అప్పలనాయుడు నాపదోక్లాసునాటికి ఏడాదివాడు.

"ఓహో, బంగారయ్య మనవడివా? నువ్వు తొంబై రెండులో పుట్టినట్టున్నావు." అన్నాను. నిజానికి అతడితాతని ఊళ్ళో వాళ్ళు గుడ్డి బంగారయ్య అనేవారు. చిన్నవయసులో రేచీకటీ, కూతురుకన్నా కొడుకు పదేళ్ళు చిన్నవాడు కావటంతో ఇల్లరికం అల్లుణ్ణి తెచ్చుకున్నాడు.

"సార్. నన్ను ఇంతలా గుర్తుంచుకున్నారా?" సంభ్రమాశ్చర్యాలు నామనసుని తాకాయి.

"సరే బాబూ, ఏమిటీ విషయం?"

"ఏం లేదు సార్. ఒకపనిమీద వైజాగొచ్చాను. మీరు మూణ్ణెల్లక్రితమే వైజాగ్ గవర్నమెంటు కాలేజీలో లెక్చెరరుగా చేరేరని మనూళ్ళో తెలిసింది. ఒకసారి తాతగారికీ, మామ్మగారినీ చూసి రమ్మని మా వాళ్ళు చెప్పేరు. మీకు ఇబ్బందిలేకపోతే ఇప్పుడోసారి వస్తాను." తాతగారూ మామ్మగారూ అంటే మా అమ్మానాన్నలు.

"అయ్యయ్యో. తప్పకుండా రా." అని ఇంటికి రావటానికి గుర్తులు చెప్పేను.

ఇంటికొచ్చిన అప్పల నాయుణ్ణి చూసిన నాన్న పురివిప్పన నెమలిలా అయిపోయారు. ఆయనపుట్టినప్పటినుండీ అరవయ్యేళ్ళపాటు ఆ ఊరు కదల్లేదు. పదిహేనేళ్ళగా మా ఉద్యోగాల మూలంగా ఊరువదిలేయటమేకాక, పదేళ్ళు హిందీప్రాంతాల్లో కూడా గడిపారు మరి. స్వంత ఊరి జ్ఞాపకాలు ఎంత ఆనందాన్నివ్వగలవో అంత ఆనందమూ ఇచ్చాయి. తాతగారికీ మామ్మగారికీ ఒక గంట కబుర్లు చెప్పాడు. నాన్న, తన ముందుతరం వాళ్ళైన బాండ్రుతాత (పేరు తాతినాయుడు, చిన్నప్పుడు బాండ్రుకప్పలా అరచేవాడట), రేషన్నాయుడు (కొన్నాళ్ళు చౌకదరల దుకాణం నడిపేడు), సైకిల్ దాలినాయుడూ (నాచిన్నప్పటివరకూ మాఊళ్ళో ఏకైక సైకిలు యజమాని) మొదలైన వాళ్ళంతా చనిపోయారని తెలుసుకొని ఏడ్చేసారు. వాళ్ళమనవల, మునిమనవల చదువులూ, వృత్తులూ, పెళ్ళిళ్ళూ వివరాలు కనుక్కొని మళ్ళీ మళ్ళీ అడిగి సంతోషించారు. నేను కొంచెం పాల్గొన్నాను. మా ఆవిడ పుట్టిల్లు గోదావరీతీరం కావటాన నూరుశాతం శ్రోతగా ఉండిపోయింది.

అప్పలనాయుడు మా ఊరికి పదిహేను కిలోమీటర్లవతల ఊళ్ళో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. మాఊరి వ్యవసాయ కుటుంబాలనుంచి తొలితరం ప్రభుత్వోద్యోగి. వైజాగెందుకొచ్చేడంటే, వాళ్ళచెల్లికి ఒకసంబంధం కుదిరింది. ఇక్కడెవరో సిద్ధాంతి చేత ముహూర్తం పెట్టించుకొని, ఇంకో పురోహితుణ్ణి పెళ్ళిచేయించుకుందికి మాట్లాడుకొన్నాడుట. ఈ ఇద్దరు పండితుల పేర్లూ మొగపెళ్ళివారు సూచించారుట. ముహూర్తం పెట్టినందుకు ఐదువేలూ, పౌరోహిత్యానికి కారు అద్దె కాక పదివేలూ.

"అన్నిడబ్బులే!" అన్నాను. నా ఊహతెలిసేటప్పటికి మా ఊళ్ళో పెళ్ళిచేయిస్తే పురోహితుడి సంభావన వంద రూపాయలు.

"అదే మూల సార్? అంతగొప్పవాళ్ళు ఇద్దరూ దొరికేరు. వాళ్ళరేట్లు తెలిసే వచ్చాం. అసలు రేపు మళ్ళీ రావలిసి వస్తుందేమోనని భయపడ్డాము. ఉదయం తొమ్మిదిలోపల రాకపోతే వాళ్ళు దొరకరు. ఏడుగంటలవరకూ రాహుకాలం. ఇంట్లోంచి బయల్దేరకూడదు. ముహూర్తం పెట్టిన సిద్ధాంతిగారిచేత ఫోనుచేయించకపోతే పురోహితుణ్ణి కలవటానికి రేపు మళ్ళీ రావలిసి వచ్చేది."

"ముహూర్తం పెట్టించుకొందికి ఇంటినుంచి బయలుదేరడానికి కూడా మళ్ళీ రాహుకాలమా? అది ఎవరు చెప్పేరు?"

"ఉదయాన్నే ఆరుగంటలకల్లా మాటీచర్స్ వాట్సాప్ గ్రూపులో ఒకాయన తిథి, నక్షత్రం, రాహుకాలం, వర్జ్యం లాంటి వివరాలన్నీ పెడతాడు. మీరవేవీ చూసుకోరా?" ఆశ్చర్యంగా అడిగాడు.

ఆ రైతుబిడ్డ ఆశ్చర్యానిక్కారణమేంటంటే, మేము ఆఊరి పురోహితులం. నాపదోక్లాసు వరకూ మానాన్నగారి కూడా వెళ్ళి పౌరోహిత్య క్రతువులో సాయపడేవాణ్ణి. కానీ, తర్వాత రాహుకాలాలూ, దుర్ముహూర్తాలూ పట్టించుకోవటం మాట అటుంచి, ఆపేర్లు కూడా దాదాపు మరిచిపోయాను.

"నేను ఉత్తరాదిలో ఉన్నప్పుడు అవన్నీ అలవాటు తప్పిపోయాయి. అదిసరే. మానాన్నగారు మన ఊరొదిలేసిన తర్వాత గజపతినగరం నుంచి ఎవరో పురోహితుణ్ణి పెట్టుకున్నారు కదా మీరు. ఆయన ముహూర్తాలు చూడ్డం, పెళ్ళిళ్ళు చేయించటం చెయ్యలేడా?"

"జాతకాలు చూడ్డం అతడికి సరిగ్గా రాదు సార్. ఏదో ముహూర్తం పెట్టేస్తే మంచిదికాదుకద సార్?"

"సరే, జాతకం చూడ్డం, ముహూర్తం పెట్టటం ఇక్కడి సిద్దాంతికి బాగా వచ్చు. మరి కనీసం పెళ్ళైనా అక్కడి పురోహితుడితో చేయించుకోవచ్చుకదా? కొంచెం డబ్బు ఆదా అయ్యేది."

అప్పలనాయుడు నన్ను చూసిన చూపులో, పురోహితుల కుటుంబంలో చెడపుట్టావుకదా అనే అర్థం గోచరించింది. అలా రెండూ సెకెన్లు చూసాకా, "సార్, లోకల్ పురోహితుడు ఐదువేలే తీసుకుంటాడు. కానీ పెళ్ళిమంత్రాలొకటే చదువుతాడు. ఈయన వేదాశీర్వచనం కూడా చెబతాడు. మాచెల్లికి కాబోయే అత్తవారింట్లో ఇప్పటికే రెండు పెళ్ళిళ్ళు చేయించాట్ట. వాళ్ళు అడిగేరు, మంచిదయింది. లేకపోతే ఈయనగురించీ, పెళ్ళిలో వేదాశీర్వచనం గురించీ మాకు తెలిసేది కాదు. మాచెల్లిపెళ్ళయ్యేకా నాకు పెళ్ళికుదిరితే అప్పుడూ కూడా వీళ్ళ దగ్గరకే వస్తాను సార్." అన్నాడు.

అంతదూరం నుంచొచ్చినవాడి నమ్మకాలజోలికెళ్ళకూడదు కనుక మామూలుగా ఉన్నాను. కానీ, ముహూర్తాలూ శాస్త్రాలపట్ల నా ఉదాసీనతకు నొచ్చుకున్నట్టున్నాడు. టీ అయ్యాకా వెళ్ళిపోయాడు. పురోహితుడి కొడుక్కి, రైతుబిడ్డ ముహూర్తాలూ, వర్జ్యాలూ, వేదమంత్ర ప్రాశశ్త్యం చెబుతున్నాడంటే, బ్రహ్మంగారు చెప్పిన కలికాలం వచ్చేసినట్టే అనిపించింది.

అప్పల్నాయుడెళ్ళిపోయాకా మా ఆవిడ రంగంలోకి దిగింది. "వీళ్ళని చూసైనా నేర్చుకొండి. ఇప్పటికే, మనవల్ల బోలెడు తప్పులు జరిగిపోయాయి." అంది. ఆతప్పులేంటంటే, మాపెళ్ళైన వారంరోజులకే గుజరాత్ బదిలీ అవటంతో, మా అమ్మానాన్నలతో కలిసి, కొత్తదంపతలం, సామాన్లు సర్దుకొని జునాగడ్ లో దిగేం. అక్కడ ఇంట్లో దిగిన రోజు అమావస్య. మేం దిగిన రెండ్రోజులకి గాని మా సామానుల లారీ రాలేదు. పాలుపొంగించుకొనే యంత్రాంగం లేకపోవటంతో మా అమ్మ, తను రైల్లో చదువుకొందికి తెచ్చుకొన్న దేవీ భాగవతం పుస్తకాన్ని ఈశాన్యమూల పెట్టి, ఒక అరటిపండు వలిచి, రెండు అగర్ బత్తీలు వెలిగించి, పుష్పరహిత, దీపరహిత పూజ కానిచ్చేసింది. తీరా బయటకొచి చూస్తే మేము పూజచేసినది ఈశన్యమూల కాదు, నైఋతిమూల. ఆమర్నాటినుంచీ నెల్లాళ్ళు అషాడమాసం, అత్తగారూ కొత్తకోడలూ లక్షణంగా ఒక ఇంట్లోనే ఉన్నారు. ఇవన్నీ శాస్త్ర సాంప్రదాయ ఉల్లంఘనలే.

అలా మొదలైన మా సంసారంలో, మా అమ్మా, మా ఆవిడా తమ భక్త్యానుసారం, శక్త్యానుసారం ఏవోచేసుకొనేవారు. రాజస్తాన్ లో ఉన్నప్పుడు ఒకశ్రావణ మాసం నోముకి ముత్తైదువలు కావలసి వస్తే, హిందీ గృహిణులకు నోము గురించి బొట్లేరు హిందీ ముక్కల్లో వివరించి కొంతమందిని ఒప్పించి వాయనాలిచ్చేసింది మా ఆవిడ. కొందరు మాత్రం దోషపరిహార దానం అనుకొని, మాదోషాలన్నీ పుచ్చుకున్నవాళ్ళకి అంటుకుంటాయని తీసుకోలేదు. ఒకావిడ వాయనం తీసుకున్నాకా మీరు ఇప్పుడు వచ్చారు. ఒకనిమిషం లేటైతే స్నానానికెళ్ళిపోయేదాన్ని అంది. అంటే వాయనం మైలపడ్డట్టే. అలా అని జరిగిన తప్పుని పుచ్చుకున్నావిడకి చెప్పటం మర్యాదకాదు కదా. వాయనం పుచ్చుకున్నవాళ్ళలో మరికొందరు మాంసాహారులని తర్వాతెప్పుడో తెలిసింది. పాపం, అత్తాకోడళ్ళిద్దరూ అలా రాజీ పడుతూ ఏవోచేసుకొనేవారు. నావీలునిబట్టి వారడిగిన పూజా ద్రవ్యాలు సమకూర్చటం, ఆఫీసు టైముకి ఇబ్బంది రానంతవరకూ పూజలో కూర్చోవటం తప్ప నామిగిలిన జీవతమంతా చార్వాక జీవితమే.

నాలో భక్తిబీజాలు నాటాలనుకున్న మా ఆవిడ సంకల్పానికి ఇప్పుడు అప్పలనాయుడి మద్దతు దొరికింది.

"ఇంతకీ ఈఅప్పలనాయుడు పెళ్ళి ఇంత శాస్త్రోక్తంగా చెయ్యటానికీ మామూలుగా చెయ్యటానికీ తేడా ఏమిటంటావ్?"

"అదేంటీ, మంత్రాలకీ ముహూర్తాలకీ ఏవిలువా లేదంటారా?"

"వీళ్ళనాన్న దాసరపేట పోలయ్య పెళ్ళి ఎలాజరిగిందో విను."

"అది మీకెలా తెలుసు?"

"అప్పుడూ నేను ఐదోక్లాసు. తాత చేయించిన పెళ్ళి అది. అప్పటికే తాతకి ఎనభై ఏళ్ళు నిండటం, ముప్పై ఏళ్ళుగా వాడుతున్న కళ్ళద్దాలు పగిలిపోవటంతో, పంచాంగం చూసేటప్పుడు నన్ను కూర్చోబెట్టేవారు. రైతుకుటుంబాలవాళ్ళు వధూవరులిద్దరి తరపు పెద్దలూ రాగానే, పేర్లని బట్టీ, వాళ్ళజన్మ నక్షత్రం రాసేవారు. జాతకాలు నప్పకపోవటం అంటే ఏంటో తెలీదు. మూఢం లేని సమయంలో ఉండే ఐదారు లగ్నాల్లో, వీళ్ళ నక్షత్రాలిని బట్టి ఒక లగ్నం, దానితో పాటే పెళ్ళిపందిరి రాట ముహూర్తం పెట్టేవారు. రాత్రి పెళ్ళి అనగా ఉదయం మా ఇంటికి బత్తెం పంపేవారు."

"అదేంటి?"

"పెళ్ళిభోజనాలని ఊళ్ళో ఇంటికో మనిషిని రమ్మని పిలిచేవారు. దానిని ఊరామిటి అనేవారు. మరి పురోహితులు ఆ వంట తినరు కనుక ఒక మనిషికి సరిపడా బియ్యం, పప్పూ మొదలైన వండని దినుసులు, రెండు అరిసెలు ఒక జంగిట్లో పెట్టి మా ఇంటికి తెచ్చేవారు. సాయంత్రం బాజాలతో మా ఇంటికి వచ్చి తాత రాసిన లగ్నపత్రిక తీసుకెళ్ళేవారు. లగ్నపత్రిక అంటే, తాటాకుపై రాసిన శుభలేఖ అన్నమాట. దానిని వరుడి తలపాగాలో ఉంచేవారు. రాత్రి తాత పెళ్ళిచేయిస్తున్నంతసేపూ నేను కూడా ప్రక్కనే ఉండీ తాతకి ఆతంతులో సాయపడేవాణ్ణి. అలా ఈదాసరపేటపోలయ్య పెళ్ళిలో జరిగిన విశేషం గుర్తుండిపోయింది."

"ఏమిటావిశేషం?"

"ముహూర్తం రాత్రి ఒంటిగంట తరువాత కనుక గంటముందు పెళ్ళివారితరుపు మనిషి వచ్చి నిద్ర లేపాలి. వాళ్ళు రావటం అరగంట లేటయ్యింది. వెంటనే తాత వాళ్ళని తిరిగిపంపేసి, నాచేతే వాచీని అరగంట ముందుకి నప్పించేకా ఇద్దరం పెళ్ళిపందిట్లోకెళ్ళేం. పెళ్ళి లక్షణంగా జరిగింది. ఇప్పుడొచ్చిన అప్పలనాయుడూ, తర్వాత ఆడపిల్లా లక్షణంగా పుట్టేరు. పిల్లాడు చక్కగా చదువుకొని ప్రభుత్వోద్యోగి అయ్యాడు. ముహూర్తం తప్పి జరిగిన పెళ్ళి కూడా విజయవంతంగా జరిగింది."

"అది తాతగారు చేయించిన మంత్రబలమేమో?"

"ఆవిషయానికి తర్వాత వద్దాం. ముందుగా ముహూర్తం నిమిషాలు, సెకెనులు ఖచ్చితంగా చూడకపోయినా పెనుప్రమాదాలేవీ జరగవని ఒప్పుకున్నాట్టేనా?"

ఔనూ, కాదూ అనకుండా అచ్చతెలుగులో చెప్పాలంటే డిప్లమేటిక్ గా తల ఊపింది.

"సరే, ఇప్పుడు దాసరపేట పోలయ్య మామగారైన గుడ్డిబంగారయ్య పెళ్ళి విశేషాలు చెప్పనీ."

"అదిమీరు పుట్టకముందు జరిగి ఉండాలి కదా?"

"నిజమే, కాపోతే అందులో జరిగిన విశేషం వల్ల మాపెద్దలు చెప్పగా విని గుర్తుంచుకున్నాను."

"చెప్పండి."

"ఆపెళ్ళి పంతొమ్మిందివందల డెబ్బై ప్రాంతంలో జరిగింది. మా తాతగారి మేనల్లుడు రామం మావయ్య తెలుసు కదా?"

"తెలుగుమాస్టరుగా జాయినయి హెడ్మేష్టారుగా రిటైరయారు కదా? వాళ్ళబ్బాయే కదా ఇప్పుడు ముంబైలో ఉద్యోగం చేస్తున్నది?"

"ఔను. ఆయన అప్పుడే భాషాప్రవీణ పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ వేసవికదా అని మా ఊరురొచ్చేరుట. సరిగ్గా అప్పుడే మా ఊళ్ళో ఒకే ముహూర్తానికి నాలుగు పెళ్ళిళ్ళు వచ్చాయి. రెండు పెళ్ళిళ్ళ పెద్దలు ఒకే పందిట్లో చేయటానికొప్పుకున్నారు. మిగిలిన వాళ్ళిద్దరూ వాళ్ళ ఇంటిముందు పందిట్లోనే చేస్తామని పట్టుపట్టటంతో ఒకపెళ్ళికి నాన్నవెళ్ళినా నాలుగోపెళ్ళికి పురోహితుడు తక్కువపడ్డాడు. అప్పుడే రామ్మామయ్యని పంపేసారు. నిజానికి తనకి పెళ్ళిమంత్రాలు రావు."

"మరెలా చేయించారు?"

"ఉదయం తాత, మాంగళ్యధారణ, జీలకర్రాబెల్లం మంత్రాలు నేర్పేరు. సంధ్యావందనం మామయ్యకి వచ్చు ఆ మంత్రాలతో మిగతా పెళ్ళితంతు కానిచ్చెయ్యమని, పెళ్ళితంతులో ఘట్టాల క్రమం ఒక పేపరుమీద రాసిచ్చారు. నామంత్రాల్లో తప్పులు పట్టుకొనేదెవరు మామయ్యా అని తాతకి ధైర్యం చెప్పి బయల్దేరుట మామయ్య."

"ఇంతకీ అక్కడేం జరిగింది?"

"మామయ్య సంధ్యావందనం మంత్రాలు పావుగంటలో ఐపోయాయిట. మళ్ళీ అందుకోబోతే చదివినవే మళ్ళీ మళ్ళీ చదువుతున్నట్టూ ఎవరో వెనకాలనుంచి గొణిగేరుట. అందుకని మామయ్యయ్య సుమతీ శతక పద్యాలు మకుటం తీసేసి చదవటం మొదలెట్టేరుట. ఆరోజుల్లో పెళ్ళిపందిట్లో ఎవరూ చదువుకున్నవాళ్ళు లేరని మామయ్య ధైర్యం. పొరుగూరి చుట్టాల్లో ఎవరో ఐదోక్లాసువరకూ చదువుకున్నవాడున్నట్టున్నాడు. పజ్జాలు చదివి పెళ్లి చేసేత్తను అని గొణగటం మామయ్యకి వినపడింది. గట్టిగా అంటే పురోహితుడికి కోపం వచ్చి వెళ్ళిపోతాడని వాళ్ళ భయం. ఆతర్వాత గజేంద్రమోక్షం పద్యాలు అందుకున్నాడు. ఆపందిట్లో ఉన్నవాళ్ళకి అవి గజేంద్రమోక్షం పద్యాలని తెలీకపోయినా, అందులో తెలుగుపదాలు పట్టేసారు. అప్పుడు మామయ్య సమయస్పూర్తితో మంత్రాలు మొదలెట్టి ఒక్కరిమార్కూ లేకుండా, పందిట్లో ఉన్నవాళ్ళంతా, పౌరోహిత్యం వృత్తిలో లేకపోయినా ఎంతబాగా మంత్రాలు చదివేరో, ఇలాంటి పంతులుగోరి మంత్రాల్లో తప్పులు వెతికేరు ఈ కుర్ర యెదవలు అని పెళ్ళిపెద్దలచేత పొగిడించుకొని మరీ పెళ్ళిపూర్తిచేసారుట."

"అన్నిమంత్రాలు రావుకదా, ఆయనకి?"

"విషయమేమిటంటే, మామయ్య విజయనగరంలో చదువుమొదలయ్యేసరికే ఒడుగు అవటంతో, చిల్లరఖర్చులకు దక్షిణ డబ్బులొస్తాయని ఆదివారాలు తద్దినం భోజనాలకెళ్ళేవారుట. ఆబ్దికంలో భోక్తలని పీటమీదకూర్చోబెట్టటానికీ, భోజనం మొదలెట్టటానికీ మధ్య కనీసం ఒక గంట పూజ ఉంటుంది. ఆమంత్రాలు మళ్ళీ మళ్ళీ వినటం వల్ల మామయ్యకి కంఠతా వచ్చేసాయి."

"అంటే?" మా ఆవిడకి విషయం అర్థం కాలేదు.

"ఆపెళ్ళికి మామయ్య తద్దినం మంత్రాలు చదివేసారు. ఆదంపతులు వాళ్ళకాపరానికి యాభై ఏళ్ళు పూర్తిచేసుకున్నారు. ముహూర్తఘడియలు మించిపోయేకా జరిగింది అప్పలనాయుడి తండ్రి పెళ్ళి. అద్భుతమైన ముహూర్తంలో, వేదాశీర్వచనాలతో జరిగిన ఏపెళ్ళికీ తీసిపోనంతగా విజయవంతమయాయి కదా రెండు పెళ్ళిళ్ళూ. దీనర్థం ఏమిటంటే మనసుమనసు కలవటమే మంత్రం పరమార్థం."

"మనసుమనసు కలవటమే మంత్రం పరమార్థం అని మంత్రాల్లో కూడా ఉందా? నేనింకా అది పెళ్ళిపుస్తకం సినిమా పాటలోనే ఉందనుకుంటున్నాను." అని గోదావరీ వెటకారం గుప్పించి వెళ్ళిపోయింది, మా ఆవిడ.

## వ్యసనం — డి.వి.డి.ప్రసాద్

" అమ్మా! నాకు ఉద్యోగం వచ్చిందమ్మా!" చాలా సంతోషంగా, ఉద్వేగంగా అన్నాడు రవి ఇంట్లోకొస్తూ.

శారదమ్మ ఆ వార్త విని ఆనందంతో తబ్బిబ్బయిపోయింది.

"ఉండు, నాయనా, నీ నోరు తీపి చేసుకో! శుభవార్త చెప్పావు, మన కష్టాలు ఇక గట్టెక్కుతాయి." అంటూ వెంటనే వంటింట్లోకి వెళ్ళి పంచదార తీసుకువచ్చి కొడుకు నోట్లో పోసిందామె.

"అవునమ్మా! మనకిక ఏ కష్టాలు ఉండవు. ప్రభుత్వరంగ సంస్థలో మంచి ఉద్యోగం వచ్చింది. ఇక మరి నువ్వు కష్టపడడం నేను చూడలేను. నువ్వు ఇప్పుడు చేస్తున్న పనులన్నీ మానేయాలి మరి." అన్నాడు రవి.

"అలాగేలేరా!" అంది శారదమ్మ ప్రేమతో కొడుకు తల నిమురుతూ.

భర్త పోయిన తర్వాత ఆమె తనకు చేతనైన పనులు, అంటే కుట్లూ, అల్లికలు చేస్తూ ఉండేది. అంతే కాకుండా అప్పడాలు, వడియాలు చేసి తనకి తెలిసిన వాళ్ళకి అమ్మేది. ఆ ఊళ్ళో ఎవరింట్లో శుభకార్యాలైనా ఆమెని వంటా,వార్పులో సహాయంకోసం పిలిచేవారు. అలా కూడా ఆమెకి కొంత ఆదాయం లభించేది. ఏ పని చేసినా ఆమె లక్ష్యం ఒక్కటే, తన కొడుకుని బాగా చదివించాలి. వాడు ఓ పెద్ద ఉద్యోగస్థుడవాలి. తమ కష్టాలు తీరాలి.

ఇన్నాళ్ళకి దేవుడు ఆమె మొర ఆలకించాడు. 'కొంచెం ఉద్యోగంలో కుదురుకున్నాక, రవి పెళ్ళి చేసేస్తే తన బాధ్యత తీరిపోతుంది.' అని మనసులో అనుకుందామె.

రవి భోజనం చేసాక తన స్నేహితులకు తనకి ఉద్యోగం వచ్చిందన్న వార్త చెప్పాలని బయటికి వెళ్ళాడు. తలుపు వేసి మంచం మీద వాలిందామె.

మంచం మీద వాలిన శారదమ్మకు గతమంతా గుర్తుకు వచ్చింది. చాలా చిన్న వయసులోనే ఆమెకి తన పదహారో ఏట మాధవరావుతో వివాహం అయింది. అతనికి పెద్ద చదువులేక పోయినా ఆస్థిపాస్థులుండడంతో శారదమ్మ తల్లి తండ్రులు ఆమె వివాహం మాధవరావుతో జరిపించారు. మాధవరావుకి ఆ ఊళ్ళో ఓ ఐదెకరాల మాగాణి, ఓ కొబ్బరి తోట ఉండేవి. ఓ పెద్ద డాబా ఇల్లు ఉండేది. పొలం మీద వచ్చిన ఆదాయంతో వాళ్ళు హాయిగా బతకవచ్చని, ఆమె భవిష్యత్తు బాగుంటుందని భావించారు ఆమె తల్లి తండ్రులు. అయితే, కాపురానికి వచ్చిన తర్వాత శారదమ్మకి యదార్థం తెలిసింది. ఆమె మావగారికి పేకాట అంటే పిచ్చి ఉండేది. అతని పేకాట వ్యసనానికి వారసత్వంగా వచ్చిన పదెకరాల మాగాణి హారతి కర్పూరంలా హరించిపోయింది. ఇప్పుడున్న ఐదెకరాలైనా మిగిలిందంటే దానికి కారణం అవి ఆమె అత్తగారి పేరు మీద ఉండటమే.

శారదమ్మ కాపురానికి వచ్చిన కొత్తలో ఆమె అత్తగారు అంది, "చూడు శారదా! మీ మావగారి పేకాట వ్యసనానికి చాలా ఆస్థులు కరిగిపోయాయి. పేకాటలో డబ్బులు పోయిన కొద్దీ ఆయన మళ్ళీమళ్ళీ ఆడేవారు, పోయిన చోటే తిరిగి సంపాదించుకోవాలని. ఏనాడైనా పోవడమే కాని, తిరిగి వచ్చేదేమీ ఉండదని అతనికి తెలియదు. చెప్పినా వినిపించుకునే స్థితిలో ఉండేవారు కాదు. ఈ ఊళ్ళో జూదరుల బారిన పడి చాలా మంది తమ సర్వసం పోగొట్టుకున్నారు. నేనెంత చెప్పినా ఆయన వినేవారు కాదు. అంతా పోగొట్టుకున్నాక గానీ ఆయనకి జ్ఞానోదయం అవలేదు. అప్పటికే ఆలస్యం అయింది. ఆయన బ్రతుకు ముగిసిపోయింది. ఆయన తన చివరి క్షణాల్లో చాలా బాధ పడి, తన పేకాట వ్యసనం అబ్బాయికి రాకూడదని, ఆ విధంగా నన్ను పెంచమన్నారు. మిగిలిన పొలం వ్యవసాయానికి తెలిసిన వాళ్ళకి అప్పచెప్పి వాటిమీద వచ్చిన ఆదాయంతో మెల్లగా మాధవ్‌ని పెంచి పెద్దచేసాను. నా కనుసన్నల్లోనే పెంచాను. చదువు పెద్దగా రాకపోయినా స్కూల్‌ఫైనల్ అయిందనిపించాడు. దేవుడిదయవల్ల వాడికి ఆ దుర్వ్యసనం రాలేదు. పొలం పనులు స్వంతంగా చూసుకుంటున్నాడు. నువ్వు కూడా ఆ విషయమై జాగ్రత్తగా ఉండాలి సుమా!"

అత్తగారి అవేదన అర్థం చేసుకుంది శారద. ఆ విషయమై ఆమెకి హామీ ఇచ్చింది కూడా.

మాధవరావు వాళ్ళ మాట నిలబెట్టాడు. పేకాట జోలికి అస్సలు వెళ్ళలేదు. అతని స్నేహితులెవ్వరికీ పేకాట వ్యసనం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు అత్తాకోడళ్ళు. ఆ విధంగా చాలారోజులు ఏ విధమైన ఒడిదొడుకులు లేకుండా సాఫీగా గడిచాయి.

ఓ అయిదేళ్ళలో చాలా పెద్ద మార్పులే వచ్చాయి. ఈలోపున శారదమ్మ అత్తగారు గతించడం, రవి ఈ లోకంలో పడడంలాంటి పెను మార్పులు సంభవించాయి.

కాలక్రమేణా, వ్యవసాయం పెద్దగా కిట్టుబాటు కాకపోవడంతో ఊళ్ళో పొలం అమ్మి పట్టణానికి మకాం మార్చి వ్యాపారం చేద్దామన్న ఆలోచనలో పడ్డాడు మాధవరావు తన స్నేహితుల ప్రోద్బలంతో. శారదమ్మ ఒప్పుకోలేదు అంత సులభంగా. తమ కొడుకు చదువుసంధ్యలు పట్టణంలో అయితే బాగుంటుందంటే ఆమెకి ఇక ఒప్పుకోక తప్పలేదు. తన కొడుకుని బాగా చదివించి పెద్ద ఉద్యోగస్థుణ్ణి చేయాలని ఆమె కోరిక. అంతేకాకుండా, ఈ పల్లెలో ఉంటే తన భర్త ఎప్పుడైనా పేకాట మహమ్మారి బారిన పడే అవకాశం లేకపోలేదు. ఎల్లవేళలా అతనిని కాపు కాయలేము కదా అని ఆమె కూడా పట్టణంలో కాపురానికి మొగ్గు చూపింది.

పట్టణాలలో ఎవరి దారి వారిది, తన భర్తకి పేకాట వ్యసనం అంటుకోదనే నమ్మింది ఆమె. అయితే ఆమెకేమి తెలుసు ప్రమాదం ఏ రూపంలో పొంచి ఉందో?

పట్టణానికి వచ్చిన వేళావిశేషమో ఏమో, మాధవరావు వ్యాపారం దినదిన ప్రవర్ధమానం అయింది. పట్టిందల్లా బంగారం అయింది. కొద్ది రోజులలోనే పట్టణంలోనే ఒక ప్రముఖ వ్యాపారస్తుడయ్యాడు మాధవరావు. తమ జీవితంలో జరిగిన మంచి మార్పులకు శారదమ్మ ఎంతో సంతోషించింది. ఆస్థి అంతస్తూ పెరగడంతో పాటు అతనికి కొత్త స్నేహితులు దొరికారు.

మధ్యమధ్య వ్యాపారం పనులమీద రోజుల తరబడి తిరిగేవాడు తన భాగస్థులతో. అతని వ్యాపారం చెన్నై, హైదరాబాద్‌లకి విస్తరించడంతో వారంలో రెండు, మూడు రోజులు అక్కడికి వెళ్ళి వచ్చేవాడు. వ్యాపారంలో అనుక్షణం మునిగితేలడంవల్ల అతనికి తన తండ్రి లాగ ఏ వ్యసనాలు తగలవని అభిప్రాయ పడిందామె. కాని, తన అభిప్రాయం తప్పని తెలుసుకోవడానికి ఆమెకి ఎక్కువ రోజులు పట్టలేదు. స్నేహితులతో సరదాగా గుర్రపు పందాలకి వెళ్ళిన మాధవరావుకి అది బాగా నచ్చింది. కలక్రమేణా, అతను తన తండ్రి వ్యసనమైన పేకాట కన్న పెద్ద వ్యసనానికి బానిసయ్యాడు. ముందు అతను గుర్రపు పందాలలో పెట్టిన డబ్బులు పోవడంతో రెట్టించిన కసితో మళ్ళీమళ్ళీ అందులోనే పెట్టసాగాడు. మధ్యమధ్య పోయిన డబ్బులు తిరిగి వచ్చేవి. అలాంటప్పుడు, రెట్టించిన ఉత్సాహంతో తిరిగి అందులోనే పెట్టేవాడు. ఉత్సాహం పెరిగినా, కసి పట్టలేకపోయినా, ఫలితం మాత్రం ఒక్కటే. రానురాను, వ్యపారంపైన పైన శ్రద్ధ తగ్గి గుర్రపు పందాలపై శ్రద్ధ పెరిగింది.

మాధవరావు ఈ వ్యసనంలో పూర్తిగా కూరుకుపోయాడని శారదమ్మకి తెలిసేసరికే పరిస్థితి చేతులు దాటిపోయింది. వ్యాపారం మందగించి, అప్పులు పెరిగి, అవి తీర్చుకోవడానికి ఆస్థులు అమ్ముకోవలసి వచ్చింది. ఇన్ని జరిగినా, మాధవరావుకి ఎక్కడో చిన్న ఆశ, ఎప్పటికైనా పోయిన డబ్బులు తిరిగి సంపాదించుకోలేకపోతానా అని. అయితే, దురదృష్టం అతనిని వెన్నంటే ఉండడంతో అతని ప్రయత్నాలేమీ ఫలించలేదు. చివరికి తీవ్రమైన మనస్తాపంతో హార్ట్‌అటాక్ వచ్చి తనువు చాలించాడు మాధవరావు. 'అంతా అయిపోయింది. తను భయపడినంతా అయింది. తమ బ్రతుకు సర్వ నాశనం అయింది.' అనుకుందామె.

అత్తగారి అండ ఎలాగూ లేదు, ఆమె తల్లి తండ్రులు కూడా ఎప్పుడో గతించారు. ఉన్న ఒక్కగానొక్క అన్నయ్య వదిన గయ్యాళితనం వల్ల ఆమెను ఆదుకొనే స్థితిలో లేడు. ఇప్పుడు భర్త కూడా పోవడంతో తీవ్రంగా చలించిపోయింది శారదమ్మ. ఆస్థులన్నీ కరిగిపోగా జీవితంలో ఒంటరిదైన ఆమెకి అంతా అగమ్యగోచరం అయింది. అయితే తన మనుగడ కోసం తనకి తెలిసిన విద్యనే నమ్ముకుందామె. తన కంటి వెలుగైన కన్న కొడుకు రవి మీదే ఆశలన్నీ పెట్టుకొని జీవిస్తోందామె.

తన గతమంతా గుర్తుకు రావడంతో కళ్ళు చెమర్చాయి అమెకి.

'రవి బుద్ధిమంతుడు. చిన్నప్పటినుంచి జీవితంలో ఆటుపోట్లు ఎదురవడంతో చదువుమీద తప్పించి ఇంక దేనిమీద ధ్యాస పెట్టలేదు. బాగా శ్రద్ధగా చదువుకుని స్కూల్లో, కాలేజీలో మంచి మార్కులు తెచ్చుకున్నాడు. ముందునుండీ, పోటీ పరీక్షలకి తయారై ఉండడంవల్ల ప్రభుత్వరంగ సంస్థలో మంచి ఉద్యోగం సంపాదించుకోగలిగాడు. ఇక తమ కష్టాలు గట్టెక్కుతాయి' అనుకుంది శారదమ్మ.

"అమ్మా! ఏం చేస్తున్నావు?" అని రవి తలుపు తట్టి పిలిచేసరికి ఆమె ఈ లోకంలోకి వచ్చింది. లేచి వెళ్ళి తలుపు తీసింది.

"ఇంద, స్వీట్స్ నీ కోసం తెచ్చాను, తీసుకో!" అంటూ తను తెచ్చిన స్వీట్స్ తల్లికి అందించాడు..

రవి జాబ్‌లో జాయిన్ అయ్యాడు. ఇంటి పరిస్థితులు బాగా మెరుగు పడ్డాయి. శారదమ్మ కొడుక్కి మాట ఇచ్చినట్లు తాను ఇంతకు ముందు చేసే పనులేవీ ఒప్పుకోవట్లేదు. చాలా సుఖంగా రోజులు గడిచిపోతున్నాయి.

ఓ ఏడాది గడిచేసరికి శారదమ్మ కొడుకు పెళ్ళి చేసే యోచనలో పడింది. తనకి తెలిసిన వాళ్ళందరికీ చెప్పింది. రవి ప్రయోజకుడయ్యాడని తెలిసి చాలామంది అమ్మాయిల తల్లితండ్రులు శారదమ్మని వెతుక్కొని వచ్చారు. అలాగ పెళ్ళి సంబంధాలు చూడగా, ఆమెకి లాయరు విశ్వనాధంగారి కూతురు రమ్య బాగా నచ్చింది. ఇరువైపులవాళ్ళు నచ్చుకున్నాక, రవిరమ్యల వివాహం కొద్ది రోజులలోనే జరిగిపోయింది.

వాళ్ళ అన్యోన్య దాంపత్యానికి శారదమ్మ ముచ్చటపడింది. రమ్య కొత్తకాపురంలో బాగా ఇమిడిపోయింది. అత్తాకోడళ్ళు ఏ అరమరికలు లేకుండా సంతోషంగా ఉన్నారు.

ఈ ఐదేళ్ళలో రవికి ప్రమోషన్ వచ్చి ఉద్యోగంలో హోదా పెరిగింది. ఒక అబ్బాయికి తండ్రి అయ్యాడు కూడా. కొడుకు, కోడలు బాగా చూసుకోవడంతో, మనవడి ఆటపాటలతో శారదమ్మకి రోజులు బాగా గడుస్తున్నాయి.

ఏ రోజైనా రవి రావడం కొద్దిగా ఆలస్యం అయిందంటే చాలు శారదమ్మ మనసు పరిపరి విధాల పోతుంది. మనసు కీడు శంకిస్తుంది. ఏమో ఎవరికి తెలుసు ఎవరు ఏ వ్యసనానికి ఎప్పుడు బానిసవుతారో? వాడు తన తండ్రి, తాత లాగ ఏ వ్యసనాల బారిన పడకూడదని, వాళ్ళ పోలిక రాకూడదని, తను అనుభవించిన కష్టాలు తన కోడలకి రాకూడదని ఆమె ప్రతీరోజూ దేవుణ్ణి ప్రార్థిస్తుంది.

ఆ రోజు రవి ఇంటికొచ్చేసరికి బాగా ఆలస్యం అయింది. తల్లి శారదమ్మ, భార్య రమ్య రవి రాకకై ఆదుర్దాగా ఎదురు చూస్తూండగా రాత్రి పన్నెండు గంటలకి వచ్చాడు.

"ఏమైందండీ? ఈ వేళ ఇంత ఆలస్యం అయింది. ఆఫీస్ గొడవలేం లేవుకదా?" ఆందోళనగా ప్రశ్నించింది రమ్య చాలా అలసటగా వచ్చి సోఫాలో కూలబడ్డ భర్తని.

"ఏమైందిరా! నీ ఒంట్లో బాగుంది కదా?" ఆదుర్దాగా అడిగింది శారదమ్మ వివిధ రకాల అనుమానాలు ఆమె మనసుని తొలుస్తూంటే. ఆమె మనసు కీడు శంకిస్తోంది.

"ఏం లేదు రమ్యా! మా ఆఫీస్‌లో నాతో కలిసి ఉద్యోగంచేసే సహఉద్యోగి రాజారావు ఆత్మహత్యా ప్రయత్నం చేస్తే అతణ్ణి ఆసుపత్రిలో చేర్చవలసి వచ్చింది. అతను ఇప్పుడు ప్రాణాపాయ స్థితి నుండి గట్టెక్కాడు. ఇంతవరకు ఆసుపత్రిలోనే ఉన్నాను. అతని బంధువులు వచ్చిన తరవాత వాళ్ళకి అప్పచెప్పి వచ్చాను. నా ఇంకో కోలీగ్ వాళ్ళకి సహాయంగా ఇంకా అక్కడే ఉన్నాడు. రేపుదయం మళ్ళీ ఆసుపత్రికి వెళ్ళాలి." అన్నాడు రవి.

రవినుంచి విషయమంతా వినడంతో వాళ్ళు ఇప్పటివరకు అనుభవిస్తున్న మానసిక వేదన చేత్తో తీసినట్లు మాయమైంది.

"ఏమయింది రాజారావుకి? ఎందుకు ఆత్మహత్య చేసుకోబోయాడు?" అడిగింది శారదమ్మ.

"రాజారావు పెద్ద ఊబిలో చిక్కుకున్నాడు. తన స్నేహితుడి సలహా, ప్రోద్బలంతో వివిధ కంపెనీల్లో షేర్లు కొన్నాడు. కొన్న షేర్స్‌కి స్టాక్‌మార్కెట్లో విలువ బాగా పెరగడంతో కొత్తలో విపరీతంగా లాభాలు వచ్చాయి. ఊహించని లాభాలు రావడంతో మళ్ళీమళ్ళీ పెట్టుబడి పెట్టేడు. వాడికదో వ్యసనం అయిపోయింది. అందుకోసం చాలా చోట్ల అప్పుకూడా చేసాడు. ముందు కొన్నాళ్ళు లాభాలు తగ్గాయి. ఎప్పటికైనా లాభాలబాట పట్టకపోతుందా అంటే, ఇప్పుడు పెద్ద ఎత్తున నష్టాలు వచ్చాయి. స్వలాభంకోసం కొంతమంది స్వార్థపరులు కృత్రిమంగా షేర్‌ధరలు నియంత్రించడంతో జరిగిన సంక్షోభంతో చిక్కుకొని నష్టాలపాలయాడు రాజారావు. చేసిన అప్పులు తీర్చే స్తోమత లేదు వాడికి. ఉన్న ఇల్లు అమ్ముకున్నా అప్పులు తీరలేదు. ఆర్థిక సమస్యలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోబోయాడు. సరైన సమయంలో మేము తెలుసుకోవడంతో అదృష్టవశాత్తూ మృత్యుముఖం నుండి బయటపడ్డాడు. వాడిని మెల్లగా ఆ వ్యసనం నుంచి తప్పించాలి." వివరించాడు రవి.

అంతా విన్నాక, శారదమ్మ, రమ్య దీర్ఘంగా నిట్టూర్చారు.

శారదమ్మకి రవి మీద తన నమ్మకం రెట్టింపయింది. తన కొడుకు చాలా ఎదిగిపోయాడని అనిపించిదామెకు ఆ క్షణంలో.

"త్వరగా పడుక్కో నాన్నా, ఏమైనా కొంత తినేసి. చాలా అలసిపోయావు. రేపు ఉదయం మళ్ళీ హాస్పటల్‌కి వెళ్ళాలి." అందామె తన గదిలోకి వెళ్తూ.

# పునాది - డా. సమ్మెట విజయ

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

"**సుబ్బారావుగారూ!** నమస్కారం.. ఎక్కడికో బయలుదేరారు" రోడ్డు మీద నడుస్తూ పక్కనే ఉన్న సుబ్బారావుగారిని పలకరించాను.

"పక్కనే సూపర్ మార్కెట్‌కి. మీరెక్కడికి?" నవ్వుతూ సమాధానమిచ్చాడు సుబ్బారావు.

"నేనూ అక్కడికే పదండి" అంటూ అనుసరించాను. పక్క పక్క వీధుల్లోనే ఉంటాము. అప్పుడప్పుడూ కలుసుకుంటాం. పదవీ విరమణ తర్వాత కలిగిన పరిచయాలు. ఉదయపు నడకలో పెరిగిన అనుబంధం.

"ఏమిటి విశేషం మీ అబ్బాయి వస్తున్నాడా?"

"నెలాఖరులో ఆఫీసుపని మీద రెండురోజులు వస్తునాడు. ఏం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలో! వాడు బెంగుళూరులో మేమిక్కడ. వాడికిష్టమని నిన్న సంతలో పండుమిరపకాయలు, చింతకాయలు కొన్నాం కదా. వాటినిప్పుడు పచ్చడి పెట్టాలని నూనె, చింతపండు, కారం పట్టుకురమ్మని పంపింది మా ఆవిడ" అన్నారు సుబ్బారావు.

"మొన్ననేగా ఎవరో దబ్బకాయలు యిచ్చారని పచ్చడి పెట్టారన్నారు."

"మీరు భలేవారే అది దబ్బకాయకదండీ. ఇది పండు మిరపకాయ. పెట్టాక మా ఆవిడతో చెప్పి చిన్న డబ్బాలు తెచ్చిస్తా ఓ ముద్ద తిని అప్పుడు చెప్పండి. మా రాధ పచ్చళ్ళు పెట్టడంలో ఆమె కామే సాటి" గర్వంగా చెప్తున్నారు సుబ్బారావు.

ఆయన మాటలు వింటుంటే నోట్లో నీళ్ళూరసాగాయి. మా లావణ్యకంత టైం ఉండదు పాపం. ఉద్యోగానికి వెళ్ళి అలిసిపోయి వస్తుంది. పోనీ నేను సహాయం చేస్తాను అంటే వినిపించుకోదు. ఆఫీసునుంచి వచ్చేసరికే రాతి తొమ్మిది. వంటమనిషి చేసే వంటలకు అలవాటు పడిపోయి విసుగొస్తోంది. పంచదార, గోధుమపిండి ప్యాకెట్లు తీసుకుని ఆయన్ననుసరించాను.

"ఏమిటి రామచంద్రంగారూ. అలా నీరసంగా ఉన్నారు?" అడిగారు సుబ్బారావుగారు.

"అబ్బే ఏం లేదండి.. మీరు పండుమిరపకాయ పచ్చడి అంటుంటే మా అమ్మ గుర్తొచ్చింది. గోంగూర పచ్చడి, నిమ్మకాయ పచ్చడి, అల్లం పచ్చడి, ఆవకాయ. ఆ ఆవకాయలో ఎన్ని రకాలో. అన్నట్టు టమాటా పచ్చడి, చింతకాయ తొక్కు ఆహా ఎన్ని పెట్టేదండి. ఇదిలా ఉండగ ఏ రోజుకారోజు రోటి పచ్చడి ఏదో ఒకటి చేయకపోతే ఆవిడకు ముద్ద దిగేదికాదు. ఈ రోజు ఏం పచ్చడి చేద్దామా అనే ఆలోచనలోనే ఉండేది. అనుకున్నది చేసేది. చేసింది పక్కింట్లో కాస్తా, ఎదురింట్లో కాస్తా పెట్టి రుచిచూపించేది. ఎంతైనా సుబ్బారావుగారూ ఆ కాలమే వేరు" నిట్టూర్చాను.

"నిజమే మా ఆవిడ ఉద్యోగం చేయక ఇంకా ఆ వాసనలు పోలేదు. అన్నీ చేయాలని తాపత్రయం. ఏదో కష్టపడుతుంది. ఎందుకూ అబ్బాయి బెంగుళూరులో ఉంటాడు. వాడికి పంపించాలని. అమ్మాయిది ఢిల్లీ. ఆమెకి పంపించాలని. ఉన్నా మేమిద్దరం ఈ వయసులో బీపీలు, షుగర్ తో ఏం తింటాం చెప్పండి?"

"అంతేలెండి. వస్తాను సార్" మా వీధి సందు రాగానే ముందుకు సాగాను. ఇంట్లోకి అడుగుపెట్టగానే "పంచదార తెచ్చారా అయ్యగారూ. కాఫీ కలిపివ్వనా?" వంటమనిషి సరోజ వచ్చేసి రెడీగా ఉంది.

"ఇవ్వమ్మా" వాలుకుర్చీలో సాగిలపడ్డాను. కళ్ళు మూసుకుంటే ఎన్నెన్నో ఆలోచనలు. పల్లెటూరులో అమ్మా, నాన్నలతో గడిపిన కాలం, తీయని జ్ఞాపకాలెన్నో. చదువుకునే రోజుల్లో నాన్న రెక్కల కష్టంతో వ్యవసాయం చేసి పట్నానికి పంపి ఫీజులు కట్టి చదివిస్తే పెద్ద ఉద్యోగస్థులుగా మారి పెళ్ళిళ్ళు చేసుకుని పట్నానికి మకాం మార్చేసి ఏ చుట్టపు చూపుగానో కన్న తల్లిదండ్రులను చూసి వచ్చే వాళ్ళం నేనూ, తమ్ముడూ.

పొద్దున్నే లేవగానే వాకిలి ఊడ్చే కార్యక్రమం ఓ గంట. అమ్మ ఇంటిముందు, చుట్టూరా ఊడ్చి, బకెట్లు పేడనీళ్ళు కలిపి కళ్ళాపి చల్లి ఆరేలోపు పిడకలతో పొయ్యి వెలిగించి గంగాళం నిండా నీళ్ళుకాచి అలికిన వాకిట్లో పెద్ద పెద్ద ముగ్గులు వేసేది. ఏ ముగ్గు కా ముగ్గు గొప్ప చిత్రకారుడు గీచిన చిత్రంలా ఉండేది. ఇక్కడ సంక్రాంతి వస్తేనే ముగ్గులు గుర్తుకొస్తాయి. అక్కడ ప్రతిరోజూ ప్రతి వాకిలి సంక్రాంతి శోభను సంతరించుకునేది. నీళ్ళుకాగాక రెండు కట్టెలు తెచ్చి పొయ్యిలో గుచ్చి అదే పొయ్యి మీద వంట చేసేది. కట్టెల పొయ్యి మీద వంట రుచికి ఈనాటి గ్యాసు పొయ్యిలకి ఎంత తేడా!.

"అయ్యగారూ కాఫీ" వంటమనిషి సరోజ.

తేరుకుని కాఫీ తాగుతుంటే ఇప్పుడు కాఫీలకి, టీలకి అలవాటు పడిపోయాం. అప్పుడైతే అప్పుడే పితికిన పాలు చిక్కగా కాచి ఇస్తే కమ్మగా ఇంత పొడుగు గ్లాసు అమృతంలా తాగేసేవాళ్ళం.

"పుల్కా చేయమంటారా అయ్యగారూ?" గోధుమ పిండి పొట్లం తీస్తూ అడిగింది సరోజ.

"ఉండు అమ్మగారు చెప్తారు" లావణ్యకి ఫోన్ కలిపి సరోజకిచ్చా. ప్రతిరోజూ రాత్రిపూట మార్పులేని పుల్కాలనబడే రొట్టెముక్కలు తినాల్సిందే ఈ మధ్య ఆరోగ్యం, పోషకపదార్థాలు, జాగ్రత్తలూ అంటూ తిండిమీద అందరికీ విపరీతమైన శ్రద్ధ పెరిగి పోయింది. వంటలకోసం ప్రత్యేక ఛానళ్ళే వచ్చేశాయి. ఎన్ని రుచికరమైన వంటకాలు చేసినా ఏదో వెలితి అనిపిస్తోంది. నానబెట్టిన మినప్పప్పుని రోట్లో రుబ్బి రవ్వ కలిపి సన్నని సెగమీద నిదానంగా ఎర్రగా కాల్చి పెట్టే దిబ్బరొట్టె, వేడి వేడి నూనెలో వేసే పునుగులు, వడలు, రోటిలో రుబ్బే రోటి పచ్చళ్ళు పెట్టుకుని తింటే వేరే ఏ రుచులు కావాలనిపిస్తుంది? ముద్దపప్పు చేసి దొడ్లో కాసిన నాలుగు కాయగూరలు తుంచి ముక్కల పులుసు పెడ్తే నెయ్యి వడ్డించుకుని తింటే స్వర్గం తిరిగిరాదూ! అవన్నీ ఈ కాలం పిల్లలకి ఏం తెలుసు? పిజ్జా కావలా ? బర్గర్ తింటారా అంటారు.

వయసు పెరిగే కొద్దీ అభిమానం పెరిగి "మాత్ర వేసుకున్నారా?" అని గడిగడికి అడుగుతుంటారు. భోజనానికి ముందు తర్వాత మాత్రలు జీవితంలో అంతర్భాగంగా నిలిచిపోయాయి.

మనం మన పిల్లలకి ఏం చూపించాము? వాళ్ళకేం తెలుసు? ఉద్యోగస్థులుగా నేను, తమ్ముడు చుట్టపు చూపుగా వచ్చి పోయేవాళ్ళం. ఉన్న కాస్సేపు ముళ్ళమీదున్నట్లుగా ఉండేవాళ్ళం. పైగా పట్నం నుంచి రావడం విమానం దిగి వేరే దేశం నుంచి వచ్చినట్టుగా బెట్టుగా మనముంటే పట్నం నుంచి పల్లెటూరికి విచ్చేసిన మనల్ని మాత్రం వాళ్ళు ఆకాశం నుండి దిగివచ్చిన దేవతల్లా అతిథిమర్యాదలు చేస్తుంటారు. ఈ వ్యత్యాసం ఎందువల్ల ఏర్పడింది?

కృత్రిమ వాతావరణంలో పెరిగి మనమూ కృత్రిమంగా తయారవడం వల్లేనా? కళ్ళుమూసుకుని ఆలోచనల్లో పడ్డ నాకు అయ్యగారూ "రొట్టెలు, కూరా చేసేసా" వస్తానని సరోజ చెప్పడంతో తలుపు వేయడానికి లేచాను. ఇంతలో ఫోన్ మోగింది.

"నాన్నా నేను కిరణ్‌ని" అమెరికానుంచి కొడుకు ఫోన్. ఒక నెలరోజులు సెలవు మీద అమెరికా నుంచి ఇక్కడికి కుటుంబ సమేతంగా వస్తున్నాడట. ఒక్కసారిగా వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లు అటూ ఇటూ పచార్లు చేయసాగాను. లావణ్య వచ్చేవరకు తిరుగుతూనే ఉన్నాను. రాగానే చెప్పేశాను.

"అవునా? ఎంత మంచి వార్త చెప్పారండీ. ఇంకో సంవత్సరం ఈ ఉద్యోగం నాకు తప్పదు. విసుగ్గా ఉంది ఈ పని వేళలతో యంత్రాల్లా. అబ్బాయి, కోడలు రాగానే సెలవు పెట్టుకుని ఎక్కడికన్నా వెళ్దాం ఎంచక్కా" అంది

"కొంపదీసి ఏ ఊటీకో కొడైకెనాల్‌కో వెళ్దామంటావా?"

"ఎందుకూ వాడు ఉంటున్నదే మంచు ప్రదేశంలో. ఎక్కడికీ వద్దు. ఎంచక్కా మన ఊరికి వెళ్దామండీ. అత్తయ్యగారూ, మామయ్యగారు, మీరు పెరిగిన ఊరిలో ప్రశాంతంగా ఉండి వద్దాం."

ఎంతైనా నా శ్రీమతి కదా. నా మనసులోని మాట తన నోటిలో నుంచి వచ్చింది.

కృత్రిమ ఆకర్షణలు నుంచి సహజ వాతావరణంలోకి ఎప్పుడు వెళ్తానా అని నా మనస్సు ఉవ్విళ్ళూరసాగింది. భోంచేసి పడుకున్నానేగానీ కలలో మేమంతా మా ఊరు వెళ్ళినట్లు నా మనవరాలు వామనగుంటలు ఆడుతున్నట్లు, మనవడు గాలిపటాలు ఎగరేస్తున్నట్లు, కోడలు అక్కడి కోనేరులో తామరపులు కావాలని అడుగుతున్నట్లు కొడుకు ఆ పాత ఇంటికి కొత్త హంగులు రూపొందిస్తున్నట్లు రాత్రంతా ఊహాగానాలతో గడిచింది.

తెల్లవారగానే ఉదయపు నడకకు ఎప్పుడు వెళ్తానా ఎప్పుడు కిరణ్ రాకని అక్కడి మిత్రులతో పంచుకుంటానా అని ఆత్రంగా గడిపాను.

నా ముఖం చూస్తూనే సుబ్బారావుగారు పలకరించారు. "ఏంటండీ రామచంద్రరావుగారు హుషారుగా ఉన్నారు. ఏమిటి విశేషం?"

"భలే కనిపెట్టారండి" అంటూ కిరణ్ కుటుంబ సమేతంగా రావడం గురించి చెప్పాడు.

"చాలా సంతోషం దేశం కాని దేశంలో ఉంటూ మనదేశం వస్తున్నారు. మీ వాడికి తెలియనిదేమీ లేదుకాని. మీ మనవడు, మనవరాలుకి మీరు చూపించే ప్రదేశాలే అసలు భారతదేశం. అది గుర్తుంచుకుని చూపించండి"

"అదేనండి అందుకే భారతదేశం చూడాలి అంటే మన పల్లెటూర్లు చూడాలి. అందుకే మేము మా స్వగ్రామం వెళ్ళాలనుకుంటున్నాం. మా లావణ్య కూడా అదే అంది" చెప్పాను గొప్పగా.

"మీరు ఊహించినట్లుగా జరిగితే సంతోషమే" అన్నారు సుబ్బారావుగారు.

పిల్లలు వచ్చేసరికి తయారు చేయవలసిన పిండివంటల ఏర్పాట్లలో ఆ వారమంతా తీరికలేకుండా గడిచిపోయింది.

కిరణ్ వస్తున్నాడని పూనేలో ఉన్న కూతురు సుమకి కబురు చేసాను. సుమకి ఇద్దరు కొడుకులు.

అనుకున్నరోజు రానే వచ్చింది. ముందుగా సుమ, తర్వాత కిరణ్ వరుసగా వచ్చేశారు. కోడలిని, మనవళ్ళని, మనవరాలిని చూసి మురిసిపోయింది లావణ్య. నాకైతే పండుగే. స్కైపుల్లో చూడటం మాట్లాడటం వేరు, ప్రత్యక్షంగా వారితో గడిపింది ఎప్పుడని కళ్ళు చెమర్చాయి.

వచ్చినప్పటి నుంచి సుమ పిల్లలు, కిరణ్ పిల్లలు ఒకరికొకరు అలవాటు పడడానికి కొంత సమయం పట్టింది. ప్రతిదీ "వాటీజ్ దిస్" "వాటీజ్ దిస్" అంటూ అడిగి తెలుసుకుంటున్నారు కిరణ్ పిల్లలు. ప్రతిదానికీ బెట్టు చేస్తున్నారు సుమ పిల్లలు. మొదట్లో ఏదో

అనుకున్నాను. తర్వాత గమనించి చూస్తే నిజంగానే చాలా పెద్ద వెలితి అనిపించింది. ప్రతిదానిపట్ల ఒక తేలిక భావం, ఒక నిర్లక్ష్యం సుమ పిల్లలలో, ప్రతిదానిపట్ల ఒక ప్రత్యేక అభిమానం కిరణ్ పిల్లలలో కనిపించింది.

పల్లెటూరికి వెళ్ళగానే అందరూ ఎగిరి గంతేస్తారనుకున్న నా అంచనాలు తల్లక్రిందులయ్యాయి. "ఏంటి నాన్నా మీరు ఈ ప్లేస్ ఎందుకు ఎంచుకున్నారు? మా పిల్లలకి పడదు ఎలర్జీలు వస్తాయి ఈ విలేజ్‌లో" విసుక్కుంది సుమ. ఉన్నంతసేపు ముళ్ళమీద ఉన్నట్లే గడిపింది. కిరణ్ మాత్రం పూర్తిగా సంతోషపడిపోయాడు. సుమ, అల్లుడు వరుణ్ ముఖాలు మాడ్చుకున్నారు. "చక్కగా అన్నయ్యతో కలిసి సిటీలో ఉండి పార్టీలు, హోటల్స్, మూవీస్‌తో ఎంజాయ్ చేద్దామనుకున్నాము. మీరేంటి ఇలా చేశారు?" అనేసింది.

మూడురోజులు గడిచాయో లేదో ఇంక వెళ్ళిపోవాలని మొరాయించింది సుమ. చేసేది లేక తిరిగి వచ్చాము. రావడం రావడం ఎంతో హుషారుగా మారిపోయింది సుమ. ఈ రోజు ఎక్కడికి వెళ్ళాలి, ఏం షాపింగ్ చేయాలి? ఏ హోటల్‌కి వెళ్ళాలి అని. అమ్మ ఏం చేసిపెడుతుందా తిందామని ఎదురుచూసిన కిరణ్ చెల్లెలి ఆరాటానికి తలవంచక తప్పలేదు. తన మనసు నొప్పించడం ఇష్టం లేక రెండురోజులు సుమ ఇష్టప్రకారం తిరిగారు. మూడోరోజు సుమకు, వరుణ్‌కు సెలవులు లేక తిరిగి పూనె వెళ్ళిపోయారు.

సుమ వాళ్ళు వెళ్ళగానే ఇల్లు సగం చిన్నబోయింది. కిరణ్ మరో రెండురోజులు అవగానే రూమ్‌లోకి వెళ్ళిపోవడం, లాప్‌టాప్ ముందు కూర్చోవడం "వర్క్ ఫ్రమ్ హోమ్" అని గదిలోనే ఉండిపోయేవాడు. పగలంతా పడుకోవడం జరిగేది.

పిల్లలు కోడలు క్రమంగా ఉత్సాహం తగ్గిపోయి ఎప్పుడు వెళ్ళిపోదామా అన్న పద్ధతిలోకి మారిపోయారు.

లావణ్య ఏం చేసిపెట్టాలా, ఏమేమి వారికిచ్చి పంపాలా అని నిమిషం తీరికలేకుండా పనులు చేస్తూ అలిసిపోతోంది. చూస్తూ చూస్తూ వాళ్ళు వెళ్ళాల్సిన రోజు వచ్చేసింది. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళి సాగనంపి తిరిగి వచ్చి నేను వాలుకుర్చీలో సాగిలపడ్డాను. లావణ్య చాలా అలసిపోయింది.

"పోనీ ఓ రోజు సెలవు పెట్టి విశ్రాంతి తీసుకోరాదూ!?" అన్నాను.

"లేదండీ ఇప్పటికే వాళ్ళకోసం సెలవులు చాలా పెట్టేసాను. ఇంక పెట్టలేను" బ్యాగు తగిలించుకుని బయలుదేరింది ఆఫీసుకి.

సాయంత్రం వాకింగుకి వెళ్తూ కిరణ్ వాళ్ళకు చేసిన పిండివంటలు, పచ్చడి కొంచెం తీసుకెళ్ళి సుబ్బారావుగారికిచ్చాను. "ఏంటండీ రామచంద్రరావుగారు వెళ్ళిపోయారా పిల్లలు? ఈ మధ్య వాకింగ్‌కు కూడా సరిగ్గా రావడంలేదు' పలకరించారు సుబ్బారావుగారు.

"ఆ వెళ్ళిపోయారండి. అమ్మాయి ముందే వెళ్ళింది. అబ్బాయి నిన్నరాత్రే వెళ్ళాడు."

నడుస్తూ నడుస్తూ చెట్టుకింద కూర్చున్నారు.

"మీ పిల్లలు హాపీయా?"

"ఆ వాళ్ళు హాపీయే" అన్నాను నిర్లిప్తంగా.

"అదేంటి అలా ఉన్నారు?"

"నాకెందుకో పిల్లల తప్పులేదనిపిస్తుంది సుబ్బారావుగారూ"

"ఏ విషయంలో"

"అదే వాళ్ళకి పల్లెటూరు నచ్చే విషయాలలో. సుమ పట్నంలో పెరిగింది. పల్లెటూరు గురించిన బలమైన అనుబంధం బలవంతంగా రుద్దితే రాదుగా. అదే కిరణ్ పిల్లలకి చిన్నతనంలోనే పల్లెని గురించి చెప్పినవన్నీ వారికి ఆ పల్లె నచ్చేలా చేశాయి. చిన్నతనంలో చూపించేది నేర్పించేదే వారి మనసుల్లో బలంగా నాటుకుంటుంది. మధ్యలో ఎక్కిస్తే ఎక్కేది కాదుగా అభిమానం" అన్నాను నిట్టూరుస్తూ.

''వస్తానండి'' ముందుకు సాగాను. మనసంతా ఆలోచనలే. నిజమే పల్లెని పరాయిగా భావించిన పిల్లలకి రేపు తల్లితండ్రులు పరాయిగానే అనిపిస్తారు. జనాలు మారిపోతున్నారు. తల్లితండ్రులని పట్టించుకోవడంలేదు. విదేశాలకి వెళ్తున్నారు. వృద్ధాశ్రమాల్లో చేరుస్తున్నారు అంటూ పిల్లల్ని విమర్శించే ముందు మనమేం చేశాం? మనమేగా పల్లెనుంచి పట్నానికి, పట్నం నుంచి విదేశాలకి వాళ్ళని సాగనంపింది. ఇంక ఆలోచనలకి తావివ్వకుండా భవిష్యత్తులో మనవళ్ళు మనవరాళ్ళ మెదళ్ళలో పల్లెలపట్ల తల్లితండ్రులపట్ల గట్టి పునాదులు వేసే సంకల్పంతో నా అడుగులు హుషారుగా ముందుకు సాగాయి.

# దిద్దుకున్న తప్పు

అగస్త్యప్రగడ హేమంత

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**అందరూ** మనవాళ్ళే అనుకుంటాం. అయితే వాళ్ళ చేతిలో ఏదో ఒక ఎదురుదెబ్బ తిన్న తర్వాత గానీ అర్థంకాదు. మనం చేసిన పొరపాటు ఏవిటో. అది గుర్తొచ్చినప్పుడల్లా, పదే పదే తప్పు చేశావేమో అనిపిస్తుంది. అలాంటి అపరాధ భావమే ఇప్పుడు నాగమణి మనసుని తొలిచేస్తోంది. గత మూడురోజులుగా అదే వరస. ఆలోచిస్తుంటే తలలోని నరాలు చిట్లిపోతాయేమో అనిపించింది. బాధగా కణతలు రుద్దుకుంది.

''ఏమ్మా! తలనొప్పిగా ఉందా?'' ఆప్యాయంగా వినిపించడంతో, తల తిప్పి ప్రశ్న వినిపించిన దిశగా చూసింది. పక్క బెడ్ మీదున్న ముసలావిడ తాలుకు బంధువు కాబోలు. తననే గమనిస్తోంది.

''లేదు'' తల అడ్డంగా తిప్పుతూ అంది నాగమణి.

ఆవిడెవరో తనకి తెలియదు. తనెవరో ఆవిడకి తెలీదు. అయినా ఎదుటి మనిషి పట్ల ఎంత ఆదరణ చూపుతోంది. ఇందులో కనీసం ఒక వంతయినా తన రక్తసంబధీకులకి లేకపోయింది. అనుకుంటూంటే మనసు బరువెక్కింది. అప్పుడే కోపమూ ఒచ్చింది. అయినా తమ్ముడికి బుద్దిలేదు. తనని ఇలా జనరల్ వార్డ్‌లో చేర్పించకపోతే స్పెషల్ రూంలో పెట్టించొచ్చుగా. లేదా! తను సంపాదించి తెచ్చిన డబ్బు బోలెడంత ఉంది. పోయేకాలం కాక పోతేనూ... అనుకుంటూంటే గుప్పున గుర్తొచ్చి ముక్కుపుటాల్ని తాకింది ఇలాచీ టీ వాసన. తలెత్తి చూస్తే, మళ్ళీ పక్క బెడ్ పేషెంట్ తాలూకు ఆవిడే

''కొంచెం వేడి టీ తాగమ్మా! తలనొప్పి నెమ్మదిస్తుంది'' అంది గ్లాసుని నాగమణి వైపు జాపుతూ.

ఆ ఆత్మీయతకి కరిగిపోయిందామె. ''మీ పేరు?'' అడిగింది గ్లాసు అందుకుంటూ.

''పార్వతి'' చెప్పింది.

''ఆవిడ మా అమ్మ'' బెడ్ పైనున్న ముసలావిడని చూపిస్తూ అంది.

"నిజంగా ఈ పార్వతి చాలా మంచిది. ఆ మాటకొస్తే తన తమ్ముడూ మంచివాడే జనరల్ వార్డ్‌లో అందరితో కలిపి ఉంచాడు కనుకనే ఇప్పుడు ఈవిడ ఇలా తనతో మాట్లాడుతోంది. తనిలా వేడి టీ తాగగలుగుతోంది. అదే స్పెషల్ రూమ్ అయ్యుంటే బహుశా పలకరించే దిక్కుకూడా ఉండేది కాదేమో" టీ తాగుతూ అనుకుంది. అంతవరకూ బానే ఉంది. కానీ ఉదయమనగా ఇంత కాఫీ తన మొహాన పోసి, టిఫిన్ తెస్తానంటూ వెళ్ళిన తమ్ముడు పదవుతున్నా రాకపోవడంతో ఆమె మనసులో తిరిగి గందరగోళం మొదలయింది. "నేను పొరపాటుగానీ చేశానేమో" అన్న ప్రశ్న మదిలో మళ్ళీ మొదలైంది. అలా అనుకోవడం అవాళ్టికి అది ఎన్నోసారో ఆమెకి గుర్తులేదు. కానీ మనసంతా ఒకలాంటి వేదనతో నిండిపోయి ఉండడం మాత్రం తెలుస్తోంది.

"ఎవరైనా ఒచ్చి, పక్కన కూర్చుని కాస్సేపు ప్రేమగా కబుర్లు చెపితే బాగుండును" అనిపించింది. కానీ ఎవరూ లేరు. పక్కన ఒక్క పార్వతి తప్ప. ఆమె కూడా వాళ్ళమ్మకి టిఫిన్ తినిపిస్తోంది. ఆమెనలా చూస్తుంటే నాగమణికి 'చంద్ర' గుర్తొచ్చాడు.

హైదరాబాద్‌లో ఉంటాడతను. నాగమణి మొదటిసారి సౌదీకి వెళుతున్నప్పుడు, ఎయిర్‌పోర్ట్‌లో పరిచయమయ్యాడు. ఇద్దరిదీ ఒకే ఫ్లైట్ కావడంతో ఆ పరిచయం మరింత పెరిగింది. సౌదీలో సెలవు దొరికినప్పుడల్లా ఇద్దరూ కలుసుకునేవారు. గంటల తరబడి మాట్లాడుకునేవారు. ఎవరెవరు ఎంత డబ్బు ఊరికి పంపించారు? ఎంత బేంక్ బేలన్స్ వుంది? ఏమేం కొన్నారు?లాంటివన్నీ దాపరికాలు లేకుండా చెప్పుకునేవారు.

ఇంటి దగ్గర ఉన్న తల్లి, చెల్లెళ్ళు, వాళ్ళ బాధ్యతలు గురించి చంద్ర చెబితే, అప్పటికి ఇంకా పెళ్ళికాని తమ్ముడు, చదువుకుంటున్న చెల్లెలి గురించి నాగమణి చెప్పేది. ఇంచుమించు ఇద్దరికీ ఒకరి బాధ్యతల గురించి మరొకరికి పూర్తిగా తెలుసు.

ఎన్ని కబుర్లు చెప్పేవాడు. ఒక్కోసారి ఇంటినుంచి ఫోన్ రాక తను దిగులు పడిపోయినప్పుడు, తన బాధని పోగొట్టడం కోసం, ఎంత పరితపించేవాడు. అక్కడ ఉన్నన్ని సంవత్సరాలూ, రోజూ క్రమం తప్పకుండా ఫోన్ చేసి తన యోగక్షేమాలు కనుక్కునేవాడు.

ఇండియాకి వచ్చేప్పుడు, వెళ్ళేటప్పుడు ఒకే డేట్ వుండేలా ప్లాన్ చేసుకునేవారు. ముంబయ్ వరకూ కలిసే వచ్చేవారు. అతనుంటే ఎంతో ధైర్యంగా వుండేది తనకి. అలాంటి చంద్రని, ఇంటికి రాగానే ఎంత నిర్దాక్షిణ్యంగా దూరం పెట్టింది తను? అదంతా తన చుట్టూ వీళ్ళంతా ఉండగా మళ్ళీ అతనికి సన్నిహితంగా ఉండడం బావుండదని కదూ. అనుకుంటూంటే మనసు మరింత కలవరపడింది. "ఏమ్మా! మీ వాళ్ళెవరూ రాలేదా?" మళ్ళీ వినిపించిన పార్వతి పలకరింపుతో చటుక్కున కళ్ళు తెరిచింది నాగమణి.

"రాలేదు" చెప్పింది. ఎందుకొస్తారు? వాళ్ళకి ముఖ్యంగా తన మరదలికి డబ్బే ప్రధానం. వాళ్ళ పిల్లలకి తను కొనిచ్చే స్మార్ట్‌ఫోన్‌లు లాప్‌టాప్‌లు ఇవి ప్రధానం. అంతే తప్ప తను కాదు. డబ్బు సంపాదించినంతకాలం తనని ఎంతో గౌరవించింది. ఇప్పుడు ఇక సంపాదించింది చాలనుకుని ఇండియాలోనే ఉండిపోతాననే సరికి వచ్చింది ఆమెలోని మార్పంతా.

అప్పట్నుంచే నిర్లక్ష్యం మొదలైంది. రెండునెలల సెలవులో తను వచ్చినప్పుడల్లా కాలుకింద పెట్టనివ్వకుండా చూసుకున్న ఆమె ఇప్పుడు తనకో శత్రువులా మారిపోయింది. ఉంటానంటేనే ఇలా మారిన మనిషి ఇక పెళ్ళి చేసుకుంటానంటే ఎలా స్పందిస్తుందో? బహుశా ఆస్తి చేజారిపోతుందనే అభద్రతా భావమే మనుషుల్ని మార్చేస్తుందేమో.

తనూ మనిషే. ఎన్నాళ్ళని తన వాళ్ళకీ, దేశానికీ దూరంగా ఉండగలదు? ఎన్నాళ్ళని వాళ్ళకీ వీళ్ళకీ చాకిరీ చెయ్యగలదు? అవన్నీ తన వల్లకాకనే కదా ఇక వెళ్ళకూడదనుకుంది. కానీ ఆ నిర్ణయం మరదలి నిజస్వరూపాన్ని బయటపెడుతుందని ఊహించలేదు. ఆఖరికి మూడురోజులుగా మూసిన కన్ను తెరవకుండా పడివున్న తనని కనీసం పలకరించనైనా లేదు. అదంతా చూడలేకనేమో తమ్ముడు తనని తెచ్చి హాస్పిటల్‌లో పడేశాడు. అనుకుంటూంటే అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాటిని దాచడం ఆమెకి సాధ్యం కాలేదు.

అందుకే అవి పార్వతి కంటపడ్డాయి.

"అయ్యయ్యో ఏమైంది?" అడిగిందామె నాగమణి కన్నీరు చూసి.

"ఏమో? కళ్ళు మండుతున్నాయి" చటుక్కున అబద్ధం చెప్పేసింది.

"అంతే. ఇదుగో ఈ రెండు ఇడ్లీలు తినేసి, కాస్సేపు కళ్ళు మూసుకుని పడుకో" చెప్పి ఇడ్లీ ప్లేటు ఆమెకి అందించింది.

ముందు మొహమాటపడ్డా, నీరసం నిలువనివ్వకపోవడంతో వాటిని అందుకుని తినేసింది. ఇంతలో డ్యూటీ నర్స్ వచ్చి అందరికీ టాబ్లెట్స్ అందించి, ఇంజెక్షన్లు ఉన్నవాళ్ళకి అవీ అందించేసి వెళ్ళిపోయింది. "థాంక్స్" అంది నాగమణి, నర్స్ అటువెళ్ళగానే పార్వతివైపు తిరుగుతూ.

"అయ్యో! ఈ మాత్రం దానికేనా! భలేదానివే" అంటూ నవ్వేసిందామె.

"ఏమ్మా ఓ మాటడుగుతాను. నీకు పెళ్ళయిందా?" ప్రశ్నించింది.

"లేదు" అన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

తలతాకట్టు పెట్టయినా సరే తన పెళ్ళి చెయ్యాలని అనుకున్నాడు తండ్రి. కానీ తనేం చేసింది? అప్పటికే ముప్పై వచ్చేసినా తన వెనకున్న తమ్ముడు, చెల్లెలి గురించి ఆలోచించింది. చేతినిండా డబ్బుంటే చాలు కానిది లేదు. అసలు అదిచ్చే ధైర్యమే వేరు. ఆపైన ముప్పై మీరితే పెళ్ళికి పనికిరారనుకోవడం నాటిమాట. ఏభైల్లోకి వచ్చినా పెళ్ళి వింతకాకపోవడం ఇప్పటి మాట. అంచేత ముందు సంపాదన. తర్వాతే పెళ్ళి అనుకుని కదూ దాన్ని వాయిదా వేసుకుంది. తనేకాదు, తన వాళ్ళూ రేపటి రోజున డబ్బుకోసం ఇబ్బంది పడకూడదని కదూ. అంతంతమాత్రం చదువున్న తనలాంటి వాళ్ళు బాగా డబ్బు సంపాదించాలంటే అందుకు ఏ సౌదికో వెళ్ళడం ఒక మార్గం అని తెలుసుకున్నది. అందుకేగా ఇంటిని బేంక్‌లో తనఖా పెట్టించి ఆ డబ్బుతో వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకుని తెగించి గల్ఫ్‌కి బయల్దేరింద్ది. ఒకటికాదు, రెండు కాదు పదేళ్ళపాటు కష్టపడి పైసాపైసా కూడబెట్టి ఇంటికి పంపించి, ఆ డబ్బుతో తనఖా విడిపించడమే కాదు పదెకరాల పొలం, ఇంకో ఇల్లు ఇవన్నీ కొనిపించింది. తమ్ముడికీ చెల్లెలికీ ఘనంగా పెళ్ళిళ్ళు చేసింది తన కష్టార్జితంతో కాదూ.

అసలు ఇందులో తన తప్పు కూడా ఉంది. ఇబ్బడి ముబ్బడిగా డబ్బులున్నప్పుడు కొన్ని కావాలనిపిస్తాయి. ఇంకొన్ని అవసరం లేదనిపిస్తాయి. అల ఒద్దనిపించిన వాటిలో పెళ్ళికూడా ఉండడంతో సంపాదన మీద దృష్టిపెట్టింది తప్ప తన గురించి పట్టించుకోలేదు. పైగా తర్వాతెప్పుడో తీరిగ్గా ఆలోచించుకుందామనుకుంది. ఎంతసేపూ వాళ్ళ సుఖం గురించే పాకులాడింది తప్ప, తన భవిష్యత్ గురించి చింతపడలేదు. ఇంత చేసిన తనకోసం, వాళ్ళు ఏదో ఒకటి చెయ్యకపోతారా! అన్న ధీమాతో. అలా చెయ్యడమే తను చేసిన పొరపాటేమోనని ఇప్పుడనిపిస్తోంది.

కానీ ఏం లాభం? పాతికేళ్ళ వయసులో పెళ్ళి చేస్తానంటే కాదు పొమ్మని తీరిగ్గా ఇప్పుడు ప్రయత్నాలు మొదలెడదామనుకుంది. కానీ ఫార్టీ ప్లస్‌లో పెళ్ళంటే తమ్ముడు మరదలు పడనిచ్చేట్టులేరు. మరదలి మెప్పుకోసం తను మళ్ళీ సౌదీకి వెళ్ళి అక్కడ ఆ చాకిరీ చెయ్యలేదు. అలాగని ఒంటరిగా ఉండనూలేదు. అంతేమరి. చేతిలో చిల్లిగవ్వలేని వాళ్ళని ఎలాగైనా ఒదిలించుకోవాలని చూస్తారు. చేతినిండా డబ్బున్న వాళ్ళని ఒడిసి పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. లోకరీతిని అనుసరించి మసలుకోకపోతే ఇబ్బందులు తప్పవు. ఇప్పుడు తన పరిస్థితి అదే. ఈ స్థితిలో ఏం చెయ్యాలి తను? ఆలోచిస్తుంటే మళ్ళీ మనసు తన ప్రశ్నకి జవాబివ్వకుండా పరధ్యానంలో పడ్డ నాగమణిని చూసి విషయం చూచాయగా గ్రహించింది పార్వతి. "ఏ పరిచయం లేకపోయినా ఇలా చెబుతున్నానని ఏమీ అనుకోకు. కొన్ని బంధాలు చేతిలో డబ్బు, ఒంట్లో ఓపిక, అవతలి వాళ్ళకి మనతో అవసరం ఇలాంటి వాటి వల్లనే నిలబడతాయి. అవి లేనినాడు తెగిపోతాయి. కానీ కొన్ని బంధాలు మాత్రం ప్రేమ, పెళ్ళి, ఆప్యాయత ఇలాంటి వాటితోనే పెనవేసుకుంటాయి. ఏనాటికైనా అవే శాశ్వతం. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నువ్వూ, నీకంటూ ఒక దారిని ఏర్పరచుకోవడం మంచిది. అంటే పెళ్ళి చేసుకోవడంలాంటిది" అంది.

"అనే నాకూ ఉంది. కానీ కుదిరేట్టు లేదు" నిరాసక్తంగా అంది నాగమణి.

"మనసున్న చోట మార్గం కనపడుతుంది. ప్రయత్నించు" ఠక్కున అంది పార్వతి.

"అదీ నీకంటూ ఓ తోడు ఉండడం కోసం. రోగాలూ రొచ్చులూ వచ్చినప్పుడు ఇలా ఇంకొకరి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడకుండా ఉండడం కోసం. ముఖ్యంగా మనసుకి కష్టంగా అనిపించిన క్షణాన అదంతా చెప్పుకుని గుండెని తేలిక పరచుకోవడం కోసం" మెల్లగా అందామె.

వింటున్న నాగమణికి అదీ నిజమేననిపించింది మనసారా సాటి మనిషితో మాట్లాడి ఎన్నాళ్ళయిందోఓ. కానీ, ఇప్పటికిప్పుడు అలాంటి ఒక తోడు ఎలా దొరుకుతుంది తనకి? అందుకు సహకరించేవాళ్ళెవరూ? అనుకుంటూంటే అప్పుడొచ్చాడు ఆమె తమ్ముడు, భోజనం కేరేజీ పట్టుకుని.

"ఏకంగా వంట చేసి ఇచ్చేస్తాను వుండమని మీ మరదలు అంటేనూ ఇక ఇన్నిసార్లు ఏం తిరుగుతానని ఉండిపోయాను" అన్నాడు. అదీ సంజాయిషీ ఇస్తున్నట్టు కాక, 'ఏదో ఒక కారణం చెప్పాలి కనుక చెప్పాను' అన్నట్టుగా.

సరిగ్గా అప్పుడే తమ్ముడి ఫోన్ రింగయింది ఎత్తితే అవతల్నుంచి మరదలు. ఏం చెప్పిందో ఏమోగానీ అతని మొహం ఒక్కసారి నల్లబడి తిరిగి యధాస్థితికి చేరుకుంది.

"ఎవరో చంద్రట సౌదీలో నీ ఫ్రెండ్‌ట కదా? ఆయన నీ సెల్‌కి కాల్ చేశాట్ట. నీ గురించి అడిగాట్ట. నువ్వు హాస్పిటల్లో ఉన్నావని మా ఆవిడ చెపితే, అడ్డమైన ప్రశ్నలూ వేసి విసిగించి నా నెంబరు అడిగి పుచ్చుకున్నాట్ట. ఇప్పుడో ఇంకాస్సేపట్లోనో ఫోన్ చేస్తాడట మా ఆవిడ చెప్పింది" అన్నాడు మొహం గంటు పెట్టుకుని.

"ఇంతకీ ఎవరా చంద్ర?" ఆరాతీశాడు ఆ మాటని ఎంత యధాలాపంగా అడగడానికి ప్రయత్నించినా అతని కళ్ళలో అనుమానం కదలడం నాగమణి దృష్టిని దాటిపోలేదు.

చంద్రపేరు వినగానే మనసు పొంగే సంద్రంలా మారినా అతికష్టం మీద అదుపు చేసుకుంది. ఉబికి ఒస్తున్న ఉద్వేగాన్ని తమ్ముడికంటపడకుండా నిభాయించుకుంది. "అతనంత ముఖ్యమైన వ్యక్తికాదులే" అంది నిర్లిప్తత నటిస్తూ. ఆ మాటతో తమ్ముడి ముఖం తేటపడడాన్ని ఆమె గమనించకపోలేదు.

అనుకున్నట్టుగానే పది నిమిషాల తర్వాత ఫోనొచ్చింది. చంద్ర మాట్లాడాడు. అతను తన పరామర్శని కేవలం ఫోన్‌కే పరిమితం చెయ్యదల్చుకోలేదు. అందుకే ఓ వారం తర్వాత హైదరాబాద్ నుంచి సరాసరి నాగమణి ఇంటికే వచ్చేశాడు.

తనని చూడడం కోసం అతను అంత ప్రత్యేకంగా, అదీ అంత దూరం నుంచీ రావడం ఆమెకి చాలా సంతోషాన్నిచ్చింది. ఇద్దరూ కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. కష్టం సుఖం కలబోసుకుంటుంటే మాటల మధ్య తెలిసింది. చంద్రకి ఇక సౌదీకి వెళ్ళే ఉద్దేశం లేదనీ ఇండియాలోనే వుండిపోవాలనుకుంటున్నాడనీను. చెల్లెళ్ళ బాధ్యతల కోసం పెళ్ళి మానేసి ఇన్నేళ్ళూ బ్రహ్మచారిగా ఉండిపోయిన అతను ఇప్పటికైనా తనవాళ్ళ మధ్యకి చేరడం ఆమెకి సమంజసంగా తోచింది.

ఎలాగూ సందర్భం వచ్చింది కనుక తన సంగతీ, తనవాళ్ళ స్వార్థం సంగతీ అన్నీ అతని దగ్గర వెళ్ళబోసుకుంది. ఆ విధంగా 'మీ వాళ్ళతోను జాగ్రత్తగా వుండు సుమా' అని అన్యాపదేశంగా హెచ్చరించింది.

అంతా విని గాఢంగా నిట్టూర్చాడతను. ఆ వెంటనే అన్నాడు. "మీరు పెళ్ళి చేసుకోవచ్చుగా?" అని.

"చేసుకోవాలనే వుంది. కానీ" ఇక ఆ మాటని ఎలా పూర్తి చేయాలో అర్థంకాక ఆగిపోయింది.

"ఆ ఏర్పాట్లు నేను చూస్తాను. సంబంధం కూడా సిద్ధంగా ఉంది. మీకు ఇష్టమైతే చెప్పండి. ఇప్పుడే అతని ఫోన్ నెంబరు ఇస్తాను" చెప్పాడు.

ఊహించని అవకాశం వచ్చి వళ్ళో పడ్డప్పుడు ఆలోచన అనవసరం అనిపించడంతో "సరే ఇవ్వండి" అంది సెల్ చేతిలోకి తీసుకుంటూ.

అతను నంబర్ చెప్పాడు.

ఆమె డయల్ చేసింది. వెంటనే రింగయింది. ఆ రింగ్ టోన్ చంద్ర సెల్ నుంచి రావడంతో ఆశ్చర్యపోయింది.

"ఇది కూడా నాదే డ్యూయల్ సిమ్" చెప్పాడు నవ్వుతూ.

అతను ఏ ఉద్దేశంతో వున్నాడో అర్థమయ్యేసరికి ఆలోచనలో పడింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగాడతను అరగంట తర్వాత సంశయిస్తూనే.

"పెళ్ళి ఎక్కడ చేసుకుంటే బావుంటుంది? రిజిస్టర్ ఆఫీస్‌లోనా? కళ్యాణమండపంలోనా? అందర్నీ పిలుద్దామా? కొందర్ని మాత్రమే ఆహ్వానిద్దామా? ఇందాకట్నుంచీ ఏదీ తేల్చుకోలేకపోతున్నాను" తలొంచుకుని మెల్లగా ఆమె చెబుతుంటే అతని మొహంలో చిర్నవ్వు చోటు చేసుకుంది. "ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది నాకు" అన్నాడతను ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ.

"అవును. చేసిన పొరపాట్లు దిద్దుకునేందుకూ అవకాశాలొస్తాయి. వాటిని వినియోగించుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. నాక్కూడా" అంది నాగమణి.

# కొన్నతల్లి

రమేష్ బోడపాటి

"అభినందనలు రావు గారూ మీరు తండ్రయినందుకు."

"చాలాబావున్నాడు. ఇంతకీ పేరేం పెట్టారు అబ్బాయికి?"

"వినూత్ " అన్నాడు రావు గర్వంగా.

"పేరు కూడా కొత్త గానే ఉంది."

"మాలతి గారూ మీకు తల్లి కళ వచ్చేసింది" అంటున్నారు ఆయన భార్యని.

'తల్లి కళ 'నవ్వుకుంది మాలతి.

అయితే అది ఆలోచించే సమయం కాదు. వచ్చిన అతిధులకు మర్యాద చేయటంలో నిమగ్నమయ్యింది.

ఆ రోజున మాలతి రావు దంపతుల కుమారుడు' వినూత్ ' నామకరణం సందర్భంగా ఏర్పాటూ చేసిన విందు కార్యక్రమం జరుగుతోంది.

నామకరణం ఇంట్లోనే జరిగిపోయినా భోజనాలు మాత్రం పెద్ద హోటల్లో ఏర్పాటు చేసారు, రావు గారి పరపతి,హోదాకు తగినట్లుగా. ఊళ్ళో ప్రముఖులంతా వచ్చేసారు. రాకపోతే అనుమానం, ఆ పై అవమానం!!

ఒకాయన మైకు అందుకుని

"రావు గారికి మనందరి తరఫున అభినందనలు తెలియచేస్తున్నాను. ఇది ఆయన కుటుంబమే కాదు మనందరమూ ఆనందించాల్సిన సమయం. వివాహమయి చాలా కాలమైనా వీరికి ఇంతవరకూ సంతానం కలగలేదు. ఇన్నాళ్ళకు దేవుడు కరుణించాడు.ఆయన వ్యాపారానికి వారసుడు దొరికాడు.అందుకు ఆయన భార్య మాలతి గారిని ప్రత్యేకంగా అభినందించాలి ."

అందరూ చప్పట్లు కొట్టారు.

ఇటువంటి ఉపన్యాసాలు కొన్ని అయిన తర్వాత రావు మాట్లాడుతూ

"మా ఆహ్వానాన్నిమన్నించి విచ్చేసిన మీ అందరికీ ధన్యవాదాలు. ఇది మా జీవితంలో మధురమైన రోజు.మాకు వివాహమై చాలా సంవత్సరాలు గడిచినా సంతానం కలగలేదు. మేము కలవని వైద్యుడు లేడు. చేయని పూజ లేదు.దేవుని దయలేదని సరిపెట్టుకున్నాం.ఎవరి నయినా పెంచుకుందామనుకున్నాంబంధువుల పిల్లలయితే కొత్త సమస్యలు వస్తాయి. అనాధ పిల్లలను తెచ్చి పెంచుకోవటానికి .....ఉహూ ... అనుకున్నాము."

అందరూ ఆసక్తిగా వింటున్నారు.

"ఈ మధ్యనే ప్రచారం, ఆదరణ పొందుతున్న సర్రొగసీ వైద్య విధానం మా దృష్టికి వచ్చింది. వైద్యుల సలహా మీద ఈ పద్ధతిని అనుసరించాము.నా వీర్యాన్ని ఒక అజ్ఞాతస్త్రీ లో ప్రవేశపెట్టి వైద్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం పూర్తి చేసాం. దాని ఫలితమే ఈ వినూత్. దీనికి చాలా ఖర్చయిందనుకోండి.అయినా నా రక్తం, నా వారసుడు. అదే నాకు కావలసింది.""

ఆయన మాటల్లో దర్పం,అహంకారం డబ్బుతో దేన్నయినా సాధించవచ్చనే అహంభావం అందరూ గమనించారు.

"అమ్మగారూ బాబు ఏడుస్తున్నాడు."అన్న నర్స్ మాట వినబడి ' బాబు ' అనుకుంటూ మాలతి ఆ పసివాణ్ణి ఎత్తుకుంది.

అలవాటు పడుతున్న స్పర్శకు ఏడుపు మానేసాడు.నర్స్ తెచ్చిన పాలసీసా అతని నోట్లో పెట్టింది. ఆకలి తీరి కిలకిలా నవ్వుతున్నాడు.

భోజనాలు పూర్తి చేసి అందరూ వెళ్ళి పోయారు.

"మనబ్బాయిని అందరూ మెచ్చుకున్నారు" అన్నాడు రావు తృప్తిగా.

మాలతి నిర్లిప్తంగా నవ్వుకుంది.

అవునని తల ఊపినా ఏదో అసంతృప్తి ఆమె మనసులో చోటు చేసుకుంటోంది.

రోజులు గడుస్తున్నాయి. పసివాడు వయసుకు తగ్గట్లుగా పెరుగుతున్నాడు.పోషణలో లోపం లేదు.ఇప్పుడిప్పుడే చిన్నచిన్న మాటలు వస్తున్నాయి.

"అమ్మ" అంటూ మాలతిని చూపించాడు రావు.

'నేను అమ్మను కాను' అనుకుంటోంది మాలతి.

సాధారణంగా తల్లి' నాన్న' అంటూ తన భర్తను సంతానానికి పరిచయం చేస్తుంది.ఇక్కడ తండ్రి 'అమ్మ' అంటూ తన భార్యను పరిచయంచేస్తున్నాడు. ఇదొక విచిత్రం.

"అబ్బాయికి డ్రస్సులు కొందాం రావోయ్" అన్నాడు ఒక సాయంత్రం.

"నేను రాను. మీరే వెళ్ళండి."

"అదేమిటి. బట్టల సెలక్షన్ ఎప్పుడూ నీదే కదా. నువ్వు ఎంచేవి చాలా బాగుంటాయని మా వాళ్ళందరూ తెగ మెచ్చుకుంటారు. మరి మనబ్బాయి దగ్గర కొచ్చేసరికి రానంటావేం."

అతనే కొడుకుని తీసుకుని వెళ్ళిపోయాడు.

'చూడు ఎన్ని కొన్నానో' అంటూ సంబరంగా చూపించాడు.

మాలతి నవ్వి ఊరుకుంది. తను ఇష్టపడి కొన్న బట్టలు భర్తకు చూపించి మురిసిపోయిన రోజులు గుర్తొచ్చాయి

ఇంకొక రోజు కారులో బయలుదేరారు..తను వెనక సీట్లో కూర్చుంది.

"అదేమిటి ఎప్పుడూ ముందు సీట్లోనే కదా నువ్వు కూర్చునేది. అయినా పిల్లాడు ఒక్కడూ కూర్చోలేడు. నువ్వు ముందుకురా."

"ఫరవాలేదు. అయినా మీరున్నారు కదా" అన్నదే కానీ ముందు సీట్లోకి మారలేదు.

వచ్చీరాని ఊహలతోఉన్న పిల్లాడు డైనింగ్ టేబుల్ మీద వంటకాలను చిందరవందర చేసేస్తున్నాడు.

'అదేంటి కాస్త అన్నం కలిపి పెట్టవచ్చు కదా' అని కసురుకున్నాడు.

మాలతి తనకేం పట్టనట్లుగా భోంచేసింది..

రావుకు ఆమె ప్రవర్తన వింతగా అనిపించటం మొదలయింది.

పడక గదిలో కూడా ఆమె ధోరణి అర్థం కావటం లేదు.

వినూత్ తండ్రిని కరుచుకుని నిద్ర పోతాడు.తల్లి మీద చేయి వేసినా ఆమె తీసివేయటంతో తండ్రి దగ్గరే మాలిమి ఎక్కువవుతోంది.

పిల్లవాడు నిద్ర పోయిన తర్వాత అతన్ని మంచానికి ఒక వైపుకు జరిపి దొర్లిపడకుండా జాగ్రత్తలు తీసుకుని భార్య మీద చేయి వేశాడు. ఆమె విసిరికొట్టింది.

"ఏం వంట్లో బాగా లేదా"అన్నాడు ఆదుర్దాగా.

"అదేం లేదు."

"మరి?"

భార్యను తన వైపుకు తిప్పుకున్నాడు.ఆమె కళ్ళంబడి నీళ్ళొస్తున్నాయి.

"ఏమయింది .ఎవరైనా ఏమైనా అన్నారా."

" .. .."

"ఇదివరకు జీవితంలో చాలా వెలితిగా ఉండేది.ఇప్పుడు మన జీవితంలోకి వెలుగొచ్చింది. నీకు గుర్తుంది కదా .పిల్లలు పుట్టటంలేదని మధన పడుతూ మనం ఎన్నోరాత్రులు నిద్ర పట్టకుండా గడిపేవాళ్ళం. కానీ ఇప్పుడు ఆ దిగులు తీరిపోయింది. మన జీవితాల్లోకి కొత్త వెలుగొచ్చింది.ఇక మనకు పిల్లలు పుట్టలేదనే చింత లేదు."

"అవును లెండి. మీరు సంపాదించుకోగలరు".

"సంపాయించుకోవటం ఏమిటి. నువ్వేం మాట్లాడుతున్నావో తెలుస్తోందా".

"నాకు బాగానే తెలుస్తోంది. నా దురదృష్టం మీకే అర్థం కావటం లేదు".

"వింతగా మాట్లాడుతున్నావివాళ.నేనెవరిని ".

"మీ బిడ్డకు తండ్రి.."

"అంటే నీకేం కానా?".

"నా భర్త హోదా కూడా ఉంది".

"హోదా ఏమిటి. ఇదేమైనా పదవా అధికారమా.! చాలా విడ్డూరం గా ఉంది."

"మీ చేతల్లాగే ఉంటాయి, నా మాటలు కూడా."

ఆమెకు దు:ఖం ఆగటం లేదు. అతనికి కారణం అంతు పట్టటం లేదు.

"మనకు పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టర్లు చెప్పినప్పుడు నాకు చాలా బాధేసింది. ఎవరినయినా పెంచుకుందామంటే మీరొప్పుకోలేదు."

"అవును.ఎవరికో పుట్టిన బిడ్డను పెంచుకోవటం నా కిష్టం లేదు."

"మరి ఈ పిల్లాడు?"

"ఏం మాట్లాడుతున్నావ్.నేను ఈ బిడ్డకు తండ్రిని."

"కానీ తల్లెవరో తెలీదు కదా."

మాలతికి నవ్వొచ్చింది , అంత దు:ఖంలోనూ.

"నా రక్తం నా వారసుడని ఘనంగా చెప్పుకున్నారు, అందరూ మెచ్చుకున్నారు కూడా."అన్నది.

రావు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. విషయం ఎటు మళ్ళుతుందో అర్థం కావటం లేదు.

"ఇదివరకు ఎవరికైనా సంతానం కలగకపోతే ఆడదానిలోనే ఏదో లోపం ఉందనీ, గొడ్రాలని ముద్ర వేసి మగవాడికి మళ్ళీ పెళ్ళి చేసేవాళ్ళు. లేదా అతను ఎవరితో నైనా ...."

దు:ఖం ఆపుకోలేకపొయింది .రావు ఆమె భుజం మీద చేయి వేసాడు.

"నాలో లోపం ఉందని, సంతానం సంపాదించుకుని, శ్రమ పెట్టకుండా నాకు తల్లి హోదా కల్పించారు. చాలా సంతోషం. కానీ' అమ్మా' అని ఆ పిల్లాడు పిలుస్తున్నా నాలో ఎటువంటి స్పందనా కలగటం లేదు.

మాట వరసకి అంటున్నాను. ఒక వేళ నేను సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి మీలో లోపం వల్ల మనకు పిల్లలు పుట్టే అవకాశం లేకపోతే........"

"ఎవరినయినా తెచ్చి పెంచుకుంటాం"

"ఎంత తేలిగ్గా చెప్పారండి. నాలో లోపం ఉండి మీరు ఏదో రకంగా తండ్రయితే ఘనం. మరి మేం కూడా ఎవరి ద్వారానో పిల్లల్ని కంటే."

"ఛ అదెలా కుదురుతుంది. ఎవరితోనో...."

"ఊ.ఎవరితో నో .. అనండి. ఆగారేం. మేమూ ఎవరితోనూ సంబంధం పెట్టుకోము. అసలు వాళ్ళెవరో కూడా మాకు తెలీదు.కేవలం దాక్టర్లకే తెలుస్తుంది, మీ విషయం లో జరిగినట్టే. భార్యాభర్తలంటే ఒకరినొకరు ఇష్టపడి పెళ్ళి చేసుకున్న జంట. వారిలో ఒకరి లోపాన్ని రెండవవారు అంగీకరించాలి.

నాకు మీ అబ్బాయిని చూసినప్పడల్లా నా లోపమే నన్ను వెక్కిరిస్తున్నట్లుంటుంది.మీరు సంపాదించుకున్న.... సంపాదించుకున్న అని ఎందుకంటున్నానంటే మీరు పెట్టే కొత్త ఫాక్టరీ, కొత్త వ్యాపారం లాంటిదే ఈ సంతానం కూడా.

తల్లిదండ్రు లెవరో తెలియని అనాధని పెంచుకోవటానికి ఇష్టపడని మీరు ముక్కూ మొఖం తెలియని ఒక ఆడదాన్ని తల్లిని చేయటానికి సిద్ధ పడ్డారు. మీ సరుకు దాచుకునే గోడౌన్ చేశారు. పచ్చిగా చెపితే క్షమించండి. ఏ జన్మలో చేసిన పాపమో ఈ జన్మలో మనకు సంతానం లేకుండా పొయింది. నవ మాసాలూ మోసి జన్మ నిచ్చిన తల్లి నుండి బిడ్డనువేరు చేసి మళ్ళీ పాపం మూట కట్టుకోవద్దు. నా మీద ఏమాత్రం ప్రేమ ఉన్నా ఈ అబ్బాయిని కన్న తల్లికి అప్పచెప్పండి. వాడి పోషణ భారం మనమే వహిద్దాం. కానీ వాడు మాత్రం ఈ ఇంట్లో ఉండటానికి వీలు లేదు. "అన్నది స్థిరంగా

మాలతి ముఖంలో ప్రశాంతత. మరి రావు ..??

❦❦❦

# నేను దొంగను కాను

దమ్మవళం శ్రీనివాస్

"పట్టుకోండి.. దొంగ..పారిపోతున్నాడు..." అరుస్తూ జనాలు వెంటబడుతున్నారు. అది పట్టపగలు. నగల షాపునుంచి ఏదో నెక్లెస్ కాజేసి బయటకు పరిగెత్తాడు జగదీష్. షాపువాడు, సెక్యూరిటీ వాళ్ళు, రోడ్డు మీది జనాలు గట్టిగా అరుస్తూ వెంటబడ్డారు.

ఆయాసంతో రొప్పుతున్నాడు జగదీష్. ఎటు పరిగెత్తాలో అర్ధంకావటంలేదు. పరిగెత్తుతూ హడావిడిగా ఆలోచిస్తున్నాడు అసలు తను దొంగతనం ఎందుకు చేసాడా అని. గుర్తుకు రావటంలేదు. తనకు దొంగతనం చేయాల్సిన ఖర్మేంటి అసలు? ఎలా వచ్చింది ఈ దరిద్రపు ఆలోచన? ఏదైతే ఏంటి? తక్షణ కర్తవ్యం ఇక్కడనుంచి తప్పించుకోవటం.

వెంటబడే జనాల సంఖ్య పెరుగుతుందో, తగ్గుతుందో అర్ధం కావాటం లేదు. వెనక్కు తిరిగి చూసే టైం కూడా లేదు. ఇలాంటి సీన్లు ఎన్ని సినిమాల్లో చూసాడు తను. ఎవడో పనికిమాలిన వెధవ రోడ్డు మీద నిలబడి జరిగేదంతా వీడియో తీస్తున్నాడు ఫోన్లో. అసలు తను ఇంత వేగంగా పరిగెత్తగలడని తనకే తెలీదు ఇంతకు ముందు. ఇప్పుడు దొరికిపోతే తన ఉద్యోగం ఉంటుందా? తను పని చేసే కంపెనీలో జాబ్ సెక్యూరిటీ ఎక్కువ అని బాసు గాడు చెబుతూ ఉంటాడు. దొంగగా మారిన తనని ఉద్యోగంలో ఉంచుతారా అసలు? ఏంటీ పిచ్చి ఆలోచనలు? తను దొంగతనం ఎందుకు చేసాడసలు?

ఈలోగా వెనకనుంచి ఒకడు హీరోలా చొక్కా కాలరు పట్టుకొని లాగాడు. కింద పడ్డాడు జగదీష్. చేతులు, కాళ్ళు గీసుకుపోయినయ్. జనమంతా చుట్టూ చేరారు. ఈ హడావిడిలో తను కాజేసిన నెక్లెస్ ఎక్కడో పడిపోయింది. ఎవరో కొట్టడం మొదలు పెట్టారు. ఎక్కడబడితే అక్కడ కొడుతున్నారు. గట్టిగా అరిచాడు దెబ్బలు తింటూ బాధ భరించలేక "నేను దొంగను కాను.."

ఉలిక్కి పడి నిద్ర లేచాడు జగదీష్. జరిగినదంతా కల అని అర్ధమై ఎంతో రిలీఫ్ గా అనిపించింది. ఎంత భయంకరమైన కల? గుండె ఇంకా వేగంగా కొట్టుకుంటుంది. టైం చూసాడు. అర్ధరాత్రి రెండు!! వెంటనే పడుకోవాలంటే భయమేసింది మళ్ళీ కల కంటిన్యూ అవుతుందేమోనని.

లేచి వెళ్లి చల్లటి నీళ్ళు తాగొచ్చి పడుకొని కళ్ళు మూసుకొని ఆలోచిస్తున్నాడు. ఇలాంటి విచిత్రమైన కల ఎందుకు వచ్చింది? ముందుగా జరగబోయేదానికి ఇదేమైనా సంకేతమా? కొంపదీసి తనేమైనా దొంగగా మారబోతున్నాడా భవిష్యత్తులో? ఇంతకు ముందు ఒకటి రెండు సార్లు ఇలా జరిగినట్టు గుర్తు. కలలో ఇంతకుముందు వచ్చిందే నిజంగా జరిగింది. పడుకునే ముందు అదేదో ఇంగ్లీష్ సినిమా చూసాడు. దోపిడీ దొంగల జీవితం గురించిన సినిమా అది. దాని ప్రభావం అనుకుంటా ఈ కల. ఇలాంటి చెత్త సినిమాల జోలికి ఇక మీదట వెళ్ళకపోతే మంచిది. ఆలోచిస్తూ నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు.

జగదీష్ వయసు నలభై ఐదు పైనే ఉంటుంది. ఎగువ మధ్యతరగతి ఉద్యోగి. పెద్దగా చెప్పుకునే కష్టాలేమీ లేవు. హోంలోనూ, కార్ లోనూ, రెండు మూడు క్రెడిట్ కార్డులు ఉన్నాయి మామూలుగానే. ఒక్కగానొక్క కొడుకు చరణ్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. భార్యతో అప్పుడప్పుడూ చిన్న చిన్న తగాదాలు, యుద్ధాలు తప్ప ఇంకే సమస్యా లేదు.

అలారం గట్టిగా మోగటంతో బద్దకంగా కళ్ళు తెరిచాడు జగదీష్. బాగా నిద్రపడుతున్న టైంలోనే ఈ వెధవ అలారం మోగుతుంది అనుకుంటూ మంచం మీద నుంచి లేచాడు బద్దకంగా. సరిగ్గా ఆరైంది. ఒళ్ళు విరుచుకుంటూ మంచం దిగాడు. ఎదురుగా ఉన్న దేవుడి పటానికి భక్తిగా దండం పెట్టుకొని భార్యను లేపడానికి వెనక్కు తిరిగి మంచం వైపు చూసి అదిరిపడ్డాడు. కళ్ళు నులుముకొని సరిగ్గా చూసాడు. తను చూస్తున్నది కలా నిజమా? భార్య లక్ష్మి మంచం మీద సుఖంగా, బద్దకంగా నిద్రపోతుంది ఎప్పటిలాగే. అదికాదు అతడు చూస్తుంది. పక్కన మరో మనిషి ముసుగు తన్ని పడుకొనున్నాడు తన స్థానంలో.

దగ్గరకు వెళ్ళి చూసాడు. అంతా మాయలా ఉందే? ఈ పడుకున్నది ఎవరసలు? ఎక్కడ నుంచి వచ్చాడు? దగ్గరకు వెళ్ళి దుప్పటి తొలగించి చూడబోయాడు. చేతులు దుప్పటి మీదుగా వెళ్తున్నాయి కానీ, దుప్పటిని పట్టుకోలేక పోతున్నాయి. కంగారు పడ్డాడు. ఏం జరుగుతుందో తెలియటం లేదు. గాబరాగా ఆలోచిస్తూ అటూ ఇటూ చూస్తున్నంతలో, "కంగారు పడకు... ఆ ముసుగుతన్ని పడుకొని ఉన్నది నువ్వే..." అన్న మాటలు వినిపించాయి వెనక నుంచి.

అదిరిపడి వెనక్కి తిరిగి చూసాడు జగదీష్. ఎవరో వింత మనిషి. ఆరడుగులుంటాడు. నల్లటి శరీరం, పెద్ద మీసాలు, లావుగా, బలంగా ఉన్నాడు. ధగధగలాడే గుడ్డలు, వింత కాళ్ళ జోళ్ళు. మెడలో ఏవో చిత్రమైన, లావైన గొలుసులు. ఒక్క క్షణం గుండె ఆగినంత పనైంది జగదీష్ కు. ఈ వింత మనిషెవరసలు? అసలు మనిషేనా?

"ఎవరు మీరు? ఏం జరుగుతుందసలు? లోపలికి ఎలా వచ్చారు?" అడిగాడు భయంగా.

"నా పేరు సదుష్టుడు. యమదూతను. నువ్వు నిన్న రాత్రి నిద్రలోనే గుండెపోటుతో చచ్చిపోయావు. నిన్ను పైకి తీసుకెళ్ళటానికి వచ్చాను." చెప్పాడు మొహంలో ఏ భావం ప్రదర్శించకుండా. సదుష్టుడు చూడటానికి చాలా రఫ్ గా ఉన్నా, మాట చాలా మామూలుగా ఉంది.

చచ్చినంత పనైంది జగదేష్ కు యమదూత చెప్పింది విని.

"నేను చచ్చిపోవటమేంటి నాన్సెన్స్. అసలు గుండెపోటు ఎలా వస్తుందో కూడా తెలీదు నాకు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. మా పక్కింట్లో ఓ గుండె పేషెంట్ ఉన్నాడు. మీరు అక్కడకు వెళ్ళబోయి ఇక్కడకు వచ్చినట్టున్నారు" చెప్పాడు ఒక్కో మాట కూడబలుక్కొని అతి కష్టం మీద .

ఒళ్ళంతా తేలిగ్గా, అదోరకంగా ఉంది. తను కొంపదీసి నిజంగానే చచ్చిపోయాడా? తను లేకుండా తన కుటుంబం ఎలా గడుస్తుంది? భార్యకు టీవీ సీరియల్స్ తప్ప వేరే లోకం తెలీదు. చరణ్ మరీ చిన్నపిల్లవాడు. ఇదంతా అసలు నిజమేనా? ఏడుపు తన్నుకొచ్చింది. బలవంతంగా కంట్రోల్ చేసుకుంటున్నాడు.

"ఏడవకు. ఇదంతా మామూలే. నువ్వు చచ్చిపోవటం నిజం. టైం అవగానే ఎవరైనా చావాల్సిందే. గుండెపోటు అనేది డాక్టర్లు చెప్పబోయే కారణం. అసలు కారణం మాత్రం నీ టైం అయిపోవటం. ఇంకాసేపట్లో ఇంట్లో వాళ్ళకి నువ్వు చచ్చిన విషయం తెలుస్తుంది. ఏడుపులు, పెడబొబ్బలు మొదలవుతాయి. అవన్నీ నువ్వు చూడలేవు. పద. కదులు. నాకు ఇంకో నాలుగు చావులున్నాయి ఇవాళ. నిన్ను దింపి మళ్ళీ రావాలి." శాంతంగా చెప్పాడు సదుష్టుడు ఇలాంటివి ఎన్నో చూసిన అనుభవంతో.

"నేను చచ్చినా రాను.." మొండిగా, కోపంగా చెప్పాడు జగదీష్ మంచం మీద కూర్చొని. తను చచ్చిపోయిన విషయం దాదాపుగా అర్థమైంది. ఏడవటం మొదలు పెట్టాడు చేతుల్లో మొహం దాచుకుంటూ. ఇంత అకస్మాత్తుగా తను చస్తానని కల్లో కూడా అనుకోలేదు. ఏంటీ జీవితం? కాదు ఏంటీ చావు? ఎక్కడనుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? ఎందుకు ఇలా చచ్చిపోవాల్సి వచ్చింది? ఆలోచిస్తున్నాడు. ఎన్నో జవాబు లేని ప్రశ్నలు.

"నీ ప్రశ్నలన్నిటికీ జవాబు దారిలో చెబుతానులే పద. మొండికేయవాకు. ఏడ్చి ప్రయోజనంలేదు.." అంటూ జగదీష్ చేయి పట్టుకొని మంచం మీదనుంచి లేపి నుంచోబెట్టాడు సదుష్టుడు. ప్రతిఘటించాలనుకున్నాడు జగదీష్. కుదరటంలేదు. అసలు అవయువాలు స్వాధీనంలో లేవు. గట్టిగా అరిచి భార్యను లేపబోయాడు. నోట్లోంచి మాట బయటకు రాలేదు. సదుష్టుడు జగదీష్ ఎడమ చేయి పట్టుకొని తేలికగా ఇంటి పైకప్పు మీదుగా గాల్లో బయటకు తీసుకువెళ్ళాడు. గోడలు, పైకప్పు ఏవీ వీరి శరీరాలకి అడ్డుపడలేదు. ఇద్దరివీ ఏవో అదృశ్య శరీరాల్లాగా అన్నింటినీ దాటుకొని పైకి వెళుతున్నాయి.

కిందికి చూసాడు జగదీష్. ఇంటి పై భాగం కనిపిస్తుంది. ఎప్పుడూ తన ఇంటిని ఇలా చూస్తాడనుకోలేదు. కొత్తగా, దుఃఖంగా ఉంది అంతా. తను ఎంతో కష్టపడి, బ్యాంకు లోన్ తీసుకొని కట్టుకున్న ఇల్లది. ఇప్పుడు ఇలా చచ్చిపోయి వెళ్ళిపోతున్నాడు ఒంటరిగా. తన కుటుంబానికి తను ఇక లేదు అనుకున్నాడు పొంగి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

తను ఇప్పుడు వెళ్ళేది యముడి దగ్గరకా? అసలు యమలోకమనేది ఒకటుందని తనకు సినిమాల ద్వారానే తెలిసింది. ఇప్పుడు స్వయంగా చూడబోతున్నాడు. తనని ఎలా శిక్షిస్తారు? నూనె బాండీలో వేయించడం, సూదులతో కుళ్ళబొడవటం లాంటివి ఉండవు కదా కొంపదీసి? అయినా శిక్షించడానికి తను చేసిన నేరమేంటి? ఎవరినీ ఎప్పుడూ మోసం చేయలేదు. నిజాయితీగా కష్టపడి చదువుకొని పైకి వచ్చాడు. ఇలా ఆలోచిస్తూ

తను చేసిన తప్పుడు పనులు ఏమున్నాయా అని ఆలోచించాడు. పెద్దగా ఏమీ తట్టలేదు. కాస్త తృప్తిగా అనిపించింది. అలాగే చేసిన మంచి పనులు కూడా పెద్దగా తట్టలేదు. అసలు ఈ యమదూతను అడిగితే విషయాలన్నీ తెలుస్తాయి.

తను చనిపోయిన విషయం అర్థమవగానే, తాత్కాలికంగా, దుఃఖాన్ని పక్కనబెట్టి ఇకమీదట జరగబోయే దాని గురించి ఆలోచిస్తున్నాడు జగదీష్. గాల్లో ఇద్దరూ ప్రయాణం చేస్తున్నారు. ఎంత వేగంగా వెళ్తుంది తెలియటంలేదు.

"సర్ మీ పేరేమిటన్నారు?"

"సదుష్టుడు..".

"నాక్కొన్ని డౌట్స్ ఉన్నాయి? తీరుస్తారా?" అడిగాక, అసలు ఈ యమదూతకి ఇంగ్లీషు వచ్చా అని అనుమానం వచ్చింది జగదీష్ కు. "డౌట్స్" అన్న పదం తెలుగులో చెబుదామనుకున్నాడు.

"నాకు అన్ని భాషలు వచ్చు...అలాగే నువ్వు మనసులో అనుకునేదంతా నాకు తెలుసు.." చెప్పాడు సదుష్టుడు.

"వామ్మో ఇంకా నయం వీడ్ని మనసులో బండబూతులు తిట్టుకోలేదు.." మనసులో అనుకొని నాలిక్కరచుకున్నాడు జగదీష్ యమదూతకు ఇది కూడా తెలుస్తుంది అనిపించడంతో.

"ఇక నీ ప్రశ్నలకి జవాబు చెబుతాను విను. సాధారణంగా అందరికీ వచ్చే అనుమానాలే ఇవి. నీ టైం అయిపోవటం వల్ల నువ్వు చచ్చిపోయవు. ప్రతీ జీవి చనిపోయే తేదీ, టైము ముందుగానే డిసైడ్ అయి ఉంటుంది. నువ్వు చేసిన మంచి, చెడు అన్నీ మా దగ్గర రికార్డ్స్ లో ఉంటాయి. చెడ్డ పనులకి నీకు శిక్ష తప్పదు. నువ్వో దొంగవని యమలోకంలో ఎవరో మాట్లాడుకుంటే విన్నాను. ఇంకో ఐదు నిమిషాల్లో మనం యమలోకం చేరుకుంటాము.."

"నేను దొంగనా? ఏంటీ దారుణం? ఖచ్చితంగా అందరూ పొరబడ్డారు. ఇంకవరినో తీసుకురాబోయి నన్ను పట్టుకెళ్తున్నారు. అన్యాయం ఇది." కల్లో కూడా దొంగతనం చేయలేదు అని ఆవేశంగా అనబోయి ఊరుకున్నాడు రాత్రి వచ్చిన కల గుర్తుకువచ్చి.

"పైకి వెళ్తాంగా. అక్కడ అన్నీ తెలుస్తాయి" చెప్పాడు సదుష్టుడు క్లుప్తంగా.

"సర్. మనం ఏ స్పీడులో వెళ్తున్నాం ఇప్పుడు? ఏమీ అర్థం కావట్లేదు.. కాస్త నెమ్మదిగా వెళ్తునట్టుగా అనిపిస్తుంది? " అడిగాడు. తొందరగా వెళ్ళి తను దొంగను కానని తేల్చేయాలని ఆత్రంగా ఉంది జగదీష్ కు.

"దాదాపు లక్ష కిలోమీటర్లు గంటకి.."

గుండె ఆగినంత పనైంది జగదీష్ కి ఇది విని. ఇదేమి స్పీడు బాబోయ్. గుండె ఆల్రెడీ ఆగిపోయింది కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇంకేమైనా ఉందా?

యమలోకం చేరుకున్నారు ఇద్దరూ. ముఖద్వారం వైపు నడవటం మొదలు పెట్టారు. దారిలో ఏవో ఊహించుకున్నాడు యమలోకం ఎలా ఉంటుందా అని. అయితే తను ఊహించుకున్నట్టుగా ఏమాత్రం లేదు. కనీసం యమలోకం అన్న బోర్డు కూడా లేదు. ఏ మాత్రం భయానకంగా లేదు. అంతా ప్రశాంతంగా ఉంది చుట్టుపక్కల. ఆలోచిస్తూ నడుస్తున్నంతలో ముఖ ద్వారం చేరుకున్నారు. ద్వారం దగ్గర ఓ నలుగురు నుంచొని ఉన్నారు. చూడటానికి సదుష్టుడు లానే ఉన్నారు చేతుల్లో పొడవైన బల్లాలతో. కాపలా వాళ్లనుకుంటా. సదుష్టుడు వారికి ఏదో సైగ చేసాడు జగదీష్ ను చూపిస్తూ. వారు ఓ మారు జగదీష్ ను తేరిపారా చూసి లోపలకి పంపించారు. వారేమైనా తన వైపు జాలిగా చూస్తున్నారా అని ఓర కంట గమనించాడు జగదీష్. అలాంటిదేమీ కనిపించలేదు. అసలు ఈ యమలోకంలో ఎవరికీ ఎక్స్ప్రెషన్స్ ఉండవనుకుంటా. కాస్త నిరుత్సాహంగా అనుకున్నాడు. ఏం జరగబోతుంది లోపల? కాస్త కుతూహలంగా, భయంగా అనుకుంటూ యమలోకంలోకి అడుగుపెట్టాడు.

తనలాంటి వారు ఎవరైనా కనబడతారేమోనని చూసాడు. ఎవరూ లేరు. చుట్టూ చూసాడు. అదో పెద్ద గదిలా ఉంది బంగారు రంగు గోడలతో. ఏవో సంస్కృత శ్లోకాలాంటివి రాసున్నాయి గోడల నిండా. ఎదురుగా ఓ సింహాసనం, దానికి ఓ పక్క ఓ బోను కూడా ఉంది కోర్టులో ఉన్నట్టుగా.

తనని ఇప్పుడు అందులో నుంచోబెట్టి విచారణ చేస్తారా? సదుష్టుడు జగదీష్ ను లోపలికి పంపి తన పని అయిపోయినట్టుగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు. ఇంకో నలుగురుకి ఇవాళ మూడబోతుందని చెప్పాడుగా. అక్కడికే వెళ్ళుంటాడు. ఎవరో వారు పాపం. జగదీష్ జాలిగా అనుకున్నాడు మనసులో.

ఈలోగా ఎవరో ఇద్దరు యమకింకరులు ఎక్కడనుంచో వచ్చి చెరో వైపు జగదీష్ చేతులు పట్టుకొని విచారణకు బోను దెగ్గరకి తీసుకువెళ్ళారు. బోనులో నుంచున్నాడు జగదీష్. ఇద్దరు యమకింకరులు బోనుకు చెరో వైపు నుంచొని ఎవరికోసమో ఎదురు చూస్తున్నారు.

మొదట చిత్రగుప్తుడు వచ్చాడు చేతిలో ఏదో లావాటి పుస్తకంతో. సినిమాల్లో చూసి, చిత్రగుప్తుడంటే ఏదో కమెడియన్లా ఉంటాడనుకున్నాడు జగదీష్. అయితే అందుకు విరుద్ధంగా ఉన్నాడు. దాదాపుగా సదుష్టుడిలానే ఉన్నాడు. మెడలో గొలుసులు కాస్త తేడాగా, హుందాగా ఉన్నాయి. అలాగే తలమీద ఓ చిన్న కిరీటం కూడా ఉంది. చిత్రగుప్తుడు ఏమీ మాట్లాడకుండా ఓ పక్కగా నుంచున్నాడు యముడి కోసం ఎదురుచూస్తూ. జగదీష్ జరిగేది కాస్త ఉత్సాహంగా, భయంగా చూస్తున్నాడు.

యముడు వచ్చాడు మరికాసేపటికి. నేరుగా సింహాసనం మీదే కూర్చొని ప్రత్యక్షమైనాడు. చిత్రగుప్తుడు, యమకింకరులు తలలు వంచి యముడికి అభివాదం చేసారు. జగదీష్ కూడా చేతులు జోడించి నమస్కరించాడు. ఓ సారి యముడ్ని తేరిపార చూసాడు. చిత్రగుప్తుడు, యమకింకర్లకంటే బాగా పొడుగ్గా, నల్లగా, బలంగా, భయంకరంగా ఉన్నాడు. తల మీద భారీ బంగారు కిరీటం. ఇక్కడ కాబట్టి సరిపోయింది కానీ, భూలోకం మీద ఇలాంటి వాళ్ళు ఉంటే, జనాలు భయంతో చచ్చేవారు. మనసులో అనుకున్నాడు.

విచారణ ప్రారంభమైంది.

"ప్రభూ, ఈ పాపి ఒక దొంగ. ఎన్నో దొంగతనాలు చేసాడు...లక్షల రూపాయలు కొల్లగొట్టాడు.." అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న చిత్రగుప్తుడ్ని మధ్యలోనే ఆపాడు జగదీష్ అసహనంగా, ఒకింత కోపంగా.

"ప్రభూ, ఏదో పొరపాటు జరిగింది. నేను దొంగను కావటం ఏంటో అర్థంకావట్లేదు. ఎవరో దొంగను తీసుకురాబోయి, మీ భటులు పొరపాటున నన్ను ఇక్కడకు తీసుకువచ్చారు. ఆఫీసులో చాలా పనులున్నాయి. దయచేసి నన్ను వెంటనే వెనక్కు పంపండి .." చెప్పాడు.

"పొరపాట్లు జరగడానికి ఇదేమీ భూలోకం కాదు. పైగా ఇదేమీ కోర్టు కాదు, నీ నేరాలు నిరూపించడానికి. మా రికార్డ్స్ ప్రకారం, నువ్వు చేసిన పాపాలు ప్రభువుకు విన్నవించడమే నేను చేసేది. మధ్యలో మాట్లాడటానికి నీకు అవకాశం ఉండదు.." చిత్రగుప్తుడు చెప్పాడు కోపంగా.

యముడు కాసేపు మౌనంగా, గంభీరంగా ఉండి, చిత్రగుప్తుడి వైపు చూసి జగదీష్ కు అర్థమయ్యేలా వివరంగా చెప్పమన్నట్టుగా తలాడించి సైగ చేసాడు. జగదీష్ కు ఏమీ అర్థం కావటంలేదు. వీళ్ళు ఖచ్చితంగా పొరపడ్డారు. లేకపోతే తను దొంగతనం చేసి లక్షలు కొల్లగొట్టడమేంటి?

"చూడు పాపి..." అంటూ ఏదో చెప్పబోయాడు చిత్రగుప్తుడు.

"నేనే పాపం చేయలేదు.. ఇలా నన్ను పాపి అని పిలవటం దారుణం. నేను చేసిన దొంగతనమేంటో ముందు తేల్చండి..." అసహనంగా అరిచాడు.

"అలాగే. ప్రభువులవారు నీకు అర్థమయ్యేలా చెప్పమన్నారు కాబట్టి చెబుతాను. సాధారణంగా ఇలా వివరించి చెప్పటం, నేరం నిరూపించటం లాంటివి ఇక్కడ ఉండవు. ఇక్కడికి పాపులు మాత్రమే వస్తారు... నువ్వు కూడా అంతే.. ఇప్పుడు నువ్వు ఎందుకు దొంగవో చెబుతాను.."

చిత్రగుప్తుడు ఏం చెబుతాడో అని కుతూహలంగా, కాస్త అలజడిగా చూస్తున్నాడు జగదీష్.

"నువ్వు దొంగవెలా అయ్యావో చెప్పే ముందు అసలు నీకు మా రూల్స్ ప్రకారం దొంగతనమంటే ఏంటో తెలియాలి. ఇతరులకు సంబంధించిన ధనమో, ఆస్తో, వస్తువో అక్రమంగా సంపాదించడాన్ని దొంగతనమంటారు..."

"అవును... మా దగ్గర కూడా దొంగతనం డెఫినిషన్ అదే... ఈ రూలు ప్రకారం నేను దొంగనయ్యే ఛాన్స్ లేదసలు.." చెప్పాడు జగదీష్.

"ఇప్పుడు చాలా తేలికగా నువ్వు ఎందుకు దొంగవో చెబుతాను.. నువ్వు నిన్న ఆఫీసుకి వెళ్తూ కార్లో విన్నది ఏ సినిమా పాటలు?"

"......" సినిమా పేరు చెప్పాడు జగదీష్ ఎందుకు ఈ ప్రశ్న అడిగాడో అని తికమక పడుతూ.

"ఆ పాటలు నువ్వు అక్రమంగా నెట్ లోంచి డౌన్లోడ్ చేసుకున్నవి... అవి ప్లే చేయడానికి నువ్వు వాడింది నీ ఆఫీసు పెన్ డ్రైవ్... ఇప్పుడు చెప్పు నువ్వు దొంగవా కాదా?"

"ఇది అన్యాయం.. ఇలాంటి చిన్న విషయాలు కూడా దొంగతనాలేనా?"

"ఇవేవీ చిన్నవి కాదు. పైగా దొంగ మా లెక్కలో దొంగే. చిన్నదొంగ పెద్దదొంగ అంటూ ఉండరు. ఇవి మాత్రమే కాదు. నువ్వు ఇంకా ఎన్నో రకాల దొంగతనాలు చేసావు. ఆఫీసులో నీ జూనియర్ చేసిన పనిని నువ్వు చేసినట్టుగా బాసు దగ్గర చెప్పుకోవటం, టాక్స్ తగ్గించుకోవటానికి దొంగ అద్దె రసీదులు, దొంగ డొనేషన్లు సృష్టించటం, ఆఫీసు ఫోన్లో పర్సనల్ కాల్స్ చేయటం, మందు బిల్స్ ఫుడ్ బిల్స్ గా మార్చి క్లెయిమ్ చేసుకోవటం, ఆఫీస్ అసిస్టెంట్లను ఇంటి పనులకు వాడుకోవటం, దుక్కలా ఆరోగ్యంగా ఉండి సిక్ లీవ్ పెట్టడం, కస్టమర్స్ కోసం కొన్న గిఫ్ట్ ఐటమ్స్ మిగుల్చుకొని ఇంటికి పట్టుకెళ్ళడం, ఆఫీసు కారు ఇంటి పనులకు వాడటం, చిల్లర సరిగ్గా చూసుకోక షాపువాడు ఎక్కువ డబ్బులిస్తే సంతోషంగా జేబులో వేసుకోవటం, కరెంటు బిల్లు తగ్గించడానికి మీటర్ టాంపరింగ్ చేయటం, ఫ్యామిలీతో బయటకు వెళ్ళి, ఆ ఖర్చంతా కంపెనీ ఖర్చుగా చూపటం, రకరకాల పైరేటెడ్ సాఫ్ట్ వేర్లు, సినిమాలు డౌన్లోడ్ చేసుకోవటం, ఆఫీసు స్టేషనరీ ఇంటికి పట్టుకెళ్ళడం. అంతెందుకు దిక్కుమాలిన వీడియోలు ఆఫీసు టైములో అందరికీ వాట్సప్ లో పంపి వారందరి ఆఫీస్ టైం వేస్టు చేయటం కూడా మా లెక్కలో దొంగతనమే.. "

మూర్ఛపోయినంత పనైంది జగదీష్ కు.

"నువ్వు బతికుండగా నీ జీతం ఎంత?" అడిగాడు చిత్రగుప్తుడు

"రెండు లక్షలు..."

చిత్రగుప్తుడు ఒక్కసారి గొంతు సవరించుకొని మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు.

"నీ ఆఫీసు వారానికి ఐదు రోజులు కాబట్టి, నీ జీతం గంటకు పద్నాలుగు వందలు. నువ్వు రోజూ ఆఫీసుకు గంట ఆలస్యంగా వెళ్ళి, గంటకు పైగా పనికిమాలిన కబుర్లు, పర్సనల్ ఫోన్ కాల్స్, ఈమెయిల్స్, పర్సనల్ పనులు, ఇంటర్నెట్లో టైంపాస్ లాంటివాటికి వెచ్చించావు కాబట్టి, రోజుకు దాదాపుగా మూడు వేల రూపాయలు ఆఫీసునుండి అక్రమంగా సంపాదించావు నీ జీతం రూపంలో. అంటే సంవత్సరానికి ఏడు లక్షల ఇరవై వేలు... ఇది నేరుగా నువ్వు కొల్లగొట్టిన డబ్బు.. ఇది కాక, ఈ రెండుగంటల వృధా సమయంలో ఆఫీసువారికి ఖర్చయ్యే కరెంటు, నీళ్ళు, నీ వల్ల ఆలస్యమైన పనుల వల్ల నీ కంపెనీకి పెరిగే ఖర్చు, నిన్ను చూసి నీలాగే తయారయే నీ కింది ఉద్యోగులకి ఆఫీసువారు ఈ విధంగా పెట్టే ఖర్చు.. ఇవన్నీ నీ అక్రమ ఖాతాలో జమ అయిన డబ్బు.."

జవాబేంచెప్పాలో అర్థం కాలేదు జగదీష్ కు. ఆలోచనలో మునిగిపోయాడు. ఇప్పుడు పూర్తిగా అర్థమైంది. చిత్రగుప్తుడు చెప్పిన ప్రతీ విషయం నిజమే. అన్నీ దొంగతనాలే. తనొక గజదొంగే అనిపిస్తుంది. సందేహం లేదు. కానీ ఒప్పుకోవాలంటే నరకంలా ఉంది. తనున్నది కూడా నరకంలోనే అని గుర్తుకువచ్చింది.

"ఇప్పుడు అర్థమైందా నువ్వు ఎందుకు పాపివో?" ఎగతాళిగా అడిగాడు చిత్రగుప్తుడు. మౌనంగా తలదించుకున్నాడు జగదీష్ ఏం చెప్పాలో తెలీక.

యముడు కింకర్లకి ఏదో సైగ చేసాడు. ఎదురుగా ఏదో ద్వారం తెరుచుకుంది. పాపులను చిత్రహింసలు పెట్టే గదికి అది దారి. హింసకు గురవుతున్న వేలమంది పాపుల గావుకేకలు వినిపిస్తున్నాయి గట్టిగా. జగదీష్ ను అక్కడకు ఈడ్చుకు వెళ్ళటానికి యమకింకర్లు దగ్గరకు వచ్చారు.

"నో.... నేను దొంగను కాను.." గట్టిగా అరిచాడు జగదీష్ పట్టరాని భయంతో..

"ఏంటండీ? ఏమైంది?" భార్య లక్ష్మి అడిగింది.

"నువ్వు కూడా నరకానికి వచ్చావా లక్ష్మీ?" ఆశ్చర్యంగా అడిగాడు జగదీష్. అడిగాక చప్పున లేచి కూర్చున్నాడు. కళ్ళు తెరిచి చుట్టూ చూసాడు. తన ఇల్లే. మంచం మీదే ఉన్నాడు. జరిగినదంతా కల అని అర్థమైంది. రెండవ కల. చెప్పలేని రిలీఫ్ గా అనిపించింది.

గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఎంత భయంకరమైన కల. అలారం మోగింది గట్టిగా.

"ఏదైనా పీడకలా?" భార్య అడిగింది కుతూహలంగా.

జవాబు చెప్పకుండా మంచం దిగి దేవుడి పటం దగ్గరకు వెళ్ళి మనస్ఫూర్తిగా దండం పెట్టుకున్నాడు. ఎన్నో ఆలోచనలు చుట్టుముట్టినయ్. కాఫీ తాగుతూ, పేపర్ చదువుతూ, ఆఫీసుకు రెడీ అవుతూ ఆలోచిస్తున్నాడు తనకు వచ్చిన కల గురించి.

కల్లో చిత్రగుప్తుడు చెప్పింది ఎంత నిజం. ప్రతీ వాళ్ళు తెలిసో తెలీకో ఎన్ని తప్పులు చేస్తున్నారు. ఆఫీసు సమయం వృధా చేయటం దగ్గరనుంచి ఎన్నో రకాల దొంగతనాలు ఎంతో మంది అలవాటుగా, దర్జాగా చేస్తున్నారు. మొదటి కలలో తను చేసిన దొంగతనానికీ, రెండవ కలలో వివరించినట్టుగా తను చేసిన దొంగతనానికీ ఏ తేడా లేదు!! ఇంత చిన్న విషయం ఇన్నాళ్ళుగా తనకి తెలీదు. ఇక మీదట ఏ దొంగతనం తను చేయటానికి వీల్లేదు. గట్టిగా నిర్ణయించుకున్నాడు జగదీష్.

టిఫిన్ చేసి ఆఫీసుకు బయలుదేరాడు. వెనకనుంచి చరణ్ గట్టిగా అరిచాడు. "నాన్నా, నా ప్రాజెక్ట్ పేపర్స్ నీకు ఈమెయిల్ చేసాను. వంద పేజీలు ఉంటాయి కనీసం. వచ్చేటప్పుడు ఆఫీసులో ప్రింటౌట్స్ తీసుకొనిరా. మర్చిపోకు"

"అలాగేలే" అనబోయి ఆగాడు జగదీష్.

ఇంట్లోకి తిరిగి వెళ్ళి, "ఆఫీస్ ప్రింటరు, పేపర్స్ మొదలైనవి పర్సనల్ పనులకు వాడటం తప్పు. అది ఆఫీసు డబ్బును దొంగలించడంతో సమానం. ఈ ఐదు వందలు తీసుకొని, నువ్వే నీ ప్రాజెక్ట్ పేపర్సు ప్రింట్ చేయించుకో" చెప్పాడు ఆశ్చర్యంగా చూస్తున్న చరణ్ చేతిలో డబ్బు పెడుతూ.

చెప్పాక మనసులో తృప్తిగా, సంతోషంగా అనుకున్నాడు జగదీష్ "నేను దొంగను కాను".

# అమ్మ కాని(కో)అమ్మ

విరించి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**ఆ పల్లెటూరు** కావాలని పట్నంలో కలవలేదు. ప్రక్కనున్న పట్నమే ఆ పల్లెటూర్ని కబళించి మహానగరమై కూర్చుంది. వెంకటలక్ష్మి నాలుగేళ్ళ క్రితం ఇంటి అరుగుల మీద రెండు కొట్టుగదులు కట్టించి, ఒక దాన్లో బ్రతుకు తెరువుకోసం కిరాణాకొట్టు పెట్టినప్పుడు అది ఒక మాదిరి పల్లెటూరు. ప్రక్కనే పెద్దమనిషిలా వున్న పట్నం క్రమేపీ ముందుకు జరుగుతూ ఈస్ట్ ఇండియా కంపెనీలా ఆ పల్లెటూర్ని ఆక్రమించింది.

ఇప్పుడు వెంకటలక్ష్మి కొట్టుకు గిరాకీలు లేవు. దగ్గర్లోనే మోర్‌లు, డి మార్ట్‌లు, స్పెన్సర్‌లు వచ్చేసాయి. ప్రతీవాడు స్నానాలగదికి వెళ్ళాక సబ్బు లేకపోతే లుంగీతో సరాసరి వాటికే పోతున్నాడు. తన దగ్గరకు వచ్చేవి కేవలం అరువు బేరాలే.

పెనిమిటి నారాయణ అడ్డమైన తిరుగుళ్ళకు, అధిక త్రాగుళ్ళకు అలవాటు పడి అనారోగ్యంతో మంచాన పడ్డాడు. కూతురు గీత కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. అవసరాలు అప్పులు పెరిగాయిగానీ వెంకటలక్ష్మికి ఆదాయం, అవకాశాలు పెరగలేదు. వెంకటలక్ష్మి కుట్టుమిషన్ కుట్టినా, కుట్టుడాకులు కుట్టినా, లేసులు అల్లినా గోదావరి ఈత లంక మేతలా వుంది.

రోజూలాగే ఉదయం పదిగంటలకు వెంకటలక్ష్మి అరుగుమీద కొట్టు తలుపు తీసింది. రెండో అరుగుమీద టైలర్ కుర్రాడు రామకృష్ణకు అద్దెకిచ్చిన కొట్టుగది ఇంకా తెరవలేదు. దేవుడి ఫోటోకి దండం పెట్టుకుని ఎత్తుపీట మీద కూర్చుంది.

మోటారు సైకిల్ శబ్దాన్ని బట్టి వచ్చింది భూషణం అని అర్థమయ్యింది. భూషణం కొట్టుముందు బండి ఆపి స్టాండ్ వేస్తున్నాడు. భూషణం ఆ ఊర్లో ఆర్.ఎంపి డాక్టరే కాదు. అందరికీ తలలో నాలుకలో ఉంటాడు. వరుసకు వెంకటలక్ష్మికి బాబాయి అయినా, ఊళ్ళో అందరూ కూడా 'బాబాయ్' అనే పిలుస్తారు.

"ఎంకటలక్ష్మీ! ఓ సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అందుకోవే" అన్నాడు భూషణం చనువుగా. వెంకటలక్ష్మికి అరువు బేరమని తెలుసు.

"ఇంకా బోణీ కాలేదు బాబాయ్! కూర్చుని కాఫీ తాగుతూ ఉండు. బోణీ అవగానే ఇస్తా" అంది.

"సిగరెట్‌కు కాఫీ ఫ్రీయా?" అన్నాడు భూషణం నవ్వుతూ. అక్కడే ఉన్న స్టూల్ లాక్కుని కూర్చున్నాడు.

"నువ్వు సిగరెట్ కొనకపోయినా ఎపుడూ నీకు కాఫీ ఫ్రీనే కదా!" అంది వెంకటలక్ష్మి కూడా నవ్వుతూ.

"ఏం వద్దులే. ఇప్పుడే టీ తాగొచ్చా. ఒక్క నిముషం... నారాయణను చూసి ఇంజెక్షన్ చేసొస్తా" అని లోపలికి వెళ్ళాడు.

మరో పదినిముషాలలో అతగాడు బయటికి వచ్చేసరికి ఏవో రెండు బేరాలు వచ్చాయి. భూషణం వచ్చి కూర్చున్నాడు.

"ఎలా వుంది వ్యాపారం?" అన్నాడు భూషణం.

"నీకు తెలియనిదేముంది బాబాయ్. అమ్మకాల్లేవ్. అరువిస్తే తిరిగిరావు. అడిగితే కోపాలు. ఏదైనా మా కష్టాలు తీరే మార్గం చెప్పు బాబాయ్. చచ్చి నీ కడుపున పుడతా " అంది వెంకటలక్ష్మి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె ఇస్తూ.

భూషణం సిగరెట్ వెలిగించి గట్టిగా ఓ దమ్ములాగాడు. ఒకసారి వెంకటలక్ష్మికేసి చూసి "అది అసంభవం కానీ.. ఇప్పుడు నీకు ఎన్నేళ్ళే?" అన్నాడు.

"ముప్పై ఆరు.. నా వయస్సుకు, నా కష్టాలకు సంబంధం ఏమిటి బాబాయ్?" అంది వెంకటలక్ష్మి.

"ఉంది అంటే ఉంది. లేదు అంటే లేదు. నీ కష్టాలు తీరిపోయే పనొకటి ఉంది. నువ్వేం బరువులెత్తక్కర్లేదు. నారాయణ వైద్యం, గీత చదువు, పెళ్ళి అన్నీ అయిపోతాయి. కానీ.. నిన్ననే ఒకళ్ళకు మాటిచ్చాను. ఎలా అబ్బా?" అన్నాడు భూషణం సాలోచనగా.

"అదేంటి బాబాయ్? చెట్టంత మనిషిని నన్ను ఇక్కడ పెట్టుకుని ఎవరికో మాటివ్వడం ఏమిటి?" అంది వెంకటలక్ష్మి నిష్ఠూరంగా.

"నువ్వు ఒప్పుకుంటావో లేదో నాకు తెలియదు. అందుకని.." సందేహంగా అన్నాడు భూషణం.

"అదేం? అంత కానిపనా?"

"రామ..రామ.. నీ సంగతి నాకు తెలియదా? నిప్పులాంటి మనిషివి నువ్వు"

"అయితే చెప్పు. ఇష్టమైతే చేస్తాను. లేదంటే లేదు. ఏంటో చెప్పు" అంది వెంకటలక్ష్మి కుతూహలంగా.

"నువ్వు టైలర్ రామకృష్ణకు కొట్టు గది అద్దెకిచ్చావ్. సంవత్సరానికి ఆడెంతిస్తాడు?" అన్నాడు భూషణం.

"పన్నెండువేలు"

"నీ ఇల్లు అద్దెకిచ్చావనుకో ఎంతొస్తుంది?"

"నెలకు మరో రెండు.. సంవత్సరానికి ఇరవైనాలుగువేలు"

"అవునా? అలాగే అద్దెకిచ్చేవాటిలో కొట్లు, కార్లు, ఇళ్ళు తోటతోపాటు ఈ మధ్య ఇంకోటి కూడా అద్దెకిస్తున్నారు తెలుసా?" అన్నాడు భూషణం.

అయోమయంగా చూసింది వెంకటలక్ష్మి.

"ఏంటది?" అంది.

"గర్భాశయం" అన్నాడు భూషణం తాపీగా సిగరెట్ రింగులు వదులుతూ.

"అంటే?"

"ఈ దేశంలో జనాభా పాపంలా ఇంతలా పెరిగిపోతున్నా సంతానం లేని దంపతులు ఎందరో ఉన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా సంతానం కలగనివాళ్ళు, గర్భసంచి వృద్ధిచెందనివాళ్ళు, గర్భసంచి తొలగించబడిన వాళ్ళు, వయస్సు అయిపోయిన వాళ్ళు... వాళ్ళకు సంతానం కావాలంటే ఒకటే మార్గం. అలాంటి దంపతుల అండాన్ని, శుక్రకణాల్ని తీసుకుని ఫలదీకరణ జరిపి, అద్దెగర్భమిచ్చే స్త్రీ గర్భాశయంలో ప్రవేశపెడతారు" అన్నాడు భూషణం.

వెంకటలక్ష్మికి కొంత అర్ధమయ్యి అర్ధంకానట్లుగా ఉంది.

"ప్రవేశపెడితే పిల్లలు పుడతారా?"

"ఆ అద్దె గర్భమిచ్చిన తల్లి నవమాసాలు మోస్తే పుడతారు"

"అవునా?" అంది వెంకటలక్ష్మి ఆశ్చర్యపోతూ.

"అప్పుడే అంత ఆశ్చర్యపోకు. ఇంకా పూర్తిగా విను. అలా అద్దెకిస్తే ఓ సంవత్సరంలో రెండు మూడు 'ల'కారాలు కళ్ళచూడొచ్చు. మన ఊళ్ళో ఇద్దరాడాళ్ళకు అలా ఇప్పించాన్లే" అన్నాడు భూషణం.

"నీకేటి లాభం?" అంది వెంకటలక్ష్మి.

"ఏదో ఆళ్ళ కష్టాలు చూడలేక, నువ్వడిగినట్లే ఆళ్ళూ 'మా కష్టాలు తీరే మార్గం చెప్పు బాబాయ్' అంటే జాలిపడి, సిటీలో మనకు తెల్సున్న డాక్టర్ల చేత ఇప్పించా" అన్నాడు భూషణం.

వెంకటలక్ష్మి ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి. ఆకలి, అవసరం ఏ పనైనా చేయిస్తుంది. ఆ పని తనే ఎందుకు చేయకూడదూ? ఓ సంవత్సరం కష్టపడితే నారాయణకు సరైన వైద్యం చేయించవచ్చు. గీతకు మంచి చదువు చెప్పించి, సరైన సంబంధం చూసి పెళ్ళి చేయొచ్చు.

"ఇంకా ఎంతమంది కావాలేటి బాబాయ్?" అంది వెంకటలక్ష్మి.

"కావాలీ అంటే.. ప్రయత్నం చెయ్యాలి."

"నేను పనికొస్తానా?"

"నీకేం? నిక్షేపంలా"

"ఓ నాల్గు ఇప్పించు. కష్టపడినా ఫలితం దక్కాలికదా! నా సమస్యలు తీరిపోతాయి" అంది ప్రాధేయపూర్వకంగా.

"అంత మొత్తం కష్టంకానీ రెండున్నర, మూడు ఇవ్వొచ్చు. నువ్వు సంవత్సరంపాటు డాక్టర్‌గారి హాస్పిటల్లోనే ఉండాలి. ఫుడ్డు, బెడ్డు, మందు, మాకు అన్నీ ఆళ్ళే చూసుకుంటారు. నువ్వు అక్కడున్నట్లు ఎవ్వరికీ తెలియదు. తెలియకూడదు"

"మరి ఈ రోగిష్టోడ్ని, పిల్లని వదిలేసి ఎలా?"

"మీ ఊర్నుంచి మీ అమ్మని రమ్మని ఇక్కడ పెట్టు. నీ మొగుడికి కూతురికి వండిపెడుతుంది. నేను వున్నాగా. నేను రోజూ వచ్చి చూస్తా. నువ్వు దుబాయ్ షేక్‌ల ఇళ్ళలో పనికి దుబాయ్ వెళ్తున్నానని, సంవత్సరం అవగానే వచ్చేస్తానని అందరికీ చెప్పు. మిగతావన్నీ నేను చూసుకుంటాను" అన్నాడు భూషణం.

"సరే. ఓ రెండు రోజులు టైమియ్యి. ఆలోచించి చెప్తా. ఈ లోపులో నీ ప్రయత్నాలు నువ్వు చెయ్యి" అంది వెంకటలక్ష్మి.

"సరే! వస్తా" అని లేచి బండి స్టార్ట్ చేసి బయల్దేరాడు భూషణం.

ఆరోజంతా ఆలోచనలతోటే గడిపింది వెంకటలక్ష్మి. ఎవరైనా ఎదురుపడితే 'ఎంతమంది సంతానం?' అని అడుగుతారుగానీ 'ఎంత సంపాదించావ్?' అని అడగరు. సంతానం వృద్ధాప్యంలో ఆదుకుంటారని మనిషి ఆశ. రెక్కలొచ్చిన పక్షులు ఎగరకుండా ఉంటాయా?

నిజానికి గర్భం ధరించిన ప్రతీసారి తల్లికి, బిడ్డకు అపాయం ఎప్పుడూ పొంచి ఉంటుంది. ప్రసవం ప్రతిసారీ స్త్రీకి పునర్జన్మే. కానీ చేసిన అప్పులు, మొగుడి అనారోగ్యం, కూతురు చదువు, పెళ్ళికోసం రిస్క్ చెయ్యక తప్పదు. ఇప్పుడు తనకు అంతకంటే మరో మార్గం లేదు. ఓ రెండు రోజులు ఆలోచించిన తర్వాత ఆపని ఒప్పుకోవాలనే నిర్ణయానికి వచ్చింది.

తల్లిని ఊరునుంచి రప్పించింది. తను దుబాయ్ వెళ్తున్నట్లు చెప్పి మొగుడిని, కూతురుని తను లేకుండా సంవత్సరం ఉండేట్లు మానసికంగా సిద్ధం చేసింది. పాస్‌పోర్ట్ కోసం వెళ్తున్నానని భూషణాన్ని తీసుకుని సిటీలో హాస్పిటల్‌కు వెళ్ళి డాక్టర్‌ను కలిసొచ్చింది. కొన్ని పరీక్షలు తర్వాత డాక్టర్ ఏ తారీఖున హాస్పిటల్‌లో జాయిన్ అవ్వాలో చెప్పారు.

మర్నాడు ఉదయన్నే టైలర్ రామకృష్ణ కొట్టు తాళాలు తీస్తూ "లచ్చక్కా! ఇది నిజమేనా? దుబాయ్ వెళ్తున్నావా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవునురా! ఒక్క సంవత్సరంలో మళ్ళీ వచ్చేస్తాను. నేను వచ్చేదాకా కాస్త కనిపెట్టుకుని ఉండు. ప్రొద్దున్న, సాయంత్రం గీత కొట్టు తీస్తుంది. ఏం కావాలన్నా చూస్తూండు" అంది వెంకటలక్ష్మి.

"అలాగే అక్కా!" అన్నాడు రామకృష్ణ.

"ఎంకటలక్ష్మీ నువ్వెళ్ళిపోతే నా వైద్యం, కూడు ఎలాగే?" అన్నాడు నారాయణ మంచంమీద నుంచే. ఏదో అడగాలని అడిగాడు కానీ నారాయణ ఒక విధంగా ఆనందంగానే ఉన్నాడు. వెంకటలక్ష్మి లేకపోతే దొంగతనంగా అయినా మందు తాగొచ్చని. సిరోసిస్ కబళిస్తుందని భయంలేదు.

"మా యమ్మ వండిపెడ్తుంది. అడ్వాన్స్ తీసుకుని సంవత్సరానికి సరిపడా గ్రాసం ఇంట్లో పడేసిపోతాను. నీ రోగానికి వైద్యం భూషణం బాబాయ్ చూస్తాడు. సరేనా?" అంది.

వెళ్ళాల్సిన రోజు రానే వచ్చింది. అందరికీ అప్పగింతలు, హెచ్చరికలు జాగ్రత్తలు చెప్పడం అయిపోయాక బ్యాగు సర్దుకుని రెడీగా ఉంది.

"బండెక్కు, నిన్ను దుబాయ్ ఫ్లయిట్ ఎక్కిస్తా. పద" అన్నాడు భూషణం.

హాస్పిటల్‌లో జాయిన్ అయ్యింది. వెంకటలక్ష్మి అదే మొదటిసారి ఎ.సి రూంలో ఉండటం. ఎ.సి, ఫ్రిడ్జ్, గీజర్ వంటి ఆధునిక సదుపాయాలతో ఎంతో సౌకర్యవంతంగా ఉంది.

టైం ప్రకారం బలవర్ధకమైన ఆహారం, మందులు ఇస్తున్నారు. టెస్టులు జరుగుతున్నాయి. మొదటి ప్రయత్నంలోనే విజయవంతంగా ఫలదీకరణ జరిగిందని తెలిసి వెంకటలక్ష్మి సంతోషించింది. అడ్వాన్స్‌గా లక్షరూపాయలు తన అక్కౌంటులో వేసారు. నెలకోసారి దుబాయ్‌నుంచి మాట్లాడుతున్నానని, అంతా సౌకర్యంగా ఉందని ఇంటి ల్యాండు ఫోనుకు చేసి మాట్లాడుతోంది. అది అధునాతన సంతాన సాఫల్య కేంద్రం. తనలాంటివాళ్ళు ఇంకా అయిదారుగురు పైనే ప్రక్కగదుల్లో ఉన్నట్లున్నారు. కానీ, ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడకూడదు.

భూషణం తరచూ వచ్చి వెంకటలక్ష్మిని చూసి వెళ్తున్నాడు. నెమ్మదిగా రోజులు, నెలలు గడిచిపోతున్నాయి. భూషణం మొదట వారికి ఒకసారి వచ్చినవాడు, ఇప్పుడు నెలకోసారి వస్తున్నాడు.

మొదట్లో తను ఫోన్ చేస్తే ఉత్సాహంగా మాట్లాడే తల్లి, మొగుడు, కూతురు ఇప్పుడు ఫోనే ఎత్తడం లేదు. తనుకూడా చెయ్యడం తగ్గించేసింది. భూషణం మొహంలో కూడా మొదటంత ఉత్సాహం కనపడటంలేదు. ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉంటున్నాడు. ఎప్పటికప్పుడు ఎప్పుడు పని పూర్తవుతుందా అని చూస్తున్నట్లుగా ఉంది అతని వాలకం. క్రమంగా నవమాసాలు పూర్తయ్యాయి.

వెంకటలక్ష్మి మనస్సులో అనిర్వచనీయమైన భావన. తనిదికాని ప్రాణిని తను మోసి జన్మనివ్వబోతోంది. అదో అద్భుతమైన అనుభవం. తను గీతను కన్నప్పుడు కూడా ఇంత అపురూపంగా తనను ఎవరూ చూడలేదు. అప్పుడు తను ప్రసవించే రోజు వరకూ పనులు చేసుకుంటూ కష్టపడ్తూనే ఉంది. ఇప్పుడు వేళ ప్రకారం పాలు, పళ్ళూ, భోజనం, పరీక్షలు జరిగిపోతున్నాయి. తననో గాజు బల్బులా చూసుకుంటున్నారు.

సరిగ్గా డాక్టర్ చెప్పిన రోజునే ప్రసవ వేదన ప్రారంభమయ్యింది. గతంలో ఆ బాధను అనుభవించిన రోజు జ్ఞాపకం వస్తోంది. ఆ రోజు పద్దెనిమిదేళ్ళ క్రితం గీతను కన్నప్పుడు అనుభవించింది. మళ్ళీ ఇన్నాళ్ళకు ఇప్పుడు. తనది కాని ప్రాణం కోసం ప్రసవవేదన.

పండంటి మగబిడ్డను కని డాక్టర్ చేతిలో పెట్టింది. ఒప్పుకున్న బాధ్యతను తను విజయవంతంగా నిర్వర్తించినందుకు ఒకరకమైన తృప్తి. నవమాసాలు మోసిన బిడ్డ పేగు బంధాన్ని తెంచుకోవాలంటే చెప్పలేని బాధ.

బిడ్డను కన్న వారం రోజులకు రూంలోంచి బయటకు వచ్చి చుట్టూ చూడసాగింది. మొహానికి మాస్క్ కట్టుకున్న యువతి కూర్చున్న వీల్‌చైర్‌ను ఆయా తోసుకుంటూ స్కానింగ్‌కు తీసుకెళ్తోంది. కళ్ళు మాత్రమే కనిపిస్తూన్న ఆమెను చూడగానే ఎక్కడో చూసానన్న భావన. ఆ అమ్మాయి తనను ఎక్కడ గుర్తుపడుతుందోనని త్వరగా రూంలోకి వచ్చేసింది. తను కూడా మొహానికి మాస్క్ కట్టుకుని గదిలో కిటికీ దగ్గర నుంచుంది.

అరగంట క్రితం స్కానింగ్‌కు తీసుకెళ్ళిన యువతిని మళ్ళీ వీల్ చైర్‌లో తీసుకొస్తున్నారు. తెలుసున్న మనిషిలా వున్నా ఎవరో గుర్తుపట్టలేకపోయింది. కళ్ళు చూస్తే భీతహరిణేక్షణిలా ఉంది. తననెవరూ గుర్తుపట్టకూడదని ఈసారి మాస్క్‌తోబాటు స్కార్ఫ్ కూడా కట్టినట్లుంది. మొహం కనపడటంలేదు. చిన్నపిల్లే. పద్దెనిమిది, ఇరవై ఏళ్ళు ఉండొచ్చు. అంత చిన్నవయస్సులోనే గర్భధారణా?

వెంకటలక్ష్మి వెనక్కి వచ్చి గదిలో మంచం మీద కూర్చుంది. ఆలోచన్లు పరిపరివిధాల పోతున్నాయి. ఇంటిదగ్గర ముసల్ది ఎలా ఉందో? రోగిష్టి మొగుడు సరిగా మందులు వేసుకుంటున్నాడో లేదో? గీత సరిగ్గా కాలేజ్‌కి వెళ్తుందో లేదో. కిరాణా కొట్టు ప్రొద్దున్నా, సాయంత్రం తీస్తోందో లేదో. టైలర్ రామకృష్ణ ఏదైనా సహాయం చేస్తున్నాడో లేదో. ఈ మధ్య ఫోన్లు కూడా చెయ్యడం లేదు. బాబాయ్ వచ్చికూడా చాలా రోజులయ్యింది. మిగిలిన సొమ్ములు ఇంకా ఇవ్వనే లేదు.

ఆలోచిస్తుండగానే తలుపు చప్పుడైతే చూసింది. భూషణం లోపలికి వస్తున్నాడు.

"బాబాయ్! అంతా కులాసాయేనా?" అంది వెంకటలక్ష్మి కుర్చీ చూపిస్తూ.

"ఆ..." అన్నాడు భూషణం ముక్తసరిగా.

"చెప్తా, నువ్వు ముందు బట్టలు సర్దుకో. ఆసుపత్రి వాళ్ళు మిగిలిన రెండు లక్షలు ఇచ్చేసారు. నువ్వు కొన్నాళ్ళు వాడవలిసిన మందులు కూడా ఇచ్చారు. పద. మనం బయల్దేరుదాం" అన్నాడు భూషణం.

వెంకటలక్ష్మి బట్టల బ్యాగ్ సర్దుకోవడం మొదలు పెట్టింది. తలుపు దగ్గర మళ్ళీ చప్పుడైతే భూషణం గది బయటకు వచ్చాడు.

"భూషణం గారూ పద్దెనిందో నెంబర్ గదిలో పేషెంట్ కోపరేట్ చెయ్యడం లేదు. ఒకటే ఏడుపు. ఇలా అయితే కష్టం" అంటోంది సిస్టర్. వెంకటలక్ష్మికి ఏదో అనుమానంగా ఉంది. ఒక్క ఉదుటున బయటకొచ్చింది. భూషణాన్ని తోసుకుని పద్దెనిమిదో నెంబర్ గదికేసి వేగంగా పరుగెత్తింది. గదిలో అడుగుపెట్టగానే అక్కడ దృశ్యాన్ని చూసి స్థాణువులా నిలబడిపోయింది.

గీత మంచం మీద కూర్చుని ఏడుస్తోంది. జుట్టు చిందరవందరగా ఉంది. మొహం పీక్కుపోయి, దుస్తులు అస్తవ్యస్థంగా ఉన్నాయి.

"గీతా!" అంటూ వెళ్ళి గట్టిగా కౌగలించుకుంది. గీత పొట్టమీద చెయ్యివేసి తడిమి షాక్ అయ్యింది.

"నువ్వు.. నువ్వు ఏమిటిక్కడా?" అంది అయోమయంగా.

గీత మొహంలో బాధ, ఆశ్చర్యం, ఆనంద్మ కలగలిసి ఉన్నాయి.

"అమ్మా! వచ్చావా అమ్మా! నేను చచ్చిపోతానమ్మా" అంటూ బావురుమంది గీత,.

భూషణం వచ్చి నెమ్మదిగా తల్లికూతుళ్ళ తలమీద చెయ్యివేసి అనునయించాడు.

"అమ్మా! వెంకటలక్ష్మీ కంగారు పడకు. స్థిమితంగా కూర్చో, మనస్సు కాస్త దిటవు చేస్కో. అన్ని విషయాలూ చెప్తాను" అన్నాడు.

తల్లీకూతుళ్ళు ఒకళ్ళనొకళ్ళు పట్టుకుని ఇంకా ఏడుస్తూనే ఉన్నారు. భూషణం కొంతసేపు మౌనంగా ఊరుకున్నాడు. ఓ ఐదు నిముషాలు తర్వాత తల్లీకూతుళ్ళు తేరుకున్నారు.

"గీతా! ఏడుపు ఆపి కాసేపు నిశ్శబ్ధంగా ఉండు. వెంకటలక్ష్మీ ఏదీ మన చేతిలో లేదు. తానొకటి తలిస్తే దైవం ఒకటి తలుస్తాట్ట. అంతా భగవంతుని నిర్ణయం. మనం నిమిత్తమాత్రులం. ఇంటినుంచి నువ్వెళ్ళిన తర్వాత నారాయణ రాత్రీ పగలు మళ్ళీ తాగుడు మొదలు పెట్టాడు. సిరోసిస్ తీవ్రమై మూడు నెలలకే బలయిపోయాడు. వయస్సులో ఒంటరిగా ఉన్న గీతను మాయమాటలతో టైలర్ రామకృష్ణ గర్భవతిని చేసాడు. గీత పెళ్ళి చేసుకోమనగానే బిచాణా ఎత్తేసి పారిపోయాడు. ఇంట్లో ఏడుస్తూ కూర్చున్న గీతను అనుమానం వచ్చి ఈ డాక్టర్‌కు చూపిస్తే, ఆరోనెలని, అబార్షన్ చేస్తే తల్లి ప్రాణానికి రిస్క్ అని చెప్పారు. భ్రూణ హత్య చెయ్యలేక, గీత ప్రాణానికి రిస్క్ తీసుకునే ధైర్యం లేక గత్యంతరం లేని పరిస్థితిలో గీతను సిటీలో హాస్టల్‌లో జాయిన్ చేస్తున్నానని చెప్పి, ఈ హాస్పిటల్‌లో చేర్పించాను. మరో రెండు నెలల్లో పురుడుపోసి, బిడ్డను సంతానంలేని కోటీశ్వర్లుకి పెంపకానికి ఇచ్చే ఏర్పాటు చేసాను. నువ్వు అమ్మకానికో అమ్మవైతే, గీత అమ్మకాని, అమ్మ అని చెప్పుకోలేని అమ్మ. జరిగింది పీడకలగా మర్చిపోవడమే మనం చెయ్యవలిసింది. గతాన్ని తలుచుకుని బాధపడితే జీవితంలో ముందుకు సాగలేం. సంసారంలో మొగాడు సరిగా లేకపోయినా, ఇంట్లో ఆడదిక్కు లేకపోయినా జరిగే అనర్ధాలివే" అన్నాడు భూషణం.

తిరుగుబోతు, తాగుబోతు భర్త గురించి ఏదో రోజు ఈ వార్త వినవలసి వస్తుందని తెలుసు. కానీ ముక్కుపచ్చలారని గీత జీవితం అన్యాయం అయినందుకు తట్టుకోలేక పోతోంది వెంకటలక్ష్మి. తను ఎవరి బాగోగుల కోసం పంటిబిగువున ఇంత కష్టపడిందో వాళ్ళే సహకరించకపోవడంతో, తన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరయినందుకు బాధగా వుంది వెంకటలక్ష్మికి.

ఓ పావుగంటకు వెంకటలక్ష్మి షాకునుంచి తేరుకుంది.

"బాబా! మొగుడు రోగైనా, భోగైనా, యోగైనా మొగుడే మగాడే మగాడు మంచం మీద పడున్నా, కంచం ముందు కూర్చున్నా మగాడూ మగదిక్కే. నేను గది అద్దెకిచ్చాను. గర్భాన్ని అద్దెకిచ్చాను. కానీ, శీలాన్ని కాదు. గీత దాటిన గీత జీవితాన్ని సరిదిద్దుదాం. టైలర్ రామకృష్ణ పిరికివాడేగానీ చెడ్డవాడు కాదు. డిగ్రీ చదివాడు. వాడు నా మాట కాదనడు. వాడ్ని పట్టుకుని గీతతో పెళ్ళి చేసేదాకా వదలను. సంతానం లేనివాళ్ళు ఎంతోమంది లక్షలు ఖర్చుపెడ్తూం తలక్రిందులుగా తపస్సు చేస్తూ, గుళ్ళూ గోపురాలు తిరుగుతూ, మందులూ మాకులు మింగుతూంటే, దేవుడిచ్చిన సంతానాన్ని వదిలివేయడం అపరాధం బాబాయ్. సంతానం అనేది సమస్త జీవరాసికి దేవుడిచ్చిన వరం. నువ్వు నాకెంతో చేసావు. ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలను బాబాయ్. గీతా! జరిగిందేదో జరిగిపోయింది. ఏడ్చి లాభంలేదు. రామకృష్ణను తీసుకొచ్చి నీకు పెళ్ళి చేసే బాధ్యత నాది. నిశ్చింతగా వుండు" అంది వెంకటలక్ష్మి.

"నన్ను క్షమించు అమ్మా" అంది గీత.

''పిచ్చిపిల్లా'' అని ఆప్యాయంగా గీతను దగ్గరకు తీసుకుంది వెంకటలక్ష్మి.

గీత లేత మనస్సునుంచి అపరాధభావం నెమ్మదిగా తొలిగిపోయింది. వెంకటలక్ష్మి సమస్యని ఎదుర్కొనే తీరుకు, గుండె నిబ్బరానికి తృప్తిగా నిట్టూర్చాడు భూషణం.

# ఎడం ఛాయా మల్లిక్

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

''**నువ్వు** స్వతహాగా కథకుడివైనందువలన నీకు ఎక్కువగా విశ్లేషించి చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను'' అని నాతో సంభాషణ ప్రారంభించిన వ్యక్తి మా చిరకాల కుటుంబ మిత్రుడే కావడంతో ఈ ఉపోద్ఘాతం ఏ బృహద్భాతానికి దారితోస్తుందోనని నేను సంకోచించిన మాట వాస్తవం.

ఆ పల్లెటూరి చెరువుగట్టున రామాలయపు మండపంలో కూర్చుని ఉన్నాం, మేమిద్దరమూ. వేసవికాలం కావడం వలన పొద్దువాలినా యింకా చీకట్లు అలుముకోలేదు. చెరువులోని నీటి అలలే చల్లగాలి కెరటాలై మృదువుగా స్పృశిస్తూ సేద తీరుస్తున్నాడు.

రెండు నిమిషాల కాలం నిశ్శబ్ధంగా గడిచాక, మళ్ళీ తనే ''క్రిందటి నెలలో పట్నం పనిమీద మీ యింటికొచ్చి నాల్రోజులు ఉన్నప్పుడు నేనో సంగతి గమనించాను. మీ యిద్దరి మధ్య ఏ విధమైన పొరపొచ్చాలూ లేవు. గత నలభై ఏళ్ళుగా మీరిద్దరూ కీచులాడుకోవడం మాకెవరికీ తెలీదు. సలక్షణంగా పిల్లలకి ఉద్యోగాలూ, పెళ్ళిళ్ళూ చేసి బాధ్యతలన్నీ తీర్చేసుకుని నిక్షేపంగా సొంత యింటిలో 'మిథునం' కథలో జంటలా ఏ బాదరాబందీ లేకుండా ఉన్నారు కానీ మీ యిద్దరి మధ్యా నాకేదో వెలితి కనిపించింది. ముభావంగా నువ్వూ, ముక్తసరిగా ఆవిడా!. ఇన్నేళ్ళ దాంపత్యం తర్వాత మీ మధ్య ఆ 'ఎడం' ఏమిటో ఎందుకో నాకేమాత్రం అర్థం కావడంలేదు. ఏమై ఉంటుందంటావ్?''

అడిగిన వ్యక్తి నిజానికి మా అన్నయ్యకి స్నేహితుడు. నాక్కాదు. కానీ, గతంలో మా అన్నయ్యకీ, నాన్నకీ చెప్పుకోలేని ఇబ్బందులూ, ఆమెతో నా ప్రేమవ్యవహారంలో తప్పనిసరైన సలహా, సంప్రదింపూ ఈయన చొరవవల్లనే చక్కబడ్డాయి. అందువలన ఈయన పరాయి మనిషికాడు, నిజమే. అందుకే, నాకంతవరకూ అనుభవంలోకి రాని విషయాన్నొకదాన్ని శోధించి, వెలికి తీసి నా సమాధానాన్ని కోరినప్పుడు 'నీకెందుక'ని తిరస్కరించలేకపోయాను.

కానీ ఇప్పుడు కొత్తగా మొదలైన అలజడిని అదుపులో ఉంచేందుకు ప్రయత్నించే పనిలో భాగంగా గత జీవితాన్ని సింహావలోకనం చేసుకుంటూ ఇంతవరకూ గమనించని 'వెలితి'కి మూలాలు అన్వేషిస్తూ స్వగతంలా మాట్లాడసాగాను.

"మొదట్నుంచీ కుటుంబ బాధ్యతలేవీ తెలియకుండానే పెరిగాను నేను. అన్ని విషయాలూ నాన్నా, అన్నయ్యే చూసుకునేవారు. అందుకేనేమో కథలూ, కవితలూ రాసుకుంటూ భావకుడిగా ఉండిపోయాన్నేను. ఉద్యోగం వచ్చిన ఏడాదిలోనే నేను ప్రేమలో పడినప్పుడు అప్పుడే పెళ్ళేమిటని మావాళ్ళు అడ్డుపడితే నువ్వే వాళ్ళని ఒప్పించి, అంతా సానుకూల పర్చావు.

ఆమెను నేను ప్రేమించానని తెలుసు. అంతే. ఆమెకు నా పట్ల ఎలాంటి భావం వుందో తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు నేను. నిన్ను మధ్యవర్తిగా పంపించి, నా ప్రేమకథని సుఖాంతం చేసుకున్నాను. కట్నం అడక్కుండా ఉద్యోగస్తుడైన అల్లుడు వస్తూంటే, ఎవరికి అభ్యంతరం ఉంటుంది?

ఇక ఆమె విషయం. జీవితంలో చదువూ, ఉద్యోగం తర్వాత సహజంగా జరిగే పరిణామంగానే వివాహాన్ని ఆమోదించింది. కానైతే అంతకాలం తన తండ్రికి చేదోడుగా తాను చేస్తున్న చిరుద్యోగాన్ని మరికొంతకాలం కొనసాగించి, ఆయనకి అండగా ఉంటానని మాత్రం చెప్పింది.

నేనందుకు ఒప్పుకోవడమే కాకుండా ఆమెకు మరింత సామర్థ్యాన్ని అందించాలని పదవతరగతితో ఆపేసిన చదువును మళ్ళీ ప్రారంభించమన్నాను. అందువల్ల ఆమె విద్యార్హత పెరిగి, మంచి ఉద్యోగాన్ని సంపాదించుకుంది.

ఛాందసభావాలు కల సమాజం నుంచి ఆమె భావ స్వాతంత్ర్యం పొందాలని, అభ్యుదయ సాహిత్యాన్ని ఆమెకు సమకూర్చాను.

ఆమె కూడా అన్నివిధాలా నాకు అనుకూలవతియై, నా బాధ్యతలన్నీ నేను సక్రమంగా నెరవేర్చడానికి ఎంతగానో సహకరించింది."

సరిగ్గా అక్కడే ఆయన అడ్డుతగిలాడు.

"అంతా బాగానే ఉంది. ఇదంతా నాకూ తెలుసు. మరి ఆ 'వెలితి' ఎక్కడ్నించి వచ్చింది?"

"అదే ఊహిస్తున్నాను. నేనింతవరకూ చెప్పినవి కేవలం నా పరంగానే ఉంది కదా! నాణానికి రెండో పార్శ్వాన్ని కూడా చూడందే 'సహజీవనా'న్ని ఎలా అర్థం చేసుకోగలం?

ఇప్పుడిప్పుడే నాకు తోస్తున్నది ఏమిటంటే నేనామెకు ఏమిచ్చానన్నదే ఆలోచిస్తున్నాను కానీ ఆమె ఏమి కోరుకుంటోందన్నది కాదు. నేనామెకు అవకాశాలిస్తే, ఆమె నాకు సహకారాన్నందించి బదులు తీర్చుకుంది. అంతేకానీ, ఆమె తనకై తాను ఒక స్వతంత్రవ్యక్తిగా తనకే తెలీని తన అంతరాంతరాల్లో దేనికై తపిస్తోందో నాకిప్పుడే స్ఫురిస్తోంది."

"ఏమిటది?" అడిగాడాయన ఆత్రంగా.

"స్వేచ్ఛ!.. నా ప్రభావంనుంచి విముక్తి"

"మరి దీనికి నీ సమాధానం?"

"మరేం లేదు. 'అన్యోన్యం' అంటే 'మమేకం' కాదని గ్రహించడమే."

## ఆ చోటు ఈ రోజు ఖాళీగా ఉంది — చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి

ఆ చోటు ఈ రోజు ఖాళీగా వుంది ..................

ఖాళీగా నే కాదు శూన్యం గా, నిస్సహాయంగా వుంది.

ఆ చోటుని నింపుతూ ఒక శాల్తీ కూర్చుంటూ వుండేది, పద్మాసనం వేసుకొని నిశారుగా కూర్చుంటూ వుండేది. ప్రపంచంతో సంబంధం లేకుండా, మనస్సును ప్రశ్నించుకొంటూ అతీతంలో వుండేది. నేను ఆమెను గమనించటం ప్రారంభించి దాదాపు రెండు సంవత్సరాలు అవుతుండొచ్చు. రోజూ ఉదయం మార్నింగ్ వాక్. ఆదివారం నుంచి ఆదివారం వరకు, పౌర్ణమి నుంచి పౌర్ణమి వరకు. విరామం లేకుండా అలసి పోకుండా అలాగే కూర్చొని కనిపించేది.. నాకే అప్పుడప్పుడు విసుగనిపించేది.ఎండ లో, ఎవరికోసమూ ఎదురు చూడకుండా , ఎవరిని పలకరించకుండా, ఏమి మాట్లాడకుండా .......... అట్లా కూర్చునేది. ఆ కూర్చోవడంలో కూడా ఎంత ఓపిక!. అది ఓపిక కాదేమో!? నిర్వేదం అనిపిస్తుంది. ఒక్కో రోజు ఆగి అడిగేస్తే తెలుస్తుంది కదా అని అనిపిస్తుంది మళ్ళా మనకెందుకులే అనిపిస్తుంది.

అదే విచిత్రం పక్క వాళ్ళ జీవితం గురించి తెలుసుకోవాలి అనే ఉత్సాహం అందరి లాగే నాకూ ఉన్నప్పటికీ ......... మరీ ఏమి మాట్లాడకుండా వున్న వ్యక్తితో సంభాషణ ఎలా మొదలు పెట్టేది?? సూటిగా చూసి మాట్లాడాలంటే కొంచం మొహమాటం. అలాగని మాట్లడకుండా ఎలా వదిలేది?? అసలే నేనొక రచయితని. నాకు తెలుసు, నా మనసుకు తెలుసు. ఏమో ఈ శాల్తీని కదిలిస్తే!?.. ఒక కథ రాసేటంతటి విషయం దొరుకుతుందేమో? .నా ప్రయత్నం నేను చేస్తే కదా తెలిసేది.. అనుకోకుండా ఇదిగో ఈ పరిస్థితి తెచ్చింది. ఒక కథను దాదాపు కోల్పోయే పరిస్థితి -.

నేను ఫుల్ టైం రచయతను అయి వుంటే ఈ పరిస్థితి కి వచ్చే వాడిని కాదేమో! నేను పార్ట్ టైం రచయితను. పైగా ఒక ఉద్యోగం వెలగపెడుతూ ఇలా తోచినప్పుడు రాస్తాను కాబట్టి, ఇప్పుడు కథ రాద్దాం అని అనుకున్నాను. కాబట్టి ఇదిగో ఆ చోటు గురించి ఆ శాల్తీ గురించి ఆలోచిస్తున్నాను. లేక పోతే నా తలకాయ నొప్పులు నాకున్నాయి. అసలు నా జీవితమే ఒక గొప్ప కథ. అయితే నన్ను నేను నగ్నంగా ఎక్కడ చూపిచ్చుకోను?? అందుకే ఇంకొకరి గురించి రాద్దాం అని నిర్ణయించు కున్నాను. అయితే ఈ శాల్తీ నే ఎందుకు ఎంచుకున్నాను అని మీకు సందేహం రావటంలో తప్పు లేదు. అది నాకున్న భావ స్వాతంత్ర్యం.... ఇది ఒక పెద్ద పదమే! కాని పెద్ద రచయితను కాగోరి ఇలాంటి "గురు" పదాలు వాడుతున్నా. ఇలాంటి వింత శాల్తీలే కథా వస్తువులుగా వాసికెక్కేది. కావాలంటే ఏ గొప్ప రచయిత కథలయినా చూడండి. ఒకానొక జీవితాన్ని తమ దృష్టితో చూసి విశ్లేషించాలి.

ఇక విషయానికి వద్దాం. ఇప్పుడు సమస్యలో వున్నాం. ఆ చోటు ఖళీ అయివుంది.. నా కథా వస్తువు కనపడటం లేదు. ఇదో పెద్ద సమస్య ........ శూన్యం లోంచి విభూతి సృష్టించే శక్తి నాకు లేదు. మరి ఏమి చెయ్యాలి ?? అక్కడున్న చెట్టు-పుట్ట , గొడ్డు-గోదా , పక్షి-పురుగు , ఆకాశం-భూమి ఎవరినడిగితే నాకు సమాధానం దొరుకుతుంది ?? ఎలా దొరుకుతుంది. దొరికే వరకు ప్రయత్నం చెయ్యాలి. టీ కొట్టు దగ్గరికి వచ్చా.

" ఒక లెమన్ టి "

అతను మౌనంగా స్టౌ వైపు చూస్తూ నీళ్ళను మరగ పెడుతున్నాడు. అడగాలా? వద్దా? పెద్ద మీమాంస. సరే ఎమైతే అది.....

" ఏమయ్యా అక్కడ ఒక ముసలామె వుండడేది కదా .....యీ మధ్య ఇక్కడికి రావటం లేదా ?"

ఎంత యాధాలాపంగా అడిగినా. నాకు తెలియకుండానె ఒక ఉత్సుకత..... కథ తెలిసేసు కొని గొప్ప కథ రాసెయ్యాలి అని ఆత్రుత

" ఎవరు సార్ ?? "

ఏమి ఎరుగని అమాయకత్వం పైగా ....... నాకెందుకు లే అన్న ప్రశ్న

"అదిగో ... అక్కడ కూర్చుని. వుండేది... "

ఇంత పరిసరాలను పట్టించుకొని జీవితాలా అని ఒక విసుగు ...కాని ----.నాకెమొ సమాధానం అత్యవసరం. దాని మీద ఎన్నొ విషయాలు ఆధారపడి వున్నాయి.

" ఇది గొండి సార్ ....."

టీ అందించాడు. నా ప్రశ్నకు సమాధానం దొరకలేదు. చేతికి టీ మాత్రం దొరికింది. సరే ఏం చేస్తాం! నిరాశగా టీ చప్పరించటం మొదలు పెట్టాను.

అవును.. ఆ చోటు ఎందుకు ఖాళీగా వుంది??? మరొకరు ఎవరూ ఆ స్థానాన్ని ఎందుకు తీసుకోలేదు??

అబ్బ ..... యీ ప్రశ్నలకి సమాధానం ఎవరు చెపుతారు?? నా చూపులన్నీ అక్కడే వున్నాయి ఆ చోటుని ప్రశ్నిస్తూ ..... గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తూ ......శూన్యంలో ప్రశ్నిస్తూ ....

" సార్ .... " యీ ప్రపంచం లోకి తెస్తూ " పది రూపాయలు " అంటూ యీ మెటీరియలిస్టిక్ అవసరాలని గుర్తు చేసాడు. జేబు లోనించి పది రూపాయలు తీసి ఇచ్చాను. ఇక బయల్దేరదాం అనుకుంటూ గ్లాసు అక్కడ టేబుల్ మీద పెట్టా. దింపుడు కళ్ళెం ఆశతో అతని వైపు చూసాను. అతను తన పని తను చేసుకుంటున్నాడు. ఒక అర్టిస్ట్ లాగా మిల్క్ పాకెట్ లు కట్ చేయడం, ఎత్తి మరుగుతున్న పాలల్లో పోయడం ....గమనిస్తూ నించున్నా. నా ఉనికి అతనిని ఇబ్బంది పెట్టటం లేదు. నేను అనే అహం నాకుంది. ఆ అహాన్ని అతను గుర్తించలేదు. అది నాకు ఇంకా బాధ కలిగించే సమస్య. ఒక చేత్తో గరిట పెట్టి మరుగుతున్న టీ కలుపుతున్నాడు. రెండో చేత్తో అల్లం దంచుతున్నాడు. తను చేస్తున్న పని మీద పూర్తి అవగాహన వున్న వాడిలానే వున్నాడు .... పోన్లే అనుకుంటూ వెనక్కి తిరిగాను. ఇక కథ ముందుకు జరగదు. హఠాత్తుగా ...

మూగ బొమ్మ మాట్లాడింది ........

" ఆవిడతో మీ కేమి పని సార్? "

అవ్యక్తమైన ప్రశ్న ...అవును నాకేమి పని? అసలు పక్కవారి జీవితాలలోకి నేను ఎందుకు తొంగి చూస్తున్నాను??.....ఇప్పుడు నేను ఏమి సమాధానం చెప్పను ??నా మనసుని నేను ప్రశ్నిస్తూ ఆలోచన్లో వుండగానే ....

" అవిడ ఇప్పుడు రావటం లేదు సార్ ...."

ఆ విషయం నాకు తెలుసు. అదే కదా నాకు కావలిసిన విషయం. ఆవిడ ఇప్పుడు అక్కడ లేదనే కదా నా దుగ్ధ.

" అదే ఎందుకు రావడం లేదు.....?"

తపస్సు భగ్న మైన ఒక రుషి తలెత్తి చూసాడు. దీర్ఘంగా, తీవ్రంగా... .నా అత్మని తరచి చూసే ఒక నిశిత మైన చూపు! మళ్ళా తన తపస్సులోకి వెళ్ళిపోయాడు. ఆ వెనుక కూర్చొన్న ఆమె లేచి నా వైపు చూసి కూర్చొంది. అనవసరమైన విషయంలో కి నేను తొంగి చూస్తున్నానా ?? నా లోని సామాజికుడు నన్ను హెచ్చరించాడు. ఇక చాలు బయలు దేరు. నువ్వూ నీ కథా ........ ఇక చాలు ..... పద ..... పద ....అని తొందర పెట్టింది.

" ఆమె ఒక పిచ్చిది సార్! " వెనకనున్న ఆమె గిన్నె తోముతూ.....నా మనస్సుని తోమేసింది.

అంతే ....అంతే .....పిచ్చిదే ..... లేక పోతే ..... ఒకటే చోటులో....అలా కూర్చొవటం... కదలకుండా కూర్చోవటం. అది పిచ్చి వాళ్ళు చేసే పనే! సందేహం లేదు .....అమ్మయ్య ....నాకు ఒక బరువు తీరినట్టయింది. మనస్సు తేలికయినట్టు అనిపించి వెంటనే గుర్తుకు వచ్చింది. అయితే నా కథ ముందుకు వెళ్ళటం ఎలాగా?? ఏదొ వెలితి ఇప్పుడు ఎలా..!? నాలోని రచయిత బయటికి ఎలా రావటం ????....మళ్ళా కొత్త కథా వస్తువుని ఎక్కడి నుంచి సంపాదించు కోవాలి ?? ఇప్పుడు ఎలాగ ?? అన్ని ప్రశ్నలే ....మళ్ళా ....మళ్ళా

సరే .... ఆవిడ పిచ్చిదే అనుకుందాం. మరి ఇన్ని రోజులు అక్కడ ఎందుకు కూర్చొంది !? ఇప్పుడు అక్కడి నుంచి ఎందుకు రావటం లేదు! ఇప్పుడు వీళ్ళని అడిగి ఏం తెలుసుకోవాలి?? మళ్ళా సామాజికుడు నిద్ర లేచాడు. ఇక చాలు పద, .పద .... అని తొందర పెట్టాడు. మళ్ళా ఎందుకో ... చిన్న ఆశ. ఏమన్నా తెలుస్తే బావుండు. ఇక వాళ్ళని అడగదలుచు కోలేదు. రచయితగా ఇక నా పాత్ర అరంభమయింది. నేనే ఇక ఆ పాత్రకి ఒక రూపం కలిగించాలి. ఒక కథని నిర్ణయించాలి. ఇక నేను సృజన మొదలు పెట్టాలి. సరే ఆమె జీవితానికి ఎలాంటి ఎగుడు దిగుడులు నిర్మించాలి!? అబ్బో చాలా పనివుంది. తొందరగా వెళ్ళాలి ....వెళ్ళీ ... నా సృష్టి మొదలు పెట్టాలి. బయలుదేరాను .... పది అడుగులు వేశానో లేదో ....అదిగో ....ఆమె ఎదురొచ్చింది. నవ్వుతూ...ఆత్మ విశ్వాసంతో నడుస్తూ ఎదురొచ్చింది. మనస్సు వూర్కో లేదు.... పాత్ర ఎదురొస్తే వూర్కోలేని రచయితలా, నా మనస్సు వూర్కోలేదు. ఇదే సమయం... ముందు పరిచయం చేసుకోవాలి ....

" నమస్తే అండీ "

" నమస్తే చెప్పండి " ...యీవిడ పిచ్చిదా ..... ??

" మీరు రోజూ అక్కడ కూర్చుని ఉండగా చాలా సార్లు చూసాను "

" ఆహ ... ఒ కే ..... అయితే "

" అదే అలా ఎందుకు కూర్చొనే వారు ??"

" ......??"

" క్షమించండి .... మీ వ్యక్తి గతమైన విశయం అయితే చెప్పొద్దు "

" డాక్టర్ ... డీ వైటమిన్ తక్కువైంది అంటే .....రోజుకి ఒక గంట అలా ...కూర్చునే దాన్ని ...... ఏం?"

-.-.-.-.-.-.-.-......

ఇక నేను రచయిత ఎలా అవను ??? ప్రకృతి కూడా నాకు వ్యతిరేకంగానే వుంది ......!!!

## కనకపు సింహాసనమున

ఆకెళ్ల కృష్ణకుమారి

"రండి, రండి. వాళ్ళు వచ్చేస్తున్నారు. హారతి తెస్తున్నాను" అంటూ హడావిడి పడుతూ పిలిచింది శాంత.

"వస్తున్నా, వస్తున్నా" అంటూ వీడియో కెమేరాతో గుమ్మం దగ్గిరికి వచ్చాడు రామం.

ఇంతలోనే, ఎర్రని టయోటా కారు ఇంటి ముందుకు వచ్చి ఆగింది. అందులోనించి కొత్త దంపతులు ఆనంద్, వందన దిగి లోపలికి వచ్చారు. గుమ్మం దగ్గిరే వాళ్ళకి హారతి ఇచ్చి, కోడలిని కుడికాలు ముందు పెట్టి ఇంట్లోకి రమ్మని చెప్పి, ఇద్దరినీ ఇంట్లోకి తీసుకు వెళ్లింది శాంత. ఇదంతా వీడియో తీస్తూ వెనకాలే లోపలికి వచ్చాడు రామం.

రామం, శాంత అమెరికాలో ఉంటున్న చాలా మందిలాగే 30 ఏళ్ల కిందట ఈ దేశం చదువులకని వచ్చి ఇక్కడే ఉండిపోయిన తెలుగువాళ్లు. రామం MS చెయ్యటానికి వచ్చి, అది పూర్తి కాగానే మంచి ఉద్యోగం తెచ్చుకున్నాడు. వెంటనే ఇండియా వెళ్లి అమ్మ, నాన్న చూసి పెట్టిన సంబంధాలలో తనకు నచ్చిన శాంతను పెళ్లి చేసుకుని తీసుకు వచ్చాడు. మెల్లిగా ఉద్యోగరీత్యా 3, 4 ఊళ్లు తిరిగి చివరకు కాలిఫోర్నియా వచ్చి, ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డారు. పిల్లలు సరిత, ఆనంద్ ఇద్దరూ ఇక్కడ స్కూళ్లలోనే చదువుకుని, ఉద్యోగాలు తెచ్చుకున్నారు. ఇంట్లో మొదట్లో ఎక్కువగా తెలుగే మాట్లాడటం, తెలుగు వంటకాలే తినటం ఉన్నా, మెల్లిమెల్లిగా పిల్లలు పెద్దవాళ్లవుతున్నకొద్దీ భాష లోను, భోజనం లోను మార్పులు వచ్చాయి. ఇంగ్లీష్ లోనే మాట్లాడటం, పీజ్జాలు, పాస్తాలు, బురీటోలు, బర్గర్లు వచ్చాయి. పిల్లలు పెద్దవాళ్ళైన కొద్దీ బైట వాతావరణంతో పిల్లల ఆలోచనా విధానంలో మార్పులు వచ్చాయి. తల్లితండ్రులు కూడా పిల్లల్ని అర్థం చేసుకుని, వాళ్లకు తగినంత స్వాతంత్రం ఇస్తూ, మన ఇండియా పద్ధతులు, సంస్కారం నేర్పటానికి ప్రయత్నం చేశారు.

అంతవరకు బాగానే ఉంది కానీ పిల్లల పెళ్లిళ్ళ దగ్గరకు వచ్చేటప్పటికి తల్లి తండ్రులకి కొంచెం భయం పట్టుకుంది, "వీళ్ళు అమ్మ, నాన్నలు చూపించే పిల్లలు వద్దు, మేమే చూసుకుంటాం అంటున్నారు. ఎలాంటి వాళ్ళను ఏరుకుంటారో ఏమో, అసలు ఇండియన్స్ అయినా అవుతారో, కాదోనని". కానీ పిల్లలు బాగానే ఆలోచించారు. సరిత తనకు బాగా తెలిసిన గుజరాతి అబ్బాయి చేతన్ ని పెళ్లి చేసుకుంది. ఇప్పుడు ఆనంద్ తనకు MS లో క్లాసుమేట్ అయిన కన్నడం పిల్ల వందనను చేసుకుంటానని చెప్పాడు. తల్లి తండ్రులు సంతోషంగా పెళ్లి చేశారు. పెళ్లి ఆయిన తర్వాత కొడుకు, కోడలు వీళ్ళ ఇంట్లో, వీళ్ళతోనే ఉంటామని చెప్పేటప్పటికి, ఇంకా చాలా సంతోషించారు. అమెరికాలో పిల్లలు ఉద్యోగం రాగానే వేరే ఇంటికి వెళ్ళిపోతారు. అలాంటిది పెళ్లి చేసుకుని, కొడుకు, కోడలు వాళ్ళతోనే ఉంటామంటే సంతోషం కదా.

వందన 4 రోజుల్లో బాగా కలిసిపోయింది ఇంట్లో. సాయంత్రం ఆఫీస్ నించి ఇంటికి వచ్చిన తర్వాత అత్తగారికి కొంచెం వంటలోను, కిచెన్ క్లీన్ చేయటంలోనూ చిన్న, చిన్న పనులకు సహాయానికి వచ్చేది. అది చూసి చాలా మురిసిపోయింది శాంత.

ఒక వారం రోజుల తర్వాత ఒక రోజు ప్రొద్దున్నే వందన తమ్ముడు సతీష్ వచ్చాడు ఒక పెద్ద నల్ల లాబ్రడార్ కుక్క ను తీసుకుని. దాన్ని చూడగానే శాంత కి భయం వేసి లోపలికి వెళ్ళిపోయింది. కాసేపు ఆయిన తర్వాత వందన వచ్చి, "ఆంటీ, వీడి పేరు టామీ. నా పెంపుడు కుక్క. ఈ వారం రోజులు నేను ఇంట్లో లేనని ఇల్లంతా వెతుక్కుంటున్నాడుట. ఇంక నించి మనింట్లోనే పెట్టుకుందామా ఆంటీ?" అని అడిగింది. ఈ ప్రశ్న వినగానే ఒక్కసారి మూర్చ వచ్చినంత పనైంది శాంతకు. రామం కి కుక్కలంటే భయం లేదు కనుక భరించగలడు. ఆనంద్ కి కుక్కలంటే చాలా ఇష్టం. పైగా ఈ కుక్క బాగా అలవాటైనట్లుంది. ఎటొచ్చి తనకే ఇది పెద్ద సమస్య. కానీ ఏమంటుంది? కోడలు ముద్దయితే కోడలితో వచ్చిన కుక్కని కూడా ముద్దుగానే చూడాలి కదా. తప్పేదేముంది?

కుక్క బోజనానికి, మంచినీళ్లు తాగటానికి గిన్నెలు, పడుకునే పరుపు, ఆడుకునే బంతి అన్ని తీసుకు వచ్చి దానికి వీలుగా అన్నీ ఫామిలీ రూమ్ లో ఏర్పాటు చేశారు పిల్లలు వెంటనే.

అసలే శాంత కి కుక్కలు, పిల్లులు అంటే భయం, అసహ్యం. అందుకే పిల్లలు చిన్నప్పుడు కుక్కని పెంచుకుందామని ఎంతో సరదా పడితే కూడా ఒప్పుకోలేదు. ఇప్పుడు ఇదేమో చూడగానే భయం వేసేటంత పెద్ద లాబ్రడార్ కుక్క. రోజంతా ఆ కుక్కని తప్పించుకు తిరిగింది. కానీ మర్నాడు వందన వచ్చి "టామీ మంచివాడు. చాలా ఫ్రెండ్లీ గా ఉంటాడు. ఏమీ చెయ్యడు. భయపడకండి ఆంటీ" అని కుక్కని దగ్గరగా తీసుకు వచ్చింది. అది మీది, మీది కి రాగానే శాంత కి ప్రాణాలు పోయినంత పనైంది. గట్టిగా ఒక కేక పెట్టింది. కానీ ఆ కుక్క తోక ఆడించుకుంటూ దగ్గిరగా వచ్చింది కానీ ఏమీ కరవటానికి రాలేదు. దాంతో కాస్త స్థిమితపడింది శాంత. మెల్లి మెల్లిగా కొంచెం, కొంచెంగా బిస్కట్లు శాంత చేత టామీ కి ఇప్పించి, శాంత చెయ్యి దాని మీద వేయించి, శాంత కి కాస్త భయం తగ్గేటట్లు చేశారు.

భయం తగ్గింది కానీ పొద్దున్న లేస్తే భర్త, కొడుకు, కోడలు అందరూ ఆఫీస్ లకి వెడతారు. ప్రస్తుతం శాంత బ్రేక్ తీసుకుంటోంది కనుక ఇంట్లో ఉండేది తను, కుక్క మాత్రమే. ఎలాగ? వందన ఒక పూట, ఆనంద్ ఒక పూట సెలవు పెట్టి, ఇంట్లో ఉండి, టామీ ని ఎలా చూసుకోవాలో కాస్త నేర్పించారు. అప్పటినించి రోజూ ప్రొద్దున్నే ఆనంద్ కానీ వందన కానీ టామీ ని బైటకి తీసుకువెళ్లి తిప్పుకు వచ్చేవారు. మళ్లీ సాయంత్రం ఆఫీస్ నించి వచ్చి తీసుకు వెళ్లేవారు. దాని భోజనం సంగతి వాళ్ళే చూసేవారు. మధ్యలో ఒకసారి మాత్రం వెనక తలుపు తెరిస్తే, అదే వెనకాలకి వెళ్లి కాసేపు తిరిగి వచ్చేది. ఇంట్లో ఊరికే తిరుగుతూ, బైట ఎక్కడైనా చప్పుడు వినిపిస్తే అరుస్తూ తిరుగుతుండేది. శాంత కి అది అలా ఇంట్లో తిరుగుతుంటే ఏమి చేస్తుందోనని భయం, భయం గానే ఉండేది అందరూ ఇంటికి వచ్చేదాకా.

ఒకరోజు శాంత స్నేహితురాలు వచ్చింది ఏదో పనిమీద. తలుపు తెరవగానే టామీ తలుపు దగ్గరకు వచ్చేసింది. ఆ వచ్చిన ఆవిడకు కుక్కలంటే భయం. అందులోనూ ఇంత పెద్ద కుక్కని చూసి ఆవిడ హడిలి పోయింది. శాంతకు ఈ కుక్కని ఎలా లోపలికి తీసుకు వెళ్ళాలో తెలియలేదు, పైగా తలుపు పూర్తి గా తెరిస్తే కుక్క పారిపోతుందేమో నని భయం. ఇదంతా చూసి వచ్చిన ఆవిడ పారిపోయింది. శాంత ఆ తర్వాత ఆవిడకి ఫోన్ చేసి సారీ చెప్పుకోవలసి వచ్చింది.

ఇంకొక రోజు మధ్యాహ్నం భోజనానికి దోశలు చేయటం మొదలు పెట్టింది శాంత. టామీ వెంటనే వచ్చి పక్కన నుంచుని మొరగటం మొదలు పెట్టింది. అదే పనిగా శాంత వైపు చూడటం, మొరగటం చేసింది. ఇది చూసి హడిలిపోయి శాంత తన గదిలో కి పారిపోయి తలుపు వేసుకుంది. మళ్ళీ వాళ్ళాయన, పిల్లలు, వచ్చేదాకా బైటకు రాలేదు. వందన "అయ్యో, మీరు ఊరికే భయపడ్డారు, ఆంటీ. వాడికి దోశలంటే చాలా ఇష్టం. అవి పెట్టమని అడిగాడు. అంతే" అని కుక్క భాషకి అర్ధం చెప్పింది నవ్వుతూ. "ఓహో, ఇక నించి ఈ భాష కూడా నేర్చుకోవాలి కాబోలు" అనుకుంది శాంత.

ఒక నెల గడిచింది. ఏదో మెల్లి మెల్లి గా శాంత, కుక్క ఒకళ్ళకి ఇంకొకళ్ళు అలవాటు పడుతున్నారు. ఇంతలో ఒకరోజు ఆనంద్ వచ్చి, “అమ్మా, మేము ఇద్దరం పది రోజులు హవాయి వెడతాము, ఇన్నాళ్ళకి మాకు ఇద్దరికీ సెలవు దొరుకుతోంది. టామీ మీతోనే ఉంటాడు. మీరు చూసుకోవాలమ్మా” అని చెప్పాడు.

“మేము చూసుకోవటం కష్టం రా. పోనీ మీ అత్తవారింటికి పంపరాదూ“ అంది శాంత.

“మొదట్లో అలాగే అనుకున్నామమ్మా. కానీ వాళ్ళు కూడా సరిగ్గా అప్పుడే 5 రోజులు ఊరికి వెళ్ళాలిట. మీరు ఒక 5 రోజులు చూసుకుంటే తక్కిన 5 రోజులు వాళ్ళు తీసుకు వెడతారు. ప్లీజ్ అమ్మా. పెళ్లి అయిన తర్వాత మేము ఎక్కడి కి వెళ్ళలేదు సెలవలు లేక. ఇప్పటికి ఇద్దరికి కుదిరింది. నువ్వే టామీ ని చూసుకోవాలి అమ్మా“ అని బతిమాలాడు. వాడి మొహం చూసి “సరే” అనక తప్పలేదు.

సరే, 10 రోజుల తర్వాత ఆనంద్, వందన కుక్క కి కావాల్సిన సామాన్లు అన్నీ పెట్టి, చెప్పవలసిన జాగ్రత్తలు అన్నీ చెప్పి ఊరికి వెళ్లారు.

ఆ సాయంత్రం మొదలైంది అసలు కథ. టామీ ని బైటకు తీసుకు వెళ్లి తిప్పుకు రావాలి. శాంత ఒక్కత్తే ఆ కుక్కని పట్టుకుని వెడితే, కుక్క గట్టిగా లాగితే తట్టుకోలేదు. అందుకని రామం సహాయం అడిగింది. ఆయన ఇన్నాళ్లు కుక్క భారం అంతా శాంతకే వదిలి, శాంత మరీ గొడవ పడితే మాత్రం సముదాయిస్తున్నాడు. ఈ సారి ఆయన కూడా డ్యూటీ చేయక తప్పేటట్లు లేదు. సరే, కుక్కని తీసుకుని ఇద్దరూ బయల్దేరారు. “తక్కిన కుక్కలు ఏమైనా దీని దగ్గిరకు వస్తాయేమో. ఎందుకైనా మంచిది ఒక కర్ర తీసుకోండి“ అంది శాంత. కర్రతో బయల్దేరుతుంటే జ్ఞాపకం వచ్చింది అసలు విషయం. ఇది ఇండియా కాదు. అమెరికా. ఎవరి లాన్ అయినా కుక్కలు పాడు చేస్తే, వాళ్ళ యజమాను లే అన్నీ ఎత్తాలి.

“అయ్యో, పెంట ఎత్తటం ఎలాగండీ?“ అంది శాంత.

“ఒప్పుకున్న తర్వాత తప్పుతుందా మరి “ అన్నాడు రామం.

సరే, గ్లోవ్స్ వేసుకుని, ఒక బ్రష్, ప్లాస్టిక్ బాగ్ పుచ్చుకుని బయల్దేరారిద్దరూ!

రోజంతా వాన పడి, బైట అంతా తడిగా ఉంది. అందుకని ఇంటికి వచ్చేటప్పటికి టామీ కాళ్ళంతా ఒకటే మట్టి. రాగానే కాళ్ళకి పట్టిన ఆ మట్టి తో కార్పెట్స్ పాడు చెయ్యకుండా దాని కాళ్ళన్నీ ఒక టవల్ తో శుభ్రం గా తుడిచారు. ఆ పని చేస్తూ “ఈ పాకీ పని, కుక్క సేవ ఏమిటి మనకి?“ అంది శాంత.

“పిల్లలు చిన్నప్పుడు కుక్క ని పెంచుకుంటే ఇవన్నీ చేసేవాళ్ళం కదా. దానికి బదులు ఇప్పుడు చేస్తున్నామనుకో“ అన్నాడు రామం.

ఆ మర్నాడు టామీ సరిగ్గా భోజనం చేయలేదు. బిస్కట్లు కూడా తినలేదు. ఇష్టమైన దోశ కూడా తినలేదు. ఇది చూసి, తిండి తినటం మానేస్తే దీనికి ఏమవుతుందో నని భయపడి కోడలి కి మెసేజ్ పెట్టింది అత్తగారు. వెంటనే ఫోన్ చేసింది వందన. “మేము లేమని బెంగ పడ్డాడేమో, ఆంటీ. వాడికి మేము ముద్దు చేయటం, కబుర్లు చెప్పటం బాగా అలవాటు కదా. ఏమనుకోకుండా కొంచెం మీరు, అంకుల్ వాడికి భోజనం పెట్టినప్పుడు దగ్గిర కూచుని మాట్లాడండి వాడితో. అప్పుడు బెంగ తగ్గి బాగుంటాడు“ అని సలహా చెప్పింది.

“బాబోయ్ దీనికి చంటి పిల్లలకన్నా ఎక్కువ ముద్దు కావాలి కాబోలు, ఎలాగ చెయ్యటం భగవంతుడా” అని తల పట్టుకు కూచుంది శాంత.

మొత్తానికి ఎలాగో ఒకలాగ ఆ 5 రోజులూ గడిపేటప్పటికి తల ప్రాణం తోకకి వచ్చినంత పనైంది శాంతకి. 6 వ రోజు వందన తండ్రి వచ్చి టామీ ని తీసుకు వెళ్ళగానే “అమ్మయ్య” అనుకుంది.

ఇంతలో కూతురు సరిత ఫోన్. ”అమ్మా మేము ఒక నాలుగు రోజులు మా ఫ్రెండ్ పెళ్ళికి న్యూయార్క్ వెడుతున్నాము. మా పిల్లి పిల్ల లూసీ ని నువ్వు చూసుకోగలవా“ అంటూ!!

# ఆలస్యపు లేఖ

ఎం.పద్మావతి

**ఎక్కడ మొదలు పెట్టను?** ముప్పై ఏళ్ళ క్రితం కథా? మూడు నెల్ల క్రితం పరిచయమయిన "పాతకొత్త" కథా? ఎలా చెప్పను నీ ప్రశ్నకు సమాధానం? కానీ రాత్రి నిశ్చయించుకున్నా నీకు సమాధానము యివ్వాలని. రాత్రినుండి యిదే ఆలోచన – రాత్రే ఎందుకంటావా కథ చివరిలో చెపుతా.

పోట్లాటతో కదా మన పరిచయం మొదలయింది. అయితే అది పోట్లాట అని నాకు అప్పుడు అనిపించలేదు. అది ఒక బలీయమయిన స్నేహానికి "నాందిగా" అపుడు నేను భావించా. నీకు కూడా అలాంటి భావమే కలిగి వుంటుందని నేను నమ్మాను. ఆ రాత్రి అంతా మరుసటి రోజు ఉదయం కళాశాలకి సమయము ఎపుడు అవుతుందా అని యెంత ఎదురు చూసానో నీకు తెలియదు, కాదు కాదు ఎప్పటకీ తెలియలేదు. కానీ ఏమయింది? రాత్రంతా నేను ఎదురు చూసింది వేరు, జరిగింది పూర్తిగా వేరు.

"విహంగమై ఎగిరిన మనసు రెక్కలు విరిగిన క్షణాలవి" ఉదయం క్లాసులో అందరి ముందు యెంత దారుణంగా అవమానించావు!?

"ఇప్పటికీ ఆ సంఘటన నన్ను ముళ్ళై గుచ్చుతూనే వుంది." ఎందుకంటే అది నేను చదివిన ఒక ప్రముఖ కవి కవితలా "అర గుచ్చిన బాణం" కదా! అది మొదలు ఆ మూడు ఏళ్ళలో మన చదువు పూర్తయ్యేలోపు ఎన్ని సంఘటనలు మనిద్దరి మధ్యా, కానీ అవన్నీ మన తరగతి వాళ్ళందరి దృష్టిలో తగవులైతే, నా దృష్టిలో మాత్రము అదంతా నీకు నాపై ఉన్న ఒక ప్రత్యేకమయిన దానిని ఏమనాలో తెలియలేదు. ఆ వయసులో అది "ప్చ్" ఏమయినా కానీ అది నీకు నేనంటే "అందరికన్నా ప్రత్యేకం" అన్నది మాత్రం నిజం. కానీ దురదృష్టం ఏమిటంటే అది నాకు తెలుసు, కానీ నీకు మాత్రం తెలియదు. ఏమయినా కానీ అపుడు నేను అర్థము చేసుకున్నది నీకు తెలియ చెప్పాలని చాలా ప్రయత్నించా – ఎందుకంటే "కరిగిపోయే కాలంలో మనం గతంలా మిగిలి పోతామనే భయంతో" కానీ ఏం లాభం? నీ అర్థంకాని తనముతో దాన్ని తగవు కిందే ముగించేవాడివి.

"ఎవరి మనసును అర్థం చేసుకునే వివేకం వారి బుద్ధికి లేకపోయాక ఎవరెన్ని ప్రయత్నాలు చేసిన లాభమేమిటి?" దేని గురించైతే నేను భయపడ్డానో ఆ రోజు వచ్చేసింది. "ఆ అమృత క్షణాల" సమయం అయిపోయి కళాశాల నుండి బయటకి వచ్చే రోజు వచ్చేసింది. నీ స్నేహితుల మధ్య ఉన్న నిన్ను దగ్గరకి వచ్చి పిలిచా! విన్నావు, కానీ విననట్టు నటించావు. భారమయిన మనసుతో వెనుతిరిగా "నీ నుండి శాశ్వతంగా"

కానీ మళ్ళీ ఎవరి జీవితంలో వాళ్ళు ఒదిగిపోయాక నా కూతురు పెళ్ళిలో నా అల్లుడు 'మా మావయ్య' అంటూ నిన్నూ నీ కుటుంబాన్ని నాకు, నా భర్తకు పరిచయం చేసాడు. కానీ ఇన్ని ఏళ్ళ తరువాత నన్ను చూసినపుడు నీ కళ్ళలో "నేను అప్పుడు ఎదురు చూసిన భావం" ఇప్పుడు కనపడింది. నాకు సమాధానం చాలా ఆలస్యంగా అయినా తెలిసింది.

కాదు కాదు ఎన్నో ఒంటరి సమయాల్లో నీ విషయంలో నేను పొరపాటు అర్థం చేసుకున్నానేమో అన్న నా ప్రశ్నకి నేను "నిజమే" అన్నది నాకు తెలిసింది.

"గతం స్మృతులతోపాటు వాస్తవంలోని బాధ్యతలను పూర్తిచేసాను" పెళ్ళి తతంగం పూర్తయి, నా కూతురు అప్పగింతల కార్యక్రమంలో నా కూతురితోపాటు నేను దుఃఖించిన దుఃఖంలో నీ పాత్ర కూడా వుందని నీకు తెలియదుకదూ! అవును.. ఇప్పుడు కూడా నువ్వు వెళ్ళిపోతున్నావన్న దుఃఖం, నా బిడ్డ పరాయిదయి వెళ్ళిపోతుందన్న బాధ కలగలసిపోయి నన్ను కుదిపివేసింది.

మీరు వెళ్ళిపోయాక చూసా. నన్ను ఒంటరిగా చూసి నువ్వు యిచ్చిన చిన్న కాగితంలోని 'నీ జీవితకాలపు ఆలస్యపు లేఖని' దానిలో "నిన్ను దూరం చేసుకున్నాక తెలిసింది నాకు కావల్సిందేమిటో. కానీ అప్పటికే నీ జీవితం వేరే వ్యక్తితో ముడిపడిపోయిందని తెలిసింది, కానీ ఒకటి చెప్పు నీకు యిదంతా ముందే తెలుసు కదా" అని వుంది. కానీ దానికి సమాధానం నీకు ఏమి చెప్పగలను? నా "ఒంటరి క్షణాలలో నీ పాత్ర గురించి నీకెలా చెపితే అర్ధమవుతుంది?"

నీ ప్రశ్నకు జవాబు నా మనసుకి తెలిసినంతగా నీకు మాటలలో చెప్పడం నాకు రాదు. కానీ రాత్రి నేను చదివిన 'బుచ్చిబాబు'గారి కథ "నన్ను గురించి కథ వ్రాయవూ?" అదే నా సమాధానం. నీకు సమాధానం చెప్పటానికి ఆ మహానుభావుడి కథని వాడుకున్నందుకు ఆయనకు మనసులో క్షమాపణలు చెప్పుకుంటూ 'జీవితకాలం' ఆలస్యంగా చదివిన ఈ కథ నేను అప్పట్లో చదివి వుంటే "నా ఒంటరి క్షణాలలో నీ పాత్ర నాకు భౌతికంగా పక్కనే ఉండేది".

"యిదే నీకు నా సమాధానం"

# పాదరసం - పి.వి.శేషారత్నం

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**'భారతీ ఎక్కడున్నావ్?'** కృష్ణమూర్తి కళ్ళు విప్పేందుకు ప్రయత్నించాడు. మసకగా పెద్దకొడుకు శ్రీహర్ష ముఖం కనిపించింది.

'నాన్నగారూ' చిన్నకొడుకు రంగనాథ్ చేతులు పట్టుకున్నాడు.

'మన ఇల్లు కూలిపోయింది. అమ్మ, మీరు, బుజ్జి, నానిగాడు మీరంతా ఆ శిధిలాలలో ఇరుక్కుపోయారు.'

'ఆయన నడుం విరిగిపోయింది. ఎక్కువ అలసిపోనీయకండి' డాక్టర్ అంటున్నాడు.

ఈసారి పిల్లల ఏడుపు వినిపించింది. 'మాట్లాడు తాతయ్యా! మాకు భయం వేస్తోంది.'

'మీ బామ్మ ఏదీ?' కృష్ణమూర్తి అడిగాడు.

'జాగ్రత్తగా నెమ్మదిగా కళ్ళు విప్పండి. కృష్ణమూర్తిగారూ ఇపుడు మీరు బాగా చూడగలుగుతున్నారా?'

'లేదు కాస్త మసకగానే ఉంది. అయినా నా కళ్ళకేమయింది?'

భారతి తనకు కళ్ళు దానం చేసి శాశ్వతంగా కాశీవిశ్వనాధుని సన్నిధికి చేరుకుందని కొడుకులు చెబుతుంటే తట్టుకోలేకపోయాడు.

'మావయ్యా! ఎవరిని బరువుగా భావించి శాశ్వతంగా కాశీ పంపేయాలనుకున్నామో ఆ అత్తయ్యగారి గుండె లేకపోతే నాకు ప్రాణమే నిలచేది కాదు. ఆవిడ కళ్ళే మీ కళ్ళుగా నన్ను అభిమానంగా చూస్తున్నాయి. అసలు మీరు అంత ధైర్యం చెప్పకపోతే నా బుజ్జి నాకు దక్కేదే కాదు.' కోడలు కళ్ళు వత్తుకుంటోంది.

'ఏవండీ ఏమిటా మొద్దు నిద్ర? లేవండి. అపుడే ఎదురింటి సుభద్రమ్మ. సారంగపాణి కాఫీలు తాగేసి వాకింగ్‌కి కూడా వెళ్ళిపోయారు. మనం వాళ్ళకంటే ముందే వెళ్ళి మరో అరగంట వాకింగు ఎక్కువ చేద్దామన్నారుగా. అపుడే మర్చిపోయారా?' తన మొహాన ఇన్ని నీళ్ళు కొడుతూ లేపుతున్న భార్యను చూసి తెల్లబోయాడు కృష్ణమూర్తి.

'అదేమిటీ ఇవాళ మన కాశీ ప్రయాణం కదా!'

'చాలు చాల్లే.. ఊరుకోండి. ఏదో అత్తాకోడళ్ళం ఓ మాట అనుకున్నాం కదా అని ఏకంగా మనం కాశీకి వెళ్ళిపోవడమేనా? బుజ్జి నేను పక్కలో లేకపోతే నిద్రపోదు. చిట్టి, నానిగాడు మీరు కథలు చెప్పకపోతే ఊరుకోరు.'

'అవునూ నువ్వు పోయావుకదే! నీ కళ్ళు నాకు దానం చేసావు. గుండేనేమో కోడలికి?'

'అమ్మో అమ్మో ఏకంగా నన్నే చంపేసారు! చూడండి కుటుంబం కూడా వాహనం లాంటిదే పొరపచ్చాలు రిపేర్లులాంటివి. వాటిని సరిచేసుకుని ఆనందంగా అపురూపంగా నడుపుకుపోవడమే జీవితం. మీకు మెలుకువ వచ్చిందా లేక గట్టిగా గిల్లనా?'

'అయితే మన ఇల్లు కూలిపోలేదూ?'

'ఇది మరీ బావుంది. పైన ఓ వాటా వేస్తే బావుంటుంది అని పెద్దకోడలు ఓ మాట మనల్ని అడిగిందో లేదో 'పాత ఇంటిమీద మంచిదికాదమ్మా' అనేసారుగా. అపుడే మీ కలలో ఇల్లు కట్టేయడం అది కూలిపోవడం కూడా అయిపోయాయన్నమాట. ఇంకా నయం భూకంపం వచ్చి మనమంతా అందులో పోయాం అన్నారు కాదు.'

కృష్ణమూర్తి తనకి ఆ స్వప్నం ఎందుకొచ్చిందా అనే ఇందాకటినుంచి ఆలోచిస్తున్నాడు. ఈ మధ్యనే ఎక్కడో చదివాడు ఉదయం మనసుమీద ముద్రవేసిన మాటలుగాని సంఘటనలుగానీ పడుకోగానే కలలరూపంలో వస్తాయని. అదీ సంగతి. అయితే రాత్రి టీవీలో భూకంపాలు గురించి చూసాడు. లేచీ లేవడంతోటే తల కొట్టుకుంటున్న భర్తను వింతగా చూసింది భారతి.

'ఏమిటో ఈ జన్మకి మీరు నాకు అర్థంకారు కదా! త్వరగా తెమలండి' వాకింగ్ సూట్‌లో తయారయిపోయిన భారతిని చూసి ఫక్కున నవ్వాడు కృష్ణమూర్తి. తర్వాత గాఢంగా నిట్టూర్చాడు. 'నీకు నేను అర్థం కాకపోయినా పరవాలేదు. పిల్లల హృదయాలు అర్థం చేసుకో పిచ్చి మొహమా? నిన్న ఈ ఇంటికి పైన ఓ అంతస్థు వేస్తే బావుంటుంది కదా అని నీరజ మన మనసులో ఓ బీజం వేసిందీ అంటే రేపో ఎల్లుండో మన పిల్లలంతా ఈ ఇంటిస్థలాన్ని డెవలప్‌మెంటుకి ఇచ్చెయ్యాలని ఆలోచన చేస్తున్నారని అర్థం చేసుకో.'

వాకింగ్ చేస్తూ కృష్ణమూర్తి అన్నమాటలకు విచారంగా ఆలోచనలో పడింది భారతి.

అదిగో అలాంటి సమయంలో కృష్ణమూర్తి కాలేజీ నేస్తం శంకరం మిత్రుని ఢిల్లీకి ఆహ్వానిస్తూ రైలు టికెట్లు కూడా జతచేసి పంపించిన ఉత్తరం కృష్ణమూర్తి దంపతులతోబాటు వాళ్ళ సంతానాన్ని కూడా ఆనందాబుధిలో ముంచెత్తింది.

సరిగ్గా నాలుగేళ్ళ క్రితం ఇలాగే గౌరీశంకరంగారు తమను టిక్కెట్లు పంపి మరీ తన ఇంటికి ఆహ్వానించడం రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో తమ తొలిసారి ప్రయాణం, ఆనాడు తామిద్దరూ రైలు దిగిన వెంటనే మిత్రులిద్దరూ దాదాపు పాతికేళ్ళ తర్వాత కలుసుకున్నప్పటి వాళ్ళ కళ్ళలోని ఆనందం భారతి కళ్ళముందు కదలాడింది.

***

'ఒరేయ్ కిష్టుడూ' రాజధాని ఎక్స్‌ప్రెస్ దిగి భార్యామణితో సహా భారత రాజధాని కొత్తఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొలిసారిగా అడుగుపెట్టి అటూ ఇటూ పరకాయించి చూస్తున్న బాల్యమిత్రుడు కృష్ణమూర్తిని బలంగా వాటేసుకున్నాడు అరవయ్యేళ్ళ గౌరీశంకరం.

'ఎంతకాలమయిపోయిందిరా నిన్ను చూసి?' అంటున్న కృష్ణమూర్తి మొహం వెయ్యివోల్టుల బల్బులా వెలిగిపోయింది.

'కిష్టుడూ నువ్వేం మారలేదురా! అదే ధోవతి లాల్చీ. అసలు సిసలైన తెలుగు మేష్టారి వంటే నువ్వే' భుజం మీద గట్టిగా చరిచాడు గౌరీశంకరం. పట్టరాని ఆనందం వస్తే అతని ధోరణే అంత.

'నువ్వు మాత్రం? నీ సూటూ బూటూ దర్జా వదిలావా ఏంటి? ఓహ్. కాలేజీ రోజుల్లో మండు వేసంకాలంలోనూ సూటు వదలని నిన్ను మన మిత్రబృందం ఏడిపించడం మర్చిపోయావు కాబోలు.'

'ఇదిగో అన్నయ్యగారూ! ఇక్కడ భారతి అనే ప్రాణి ఉందని మరిచిపోయి మీ బాల్య స్నేహితులిద్దరూ ఫ్లాట్‌ఫారం మీద ఎంతసేపని అలాగే వాటేసుకుని కలల్లో విహరిస్తారు?'

భారతి మాటలతో ఈ లోకంలోకి అప్పుడే వచ్చినట్లుగా 'నువ్వున్నావుగదే అర్ధాంగినివి నన్ను కలల్లో కూడా కాసేపు సుఖంగా విహరించనీకుండా ఈ లోకం లోకి లాక్కు రావడానికి' విసుగు నటించాడు కృష్ణమూర్తి.

'విన్నారా అన్నయ్యగారూ! ఇదీ వరస. మీరు కనిపించగానే నేను పానకంలో పుడకనయిపోయాను ఈయనగారికి. రైల్లో ప్రయాణం చేసినంతసేపూ మీ నామ స్మరణ వదిలితే ఒట్టు.'

'వాడంతేనమ్మా. ఏమా ప్రయాణం బాగా అయిందా?' కృష్ణమూర్తి చెయ్యి వదలకుండానే గౌరీ శంకరం భారతిని పలకరించాడు. తర్వాత దర్జాగా రాజహంసలాంటి తన కారులో ఎక్కించి తనే డ్రైవ్ చేస్తుంటే 'మా శంకరంగాడు ఎంత స్థితిమంతుడయ్యాడోనని' కృష్ణమూర్తి కళ్ళు చెమర్చాయి.

'ఏదో నువ్వు నీమీద ఒట్టు పెట్టుకుని మా యిద్దరికీ టిక్కెట్లు కొని పంపించకపోతే రాజమండ్రి దాటి ఎరగనివాళ్ళం మేం ఇలా రాజధానికి రావడమనేది ఈ జన్మలో జరిగే పనేనంటావా గౌరీశంకరం?'

'అబ్బే.... నీ యీ మాటలతీరు అదీ నువ్వేం మారలేదురా?' అంటూ మళ్ళీ జబ్బమీద బలంగా చరిచాడు గౌరీశంకరం.

ఇంద్రభవనంలా ఉంది యిల్లు. ఇంటిముందు అధునాతనంగా పెద్ద గార్డెన్.

'లోపలికి రండన్నయ్యగారూ. వదినగారూ ప్రయాణం బాగా జరిగిందా?' ఢిల్లీలో ఉంటున్నారు కదా గౌరీశంకర్ భార్య అనసూయ ఏ పంజాబీ డ్రెస్సో వేసుకుని జుట్టు విరబోసుకుని దర్శనం ఇస్తుందనుకున్న దంపతులకు చక్కని హుందా అయిన వెంకటగిరి చీరతో కళ్ళనిండా కాటుకతో నిండుగా ఎర్రని కుంకుమబొట్టుతో, అచ్చ తెలుగు ఆడపడుచులాగా సంప్రదాయంగా స్వాగతం చెప్పేసరికి కాస్తంత ఆశ్చర్యపోయినా వెంటనే సర్దుకున్నారు.

ఏసీ ప్రయాణమే అయినా అన్ని గంటలు రైల్లోనే కూర్చోవడం వయసురీత్యా బడలికగానే అనిపించి కృష్ణమూర్తి భారతి భోజనాలయ్యాక కాస్త కునుకుతీసి లేచేసరికి టిఫిన్లు రడీ.

అనసూయ సాయంత్రం కొడుకులు కోడళ్ళు ఉద్యోగాలనుంచి వచ్చేసరికి చపాతీ పిండి కలిపేసి అన్నం, కూర వండేసింది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కోడళ్ళు చక్కగా స్నానాలు చేసి ఫ్రెష్ అయిపోయి వంటింట్లోకి ప్రవేశించి తక్కిన పనంతా నవ్వుతూ పూర్తిచేసేసారు.

భోజనాల దగ్గర వీళ్ళని తండ్రి పరిచయం చెయ్యగానే 'అంకుల్ మా అమ్మానాన్నగార్లకు మంచి కాలక్షేపం దొరికినందుకు మాకెంతో సంతోషంగా ఉంది.' అంటూ ఇద్దరినీ కుటుంబ సభ్యుల్లా కలిపేసుకుంటున్న వాళ్ళందరినీ చూస్తుంటే దంపతులకు తెగ ముచ్చటేసింది.

భోజనాలు చేస్తున్నప్పుడు కృష్ణమూర్తి కూడా వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోతూ 'మీ నాన్నకి గౌరీశంకర్ అనే ఆ పేరెలా వచ్చిందో చెప్పనా' అంటూంటే హాలంతా నవ్వుల పువ్వులు విరిసాయి.

'ఇదిగో చెల్లెమ్మా! కాలేజీలో చదివేటప్పుడు ఇప్పుడంత స్టయిలిష్‌గానూ ఉండేవాడేమో వీడికి గౌరీదేవి నుంచి తెగ ప్రేమలేఖలు వచ్చేవని నీకెప్పుడయినా చెప్పాడామ్మా' ఆ మాటలకి అనసూయ లేదని తలతిప్పుతూ నవ్వింది.

'ఆ తర్వాతేమయింది అంకుల్ చెప్పండి నాన్నగారు కూడా తిరిగి లవ్ లెటర్లు రాసారా? నాన్నగారికి గౌరి కనిపించిందా లేదా? ' గౌరీశంకర్ కొడుకులు, కూతురు, అల్లుడు సరదాపడుతూ కుతూహలంగా అడిగారు.

'ఆ..ఆ మీ నాన్న కూడా తెగ కవితావేశంతో వీరలెవెల్లో రాసేవాడు లవ్‌లెటర్లు. ఒకానొక శుభముహూర్తాన గౌరీదేవి, శంకరం, కాలేజి గ్రౌండ్‌లో రహస్యంగా కలుసుకోగానే వెనకనుంచి మా స్నేహ బృందమంతా ఒకటే నవ్వులు.. చప్పట్లు.'

'ఇదంతా నాకెప్పుడూ చెప్పలేదేమండీ?' కోపం నటించింది అనసూయ.

'పాపం! మరి వాళ్ళెందుకు పెళ్ళి చేసుకోలేదు. పెద్దవాళ్ళు ఒప్పుకోలేదా అంకుల్?' కొంటెగా అడిగాడు శంకరం అల్లుడు మనోహర్.

'వీళ్ళే ఒప్పుకోలేదయ్యా' గౌరీశ్వర్ అనబడే గౌరిని ఈ శంకరం ఎలా పెళ్ళి చేసుకుంటాడు? మిత్రులతో మాట్లాడే ప్రతిపదానికీ ఓ చక్కని ప్రాస కలిపి ఎప్పుడు కవిత్వం అల్లే వీడిని ఆట పట్టించడానికి మా స్నేహబృందం ఆడిన నాటకమది.'

'ఒరేయ్ కిష్టుడూ మా వాళ్ళముందు నన్నాట పట్టిస్తావా ఉండు నీ పని చెప్తాను' అంటూ శంకరం చిన్నపిల్లాడిలా కృష్ణమూర్తి జబ్బ చరిచేందుకు ఆయనని పట్టుకోవడానికి డైనింగ్ టేబుల్ చుట్టూ తిరుగుతూంటే అంతా ఘొల్లుమంటూ ఒకటే నవ్వులు.

'అన్నయ్యగారు మా ఆయనకి కాలేజీలో నిజంగా ఓ రాధ ఉన్నా దయచేసి నాతో చెప్పకండి. నా గుండె ఇక్కడే ఆగిపోతుంది' అన్న భారతి మాటలకి అంతా కడుపులు పట్టుకున్నారు. ఆ రాత్రంతా ఇద్దరు మిత్రులూ ఒకటే కబుర్లు. కాలేజీ అవగానే గోదావరి ఒడ్డుకి పారిపోవడం పడవల్లోనూ, నావల్లోనూ తిరగడం, సెలవుల్లో అవతలి ఒడ్డుకి పోటీలు పడుతూ ఈదులాడడం, ఇదంతా ఒకరోజు గౌరీశంకర్ తల్లికి తెలిసిపోయి ఆవిడతో ముక్కు చివాట్లు తినడం, ఆవిడ ఇంకమీదట ఈతకు వెళ్ళనని ఏడుస్తూ ఒట్లు వేయించుకోవడం సెలవు రాగానే అవన్నీ గట్టున పెట్టేసి మళ్ళీ గోదావరి దగ్గరకు పరిగెత్తడం అన్నీ గుర్తుకొచ్చాయి.

ఆ మర్నాడు రెండో శనివారం. అందరికీ సెలవే. అనసూయ దర్జాగా ముగ్గురు కోడళ్ళకు పనులు పురమాయిస్తూ వాళ్ళతో కలిసి కబుర్లు చెబుతూ వారానికి సరిపడా జంతికలు, బెల్లం బూంది, తొక్కుడు లడ్డూలు, కారప్పుస వగైరా వగైరాలు చేయిస్తూంటే భారతి కళ్ళు తుడుచుకోవడం కృష్ణమూర్తి కంట బడింది.

ఏమిటో ఈ ఆడాళ్ళకి ఆనందమొచ్చినా విషాదం కలిగినా చప్పున కన్నీళ్ళొచ్చేస్తాయి. ఎంతైనా ఎప్పటికప్పుడు భావోద్వేగాలు వదిలించుకునే ఆడవాళ్ళే అసలైన అదృష్టవంతులనే చెప్పాలి. నేనలా చెయ్యలేకపోవడంతో ఒత్తిడి ఎక్కువైపోయి మాయదారి షుగర్ దాపరించింది అనుకున్నాడు కృష్ణమూర్తి.

భోజనాల దగ్గర అంతా పోటీలు పడుతూ ఒకటే సరదా కబుర్లు చెబుతుంటే ఆయనకయితే అన్నం తినకుండానే కడుపు నిండిపోయింది. గౌరీశంకర్ కోడళ్ళు కూడా ఎంతో చురుకైన వాళ్ళు కావడంతో చకచకా అత్తగారిని మన్నిస్తూనే వడ్డనలు, తక్కిన పనులు

చక్కబెట్టేసి ఆ తర్వాత అత్తాకోడళ్ళు అంతా ఒకే దగ్గర సరదాగా కబుర్లు చెప్పుకుంటూ అన్నాలు తింటూంటే భారతి ఉత్సాహంతో వాళ్ళలో కలిసిపోవడం చూసి కృష్ణమూర్తి మనసు ఆనందతరంగితమయింది.

ఆడవాళ్ళకీ అప్పుడప్పుడూ ఇలాంటి ఆటవిడుపు అవసరమని తొలిసారిగా అర్థమయింది ఆయనకి. ఇదంతా తప్పకుండా ఈ ఇంటి యజమాని చాకచక్యమే. లేకపోతే ఈ లోకంలో అత్తాకోడళ్ళను ఇలా నవ్వుకుంటూ చూడడం అంత తేలిక కాదనే చెప్పాలి. ఆ రోజు సాయంత్రం ఆడవాళ్ళంతా గుడికి వెళ్ళిపోతే, కృష్ణమూర్తి, గౌరీశంకర్, కొడుకులు మనవలతో కలిసి పార్కుకి వెళ్ళి అలిసిపోయేదాకా టెన్నిస్‌లాంటి ఆటలు ఆడాడు.

'నా మనవలతో ఒక్కనాడూ నాకిలాంటి అనుభవం కలగనే లేదు' మనస్ఫూర్తిగా అనుకున్నాడు కృష్ణమూర్తి. ఎప్పుడెప్పుడు ఇల్లు వాటాలు వేసేసి కృష్ణారామా అనుకోవడానికి అత్తమావలు కాశీకి పోతారా అని చూసే కోడళ్ళు గుర్తుకొచ్చారాయనకు.

వచ్చి అప్పుడే మూడు రోజులయిందంటే నమ్మబుద్ధి కావడంలేదు కృష్ణమూర్తి దంపతులకు. ఎందుకంటే ఇంటిదగ్గర కాలం ఎంత భారంగా కదిలేది? ఇక్కడనుంచి కదిలి వెళ్ళేలోగా ఆ చిదంబర రహస్యాన్ని శంకరం నుంచి తెలుసుకునే తీరాలని నిశ్చయించుకున్నాడు కృష్ణమూర్తి. అయితే ఆ అవకాశం లేకుండా బుజ్జి బెంగపెట్టుకుందని వెంటనే బయలుదేరి రమ్మని కొడుకునుంచి ఫోన్ రావడంతో మర్నాడు ఉదయమే గౌరీశంకర్ తన పరపతినుపయోగించి ఎమర్జెన్సీ కోటాలో రాజధాని ఎక్స్‌ప్రెస్‌కే రెండు టిక్కెట్లు సంపాదించాడు.

'మీరొచ్చాక ఈ మూడురోజులూ ఇల్లంతా ఎంతో నిండుగా ఉంది. పిల్లలూ ఎంతో సంబరపడ్డారు. ఏమిటో ఓ పదిరోజులయినా ఉండివుంటే మాకు తృప్తిగా ఉండేది అన్నయ్యగారూ! ఈసారి మీకోసం పలవరించిపోయే మనవరాలిని కూడా వెంటబెట్టుకుని మరీ రండి. ఓ నెల్లాళ్ళు ఉండి వెళ్దురుగాని' అంటూ అనసూయ కృష్ణమూర్తి దంపతులకు బట్టలు పెట్టి కొడుకు కోడళ్ళ చేత దణ్ణాలు పెట్టించింది.

'నేను మీ ఇంటికి రాలేదులాంటి శంకలేమీ పెట్టుకోకు చెల్లెమ్మా! నేను మన ఆంధ్రదేశం వచ్చినప్పుడు మీ యింట్లోనే దిగుతానని మాట ఇస్తున్నాను. సరేనా? ఇది మీ యిల్లే అనుకుని ఎపుడు రావాలనిపించినా ఒక్క ఫోన్ కొట్టండి నాకు.' అంటూ రైలు కదిలిపోయినా దానితోబాటే అలా చెయ్యి ఊపుతూనే శంకరం వాళ్ళు క్రమంగా కనుమరుగయ్యారు.

రాజమండ్రిలో రైలు దిగుతుంటే వాళ్ళ కుటుంబం మొత్తం స్వాగతం పలుకుతూంటే బిత్తరపోయారు ఇద్దరూ.

'అత్తయ్యగారూ మీరు లేని ఈ మూడురోజులూ ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం అనుకోండి' పెద్దకోడలు గొంతులోని ఆరాటంలో నిజాయితీ తళుక్కుమంటోంది.

'అవును నాన్నా! రాత్రిళ్ళు మీరిద్దరూ లేని ఇంటికి రావాలనే అనిపించలేదు.' శ్రీహర్ష, రంగనాథ్ తండ్రిని చుట్టేశారు. వాళ్ళ స్పర్శలో ఎప్పటిలాగా ఆర్థిక సంకేతం కాకుండా ఏదో ప్రేమ సంకేతం.

ఉద్యోగం చేసే చిన్నకోడలు పండరి నిష్ఠూరాలాడింది. 'మీకు ఎంతసేపూ కొడుకులమీదే ప్రేమ. మీరు ఊరెడుతున్నట్టు ఒక్క మాటైనా చెప్పారా? నేను క్యాంప్ నుంచి వచ్చేసరికి మీరింట్లో లేక ఎంత గాభరా పడ్డానో? అత్తయ్యా మీ మనవరాలు బామ్మకోసం ఎలా బెంగపెట్టుకుని చిక్కి శల్యమయిందో చూడండి.' ఫిర్యాదు చేసింది.

'అవును బామ్మా! ఇన్నాళ్ళు ఎందుకుండిపోయావు? నా కాలికి దెబ్బ తగిల్తే నువ్వు మంత్రం వేస్తే ఇట్టే తగ్గిపోయేది. చూడు ఎన్ని దెబ్బలు తగిలి అలాగే పెచ్చులు కట్టిపోయాయో' అంటూ మనవరాలు బామ్మని వాటేసుకుంటూంటే భారతికి కన్నీళ్ళు వద్దన్నా ఆగడంలేదు.

'తాతయ్యా నువ్వు లెక్కలు చెప్పలేదుగా అందుకే నాకు మార్కులు తగ్గిపోయాయి. ఇంకెప్పుడు నువ్వెక్కడికీ వెళ్ళొద్దు తాతయ్యా!' నాని చిట్టి మాటలకు ఏదో తెలియని ఉద్వేగంతో భారతి, కృష్ణమూర్తి ముఖముఖాలు చూసుకున్నారు.

అప్పుడప్పుడూ గౌరీశంకర్ గుర్తుకొస్తూంటాడు. ఇదిగో ఎందుకో మళ్ళీ ఈ మధ్య అందరికీ ఇల్లు చాలడం లేదని పైన అంతస్థు వేసుకుంటే బావుంటుందని పెద్దకోడలు మావగారి ముందు తీర్మానం పెట్టినందుకే ఈయనగారికి దుస్వప్నాలు, పలవరింతలు.

***

అదంతా గుర్తుకొచ్చి భారతి అడిగింది కృష్ణమూర్తిని.

'శంకరం అన్నయ్యగారు ఇలా సడన్‌గా మళ్ళీ టిక్కెట్లు పంపించి మరీ రమ్మన్నారంటే అక్కడ అంతా సవ్యంగానే ఉందంటారా?'

'భారతీ అనుమానం ముందుపుట్టి నువ్వు తర్వాత పుట్టావు. అలాంటిదేమీ లేదు. వాడంతే తలుచుకున్నప్పుడే తాత పెళ్ళి అనేరకం. రాత్రి ఏ కల్లోకో వచ్చి వుంటాను. వెంటనే చూడాలనుకుని అమలు చేసేస్తున్నాడు. అందుకే ఉద్యోగంలో కూడా అంత చక్కగా రాణించి మంచి ఇల్లు కట్టుకోగలిగాడు. చూసావుగా' ఎందుకో ఈసారి రాజధాని ప్రయాణం అంత థ్రిల్లింగ్‌గా అనిపించలేదు. అదంతా అలవాటయిన వాళ్ళలాగా ప్రయాణం చేసారు.

అందుకే అంటారు జీవితంలో ఒక్క స్నేహం తప్ప ఏదయినా అంతే. మొదటిసారే మురిపిస్తుంది. స్నేహం అయితే జీవిత పర్యంతం మనసును సేదదీరుస్తుంది.

స్టేషన్‌కు వచ్చిన శంకరం మిత్రుడిని ఆలింగనం చేసుకున్నాడు. ఇంటికెళ్ళేసరికి సందడి లేదు. పొద్దుటే పిల్లలంతా స్కూళ్ళకు, శంకరం కొడుకులు కోడళ్ళూ ఉద్యోగాలకు వెళ్ళిపోవడంతో ఇల్లు చిన్నబోయింది.

అనసూయ ఎక్కడా కనిపించకపోయేసరికి భారతి అటూ యిటూ వెతుకుతుంటే చెప్పాడు శంకరం.

'ఇవాళ రాత్రికే ఈ ఊళ్ళోనే మా పెద్దబావ మరిది ఇంటి గృహప్రవేశముందమ్మా! బాగా అలసిపోయి పడుకుని వుంటారు. ఫోన్ చేసి రైలులో మిమ్మల్ని లేపడమెందుకని మా బావమరిదితో ఉదయమే వెళ్ళిపోయింది. ఏమీ అనుకోకమ్మా! పోన్లే. ఇన్నాళ్ళకి నీ చేతివంట తినే అదృష్టం దొరికింది మీ అన్నగారికి.'

'దానికేం భాగ్యం' అంటూ భారతి చిరునవ్వుతో వంటమనిషి సాయంతో ప్రత్యేకంగా వంట చేసాక మళ్ళీ కబుర్లతో కాలక్షేపం చేస్తూ భోజనాలు చేసేసి కునుకులు తీయడం అయ్యాక శంకరం అడిగాడు.

'ఈ పూటేం చేద్దాంరా కిష్టుడూ. మన కాలనీ చివర థియేటర్‌లో పాత తెలుగు సినిమా 'కలసివుంటే కలదు సుఖం' వేస్తున్నారుట వెళ్దామా! ఏవమ్మా ఏమంటావు?'

'ఇంత చల్లనివేళ మన నందనవనంలో పూలపరిమళాలు ఆస్వాదిస్తూ కూర్చోకుండా సినిమా ఏమిటి అన్నయ్యగారూ. క్రితం సారి వచ్చినపుడు వదినగారూ నేనూ పోటీ పడుతూ సన్నజాజి మాలలు కట్టాం' గార్డెన్‌ను ఇంతింత కళ్ళు చేసుకుని చూస్తు పువ్వులను సున్నితంగా స్పృశిస్తున్న భతికి అక్కడ జీవకళ కనిపించలేదు.

'ఇంత వయసొచ్చినా నీ సినిమా పిచ్చి తగ్గలేదేవిటిరా శంకరం? నిన్నా మొన్నా సెలవుకదా మీ పిల్లలందరితో కలసి వెళ్ళకుండా ఇపుడు సినిమా ఏమిటిరా? అదీకాక ఇంకాసేపట్లో కొడుకులు కోడళ్ళు మనవలు వచ్చే వేళవుతోందాయె. అయినా ఉద్యోగాలతోనూ, చదువులతోను అలసిపోయి వస్తారు. ఇవాళ మనం సినిమాకి రమ్మన్నా వాళ్ళు వస్తారో రారో.'

గౌరీశంకర్ కొత్త సినిమా తొలి ఆటకే క్లాసులు ఎగ్గొట్టి వెళ్ళడం కృష్ణమూర్తికింకా గుర్తుంది. 'ఎవరి సంగతి నువ్వనేది. కొడుకులు, కోడళ్ళు మనవలు వాళ్ళిళ్ళకి వెళ్తారుగానీ మనింటికెందుకు వస్తారురా. నువ్వొట్టి అమాయకుడివి' అన్నాడు శంకరం ఎటో చూస్తూ.

'వాళ్ళిళ్ళకి వెళ్ళడమేమిటి? అంటే?' ఇంకా ఏదో అనబోయి ఆగిపోయాడు కృష్ణమూర్తి. అతనికేదో అర్థమయీ అవనట్టుంది.

'అంటే ఏం లేదులే మీరొచ్చినప్పుడు కూడా వారాంతం గనుక వాళ్ళంతా పిల్లలతో సహా ఎప్పటిలాగే ఇక్కడకు వచ్చి గడిపారు. మీ చెల్లాయి, నేనూ వాళ్ళు రాకముందు మూడురోజులూ వాళ్ళువస్తారనే ఎదురుచూపుతోను, వచ్చి వెళ్ళిన తర్వాతి మూడురోజులూ వాళ్ళతో గడిపిన రోజుల్ని నెమరువేసుకుంటూ గడిపేస్తుండేవాళ్ళంరా రాధా!'

ఆ తర్వాత కృష్ణమూర్తిని మాట్లాడనివ్వకుండా శంకరం కళ్ళు మూసుకుని చెప్పుకుపోయాడు. 'ఒరేయ్ కిష్టుడూ! నీకో సంగతి తెలుసా? చిన్నప్పుడు మీ ఉమ్మడి కుటుంబాన్ని చూసినప్పుడల్లా అమ్మ తప్ప ఎవరూ లేని నేను ఎంతో ముడుచుకుపోయేవాడిని. ఒకరోజు నువ్వన్నం తినకుండా స్కూల్‌కి వచ్చేసావని మీ బాబాయి క్యారేజీ మోసుకు వచ్చి నీకు ప్రేమగా తినిపించడం చూసి ఇంటికెళ్ళి నాకలాంటి బాబాయి ఎందుకులేడని మా అమ్మ దగ్గర ఎంత ఏడ్చానో. అమ్మ ఇచ్చిన తాయిలాలు నేను నీతో పంచుకుంటే 'ఇది మా చెల్లికి ఎంతో ఇష్టం' అంటూ అందులో కొంత దాచి నువ్వు మీ బాబాయి కూతురికి పెడుతుంటే ఆశ్చర్యంతో కళ్ళు ఇంత చేసుకుని చూడడం నువ్వు గమనించి ఉండవు. నాకూ ఎప్పటికయినా అలాంటి కుటుంబం ఏర్పడాలని ఓ కోరికగా దాచుకున్నానురా. కానీ నా దురదృష్టమదేమోగానీ మాకు పిల్లలనివ్వలేదు ఆ దేవుడు. అయినా నేను నిరాశపడలేదు' ఊపిరి తీసుకునేందుకు ఆగాడు శంకరం.

ఉలిక్కిపడ్డారు కృష్ణమూర్తి భారతి.

'నీలాగే ఎవరికీ వీళ్ళు ముగ్గురూ మా కడుపున పుట్టిన పిల్లలు కాదని తెలియదు.'

'మీ కొడుకులు కాదా! మరి?' భారతి ముఖంలో ఆశ్చర్యం అలాగే ఉంది.

'అప్పట్లో నేను జయపూర్‌లో పనిచేసేవాడిని. ఒకరోజు మా పక్క ఇంట్లో దంపతులు కలహించుకుని క్షణికావేశంలో ఉరిపోసుకుంటే ముక్కుపచ్చలారని వాళ్ళ ముగ్గురు పసిపిల్లల్ని చేరదియ్యడానికి బంధువులూ మిత్రులు ఎవరూ ముందుకు రాకపోతే మా పిల్లలుగా తెచ్చి అనాధలని వాళ్ళకు తెలియనీయకుండా పెంచాము మా అనసూయా నేనూను. అందుకే నా సంపాదనతో నా కొడుకులూ, కోడళ్ళూ, మనవలతో ఉమ్మడి కుటుంబంగా గడుపుదామనే.... చూసావుగా ఇంత పెద్ద ఇల్లు డిజైన్ చేసి కట్టించాను.'

'మొగాడ్! నీదెంత విశాల హృదయంరా. నువ్వు స్నేహితుడవని చెప్పుకోవడానికి ఇప్పుడు ఇంకా ఎక్కువ గర్వపడతాను. మూడు పసిప్రాణాలకు ఈలోకంలో ఆధారం కల్పించావు' కృష్ణమూర్తి శంకరం చెయ్యి నొక్కాడు.

శంకరం నవ్వాడు. 'కానీ మా పిల్లల దృష్టిలో నేనొక స్వార్ధపరుదైన తండ్రిని. ఉమ్మడి కుటుంబం అంటూ వాళ్ళ ఆశలమీద నీళ్ళు జల్లుతున్న రాక్షసుడిని.'

'ఛ అలా ఎందుకనుకుంటారురా గౌరీ' ఓదార్పుకోసం అన్నాడేగాని కృష్ణమూర్తికి ఈ కాలం యువకుల మనస్తత్వ కొట్టిన పిండే తన బిడ్డలు లేరూ!

'పూర్వపు రోజులు వేరురా. వ్యక్తిత్వాలు ఏర్పడ్డాకనే పెళ్ళిళ్ళు చేసుకుంటున్న ఈరోజుల్లో అందరికీ స్వతంత్ర భావనలే. ఆదాయాలలో తేడాలవల్ల తోడికోడళ్ళ మధ్య పోటీ. అటు భార్యలను సమర్ధించలేక, సమర్ధించకుండానూ ఉండలేక ఇంట్లో తండ్రీ కొడుకులకు హైరానా. మా యింట్లోనే కాదు ఏ ఇంట్లోనయినా కాస్తో కూస్తో తేడాతో ఇదే పరిస్థితి అనే నిజం చాలాకాలానికి గానీ నాకర్ధం కాలేదురా. పైగా మా చేతుల్లో పెరిగిన పిల్లలే పెళ్ళిళ్ళయ్యాక మాకు నీడలేకుండా చెయ్యాలని ప్రణాళికలు రచిస్తుంటే కృంగిపోయానురా కిష్టుడూ. ఇంట్లోని తలనొప్పులతో ఏడాది తిరక్కుండానే నాకు హార్ట్ ఎటాక్ వచ్చింది. ఆరోగ్యం పోయాకనే దాని విలువ తెలిసి ఇంట్లో శాంతం కావాలంటే ఏం చెయ్యాలో అదే చేసాను. నేను బ్రతికుండగానే నాకున్నదానిని నాతో సహా వాటాలు వేసి పంచేసి ఎవరి ఇల్లు వారికి ఏర్పాటు చేసాను. బ్రతికున్నన్నాళ్ళూ బద్ధశత్రువుల్లా ప్రతిరోజూ కత్తులు దూసుకోకుండా అప్పుడప్పుడూ వచ్చి

పలకరించే పిల్లల ప్రేమాభిమానాలతో ఈ జీవితం ఇలా ఆనందంగా వెళ్ళిపోతే చాలనుకున్నాను. నేను పోయేలోగా ఒక్కసారి మళ్ళీ నీతో గడపాలనే ఇలా...'

కృష్ణమూర్తి కళ్ళు సజలాలయ్యాయి. 'పిచ్చి శంకరం'

'మరి వదినగారు?' భారతి మాటలు పూర్తికాకుండానే చెప్పాడు శంకరం.

'అదిగో వస్తోంది చూడండి.'

కారులోంచి దింపి చక్రాల కుర్చీలో కూర్చోపెట్టి ఒకావిడను తీసుకువచ్చాడు బక్కపలచటి ఓ వ్యక్తి. 'బావగారూ! చాలా పనులున్నాయి. నేను రేపు వస్తాను మళ్ళీ. అక్కను లోపలికి తీసుకెళ్ళండి' అంటూ వెళ్ళిపోయాడు.

ఆమె అనసూయా? నివ్వెరపోయారు కృష్ణమూర్తి, భారతి. బాగా ముసలిరూపు వచ్చేసింది. తలమీద జుట్టు పలచబడిపోయింది, కళ్ళు ఎక్కడో చూస్తున్నాయి.

'అయ్యో మనం పలకరించలేదని కోపం వచ్చిందేమోనండీ వదినగారికి?' భారతి నొచ్చుకుంది గానీ అనసూయ వీళ్ళెవరి వైపు చూడనేలేదు.

'అనసూయకు సడెన్‌గా ఏమయింది అంత అలిసిపోయిందెందుకని?' ఇద్దరి మనసుల్లోను అదే ప్రశ్న. జవాబు చెప్పేందుకు శంకరం అక్కడ లేడు.

శంకరం ఆమె దగ్గరకి వెళ్ళి బ్రతిమాలి తోటమాలి నీళ్ళు అందిస్తూంటే ఆమె కాళ్ళమీద పోసి కడిగాడు. తనే శ్రద్ధగా తుడిచాడు. తర్వాత తమకేసి కూడా చూసే తీరిక దొరకలేదు ఆయనకి.

అలసిపోయినట్టున్న ఆమెకి పసిపిల్లలా మొహం కడిగి, తల దువ్వి భోజనం తినిపించి మంచం మీద పడుకోబెట్టి దుప్పటికప్పాడు. అతని చర్యలని అన్నీ విభ్రమంగా చూస్తూండిపోయారు కృష్ణమూర్తి భారతి.

'ఓసారి ఇలా వస్తారా?' భారతి వెనుదిరుగుతుంటే వినిపించింది అనసూయ కంఠం.

బహుశా తమకు చెప్పకుండా అన్నగారి ఇంటికి వెళ్ళినందుకు క్షమాపణ చెబుతుందేమో అనుకుంది.

'పరవాలేదు వదినగారూ! మీకు ఆరోగ్యం బాగోలేనట్టుంది. విశ్రాంతి తీసుకోండి. పొద్దున్న మాట్లాడుకుందాం.'

'ఇంతకీ మీరెవరు?'

ఆవిడ ప్రశ్నకి భారతి విస్తుబోయింది. 'అదేమిటి వదినగారూ! నేనూ, మావారూ ఇదివరకు మీ యింటికి వచ్చాం గుర్తులేదూ?'

భారతి మాటలు విననట్టే అడిగింది అనసూయ. 'ఇదిగో మీరెవరోగానీ ఆయనకి కాస్త చెప్పండి ఇలా చెయ్యడం బాగాలేదని. అయినా మీకేమయినా తెలుసా ఆయన ఎవరో? రోజూ నాకు దగ్గరుండి అన్ని పనులు స్వయంగా చేసి పెడతారు. మీ పేరు ఏమిటి అంటే మాట్లాడరు. మీరెవరంటే చెప్పరు. ఇలా ఒకేచోట ఉంటే ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు చెప్పండి.'

ఏదో అనేందుకు నోరు తెరిచింది భారతి.

'అన్నట్టు మీరెవరు? ఈ ఇల్లు మీదా? ఇన్నాళ్ళూ మీరు కనిపించలేదేం?' కృష్ణమూర్తి భారతి నివ్వెరబోయి చూస్తుంటే వెక్కిళ్ళు వినిపించాయి వెనకగా.

'అనసూయకు అల్జిమర్స్‌రా కిష్టుడూ' మనమెవరమూ ఆవిడకు గుర్తులేదు. అలాగే పాతికేళ్ళు పెంచిన కొడుకులు, లాలించిన మనవలూ.. ఊహూ ఎవరూ గుర్తులేరు.'

అదిరిపడింది భారతి.

'మరి ట్రీట్‌మెంటు?'

'దీనికి ఇంకా పూర్తిగా రాలేదటరా? ఏదో నా తృప్తికోసం డాక్టరుగారు అపుడపుడు వచ్చి ట్రీట్‌మెంటు ఇస్తుంటారు. ఇవాళ మీరొస్తున్నారని నాకు వీలు కుదరకపోతే మా బావమరిది అనసూయని క్లినిక్‌కి తీసుకెళ్ళాడు.'

'ఎందుకిలా? డాక్టర్ ఏమీ చెప్పలేదా?'

'సాధారణంగా వయసుతోపాటు వస్తుందిట. కానీ అనసూయకు అందరూ ఇల్లు విడిచి వెళ్ళిపోవడంతో మనోవ్యాధితో వచ్చింది. వాళ్ళు ఈ ఇల్లు వదిలి వాళ్ళిళ్ళకు వెళ్ళిపోయిన కొత్తల్లో అపరాధభావంతోనయినా వారానికి రెండురోజులు సెలవులు ఇక్కడే గడిపి వెళ్ళేవారు. అందుకే శుక్రవారం సాయంత్రానికి కొడుకులు మనవలకోసం ఎదురుచూస్తూ నాకెన్నో పనులు పురమాయించేది. సోమవారం వాళ్ళందరూ వెళ్ళిపోయాక ఇలాగే ముసుగుపెట్టి పడుకుని మంచం దిగేది కాదు. క్రమక్రమంగా పిల్లలు బిజీ అయిపోయి రావడం తగ్గించేసారు. అనసూయ ఇప్పుడు వాళ్ళని పూర్తిగా మర్చిపోయింది. రోజు నేను చేయిస్తే తప్ప ఏ పనీ గుర్తుండదు. లేచిన దగ్గర్నుంచీ అలాగే కూర్చుంటుంది. ఆకలి దప్పిక ఏమీ తెలియవు. జరిగినవన్నీ మర్చిపోయింది. అంతవరకూ అదృష్టవంతురాలే. కానీ నన్ను కూడా మర్చిపోయిందిరా.'

మిత్రుని దుఃఖం కృష్ణమూర్తిలో కూడా భయాన్ని రేకెత్తించింది.

'ఇవాళో రేపో నా యింట్లో కూడా ఇలాంటి అల్జిమీర్స్ ప్రవేశించకుండా ఉండాలంటే మా నాన్న వారసత్వంగా నాకిచ్చిన పాత యింటిని ఘణంగా పెడితే చాలు, నా పిల్లలందరి దృష్టి దానిమీదేనని నాకుగాక ఇంకెవరికి తెలుస్తుంది. అయినా పైకి వెళ్ళేటప్పుడు ఈ భూములు, భోషాణాలు మనవెంట వస్తాయా పిచ్చిగాని' అనుకున్నాడు కృష్ణమూర్తి భారంగా నిట్టూరుస్తూ.

గౌరీ శంకర్ దుఃఖం సముద్రమంత అనంతంగా తోచింది కృష్ణమూర్తికీ, భారతికి.

నిజంగా అది దురదృష్టమే. కానీ అనసూయకి ఈ అల్జిమీర్స్ వ్యాధి మనోవ్యాధివల్ల వచ్చింది.

కానీ ఈకాలం సంతానానికి వచ్చిన అల్జిమీర్స్ మాటేమిటి? అంటే అదే ఆరోగ్యం ఉండి కూడా తమకు జీవనదానం చేసి పెంచిన తల్లిదండ్రుల్ని ఆ పిల్లలు నిర్దాక్షిణ్యంగా మరిచిపోవడం.

అయితే ప్రతితరం వారూ మర్చిపోతున్న ఒక నగ్నసత్యమొకటుంది.

"కాలం పాదరసంలాంటిది. ఎంతలో జారిపోతుంది? నిన్నటి యువతరం ఈనాటి వృద్ధతరమైనట్టే ఈనాటి యువతరంకూడా రేపటి వృద్ధులవక తప్పదు."

## చిత్రపటం - శ్రీకళ అబ్బరాజు

"**మా పరుచూరిలో** యింట్లో రెండు పెద్ద పెద్ద వేపచెట్లు వున్నాయి. ఇంకా నాలుగు కొబ్బరి చెట్లు కూడా వున్నాయి. వాటిలో ఒకటి 'గంగా భవాని' రకం. ఆ కొబ్బరి చెట్టు కాయల్లో నీళ్ళు తేటగా తియ్యగా 'ఎంత' బావుంటాయో! ఇంక పూలచెట్ల గురించి

అయితే అడగనే అక్కర్లేదు. బోలెడన్ని. మా యింట్లో గరుడవర్ధనం చెట్టు పూలు కోసుకోడానికి ఎంతమంది వచ్చేవారనుకున్నావ్? అసలు 'గరుడవర్ధనా'లంటే తెలుసా నీకు?" లొడలొడా వాగుతున్న దాన్ని కాస్తా, ఆగి, బుజ్జిగాడి మొహంలోకి చూశాను.

"ఊహూ.. తెలీదమ్మా" ఆరేళ్ళ వయసున్న మా అబ్బాయి అమాయకంగా చెప్పాడు.

"గరుడవర్ధనాలంటే ఐదేసి రెక్కలతో వుండే తెల్లటి పూలన్నమాట. నాకింకా బాగా గుర్తు. తెల్లవారుఝామున లేచి, వాకిట్లోకి వచ్చి చూస్తే వచ్చీరాని వెలుతురులో పచ్చటి గుబురులో చిక్కుకున్న నక్షత్రాల్లాగా మెరిసిపోతూ కనిపించేవా పూలు."

నా పాటికి నేను మాట్లాడుతూనే వున్నాను. బుజ్జిగాడు వాడి పాటికి వాడు తలొంచుకుని యిడ్లీలు తింటూనే వున్నాడు.

నేను చెప్పే విషయాలు వాడికి ఒక్క ముక్క కూడా అర్థం కావడంలేదని తెలిసినా నా ఆరాటం. నా చేత వాగిస్తూనే వుంది.

వాడికి మామూలుగా మాట్లాడే తెలుగే సరిగ్గా అర్థంకాదు. నువ్వేమో గుబురూ నక్షత్రాలూ అంటూ కవిత్వం చెబితే ఏం అర్థం అవుతుంది?" అంటూ, మధ్యలో వచ్చాడు వరుణ్.

"పోనీ అర్థం చేసుకునే మీరు వింటారా?" అన్నాను యిడ్లీల ప్లేటుని ముందుకి నెడుతూ.

"ప్లీజ్" ఇక చాలన్నట్టు చెయ్యి చూపించాడు వరుణ్.

"పెళ్ళైనప్పట్నుంచీ రోజూ మీ వూరి కథ. మీ యింటి కథ వింటూనే వున్నాను. నాకింకా వేరే పనులు కూడా వున్నాయి. వదిలెయ్" అన్నాడు చిరాగ్గా.

వరుణ్ చిరాకు చూసి నాకూ కోపం వచ్చింది.

"అవును. నేను చెప్పేది మీరెందుకు వింటారు?" అన్నాను మూతి విరుస్తూ.

"ఇవాళ నాకు చాలా ముఖ్యమైన పన్లున్నాయి మహీ ప్లీజ్. త్వరగా బుజ్జిగాడిని రెడీ చెయ్యి. స్కూల్లో దించి ఆఫీసుకి వెళ్ళాలి" నా కోపంతో ఏ సంబంధం లేనట్టు, యిడ్లీ ముక్కల్ని ఒకదాని తర్వాత ఒకటి నోట్లోకి తోసేస్తూ చెప్పాడు.

ఇన్నేళ్ళ కాపురంలో వరుణ్, అలవాట్లూ, పద్ధతులూ తెలుసుకున్న నేను ఇంక మాట్లాడడం అనవసరం అని వూరుకున్నాను.

"నా ఘోష మెట్టతామర మొక్కలూ, గరుడవర్ధనం పూలూ గురించికాదు. ఆ యింటితో నాకున్న అనుబంధం గురించీ అక్కడ పెనవేసుకున్న జ్ఞాపకాల గురించీ! అది మీకెప్పటికీ అర్థంకాదు" కోపంగా అనాలనుకున్న మాటలు మనసులోనే మిగిలిపోయాయి.

బుజ్జిగాడిని తీసుకుని వరుణ్ వెళ్ళిపోతూనే, తిరిగి వంటిల్లు సర్దుకునే పనిలో పడ్డాను.

పని చేసుకుంటున్నంతసేపూ మా పరుచూరు, పరుచూరులోని మా యిల్లు మనసులో మెదులుతూనే వున్నాయి.

వరుణ్ అన్నట్టుగా ఎప్పుడు మా వూరి నామస్మరణ చేసేనేను యివాళ ఇంత ప్రత్యేకంగా తలుచుకోవడానికి మాత్రం ఒక కారణం వుంది. అది అమెరికానించి వచ్చిన మా అమ్మ ఫోను.

ఆర్నెల్ల కిందట మా అన్నయ్యకి ఆన్‌సైట్ అవకాశం రావడంతో భార్యాపిల్లలతో సహా అమెరికాకి వెళ్ళాడు. మా అమ్మ హైదరాబాదులో ఒంటరిగానే వుండేది.

నాలుగు నెలలు గడిచాక మా అమ్మకి కూడా విజిటింగ్ వీసా వచ్చింది. దాంతో ఓ ఆర్నెల్లు వుండి వస్తానంటూ అమ్మ కూడా అమెరికాకి ప్రయాణమై వెళ్ళింది.

అన్నయ్య దేశం వదిలి వెళ్ళిన దగ్గర్నుంచీ వూళ్ళో మా యింటిని పట్టించుకునే వాళ్ళే లేకపోయారు. ఆ యింట్లోకి అద్దెకి దిగినవాళ్ళు ఏవో రిపేర్లు చేయించాలని, వాట్సప్‌లో మాటిమాటికీ మెసేజీలు పెడుతూ ఫోన్లు చేస్తూ వున్నారట. దాంతో, నెలరోజుల కిందటే పూనే నుంచి హైదరాబాదుకి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని వచ్చిన మాకు ఆ పనిని పురమాయించింది అమ్మ.

నాకు పెళ్ళైన తర్వాత, ఒకే ఒక్కసారి వరుణ్‌తో కలిసి పరుచూరు వెళ్ళాను నేను. ఆ తర్వాత నేను పూనే వెళ్ళడం, మా అన్నయ్యకు హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో ఆ యింటిని అద్దెకి యిచ్చి సిటీకి వచ్చేశారు అమ్మా, నాన్నా. ఆ తర్వాత మళ్ళీ ఆ యింటిని చూసే అవకాశం నాకు రాలేదు. నాన్న బతికున్నప్పుడు 'మళ్ళీ మన వూరికి వెళ్ళి, అక్కడే వుందాం. అనేవాడట అమ్మతో'

కానీ, అనుకోకుండా నాన్న హఠాత్తుగా చనిపోయారు. ఆయన అంత్యక్రియలు కూడా హైదరాబాదులోనే జరిగాయి. ఇప్పుడు, వూరు.. వూళ్ళో యిల్లు మా జీవితాల్లో, భాగం కాదు.

అయినా నా కలల్లో, కళ్ళల్లో తరుచుగా మెదుల్తూనే వుంటుంది ఆ యిల్లు.

జీవితంలోని పరుగులూ, ఒత్తిళ్ళూ తెలియని నా బాల్యం అక్కడ ఆనందంగా గడిచిపోయింది. గతాన్ని గుర్తుచేసుకుంటే ఎన్నో మధురమైన అనుభూతులూ అనుభవాలూ అక్కడే ముడిపడి కనిపిస్తాయి.

అమ్మా, నాన్నా అన్నయ్యా నేనూ అప్పట్లో మాది చిన్న కుటుంబం. అందులో అల్లారుముద్దుగా, ఏ ఆంక్షలు లేకుండా పెరిగాను నేను. నా అల్లరికి అడ్డే వుండేది కాదు. నాకు తోడుగా 'సుజీ' కూడా బాగా అల్లరి చేసేది. సుజీ మా వూళ్ళో నా స్నేహితురాలు. ఇద్దరం మా పక్కింట్లో ఉసిరిచెట్టు కాయలు. దొంగతనంగా కోసి తినేవాళ్ళు. మునిగోరింట పూలతో వచ్చీరానట్టుగా దండ కట్టి తలలో పెట్టుకోమని సుజీ చెల్లెలు పూర్ణిమ వెంటపడే వాళ్ళం. మమ్మల్ని మేం కట్టిన దండనీ చూసి భయపడి పారిపోయేది పూర్ణి. గోరింటాకు పెట్టుకుని, ఉయ్యాల బల్ల ఎక్కితే మా అమ్మ అరిచి మొత్తుకున్నా గోరింటాకు తీసేవరకూ వుయ్యాల దిగేవాళ్ళం కాదు.

ఇలాంటి జ్ఞాపకాల్ని ఎన్నింటినో దాచుకున్న మా యింటికి, వెళ్ళిరావడానికి చాలా కాలానికి నాకు ఒక కారణం దొరికింది. ఇది అవకాశంగా తీసుకుని మళ్ళీ ఒకసారి మా యింటికి వెళ్ళిరావాలని నా ఆశ. ఈ విషయమే వరుణ్ చెవిన వేయాలని నా ఆరాటం.

"వంకాయకూర యింకొంచెం వడ్డించేదా?"

రాత్రి భోజనాల దగ్గర కళ్ళు పైకెత్తి చూడకుండానే అడిగాను వరుణ్‌ని.

"మీ వూళ్ళో దొరికే ముళ్ళొంకాయలు ఇంతకన్నా బావుంటాయని చెప్పట్లేదేం?" ఆ మాట నువ్వు చెబితే అప్పుడు తింటాను ఈ కూర" అన్నాడు వరుణ్ నవ్వుతూ.

పొద్దుటి చికాకు అంతా ఎగిరిపోయి బతిమాలుకునే మూడ్‌లోకి వచ్చాడని అర్థమైంది నాకు.

భోజనాలయ్యాక బుజ్జిగాడిని పడుకోబెట్టి, వరుణ్‌కి మా అమ్మ ఫోన్ సంగతి చెప్పాను.

"దానిదేముందీ ఈ వీకెండ్ వెళ్ళి వద్దాం. కాకపోతే నాకు సెలవులు లేవు. కాబట్టి, వెంటనే తిరిగి వచ్చేయాలి" చెప్పాడు.

"నిజంగా!" ఆనందంతో ఎగిరి గంతేసినంత పని చేశాను.

"వరుణ్! నాకెంత సంతోషంగా వుందో చెప్పలేను. మనం ఆ యింటికి వెళ్ళి దాదాపు పదేళ్ళపైనే అవుతుంది కదూ! బుజ్జిగాడైతే మొదటిసారి చూడబోతున్నాడు.

నాకు తెలిసి 'సుజీ' కూడా ఆ వూళ్ళోనే వుంటోంది. దాన్నికూడా చూడొచ్చు. దిండుని పైకి జరుపుతూ, హుషారుగా చెప్పుకుపోతున్నాను.

"చాలు" నా మాటలకి మధ్యలో అడ్డకట్టవేశాడు వరుణ్.

"నువ్వు గాల్లోకి తీరిగ్గా తేలిపోదువుగానీ. ముందు ఆ యింటికి ఏమే రిపేర్లు చేయించాలో వివరంగా కనుక్కో. మనం వెళ్ళేపని మీద ధ్యాస పెట్టు. ఇంకో విషయం ఈ పదేళ్ళలో మీ వూరి రూపురేఖలు మారిపోయి వుండొచ్చు. నువ్వు మరీ ఊహల్లో తేలిపోకు" హెచ్చరించాడు.

"నేను మరీ మీ అంత ప్రాక్టికల్‌గా ఆలోచించలేను బాబూ! అయినా ఇన్నేళ్ళలో ఏమేమి మార్పులు వచ్చి వుంటాయో ఊహించడానికి ప్రయత్నిస్తాను. మీరేం కంగారుపడక్కర్లేదు" అన్నాను నవ్వుతూ.

అనుకున్న ప్రకారం శుక్రవారం రోజు రాత్రికే బయల్దేరి గుంటూరు వెళ్ళాం. అక్కడ వరుణ్‌వాళ్ళ బంధువుల యింట్లో దిగి మర్రోజు వుదయాన్నే కారులో మా వూరికి ప్రయాణం అయ్యాం.

కారు వూళ్ళోకి వస్తూనే నాలో ఉత్సాహం రెట్టింపయ్యింది.

"అదిగో వేణుగోపాలస్వామి గుడి. ప్రహరీగోడకి సున్నం వేయించినట్టున్నారు" అంటూ కారులో నుంచే దణ్ణం పెట్టేసుకున్నాను.

"చెరువు చెరువు" అక్కడ తామరపూలు కనిపిస్తున్నాయా? అవంటే పిచ్చి యిష్టం నాకు" ఉత్సాహంగా అరుస్తూ బుజ్జిగాడికి బలవంతంగా కారు కిటికీలో నుంచి మా వూరి చెరువుని చూపించాను.

"ఇక్కడ ఆ యిటుకరాళ్ళు పేర్చి వున్నాయే అది మా గోంగూర బామ్మ వాళ్ళిల్లు. అక్కడ నుంచి నేరుగా పోనివ్వండి కారుని" చెప్పాను వరుణ్‌కి.

నా డైరెక్షన్స్‌కి పాటిస్తూ, నా రన్నింగ్ కామెంట్రీని భరిస్తూ చిన్నగా కారుని తెచ్చి యింటి ముందు ఆపాడు వరుణ్. కారు దిగుతూనే ఎదురింటి మెట్లమీద సగం నెరిసిన జుట్టుతో బక్కపలచగా వున్న ఒకావిడ,

"నువ్వు మహితవి.. కదూ! బావున్నావా!" అని పలకరించింది.

నేను ఆవిడని గుర్తుపట్టి మాట్లాడబోయేలోపే చివాలున లేచి గబగబా లోపలికి వెళ్ళిపోయిందామె.

"అమ్మా!..రా"

అలాగే నిలబడిపోయిన నేను బుజ్జిగాడి పిలుపుతో కదిలాను. గేటు తీసుకుని లోపల అడుగుపెట్టేసరికి యింటి ఆవరణ అంతా బోసిగా కనిపించింది. వాకిటి ముందు పచ్చటి హర్మ్యాలు వుండే రెండు వేపచెట్లూ లేవు. పెరట్లో మునగచెట్టుని కూడా కొట్టేశారు.

నేను బుజ్జిగాడికి రోజుకి నాలుగుసార్లు వర్ణించి చెప్పే గరుడవర్ధనం సగానికి పైగా ఎండిపోయి వుంది.

"ఆ వేపచెట్టు ఆకులు చిమ్మలేకపోతున్నానండీ. నాకు నడుము నొప్పులు. వెన్నపూస సమస్య అని చెప్పారు డాక్టర్లు. మునగచెట్టుకి గొంగళిపురుగులు పడుతున్నాయి. మొన్ననే అది కూడా తీసేయించాము"

నా మొహంలో ప్రశ్నార్థకం చూసి, అడగకుండానే జవాబిచ్చింది యింట్లో అద్దెకున్నావిడ.

పెరట్లో ఉన్నప్పుడు వాడిన నీళ్ళతొట్టి అలాగే వుంది. చిన్నప్పుడు నేనూ, మా అన్నయ్య వంతుల వారీగా దాన్ని నింపేవాళ్ళం. అది మానాన్న మాకు పెట్టిన రూలు.

ఆ తొట్టి దగ్గరికి వెళ్ళి, దాన్ని ముట్టుకుని చూశాను. ఎందుకో నాకు మనసులో గుర్తుండిపోయిన దానికన్నా అది చాలా చిన్నగా వున్నట్టు అనిపించింది. తొట్టేకాదు. యిల్లు కూడా చిన్నదిగా, యిరుగ్గా కనిపించింది. ఇంట్లో అద్దెకున్నవాళ్ళది చెప్పుల వ్యాపారం. ముందున్న రెండు గదుల్లో చెప్పుల అట్టపెట్టెలు పేర్చి పెట్టడంతో యిల్లంతా చీకటిగా వుంది. గాలి పారక ఒక రకమైన వాసన కూడా.

వరండాలో మేం వదిలి వెళ్ళిన టేకు ఉయ్యాలబల్ల మాత్రం అలాగే వుంది. బుజ్జిగాడు కాస్సేపు ఉయ్యాలూగి, పెరట్లో నూతి దగ్గరికి పరిగెత్తాడు. అది చూసి వెనకాలే నేనూ పరిగెత్తాను. చేదతో బావిలో నుంచి నీళ్ళు తోడి యిస్తే చల్లటి నీళ్ళు మొహం మీద పోసుకుని కిలకిలా నవ్వాడు. ఇంట్లో వున్న వాళ్ళ పిల్లలతో బుజ్జిగాడికి స్నేహం కుదిరింది. కాస్సేపు ఆడుకున్నాడు.

మేం పెత్తనాలు చేస్తుంటే వరుణ్ మాత్రం "శ్లాబ్‌లో ఎక్కడ లీకవుతుంది? ఏయే తలుపులు బాగు చేయించాలి?" అని అద్దెకున్నాయనతో మాట్లాడుతూ వున్నాడు. అలా ఓ గంట గడిచిపోయింది.

రిపేర్లు చేయడానికి మనుషుల్ని పురమాయించే పని పూర్తయ్యాక మధ్యాహ్నం మా గోంగూర బామ్మ వాళ్ళింట్లో భోజనం చేసి సాయంత్రం తిరుగు ప్రయాణం కట్టాము.

ఊరు నుంచి తిరిగి వచ్చి, అప్పటికి రెండు రోజులయ్యింది.

వంటపని పూర్తవుతూనే చల్లగాలి కోసం వరండా మెట్లమీదకి వచ్చి కూర్చున్నాను. వరుణ్ యింకా యింటికి రాలేదు.

బుజ్జిగాడు లోపల కూర్చుని రాసుకుంటూ వున్నాడు.

చూస్తూ వుండగానే ఆకాశం నల్లబడిపోయింది. మినుకు మినుకుమంటూ మెరుస్తున్న నక్షత్రాలు ఒక్కొక్కటిగా బైటికి వచ్చాయి.

వాటిని చూస్తుంటే మా నాన్న జ్ఞాపకానికి వచ్చాడు. నేను చిన్నపిల్లగా వున్నప్పుడు మా యింట్లో ఆరుబయట మంచం మీద మా నాన్న చేతిని పట్టుకుని నక్షత్రాల్ని చూస్తూ నిద్రపోవడం గుర్తొచ్చింది.

"ఏంటీ దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?"

ఎప్పుడు వచ్చాడో వరుణ్ నా ఎదురుగా నిలబడి అడుగుతున్నాడు. "ఏం లేదు" తల అడ్డంగా వూపాను.

"వూళ్ళో మీ యింటిని చూసినప్పట్నుంచేనా నీకీ వైరాగ్యం ఓ పని చేద్దాం. ఆ యింటిని బాగు చేయించి, తిరిగి నువ్వు చెప్పే మెట్టతామరలూ గరుడవర్ధనాలూ పెంచుదాం. మళ్ళీ వేపమొక్కలు నాటి నువ్వు కోరుకున్నట్టే తయారుచేద్దాం. ఈసారి యింటిని అద్దెకి యివ్వకుండా మన కిందే వుంచుకుని, సెలవులకి వెళ్తూ, వస్తూ వుందాం. సరేనా?"

నాలో ఉత్సాహాన్ని నింపడానికన్నట్టుగా నవ్వుతూ అన్నాడు.

"వద్దు వరుణ్" చెప్పాను ఠక్కున.

"ఏమైంది మహీ"

నా పక్కన కూర్చుంటూ అడిగాడు వరుణ్.

"కావాలంటే మొక్కల్నీ, చెట్లనీ మనం కోరుకున్నట్టుగా తిరిగి పెంచుకోవచ్చు. కానీ కొన్నింటిని మనం తిరిగి తీసుకురాలేము వరుణ్. ఆ యింట్లో అమ్మా, నాన్నా, అన్నయ్యా, నేనూ చాలు ఆనందంగా గడిపాం. గొప్ప సుఖాలు లేకపోయినా, ఎటువంటి కష్టాలూ, సమస్యలూ ఉండేవి కావు. మాకు. మా నాన్న సజీవంగా వున్నప్పటి జ్ఞాపకాలే ఆ యింట్లో వున్నాయి. పిల్లాపాపలతో అన్యోన్యంగా హాయిగా జీవితం గడిపిన ఓ జంట. స్నేహితులతో ఆడుతూ, పాడుతూ పెరిగిన యిద్దరు పిల్లలు. ఇదే ఆ యింటిలో మాకున్న అనుబంధం, ఎప్పుడు ఆ యింటిని తలుచుకున్నా అదే గుర్తుకు రావాలి. కాలాన్ని అక్కడికి బంధిస్తేనే అది ఒక అందమైన వర్ణ చిత్రం.

దాన్ని దాటి చూస్తే ఒక్కో రంగూ వెలిసిపోతూ కనిపిస్తూ వుంది. ఈ విషయం నాకు, ఆ యింట్లో మా నాన్న తాలూకు జ్ఞాపకాలు మనసుని తాకిన తర్వాత వెలిసిపోయిన సుజీ మొహం చూసిన తర్వాతనే అర్థం అయ్యింది.

మనం కారు దిగుతూనే మొదటగా నన్ను పలకరించింది నా క్లోజ్ ఫ్రెండ్ సుజాతే.

కాలం తనని బాగా కుంగదీసింది. మా యిద్దరి పరిస్థితుల్లో అంతరాన్ని గుర్తిస్తూనే నాతో మాట్లాడడానికి యిష్టపడలేదు.

మనం అక్కడ్నుంచి బయల్దేరే ముందు నేను వెళ్ళి 'సుజీ' కలిశాను. మొదట. కాస్త యిబ్బందిపడ్డా. తర్వాత బానే మాట్లాడింది కానీ చిన్నప్పటి 'సుజీ' కాలేకపోయింది. నేను ఆ విషయాలన్నీ తనకి గుర్తుచేయదలుచుకోలేదు కూడా.

"నీకే అవసరం వచ్చినా నాకు ఫోన్ చెయ్యి" అని మాత్రమే చెప్పగలిగాను. వర్తమానంలో యిబ్బందులు పడుతున్న వ్యక్తి, గతాన్ని తలుచుకుని సంతోషించడం కష్టం అన్న విషయం అర్థం చేసుకున్నాను.

మనిషి జీవనపోరాటంలో గెలిస్తేనే ఊహా ప్రపంచాన్ని బతికించుకోగలడు. ఆ విషయం అర్థం అయ్యాక.

ఆ యింట్లో చెప్పుల వాసన కూడా నాకు బాగా నచ్చింది. నాకు సంబంధించిన వరకూ నా మనసులో మిగిలిపోయిన 'ఆ అందమైన చిత్రపటం' చాలు. ఆ యింట్లో ఆ చిన్న కుటుంబాన్ని అలాగే వుండనిద్దాం" అన్నాను ఉద్వేగంగా.

వరుణ్ నా వంక మెచ్చుకోలుగా చూశాడు.

"మరి యిన్ని తెలిసి ఎందుకు మొహం వేళ్ళాడేసుక్కూర్చున్నావు?" అడిగాడు విచిత్రంగా చూస్తూ.

"బావుంది. నీతులు చెప్పడం ఎవరికైనా తేలికే. కానీ, మనసుని సమాధానపర్చుకోవద్దూ. ఎంతలేదన్నా ఆ యింట్లో సగం ఎండిపోయిన గరుడవర్ధనం చెట్టు గుర్తొస్తే బాధగా వుంది. ఆ చెట్టుకి సరిగ్గా నీళ్ళు పోయమని మరీ మరీ చెప్పొచ్చాను వాళ్ళకి"

నేను మాట్లాడుతూ వుండగానే బుజ్జిగాడు లోపలి నుంచి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"అమ్మా! ఇది చూడు" అంటూ నా చేతిలో ఒక కాగితాన్ని పెట్టాడు.

"ఇది యిల్లు. ఇదేమో బావి. ఇది గరుడవర్ధనం" అంటూ రంగులు వేసిన బొమ్మల్ని చూపించాడు. చిన్న ఆకుపచ్చని కొండమీద తెల్లటి ముద్దల్లా వున్న గరుడవర్ధనాల్ని చూసి ఫక్కున నవ్వాం నేనూ, వరుణ్.

## పార్టీ టైమ్ — సోమ సుధేష్ణ

"హాయ్ వినూ! ఈ శనివారం గీత వాళ్ళింట్లో వెడ్డింగ్ యానివర్సరీ పార్టీ కదా! వాళ్ళకు గిఫ్ట్ తీసుకుని, మనకు గ్రోసరీ తీసుకుని వచ్చేసరికి లేటవుతుంది. పిల్లలకి డిన్నర్ పెట్టేయమని అమ్మకు చెప్పండి. ఫోన్ పెట్టేస్తాను, ట్రాఫిక్ చాల ఉంది "

"డోంట్ వరీ సీమా, కేర్ ఫుల్ గా డ్రైవ్ చెయ్, బై" వినోద్ ఫోన్ పెట్టేసి ఇంటికి ఫోన్ చేసాడు.

"అత్తయ్యా! సీమకు రావడానికి లేట్ అవుతుందట. నాక్కూడా కాస్త లేటవుతుంది. ఆర్య, సూర్యని డిన్నర్ టైంకి తినేయమనండి. మీరు కూడా టైంకి డిన్నర్ తినేసేయండి. మాకోసం చూస్తూ లేట్ గా తినడం మీ ఆరోగ్యానికి మంచిది కాదు."

"సరే. మరీ లేటు చేయకండి." అంటూ అత్తగారు ఫోన్ పెట్టేసింది.

కాస్త లేటుగానే ఇంటికి చేరిన వినోద్ వచ్చీ రాగానే పిల్లలిద్దరి వైపు చూస్తూ అడిగాడు.

"హౌ వాజ్ యువర్ డే గైస్? డిన్నర్ తిన్నారా?"

"ఫైన్ డాడ్. డిన్నర్ ఎప్పుడో తినేశాం. రేపు పి.టి.ఏ. మీటింగ్ ఉంది కదా, మామ్మి వస్తోందా లేక నువ్వు వస్తున్నావా డాడ్?" లెవెంత్ గ్రేడ్ లో ఉన్న ఆర్య అడిగాడు.,

"మమ్మితో మాట్లాడాక ఎవరికి వీలవుతుందో చూద్దాం. హోమ్ వర్క్ చేసుకున్నారా? ఆర్య నీకేదో ప్రాజెక్ట్ డెడ్ లైన్ ఉందన్నావు ."

"యస్ డాడ్. ఈ రోజు బుక్ రిపోర్ట్ రాయాలి రేపు ప్రాజెక్ట్ చూస్తాను."

"సూర్య, నీ సంగతేమిటి!"

సూర్య గారాలు పోతూ "డాడ్ నా హోం వర్క్ చేసేసాను. నేను టి. వి. చూడొచ్చా?"

"ఒక్క షో మాత్రమే." తండ్రి మాట పూర్తి కాక ముందే టివి ఆన్ చేసి దాని ముందు కూర్చున్నాడు సూర్య.

పోయిన శనివారం వినోద్, సీమ పార్టి ఇచ్చారు. పార్టి కి రెండు రోజుల ముందు నుండి వినోద్, సీమ మరో లోకంలో ఉంటారు. ఆర్య హాయిగా రూంలో కంప్యూటర్ తో ఉంటాడు. ఆ రెండు రోజులు సూర్య వంటరి వాడై పోయినట్లు ఫీల్ అవుతాడు. తాతతో కొన్ని ఆటలు ఆడతాడు కాని చాల సేపు ఆడాలనిపించదు.. సూర్య వయస్సు వాళ్ళు పార్టికి వస్తే వాళ్ళతో చాల ఎంజాయ్ చేస్తాడు. పిల్లలు పెద్ద వాళ్ళు అని ఈమధ్య పేరెంట్స్ మాత్రమే కలుసు కుంటున్నారు.

పోయిన శనివారం ఇంట్లో పార్టికి సోహన్, శుభం, శివ వచ్చారు. సూర్యకు పండగ లాగుండింది. సోహన్, శివతో ఎన్నో గేమ్స్ ఆడుకున్నాడు. కానీ శుభం ఎప్పుడు పెద్ద వాళ్ళ మాటలు వింటూ వాళ్ళ దగ్గరే కూర్చుంటాడు. శుభం లాగ కాకుండా సూర్య అన్ని గేమ్స్ తీసి అక్కడ పెట్టాడు. ఎవరికి ఇష్టం వచ్చిన గేమ్స్ వాళ్ళు ఆడుకున్నారు. సూర్యకు చాల ఫన్ గా గడిచింది.

మరో శనివారం రానె వచ్చింది. ఈ సారి పార్టికి రానని సూర్య అనగానే ఇంతకు ముందులాగ రావాల్సిందే అనకుండ తల్లి వెంటనే

"ఫర్వాలేదులే, అక్కడ నీకు కంపేని కూడా లేదు. నానమ్మ తాత ఉన్నారుగా. తాతతో గేమ్స్ ఆడుకో. నానమ్మ నీకు హేరీ పాటర్ లాంటి కథలు చెప్తుంది. నువ్వు చాల లేట్ వరకు టివి చూడకు. ఓకేనా!" అప్పగింతలు మొదలవగానే తలాడించడం మొదలు పెట్టిన సూర్య ఆఖరి అప్పగింతతో తల ఊపడం ఆపేసాడు, వాళ్ళు ఆల్రెడీ గరాజులోకి వెళ్లి పోయారు.

సూర్యకు బుర్రలో తల్లి దండ్రులు నిషేదించిన టివి ప్రోగ్రామ్స్ చూడాలని, ఇంకా వాళ్ళు వద్దన్నవి ఏవేవో చేసెయ్యాలని ఉబలాటంగా ఉంది. కాసేపు పోట్లాడటానికి ఆర్య కూడా లేదు. ఇంకేం తన ఇష్టం వచ్చినట్టు చేయొచ్చు. తాత పక్కన కూర్చుని టివి చూస్తున్న సూర్య మనసు లో గజిబిజిగా ఆలోచనలు కదులు తున్నాయి.

"కంప్యూటర్ గేమ్స్ ఏదైనా ఆడదామా?" రఘురాం అడిగాడు.

"నాట్ నౌ తాత" టివి వైపు నుండి తల తిప్పకుండానే అన్నాడు సూర్య. టివి చూడకుండా చేయాలని తాత ప్రయత్నం అని సూర్యకు తెలుసు. గ్రాండ్ పేరెంట్సు ఎక్కువ సేపు మెలకువగా ఉండలేరని కూడా సూర్యకు తెలుసు.

రాత్రి పదయింది ..

"సూర్యా, ఇక లే నాన్న పడుకునే టైమైంది. మాకు నిద్రోస్తోంది." అంటూ నానమ్మ లేచింది. ఆ వెంటనే తాతయ్య లేచి

"గెటప్ మై హీరో" అంటూ చెయ్యి చాచాడు.

"నాకు నిద్దర రావడం లేదు. వన్ మోర్ షో చూసి పడుకుంటాను తాతా!"

"కథ వింటూ పడుకుందువు రా." గుడ్నైట్ కిస్ ఇచ్చి వాళ్ళిద్దరూ లేచారు.

"నా రూమ్ లోనే పడుకుంటాను. గుడ్ నైట్" సూర్య లేచి పైకి తన రూమ్ లోకి వెళ్ళాడు.

ఎక్కువ సేపు కూర్చున్నా వీళ్ళిద్దరూ సగం నిద్రలో మంబులింగే తప్ప మాటలు తక్కువే అనుకున్నాడు.

ప్రపంచంలో అన్నీ తెలుసనుకునే దుడుకు వయసులో  అడుగు పెట్టాడు సూర్య. ఎవరు ఏది చెప్పినా అందులో కొత్తేముంది అనే వయస్సు లోకి వస్తున్నాడు. అన్నీ అనుభవంలో చూడాలనే ఉత్సుకత ఉంది కానీ చాల వాటిలోకి తొంగి చూడలేని అదుపులు, అదుపులు దాటలేని అశక్తత. అన్నింటి మీద ఆసక్తి ప్రవేశిస్తున్న తొలి యౌవ్వనం. తర్టీన్ లో అడుగు పెట్టానని  అప్పుడే మనసులోకి ఎక్కుతున్న పొగరు మొదలయింది.

టివి ఆఫ్ చేసి తన రూమ్ పక్కనే ఉన్న ఆర్య బెడ్ రూమ్ లోకెళ్ళాడు. ఆర్య డేవిడ్ తో స్పెండ్ చేయడానికి వెళ్ళాడు. కంప్యూటర్ లాక్ చేసుకుంటాడు. వాడి సీక్రెట్స్ అన్నీ అందులో ఉంటాయి. ఆర్య ఉంటె కాసేపు ఆడుకుని, పోట్లడుకునే వాళ్ళు– బావుండేది. సూర్యకు  లోన్ లీగా అనిపించింది. గ్రాండ్ పేరెంట్స్ దగ్గర పడుకోవడానికి ఇష్టం అనిపించలేదు. నిద్ర వచ్చే సూచనలేవి లేవు. సెల్ ఫోన్ వాడలేదు. రాత్రి రేస్ట్రిక్టేడ్ మోడ్ లోకి వెళ్లి పోతుంది. పెరెంట్సును తప్ప ఎవరిని కాల్ చేయలేదు. ఏది చదివే మూడ్ లేదు. ఎదురు చూసిన ఒంటరితనం దొరికాక ఏం చేయాలో తోచలేదు.

బేస్ మెంటులో డాట్ బోర్డ్ ఉంది, చప్పుడు కూడా కాదు అనుకుంటూ బేస్ మెంటుకి వెళ్ళాడు.  రోజూ తిరిగే ఇల్లే అయినా ఆ క్షణంలో నిశ్శబ్దంలో బిగుసుకు పోయాడు. ధైర్యం కూడ దీసుకుని నెమ్మదిగా బేస్ మెంటువేపు వెళ్ళాడు. పది నిముషాలు అడగానే బోర్ కొట్టింది. పక్కనే బార్ లైటు వేసాడు. డెస్క్ వెనక కెళ్ళి ఒక స్టూల్ పై కుర్చుని గ్రోనప్ లాగ ఏక్ట్ చేయడం మొదలు పెట్టాడు.

'డాడ్  ఫ్రెండ్స్ తో కలిసి ఈ బార్ దగ్గర ఎన్ని జోకులు — ఎంత నవ్వుతారు! ఫన్ టైం. చాల మజాగా ఉండి ఉంటుంది

డాడి వర్క్ స్ట్రెస్ లో ఉన్నపుడు డ్రింకు తీసుకుంటాడు. కొన్నిసార్లు మామ్మీ కంపెని ఇస్తుంది. కొన్నిసార్లు "తాగింది చాలు, ఇక ఆపండి" అంటుంది. తాగే వాళ్ళకే తెలుస్తుంది ఏ బాటిల్ లో ఎంత పవర్ ఉందో అంటాడు ఆర్య.'

కేబినేట్ తెరిచాడు. దాన్నిండా రంగు రంగుల, రకరకాల షేప్స్ తో బాటిల్స్ –

"నా ఫేవరేట్ కలర్ రెడ్ సో.." అంటూ రెడ్ లేబిల్ విస్కీ బాటిల్ తీసుకుని ఒక గ్లాసులో పోసి ఒక్క గుక్కలో తాగేసాడు. గొంతంతా మంట. అ బాటిల్ తో  పాటు తన బెడ్ రూమ్ లో కెళ్ళాడు. గొంతులో మంట,

"గ్రోయింగ్ అప్ పెయిన్స్ " నవ్వాలని ట్రై చేసాడు.

సీమ, వినోద్ ఇంటికి వచ్చేసరికి రాత్రి పన్నెండు దాటింది. వాళ్ళ బెడ్ రూమ్ కి వెళ్ళే ముందు అలవాటు ప్రకారం పిల్లలను ఒకసారి చూసి, తన్నేసిన దుప్పటిని సరిగ్గా కప్పడం సీమకు అలవాటు. సూర్య గది తలుపు పుష్ చేసింది,  గది తలుపు లాక్ చేసుకున్నాడు. సీమ ఆశ్చర్య పోయింది. ఇన్ని ఏళ్ళల్లో ఏ  ఒక్కనాడు డోర్  లాక్ చేసుకోలేదు. ఓరగా తీసి ఉంచుతాడు. గట్టిగా వినోద్ కోసం అరవ బోయింది కానీ సూర్య లేస్తాడేమో నని గబగబా వెళ్లి  బెడ్ రూమ్ లో బట్టలు మార్చుకుంటున్న వినోద్ తో

"వినూ! ఒకసారి ఇటురా! సూర్య బెడ్ రూమ్ తలుపు లాక్ చేసుకున్నాడు.." గాభరాగా అంటూ వినోద్ చెయ్యి పట్టుకుని గబగబా సూర్య రూమ్ వేపు తీసికేల్లింది.

వినోద్ తలుపు గట్టిగా తోసాడు. లాక్ చేసిఉంది.

"సూర్యా! సూర్యా! డోర్ ఓపెన్ చెయ్యి." వినోద్ గట్టిగానే అన్నాడు. ఏమి జవాబు లేదు.

"బాగా నిద్దరలో ఉన్నట్టున్నాడు. మధ్య రాత్రి కదా, పడుకోనియ్, పొద్దున్నేచూడొచ్చు." ఆవులింత  తీస్తూ అన్నాడు వినోద్. వినోద్ కు ఈ రోజు డ్రింక్ కాస్త ఎక్కువే పడింది . ఈరొజు సీమ డిజిగ్నేతేడ్ డ్రైవర్ ఈజిగ తీసుకున్నాడు.

"డోర్ ఓపెన్ చేయండి, ఒకసారి సూర్యను చూసి వెళ్లి పడుకుంటాను." సీమ బాధగా, ఆరాటంగా అంది.

"కొన్ని గంటల్లో వాడు లేస్తాడుగా, ఇప్పుడు వాణ్ణి లేపి హడావుడి చేయడమెందుకు"

వినోద్ మాటలు కాస్త ముద్ద ముద్దగా వస్తున్నాయి

"ఎప్పుడూ డోర్ లాక్ చేసుకోడు." సీమకు డోర్ పైన పెట్టిన లాక్ గుర్తుకు వచ్చింది.

"డోర్ మోల్డ్ పైన కీ ఉంటుంది. తడిమి చూడండి."

"అబ్బా సీమా! ఏమిటి ఈ పిడకల వేట, నాకు బాగా నిద్దరొస్తోంది. నిలబడే ఓపిక లేదు. నన్ను పడుకోనివ్వు."

"కీస్ నాకిచ్చి మీ రెల్లి పడుకోండి ప్లీజ్!" దుఃఖాన్ని అణుచుకుంటూ వేడుకుంది.

కాదనలేక తూలుతూ డోర్ మోల్డ్ పైన తడిమాడు. మేకులాంటిది కింద పడింది. సీమ వంగి దాన్ని తీసుకుని

"ఇదే నండి కీ. థాంక్ గాడ్. ఇక మీరు వెళ్ళొచ్చు." గబగబా దోర్ ఓపెన్ చేసింది.

సీమ నైట్ లైట్ మసక వెలుగులో అడ్డదిడ్డంగా పడుకున్న సూర్యను చూస్తూ

"భయం వేసిందేమో తలుపు వేసుకున్నాడు. బాగా నిద్రలో ఉన్నాడు. షీట్ గూడ తన్నేసాడు." అనుకుంటూ షీట్ కప్పి ప్రేమగా తల నిమురుతున్నసీమ షాక్ తగిలినట్టుగా చిన్న కేక్ వేసింది. సూర్య నోట్లోంచి విస్కీ వాసన గుప్పు మంది. పక్కనే దిండు కింద దాగలేక్ తోంగి చూస్తున్న విస్కీ బాటిల్ ! తలుపు దగ్గర కెళ్ళి

"వినోద్ " ఏడుపు, భయంతో గట్టిగా అరిచింది. పడకెక్క బోతున్న వినోద్ ఆ అరుపు విని మత్తు దిగి పోయి పరుగెత్తు కొచ్చాడు.

మంచంపై ఉన్న సూర్యను, విస్కీ సీసాతో మంచం మీద కూర్చున్న సీమను చూడగానే వినోద్,

"ఓ మై గాడ్!" అంటూ గుండె మీద చెయ్యి వేసుకున్నాడు.

ఇద్దరూ సూర్యను లేపాలని చూసారు. ఎంత పిలిచినా ఉలుకూ పలుకు లేదు. శ్వాస కూడా నెమ్మదిగా ఉంది. వినోద్ వెంటనే 911 కు కాల్ చేసాడు. నీళ్ళు తెచ్చి మొహం పై చిలకరించారు. చలనం లేదు. వినోద్ ఎత్తుకోబోయాడు కానీ సూర్య తల వెళ్ళా దుతోంది. సీమ గట్టిగా ఏడుస్తోంది, వినోద్ కు కూడా కన్నీరు ఏకధాటిగా కారుతోంది.

అంబులెన్స్ త్వరగానే వచ్చింది. ఆ హడావుడికి లేచి వచ్చిన తల్లి దండ్రులకు ధైర్యంగా ఉండమని ఫోన్ దగ్గర పెట్టుకుని పడుకోమని చెప్పాడు వినోద్. సూర్యను దగ్గరే ఉన్న హాస్పిటల్ కు తీ సికెల్లారు. ER లో వాళ్ళు చెప్పిన చోటల్లా మర బొమ్మల్లా సంతకం చేసి సీమ, వినోద్ ఆ పక్కనే ఉన్న వెయిటింగ్ రూమ్ లో కూర్చున్నారు. జోగుతూ, ఉలిక్కి పడుతూ అలా గంటలు గడిచాయి. మార్నింగ్ ఎనిమిది గంటలకు డాక్టరు పిలుస్తున్నాడు అని నర్స్ చెప్పింది.

ఇద్దరు ఒక్క పరుగున డాక్టర్ దగ్గరకు చేరారు. ఇండియన్ డాక్టర్ కావడంతో ప్రాణాలు లేచి వచ్చాయి ఇద్దరికి. అసహనంగా చూస్తున్న డాక్టరు వేపు చూస్తూ "సూర్య.. ఎలా ఉన్నాడు" కళ్ళు తుడుచు కుంటూ నసిగాడు వినోద్.

"ఇంతకు ముందు డ్రింకు తీసుకున్నాడా లేక ఇది మొదటి సారా?"

"ఎప్పుడు ఇలా జరగా లేదు. అసలు డ్రింక్ జోలికే వేల్లడు. మాకు షాకింగుగా ఉంది."

"బాయ్ అండ్ మీరు కూడా చాల లక్కి, ఎక్కువగా తాగేసాడు. ఇప్పుడు ప్రాణానికేమి ప్రమాదం లేదు. అంతా ఫ్లష్ చేసాము. 24 గంటలు ఇక్కడే ఉంటాడు."

సీమలో ఆపుకోలేని దుఃఖం పైకే పొంగింది.

"ఇప్పుడు ఏడిస్తే ఏం లాభం చెప్పండి. ముందే కాస్త జాగ్రత్తగా ఉంటె బావుండేది. టివి కంట్రోల్ చేస్తారు, ఐ ఫోన్ కంట్రోల్ చేస్తారు, కంప్యూటర్ కంట్రోల్ చేస్తారు కానీ బార్ మాత్రం ఓపెన్ చేసి పెద్తారు..." పశ్చాత్తాపంతో కుమిలి పోతున్న వినోద్ ను ఏడుస్తున్న సీమను చూసి చెప్పడం ఆపేసి,

"ఇప్పుడు నిద్ర పోతున్నాడు. నర్స్ వచ్చి మిమ్మల్ని తీసుకెళుతుంది. మీరు వెళ్లి చూడొచ్చు. బి కేర్ ఫుల్ సో నెక్స్ట టైం ఇట్ వొంట్ హేప్పెన్". అంటూ అక్కడినుండి వెళ్లి పోయాడు.

"ఈ రోజూనేలా రానిచ్చాను! భగవంతుడా !" వినోద్ కు ఈ కొన్ని గంటల్లో జీవిత పాటాలన్నీ అర్థం అయినట్లనిపించింది.

"విలువైన వారిని ఇండియాలో వదిలి సుఖాలు జుర్రు కుందామని ఈ దేశం వచ్చాము. ఇక్కడ కూడా విలువైనవి పోగొట్టుకున్నాక ఇక మనకు మిగిలేది ఏమిటి! జీవితాన్ని సరి చేసుకోవాలి సీమా" గాద్గాదికమైన గొంతుతో చిన్నగా అన్నాడు వినోద్. సీమ సమ్మతంగా తలాడించింది.

నర్స్ తో పాటు రూమ్ లోకి వెళ్ళారు. ముద్దుల కొడుకు, పసివాడు అలా మంచం మీద పడుకుని ఉంటె ఇద్దరికీ గుండె తరుక్కు పోయింది.

'ఎందుకు ఇలా చేసావు సూర్యా' అని అడిగే అర్హతను కోల్పోయిన తల్లిదండ్రులు దిగాలుగా పక్కనే ఉన్న కుర్చీలో కూచున్నారు.

జీవితాన్ని రీ షఫుల్ చేసి అన్ని మార్చేయాలి అని అనుకున్నాడు వినోద్. పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటానని దేవుడికి ప్రమాణం చేసింది సీమ.

సూర్య మూలుగు వినిపించగానే ఇద్దరూ పరుగెత్తి "నాన్నా సూర్యా!" తల నిమురుతున్న తల్లిని మగతగా చూసిన సూర్య

"ఈజ్ ఇట్ పార్టీ టైం మామ్" అస్పష్టంగా అన్నా వినోద్ కు సీమకు అర్థం అయ్యింది.

తమ అజాగ్రతకు గురైన కొడుకును చూసి బాధ ఒకవైపు, పెద్ద ప్రమాదం తప్పిందనే స్వల్ప ఆనందం మరోవైపు రెండు పొంగుతూంటే కళ్ళల్లో నీళ్ళు, మొహంపై మందహాసంతో ఈ ఒక్క జీవిత పాఠం చాలు అనుకున్నారు.

❦❦❦

## కాదంబరి కన్నీరు ఆర్.సి.కృష్ణస్వామి రాజు

"ఏమండీ! మన హంసిని అపార్టుమెంట్ ప్రెసిడెంట్ నిరంజన్ రెడ్డి ఫోన్ చేసారండి, ఈ రోజు సాయంత్రం మన ఫ్లాట్స్ లోని వాగ్దేవి మీటింగ్ హాల్లో నాకు సన్మానం చేయబోతారట. మీరు కూడా పక్కనుంటే బాగుంటుందండీ " అని వేడుకోలుగా ఫోన్ చేసింది సూత్రదేవి తన మొగుడు మునిమాణిక్యంకి .

బ్యాంకు లావాదేవీల్తో బిజీబిజీగా వున్న బ్యాంకు ఆఫీసర్ మునిమాణిక్యం తన భార్య ఫోన్ కి అదిరిపడ్డాడు . 'థంబ్ వాలా కాదు కానీ ఇంటర్ వరకు చదివిన పిల్లే అయినా సన్మానం చేయించుకునేంత ఘనకార్యం సూత్రదేవి ఏమి చేసివుంటుందబ్బా' అని తెగ ఆలోచించినాడు. ఆలోచించి ఆలోచించి బుర్ర వేడిక్కింది కానీ సరైన సమాధానం దొరకలేదు. మళ్ళీ తనే ఫోన్ చేసి సన్మానానికి కారణమేమిటని సూత్రదేవి ని అడిగినాడు. "తినబోతూ రుచి అడగడం ఎందుకని అడగలేదండీ , అయినా జన్మకొక శివరాత్రి అన్నట్లు లేక లేక నలుగురు చేరి నాకు సన్మానం చేస్తానంటే అదీ ఇదీ అడిగి అసలుకే మోసం తెచ్చుకోవటం ఎందుకని అడగలేదండీ " అని ముద్దుముద్దుగా సమాధాన మిచ్చింది.

00000

మునిమాణిక్యం ఆరున్నరకంతా అన్ని పనులూ ముగించుకొని గబగబ అపార్టుమెంట్స్ కి చేరినాడు. అప్పటికే మీటింగ్ హాల్ జనంతో నిండిపోయి వుంది. చల్లటి ఏర్ కండీషన్ గాలి చిన్నచిన్నగా వీస్తోంది. ఆడియో సెట్ నుంచి వీణాగానం మృదుమధురంగా వినిపిస్తోంది. మీటింగు గ్రాండు గ్రాండుగా జరగాలని కాబోలు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ని చీఫ్ గెస్ట్ గా పిలిచివున్నారు. అంతా సందడి సందడిగా వుంది. వాచ్ మెన్ భార్య విమలక్క, సీతారాం పేట నూలు చీరకట్టి నవ్వుతూ ఆహ్వానితులందరికీ రంగు రంగుల గులాబీలు పంచుతోంది. స్టేజి పైన అపార్టుమెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ ,రిజిస్ట్రార్ లు కూర్చొని వున్నారు. వారి మధ్యలో సూత్రదేవి పాల మీగడ రంగు పట్టుచీర కట్టి మెడనిండా బంగారు నగలు ధరించి ముసిముసిగా నవ్వుతూ కూర్చొని వుంది . నిమ్మరంగు శరీరం కదా , దీపాల కాంతికి ధగధగ మెరిసిపోతోంది.

రిటైర్డ్ తెలుగు లెక్చరర్ మరియు అపార్టుమెంట్ ట్రెజరర్ అయిన ఆనందనాయుడు సిల్క్ చొక్కా, సిల్క్ పంచె ధరించి భుజం పైన సిల్క్ కండువా వేసి ఎడమ చంకన పాత తెలుగు న్యూస్ పేపర్ పెట్టుకొని అటూఇటూ తిరుగుతున్నాడు. ఎవరైనా పలకరిస్తే పేపర్ ఓపెన్ చేసి చూపాలని

తహతహలాడుతున్నాడు . ఆరు నెలలు క్రితం జిల్లా ఎడిషన్ లో సమస్యల తోరణం శీర్షికలో ఆనందనాయుడు ఫోటో వుంది. తమ కాలనీలో దోమల బెడద ఎక్కువ వుందని, తిరుపతి కార్పొరేషన్ వారు దోమల పొగ వదలాలని కోరుతూ వున్న న్యూస్ ఐటెం అది. ఎవరో ఒకరు న్యూస్ పేపర్ కథా కమామీషు ఏమిటని అడుగుతారేమోనని ఆ పక్కకి ఈ పక్కకి ఆశతో తిరుగుతున్నాడు. ఎవ్వరూ పట్టించుకోక పోయేసరికి తనే ఒక మూలకెళ్లి పేపర్ ఓపెన్ చేసి తన ఫోటోని , తన పేరుని అచ్చులో చూసుకుంటూ ఆనంద గుటికలు మింగసాగాడు.

ఫ్లాట్స్ లోని కిండర్ గార్డెన్ స్టూడెంట్స్ నలుగురు స్టేజిపైకి వచ్చి "సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ ... " పద్యం పాడి వెళ్ళినారు. వైట్ అండ్ వైట్ డ్రస్సు వేసిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ నిరంజన్ రెడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్ హోదాలో లేచి నిలబడి గొంతు సవరించుకున్నాడు. ఆయన లేచి నిలబడిందే ఆయన తన డ్రస్సుకి స్ప్రే చేసివున్న కొరియా పెర్ఫ్యూమ్ గుబాళింపు గది అంతా వ్యాపించింది. కాసేపు అందరూ కళ్ళు మూసుకొని పరిమళాన్ని ఆస్వాదించారు. కొత్త విషయం ఏమి చెబుతాడోనని ఆసక్తిగా కళ్లుతెరిచారు.

"ఫ్లాట్స్ ఓనర్స్ మరియు టెనెంట్స్ కి శుభాభినందనలు. పది నెలల పాటు పదిరకాల పరిశీలనలు చేసి సూత్రదేవిని సన్మానించదలిచినాము. పుస్తకాలు చదవడం మర్చిపోయిన ఈ కాలంలో పుస్తకాలు కొని మరీ చదివే సూత్రదేవి ఈ సన్మానానికి అర్హురాలని ఆరుగురి కమిటీ నిర్ణయించింది. డైలీలే కాదు వీక్లీ మంత్లీలే కాదు త్రైమాసిక అర్ధవార్షికా వార్షిక మరియు ప్రత్యేక సంచికలే కాదు. అన్ని పుస్తకాలనూ ఆమె కొంటుంది. చదువుతుంది. మార్కెట్లో దొరకని పుస్తకాలకు చందాలు కడుతుంది. మీకు తెలుసో తెలియదో ఆమె కొచ్చే పుస్తకాలు మోయలేక మన ఏరియా పోస్టుమ్యాన్ అప్పుడప్పుడు భుజాలకు ఫీజియోథెరపీ చేయించుకుంటున్నాడు. ఆదివారం అనుబంధాలను మేడమ్ పడీ పడీ చదువుతుందని ఇక్కడి వారందరికీ తెలుసు. తిరుపతి పట్టణంలో అన్ని పత్రికలూ దొరకని గ్రంధాలయాలు వుంటాయోమో కాని మేడమ్ పుస్తకాలయంలో దొరకని పత్రిక వుండదు. అందుకే ఈ టౌన్ కి , ఈ ఇయర్ కి పుస్తకాల ప్రియురాలైన మేడమ్ ని 'గుడ్ రీడర్ ' గా ఎంపిక చేసి సన్మానం చేస్తున్నాము" అని చెప్పి కూర్చున్నాడు. జనాలు చప్పట్లు మీద చప్పట్లు కొట్టినారు.

మీటింగ్ లో వున్న జనానికి మినరల్ వాటర్ ని కాగితం గ్లాసుల్లో పోసుకొని ప్లేటులో పెట్టుకొని తెచ్చింది వాచ్ మెన్ కూతురు వాణి . ఎవ్వరూ ఎడమ చేతితో కూడా తాకలేదు. హాల్ అంతా తిరిగి తిరిగి వంటగదిలోకి వెళ్లిపోయింది. వాచ్ మెన్ మనవడు వెంకటరత్నం మొన్న మీటింగ్ లో మిగిలిన అర లీటర్ వాటర్ బాటిళ్లను అట్టపెట్టలో పెట్టుకొని తెచ్చినాడు. జనాలు ఎగబడి వాటర్ బాటిళ్లు ఎత్తుకున్నారు. అట్టపెట్టె ఖాళీ అయ్యింది . ఖాళీ అట్టపెట్టెని చూసి వాచ్ మెన్ భార్య విమలక్క ముక్కు మీద వేలువేసుకుంది.

రిజిస్ట్రార్ రంగరాజు లేచినాడు. కాలర్ సర్దుకున్నాడు. గొంతు సవరించుకున్నాడు. "యూనివర్సిటీలో రోజూ 'రీడర్స్ ' ని చూస్తున్నాను కానీ, ఒరిజినల్ బుక్ రీడర్స్ ని చూసి చాన్నాళ్ళయ్యింది. అలా చూసే భాగ్యం హంసిని అపార్టుమెంట్స్ అధినేతలు నాకు కలుగజేయడం అభినందనీయం. పాఠకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. రచయితుల కథలు ఇతర రచయితలు మాత్రమే ఎక్కువ చదువుతున్నారని వింటున్నాను . నా వీపు నువ్వు గోకు , నీ వీపు నేను గోకుతా అన్నట్లుగా వుంటోంది వ్యవహారం.

పుస్తకప్రియులు తగ్గిపోవడం, అక్షర అభిమానులు అదృశ్యమవుతుండడం విచారకరం. నేటి యువతరం పట్టుమని పది నిమిషాలైనా పత్రికలు చదవడం లేదు. గంటల కొద్దీ వాట్స్ అప్ ఫేస్ బుక్ యూట్యూబ్ లు లాంటివి చూసుకొంటూ కాలం గడుపుతున్నారు. బాత్ రూమ్ లో కూడా వారు వాటిని వదలడం లేదు. దిండు దుప్పటి లేక పోయినా ఫర్లేదు కానీ సెల్ పక్కన లేకపోతే నిద్రపోలేక పోతున్నారు.

మీకు తెలుసో తెలియదో కానీ నేనూ ఒక చిన్న సైజు రచయితను. ఆడికి అమావాస్యకీ నా కవితలు పత్రికల్లో ప్రచురింపబడతాయి. వాటిని కనీసం నా భార్యా బిడ్డలు కూడా చూడరు, చదవరు" అన్నాడు గద్గదస్వరంతో. వెంటనే సూత్రదేవి రిజిస్ట్రార్ కి చల్లటి నీళ్లు అందించింది. జాలిగా రిజిస్ట్రార్ వైపు చూడసాగారు సభికులు.

నీళ్ళుతాగి మళ్లీ శక్తి పుంజుకొని గొంతు సవరించుకొని "ఎడారిలో ఒయాసిస్సుల్లా అప్పుడప్పుడు ఇలాంటి ఉత్తమ పాఠకులు ఎదురవుతారు. ఇలాంటి వారిని చూస్తే పాయసం తాగుతున్న నోటికి జీడిపప్పో బాదంపప్పో ఎండుద్రాక్షో తగిలినంత సంబరం అవుతుంది . సీరియస్ మరియు సీనియర్ రీడర్స్ ని ప్రోత్సహించాల్సిన బాధ్యత, వారిని రక్షించుకోవాల్సిన నైతిక బాధ్యత సమాజం పైన వుంది" అని చెప్పి కూర్చొన్నాడు.

జనాలందరూ లేచి మరీ చప్పట్లు కొట్టినారు. వేయి విద్యుత్ దీపాల కాంతి ముఖంతో సూత్రదేవి లేచి నిలబడి హాల్ లోని జనాన్ని చూస్తూ కుడిచేయి ఊపింది. ప్రోగ్రాం ఆర్గనైజర్ పరంధామిరెడ్డి కుశాలగా నవ్వుతూ ఆనందం తో అందరకీ వేడివేడి ఉల్లిపాయ పకోడీ మరియు ఫిల్టర్ కాఫీ అందించసాగాడు.

పెంట్ హౌస్ లో ఒంటరి జీవితం గడుపుతున్న యువ రచయిత యుగంధర్ భావోద్వేగంతో స్టేజి మీదకు వచ్చినాడు . "పుస్తకమా ... ఓ పుస్తకమా....". అంటూ పూనకం వచ్చిన వాడిలాగా పద్యం పాడినాడు

సెక్రటరీ అందించిన దుశ్శాలువాని రిజిస్ట్రార్ రంగరాజు స్టార్ అఫ్ ది డే సూత్రదేవికి కప్పినాడు. ఫ్లవర్ బొకే అందించినాడు. ఇంతలో ఫోటోగ్రాఫర్ గబా గబా వచ్చినాడు. ఫ్లవర్ బొకేని అలాగే పట్టుకోమని, శాలువా ని అలాగే వుంచుకోమని సూత్రదేవి ని కోరినాడు. ప్రెసిడెంట్ సెక్రెటరీలను దగ్గరగా జరగమని చెప్పి పదిహేను సార్లు క్లిక్ క్లిక్ లు కొట్టినాడు. సన్మాన గ్రహీతకు,సన్మానించిన రిజిస్ట్రార్ కు అపార్టుమెంటు లేడి లీడర్ శారదాంబ ఫ్రూట్స్ బొకే అందించింది.

కాలేజి యూత్ అందరూ ఊగతా ఊగతా స్టేజివద్దకి వచ్చినారు. గుడ్ బెటర్ బెస్ట్ రీడర్ తో సెల్ఫీలకు దిగినారు. చక చక తమ వాట్స్ అప్ గ్రూపుల్లోకీ, ఫేస్ బుక్ ఖాతాల్లోకి సర్క్యులేట్ చేసినారు.

రిటైర్డ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరియు ప్లాట్స్ ప్రస్తుత సెక్రటరీ సుబ్రమణ్యస్వామి ఓట్ ఆఫ్ థాంక్స్ చెబుతున్నాడు . "ప్రతి మగాడి విజయం వెనుక ఓ స్త్రీ వుంటుంది అని విన్నాం . అలాగే ప్రతి ఉత్తమ పాఠకుల వెనుక వారి ఇండ్లల్లో సైలెంట్ ప్రమోటర్స్ వుంటారు. సూత్రదేవి గుడ్ రీడర్ షిప్ వెనుక వున్న అదృశ్య హస్తం అయిన మునిమాణిక్యం గారిని వేదికపైకి రావాల్సిందిగా కోరుతున్నాం" అని ఆహ్వానించాడు . జనాల్ననంతా తోసుకొని అస్సు బస్సు మని స్టేజిపైకి వచ్చినాడు మునిమాణిక్యం. చిన్న చిన్న పుస్తకాలను పూలమాలగా చేసుకొచ్చిన యూనివర్సిటీ లైబ్రేరియన్ లోకనాథం సరసర వచ్చి మాలని మునిమాణిక్యం మెడలో వేసినాడు. మునిమాణిక్యం ముసిముసిగా నవ్వుతూ అందరికీ దండాలు పెట్టినాడు . చివరిగా ఆయన్ని చివరి మాటలు చిన్నచిన్నగా చెప్పమన్నారు. ఉక్కిరి బిక్కిరి అయినాడు మునిమాణిక్యం .

"నా భార్యకి పుస్తకాలు అంటే ప్రాణం. తెచ్చిన పుస్తకాలు వెంట వెంటనే చదివితే గాని ఆమె తిండి తినదు. నిద్రపోదు. పత్రికలు ఆమెకి సకాలంలో అందకపోతే ఆమె ఫీలింగ్స్ చూడాలి – దేవదాసు సినిమాలో పారు పాత్రధారి సావిత్రి కూడా అంత బాధ అనుభవించి వుండదేమో. సకాలంలో పత్రిక రిలీజు కాకపోతే పబ్లిషర్లు కూడా అంత టెన్షన్ పడరేమో. పత్రికల పట్ల, పత్రికా పఠనం పట్ల అంత పాషన్ (PASSION) ఆమెది " అంటూ స్టేజి దిగాడు. జనాలు ఎగిరెగిరి చప్పట్లు చరిచినారు. ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పదవి కోసం సీరియస్ గా ప్రయత్నాలు సాగిస్తున్న పటాసుల పద్మనాభం సభికులందరికీ పుస్తక ప్రసాదం అందించసాగాడు. పైసలిచ్చి పుస్తకాలు తీసుకోవాలేమో అనుకోని ఎవ్వరూ తీసుకోలేదు . "పైసలు ఇవ్వక్కర్లేదు . పుస్తకాలు తీసుకున్నా తీసుకోక పోయినా కంపెనీ (అసోసియేషన్) లెక్క " అని చెప్పినాడు. అయిదు నిమిషాల కంతా పుస్తకాల సంచి ఖాళీ అయ్యింది.

పట్టు పావడ జాకెట్టులు ధరించిన మెడికో అమ్మాయిలు జనగణమన పాడటంతో సన్మాన సభ సమాప్తమయ్యింది. కార్యక్రమం కన్నుల పండుగగా జరిగినందులకు కార్యనిర్వాహకులు ఒకరికొకరు షేక్ హ్యాండ్ లిచ్చుకున్నారు. గబుక్కున రెక్కలొచ్చి ఎగిరినంత ఆనందంగా సన్మానం

చేయించుకున్న మొగుడూ పెళ్ళాలిద్దరూ ఎవ్వరూ గుర్తించలేని విక్టరీ సంకేతాలు ఒకరికొకరు ఇచ్చుకున్నారు. మీటింగ్ హాల్ లోని ఆడియోలో "యాకుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రా న్వితా " శ్లోకం శ్రావ్యంగా వినిపిస్తోంది.

మీటింగ్ హాల్ లో మూలన కూర్చొని వున్న రిటైర్డ్ టీచర్లు చెంగల్రాజు మరియు సంజీవరాజు పకోడీ తింటూ మాట్లాడుకుంటున్నారు . "మేము చిన్నప్పుడు మా మడిబాక లైబ్రరీలో పేపర్లని పెరుక్కొని పెరుక్కొని చదివేవాళ్ళం. వేరే వాళ్ళు చదువుతుంటే వంగివంగి, తొంగితొంగి చూసి చదివేవాళ్ళం . ఆరోజులే వేరు . నేను పుస్తకాలు తెగ చదువుతానని నాకు పుస్తకాల పురుగు అని కూడా మారు పేరు పెట్టినారు"అని పకోడీ నములుతా చెప్పినాడు చెంగల్రాజు. వెంటనే సంజీవరాజు "మా పక్క ఊరు గుజ్జనగుండ్లలోని నారాయణ రాజు బి. ఎ . వరకు చదివినాడని ఆయన బతికినంతకాలం ఆయన్ని బి. ఎ.,నారాయణ రాజు అని పిలిచినారు . ఎమ్ .ఎ . చదివిన మొగిలిరాజును ఎమ్ .ఎ., మొగిలిరాజు అని పిలిచినారు " అని కట్టుడు పళ్లతో పకపక నవ్వుతూ చెప్పినాడు. పుస్తకాల తల్లిని ప్రాణంగా భావించే రోజులు పోయి పుస్తకం తాకితే ఫైజులిచ్చే రోజులు వస్తున్నాయని ఇద్దరూ బాధపడినారు.

న్యూస్ కవరేజికి వచ్చి వీరిద్దరి మాటలు విని ఆలోచనలోపడిన కల్చరల్ న్యూస్ కాంట్రిబ్యూటర్ ప్రజ్ఞా మూర్తి తలపైకెత్తి చూసినాడు. మీటింగ్ హాల్ లోని గోడపైన , నీళ్లలో తామరపువ్వులో వీణ వాయిస్తూవున్న సరస్వతీ దేవి ఫోటో కనిపించింది. సూక్ష్మంగా చూసిన ప్రజ్ఞా మూర్తికి సరస్వతీదేవి (కాదంబరి) కళ్లు చెమ్మగిల్లడం కనిపించింది.

# మనసున మనసై — యలవర్తి అనురాధ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**మంచు** మేలిముసుగులో పెళ్ళి కూతురిలా ఉంది ఊరంతా. పైన మఫ్లర్ కట్టుకుని, చలికోటు వేసుకుని ఆ మంచు తెరను చీల్చుకుంటూ నడకను సాగిస్తున్నాడు కృపాకర్. ప్రశాంతమైన వాతావరణంలో ఆలోచనలు తోడుగా ఆ పయనం తనకెంతో ఇష్టం.

తెల్లవారితే ఏముంది? అంతా గజిబిజి గందరగోళం. అందుకే ఎంత బద్ధకంగా ఉన్నా ఈ మార్నింగ్ వాక్‌ను మాత్రం వదులుకోడు. రోజంతటిలో అతడు ఎంతో ఆనందించే సమయం ఇది.

అందరికీ నడుస్తున్న అతడు ఒక్కడే కనిపిస్తూ ఉంటాడు. కానీ ప్రతీ అడుగు వెంట అడుగు వేస్తూ ప్రక్కన ప్రియ ఉంటుంది. అది అతడి మనసుకు మాత్రమే తెలిసిన సత్యం.

"ప్రియా! ఏదయినా మాట్లాడు"

"ఏం మాట్లాడను? ఈ రోజు ఎందుకో నీ ప్రక్కన మౌనంగా అడుగులు కదపాలని మనసు చెబుతోంది"

"పోనీ అలాగే కానీ నీ మౌనం కూడా నాకెన్నో కబుర్లు చెబుతుంది" అన్నాడు కృపాకర్.

"ఎక్కడా లొంగవు కదా!"

"నువ్వంటే నాకు పిచ్చిప్రేమ. ఆ ప్రేమకోసం నేను ఏమైనా చేస్తాను. నన్ను నేను త్యాగం చేసుకోవలసి వచ్చినా నేను సిద్ధమే"

"ఇప్పుడు నువ్వు చేస్తున్నది అదేగా"

"లేదు ప్రియా. నువ్వలా అంటే నేనొప్పుకోను"

"ఎన్నాళ్ళిలా ఒంటరి ప్రయాణం చేస్తావ్?"

"అరే! చెబితే అర్థం చేసుకోవే, భౌతికంగా నువ్వు నా ప్రక్కన లేవు. కానీ ఆలోచనలలో ఉన్నావుగా అది చాలు. అదే నాకు కొండంత ధైర్యాన్నిస్తుంది. మరొకరిని పెళ్ళి చేసుకుంటే ఈ ఆనందాన్ని కోల్పోతాను. అలాంటి పని ఎప్పటికీ చేయను"

"గత ముప్ఫై సంవత్సరాలుగా నీకు చెప్పి చెప్పి విసిగిపోయాను. నేను వెళ్ళిపోతేగానీ నువ్వు ఇందులోంచి బయటపడవు"

"వెళ్ళలేవు. నేను వెళ్ళనివ్వను. మనసు సంకెళ్ళతో నిన్నెప్పుడో బంధించేసాను."

"అవును. అది నిజమే అందుకే ఆత్మవై కూడా నీ చుట్టే తిరుగుతున్నాను"

"విధి చేసే వింత నాటకంలో విడిపోయిన జంటగా అయితే మిగిలాంగానీ మనసు గూటిలో ఎప్పుడూ గువ్వల్లా జంటగానే. ఈ బంధాన్నీ, అనుబంధాన్నీ ఎవరూ విడదియ్యలేరు"

"కృపా! కృపా!" ప్రియ పిలుపు అతనికి వీనుల విందుగా వినిపిస్తోంది. ఎలా వెళ్ళాడో అలాగే తిరుగు ప్రయాణమయ్యాడు.

"పెద్దన్నయ్యా"

తమ్ముడు చక్రధర్ పిలుపుకు "ఏంటిరా?" అంటూ వెనక్కి తిరిగాడు.

"కాలేజీలో ఫీజు కట్టాలి అన్నయ్యా!"

"నీకు కాలేజీ ఫీజు కట్టి నాలుగురోజులయింది. బుద్ధిగా చదువుకో వెళ్ళు."

"అవునా?" అయినా అన్నయ్యకు అన్నీ తెలుసు. తెలియదనుకోవటం తనదే తప్పు. అనుకున్నాడు మనసులో చక్రధర్.

చిట్టచివరి తమ్ముడు. వాడంటే అందరికీ ముద్దే. డాక్టరు చదువుతున్నాడు. తమ ఊరు సిరిపురానికి, ప్రజలకు ఆరోగ్యవిషయంలో సేవ చేయాలని ఉబలాటపడుతున్నాడు. వాడి చదువు అయిపోయేటప్పటికి చిన్న డిస్పెన్సరీ తను తెరిపించాలి.

రెండో తమ్ముడు హేమంత్. వాడికి చదువు చెప్పటమంటే ఎంతో ఇష్టం పాఠాలతోపాటు విద్యార్థులకు విలువలను కూడా బోధిస్తూ సమాజానికి ఎంతో ఉపకారం చేస్తున్నాడు.

ఇప్పటి వాళ్ళు అవే కదా కోల్పోతున్నారు.

ఇక నాలుగోవాడు సంఘసేవకే పుట్టానన్నట్లుంటాడు. వాడి ప్రతి పనిలో ఎవరికో ఒకరికి పనికి వచ్చే పని ఉంటుంది.

ఊరు మన తల్లిలాంటిది. బిడ్డలా సేవ చేస్తూ ఋణం తీర్చుకుంటూ ఉండాలి. అని తండ్రి చెప్పిన మాటలని నిజం చెయ్యాలని తామంతా తపిస్తూ ఉంటారు. తండ్రిని తలుచుకోగానే కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఏయ్! ఆ కళ్ళు నావి. అందులో కన్నీళ్ళని నేను చూడలేను" ప్రియ ప్రక్కనుంచీ అంటున్న మాటలకు కండువాతో అద్ది ఆపేసాడు.

"కృపా! పొలంకి వెళ్ళలేదా?" అమ్మ లోకేశ్వరి పిలుపులో ఈ లోకంలోకి వస్తూ "ఇప్పుడే వెళుతున్నానమ్మా" అన్నాడు.

"ఆ! నాన్నా! అలాగే సీతయ్యకి నాలుగు చీవాట్లు పెట్టు. భార్య మాటలు విని వాళ్ళమ్మను వృద్ధాశ్రమంలో పెడతాను అంటున్నాడట. అలాంటివి మన ఊరిలో జరగటానికి వీలులేదు. తను పస్తులు ఉండి వాడ్ని పెంచింది. అది వాడికి తెలియక పోవచ్చు. కానీ మనకు తెలుసుకదా!"

"అలాగే అమ్మా!"

"అందరూ కలిసి ఊర్లో మద్యం షాపే లేకుండా చేసాం. అలాంటిది ఇది ఒక లెక్కా?" అనుకున్నాడు మనసులో.

"అవును. నువ్వు ఏదనుకున్నా సాధిస్తావు. నాకు తెలుసుకదా" చెవిలో ప్రియ గుసగుసలు.

నవ్వుకున్నాడు కృపా.

ఇది తమకు అలవాటేనన్నట్లు ఎదురు పడ్డ జనాలు పట్టించుకోవటం ఎప్పుడో మానేసారు. అతను ప్రేమలోకంలో ఉన్నా ఈలోకానికి కావల్సినవి చేస్తూనే ఉన్నాడు. తన గ్రామానికి స్వచ్ఛగ్రామంగా పేరు వచ్చిందంటే అది అతని వల్లే మరి.

ఇలా అనుక్షణం తనని నీడలా వెంబడించే ప్రియలేదని అందరూ అంటుంటే తనకు ఎంతగానో ఉంటుంది.

మనసున మనసై తోడొకరుండిన అదే భాగ్యమూ.. పాట వినిపిస్తోంది ఎవరింట్లోంచో టీ.వీలో వస్తోందేమో!

ఎంత చక్కటి భావం? రాసిన వాళ్ళకి, పాడిన వాళ్ళకు చేతులెత్తి మొక్కాల్సిందే

"కృపాబాబూ! గంగి గుడిసె అంటుకుపోయింది బాబూ" అంటూ ఎదురుగా చిన్ని కృష్ణ వచ్చి చెప్పటంతో

"అరెరె" అంటూ అటు పరుగెత్తాడు. అందరూ కలసి మంటలు ఆర్పారు కానీ ఏమీ మిగలలేదు. ప్రక్క ఇళ్ళకు మంటలు వ్యాపించకుండా మాత్రం ఆపగలిగారు.

గంగి నడిరోడ్డులో నిలబడింది.

"గంగీ! నువ్వు మా ఇంటికి వెళ్ళు. ఏం భయంలేదు. అమ్మ నిన్ను చూసుకుంటుంది. మా ఇంట్లోనే ఉండవచ్చు. నలుగురూ నాలుగు చేతులు వేస్తే నీకు గుడిసె ఎంతసేపటిలో రాదూ. అరేయ్ చిన్నీ! నేను తొందరపని మీద పొలంలోకి వెళుతున్నా. అక్కను మా ఇంటి దగ్గరకు వెంటబెట్టుకుని తీసుకు వెళ్ళి అమ్మకు అప్పచెప్పు"

"అలాగే" అని తల ఊపి గంగి చెయ్యి పట్టుకున్నాడు రమ్మన్నట్లు.

అతన్ని అనుసరించింది గంగి.

పొలం పని చూసుకుని మామిడిచెట్టు నీడన సేదతీరసాగాడు. చెట్టంతా పూతతో కళకళలాడుతోంది. మామిడికాయలు చెట్టెక్కి కోసుకుని దిగమంటే ప్రియకు ఎంతో ఇష్టం. ఎందుకురా ప్రియ అంటే నీకంత ఇష్టం అని అందరూ అడుగుతూ ఉంటారు. ఇష్టానికే ఇష్టం ఏమిటని అడిగితే తన ప్రియనే చూపుతుంది. అలాంటిది తను ఎంత?

తన భావనకి తనే నవ్వుకున్నాడు.

ప్రియ తన అత్తకూతురు. చిన్నప్పటి నుంచీ కలిసే పెరిగారు. ఇద్దరి ఇళ్ళు ప్రక్కప్రక్కనే ఉన్నా ఇద్దరూ ఎప్పుడూ ఒక్కచోటే ఉండేవారు. ఒకే స్కూల్లో చదివారు. అక్కడ కూడా ప్రక్కప్రక్కనే ఉండేట్లు కూర్చునేవారు అటూ ఇటూ. అది చూసి అందరూ నవ్వేవారు. మెచ్చుకునేవారు కూడా. వాళ్ళ వయసుతో పాటూ ప్రేమ కూడా పెరుగుతూ వచ్చింది. పెళ్ళిలో ముడిపెట్టేస్తే సరి అనుకున్నారు పెద్దలు.

ఆ ఇంట బాజాభజంత్రీలు మ్రోగాయి.

సంవత్సరం పాటు రోజులు ఎలా గడిచిపోయాయో వారికే తెలియదు. ప్రియ గర్భం దాల్చింది. తన ప్రతిరూపాన్ని అందివ్వబోతున్న ప్రియను మరింత అపురూపంగా చూసుకోసాగాడు.

కానీ అన్ని వేళలా కాలం ఒకలా ఉండదన్నట్లు కాన్పులో తల్లి, పిల్లా ఇద్దరూ మృతి చెందారు.

ప్రియ యముడ్ని ఎదురించి అయినా తనను విడిచి వెళ్ళదనుకునేవాడతను.

"ఇప్పుడు మాత్రం ఎక్కడికి వెళ్ళాను. నీ ప్రక్కనే ఉన్నానుగా" చెవిలో గుసగుసగా వినిపించేవి మాటలు.

ఇదే తన అదృష్టం అనుకున్నాడు మనసులో.

అప్పటినుంచీ ఇలా గడిపేస్తున్నాడు. కుటుంబసభ్యుల ఆనందం తన ఆనందాన్ని వెతుక్కుంటున్నాడు.

పెళ్ళాంపోగానే మరో పెళ్ళికి సిద్ధమైపోయే ఈకాలంలో ఇలాంటి వాళ్ళు అరుదే

అవును. మహాత్ముడు, మదర్ థెరిసాలు వందమంది ఉండరు. ఒక్కరే ఉంటారు.

అలాగే ప్రేమకి ఈ కృపాకర్ కూడా.

కృపాకర్‌ని లేపటానికి వచ్చిన లోకేశ్వరికి "ప్రియా! తెల్లవారింది. ఇక లేద్దామా?" అన్న కొడుకు మాటలతో కడుపు తరుక్కుపోయింది.

"శ్రీరామచంద్రుడిలాంటి కొడుకు. సీతమ్మను దూరం చేసినట్లు మా ప్రియను లాక్కెళ్ళావు. ఇంకా ఇలా ఎన్నాళ్ళు అలా ఆమె జ్ఞాపకాలలో బ్రతుకుతాడు? ఒడ్డున పడెయ్యి తండ్రీ" అక్కడే ఉన్న ఆంజనేయ స్వామి ఫోటోకు నమస్కరించింది.

ఎవరైనా మనస్తత్వశాస్త్రకి చూపిద్దామని ఎంతో ప్రయత్నించారు. రానంటే రానని మొరాయించాడు. నా నుంచీ ప్రియని దూరం చేస్తే నేనే మీ అందరికీ దూరమయిపోతానని బెదిరించటంతో తామంతా ఏమీ చేయలేని పరిస్థితులలోకి నెట్టి వేయబడ్డారు.

అది ఒక్కటే లోపం తప్ప మరే విషయంలోనూ కృపాకర్‌ని తప్పు పట్టడానికి ఉండదు. అందుకే ఆ విషయంలో ఊరంతా సహకరిస్తోంది.

ఒకరోజు తోచక 'శతమానంభవతి' సినిమాకు వెళ్ళాడు. సినిమా చాలా హాయిగా ఉంది కదా బావా అంది ప్రియ ప్రక్కన చేరి.

"అవును ప్రియా!" అన్న పదాలు మనసులోనే ఉండిపోయాయి. బయటకు రాలేదు.

సినిమా నుంచీ బయటకు వస్తుంటే "పెద్దన్నా! మా అమ్మాయికి ఆడపిల్ల పుట్టింది. ఒక్కసారి చూసి ఆశీర్వదించి పోతే బాగుంటాది" అంది పార్వతమ్మ.

"రేపు తప్పకుండా వెళ్ళాలి" అనుకున్నాడు మనసులో.

"అవును వెళదాం" అంది ప్రియ ప్రక్కనుంచే

"తప్పకుండా వస్తాను" అని ఆమెకు మాటిచ్చి ముందుకు కదిలాడు.

అతని వెంటే ప్రియకూడా.

"కాస్త నెమ్మదిగా నడువు బావా. అంత తొందర తొందరగా ఎవరో వెంటపడి తరుముతున్నట్లు పరుగెడతావేం?"

"అది తను అసలు ఆలోచించలేదు" అనుకుంటూ తన నడక వేగం తగ్గించాడు కృపాకర్.

అందరూ లేదనే మనిషికి కూడా అంత విలువ ఇస్తాడు. ఆత్మకి వేగం లేకపోవటమేమిటి అని కూడా ఆలోచించడు.

కనకబాబు ఎదురు వచ్చాడు.

"అన్నా! నీతో మాట్లాడాలి"

"పద! అలా రచ్చబండ దగ్గర కూర్చుని మాట్లాడుకుందాం"

"లేదన్నా! మా ఇంటికి వెళదాం"

"సరే!" అన్నాడు.

లోపల వరండా అరుగు మీద కూర్చున్నారు ఇద్దరూ.

"నా భార్య భాగ్యం యాక్సిడెంట్‌లో పోయిందని నీకు తెలుసుకదా. నాకు వేరే పెళ్ళి చేసుకోవాలని ఉంది. "

"చేసుకో. అందుకు ఆలోచించటం ఎందుకు?"

"నీలా ఉండలేకపోతున్నానన్నా"

"పిచ్చి రాజూ! నాలా అందరూ ఉంటే ఇంక సంసారాలు ఎక్కడ ఉంటాయి? చచ్చిపోయిన వాళ్ళతో మనమూ పోతామా? అలాగని జీవితమంతా ఒంటరిగా గడపగలమా?"

"మరి నువ్వెందుకు అలా ఉన్నావన్నా?"

అమ్మగానీ ఇతనితో ఇలా అడిగించటంలేదు కదా? అని అనిపించింది ఒక్క క్షణం కృపాకర్‌కి. కాదు. కాదు. ఎప్పుడూ అలా చెయ్యదు అమ్మ అనుకున్నాడు మళ్ళీ.

"అందరిదీ ఒక భావన కాదు కదా! ప్రియతో నా బంధం అలా ముడిపడిపోయింది. ఆమె స్థానంలో నేను మరొకరిని ఊహల్లో కూడా భరించలేను. అందుకే ఆ ఆలోచనను ప్రక్కకు పెట్టాను. నాకు ఇలా ఒంటరిగా ఉండటంలోనే సంతోషం ఉంది. అయినా ప్రియలేకపోయినా మా వాళ్ళంతా ఉన్నారుగా. నీకు అలాకాదు. తోడు ఎవ్వరూ లేరు. సమాజంలో ఒంటరిగా బ్రతకటం కష్టం. నేనే మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేస్తాలే"

"ఇలా అడిగానని ఏం అనుకోవుగా?"

"భలేవాడివే. అన్నా అని పిలిచాక తమ్ముడిని తప్పుపడతానా?"

"సరే. నేను వెళ్ళొస్తా"

"కాస్త మజ్జిగ త్రాగి వెళ్ళన్నా"

"లేదు. అమ్మ నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. వెళ్తున్నా" అంటూ వెళ్ళిపోయాడు కృపాకర్.

అందరికీ చచ్చిపోయిన ప్రియ తనతో అనుక్షణం ఉంటుందని చెప్పినా జనం నమ్మరు. వాళ్ళతో నాకు పని ఏంటి?

"అవునవును బావా" అంది ప్రియ చిలిపిగా.

అలాంటప్పుడే ప్రియ తలమీద సరదాగా ఒకటి వెయ్యాలనిపిస్తుంది దెబ్బతగలకుండా.

కానీ అంది మాత్రం అసాధ్యం కదా!

"తొందరగా నన్నుకూడా అక్కడికి తీసుకెళ్ళిపో ప్రియా" ఘోషిస్తోంది అతని హృదయం.

"వచ్చేద్దువుగానీ బావా! వచ్చేద్దువుగానీ"

ప్రియ కంఠం లాలనగా.

ఆ రోజు కోసం ప్రతిరోజూ కళ్ళు తెరుస్తున్నాను ప్రియా.

"నాకు తెలియదా బావా?"

ఇంటికి ఎలా వచ్చాడో అతనికే తెలియదు.

తల్లి లోకేశ్వరి అతనికి ఎదురువచ్చి "వచ్చావా? ఇంకా రాలేదేమిటా అని అనుకుంటున్నా. రా! భోజనం పెట్టేస్తాను"

అన్నం తింటున్న కొడుకుతో "కృపా! ఈలోకం రోజు రోజుకీ మారిపోతోందిరా"

"ఏమైందమ్మా?"

"మన ఎదురింటి సౌభాగ్యం ఉంది కదరా"

"ఆఁ ఉంది"

"వాళ్ళాయన ఎవరితోనో ఉంటున్నాడట. ఊరంతా గుప్పుమంటోంది. మన ఊర్లో ఇలాంటి తప్పుడు పనిని మనం చెయ్యనివ్వంగా. ఒక పెళ్ళాం ఉండగా మరో పిల్లని ఆ భావంతో చూడటం తప్పుకదా! నిజానిజాలు ఏమిటో నువ్వే నిగ్గు తేల్చాలి"

"చెప్పావుగా నేను కనుక్కుంటాలే"

ఈ మధ్య తనూ ఒకటి రెండు చోట్ల ఈ మాటలు విన్నాడు.

అతను అలాంటి వాడు కాదు. ఇందులో ఏదో రహస్యం ఉంది. తప్పకుండా ఓసారి ఆ విషయం తెలుసుకోవాలి.

సౌభాగ్యం నుదిటిన ఆ కుంకుమకే అందం వచ్చినట్లుంటుంది. అలాంటి ఆమెకు ఇలాంటి కష్టం రావటమంటే తను ఒప్పుకోను కాక ఒప్పుకోడు.

మనిషి నైతిక విలువలు పాటించకపోతే ఎలా?

"పోనీలేమ్మా ఇప్పుడేం లేదు కదా!"

"ఏమో ఉండి ఉంటే అన్న విషయాన్నే భరించలేకపోయాను"

"ఇప్పుడు తెలిసిపోయిందిగా. హాయిగా నిద్రపో"

"ఆ మాట తెలిసినప్పటినుంచీ నాకు కంటిమీద కునుకు లేదంటే నమ్ము. అలాటి ఆడకూతురికి కష్టం వచ్చిందంటే నాకు వచ్చినట్లు కాదా?" అంటూనే ఆవిడ గదిలోకి వెళ్ళిపోయింది.

"బావా! నాకు మాత్రం ఆ బాధలేదు" ప్రియ అంది నవ్వుతూ. చిన్నగా నవ్వుకున్నాడు.

మళ్ళీ అదే ఆలోచన. చిన్నగా ప్రియ తలమీద తట్టాలని.

ఎప్పుడు తామిద్దరూ కలిసేది. అందరూ చచ్చిపోతామేమో అని మృత్యువుకి భయపడతారు. తను మాత్రం దాన్ని ఆహ్వానిస్తున్నాడు ప్రియను చేరాలని.

"వద్దు బావా! నా ఒక్కదానికోసం నువ్వలా ఎదురు చూడకు. నీ వల్లే కదా మన ఊరు ఇంత బాగుపడింది. ఇంకా నువ్విక్కడే ఉండి మంచి మంచి పనులు చేస్తుంటే నేను ఆనందంగా చూస్తుంటాను. ఇప్పుడు మాత్రం ఏమయింది? ఎప్పుడూ నేను నీ ప్రక్కనే ఉంటున్నానుగా. అలాంటి ఆలోచనలు రానివ్వనని నాకు మాట ఇవ్వు."

"ఇంకా తటపటాయిస్తావేం బావా? నీ వల్లే ఈ ఊరు 'విలువల ఒడి'లా మారిందని మన ఊరివారందరికీ తెలుసు. అలాంటిది నువ్వు లేకపోతే ఎలా మారిపోతుందో ఏమో?"

"చెడ్డవాడు మంచిగా మారాలంటే కష్టం ప్రియా. అలా మారిన మంచివాడు తొందరగా చెడ్డవాడు అవడు. ఆ నమ్మకం నాకుంది. నన్ను నీ దగ్గరికి వచ్చెయ్యనీ ప్రియా"

"బా....వా..!"

"ప్రి...యా..!"

వాళ్ళ పిలుపులు ప్రక్కప్రక్కనే.

కొంతకాలానికి తనువులూ ప్రక్కప్రక్కనే.

కాలం ఇచ్చిన తీర్పు ఇదే

# విలువలు

విద్యార్థి

స్వర్ణకు పురుడు పోసాడు పన్నెండేళ్ల కోఫీ. ఆ పురిటినీళ్ల పళ్లాన్ని పట్టకారుతో జాగ్రత్తగా పట్టుకుని కొంచెం ప్రక్కగా గుమ్మరించాడు. అక్కడ ఉన్న చీమల బారులు ఒక్కసారిగా, కుప్పలు, కుప్పలుగా చలనం లేకుండా పడిపోయాయి. అటుగా తిరుగుతున్న తొండ ఒకటి పడిపోయిన చీమల కోసం నాలుక చాచి అందుకుంది. వెంటనే కుప్పకూలింది. ఆ తొండను ఇంకొక పక్షితినటానికి అందుకోబోయింది. ముక్కుతో తాకగానే మరణించింది.

అప్పుడే వెలుతురు చూసిన స్వర్ణ ఇదంతా చూస్తూనే వుంది. గర్వ పడింది. తన పురిటి నీళ్లకే ఇంత మహిమ వుంటే, తనకి ఇంకెంత విలువ ఉంటుందీ? మురిసిపోయింది.



కోఫీ పురిటి నీళ్ల పళ్లెంలో స్వర్ణను ఉంచి ప్రక్కనే ఉన్న సెలయేటి నీళ్లల్లో ఉంచాడు. మిల మిలలాడుతూ ఆడుకుంటున్న చేప పిల్లలు చలనంలేకుండా సెలయేటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. స్వర్ణ తళ తళా మెరిసింది. స్వర్ణను ఒక తగరంలో చుట్టి జాగ్రత్తగా తన నిక్కరుకున్న లోపలి జేబులో పెట్టుకున్నాడు కోఫీ.

కోఫీ అనాథ. గలామసీ పనులు చేస్తూవుంటాడు. బ్రిటిష్ వారిని ఎదిరించి, ఓడిపోకుండా గర్వంగా నిలబడ్డ అషాంతి తెగకు చెందినవాడు. ఈ అషాంతి రాజ్యం నేటి ఘానా దేశంలో కలసిపోయింది. ఆ దేశానికి యురోపియన్లు ఇచ్చిన పేరు స్వర్ణ తీరం, గోల్డ్ కోస్ట్. ఇక్కడ బంగారం బాగా దొరుకుతుంది.



కోఫీ గొప్ప రైతు కుటుంబంలోనే పుట్టాడు. అతని తాతగారికి పది ఎకరాల కోకోవా తోట ఉండేది. కొకోవా గింజలు లేకపోతే చాక్లెట్టు అనే పదార్థమే లేదు. అందులోనూ ఘానా కోకోవా గింజల నాణ్యత, రుచే వేరు. నాలుగేళ్ల క్రితం కోఫీ తాతగారితో కలసి కోకోవాతోటకి వెళ్లి అక్కడ ప్రక్కనే ఉన్న సెలయేటిలో ఆడుకునే వాడు. అప్పుడప్పుడూ తన చిట్టి చెల్లెలితో కలసి, తుండుతో నీటిలో మిల మిలాడే చేపలను పట్టుకోవటానికి ప్రయత్నిస్తూ ఆడుకునేవాడు. చుట్టూ పచ్చని అడవి. ఎన్నో అందమైన పక్షులు. ఎన్నో వింత జంతువులు. సారవంతమైన నేల, ఏ గింజా నాటాల్సిన అవసరంలేదు, వాటంతటికి అవే పడతాయి, అవే మొలుస్తాయి, అవే పెరుగుతాయి. కానీ అక్కడక్కడా బంగారం కోసం తవ్విన కందకాలు కనిపించేవి. "మన శ్రమకూ, చెమటకూ మించిన బంగారం లేనే లేదు" అనేవాడు కోఫీ తాతగారు.

కోకోవా కాయలు

అటువంటిది ఎగువన ఉన్న ఆంగ్లో అషాంతి గోల్డ్ మైన్స్ లోని దుర్ఘటనతో ఒక్కసారిగా జీవితం తిరగబడింది. అక్కడినుండి కొట్టుకువచ్చిన వ్యర్థాలతో కొకోవా తోట పూర్తిగా నాశనమయ్యింది. గోల్డ్ మైన్స్ వాళ్లతో జరిగిన పోరాటంలో తన తండ్రి మరణించాడు. తాతగారు

నిదానస్తుడు, కోఫీని చదివించుకోవాటనికైనా కొంత డబ్బు అవసరమని, తప్పక, అదే ఆంగ్లో అషాంతి గోల్డ్ మైన్స్‌లో కూలీగా చేరాడు. సంవత్సరం క్రితం మైన్స్‌లో జరిగిన దుర్ఘటనలో మరణించాడు.

కోఫీ అధైర్యస్తుడేమీ కాదు, పౌరుషం కలిగిన అషాంతి తెగకు చెందినవాడు. తనలాంటి పిల్లలు ఇప్పుడు చాలా మంది గలామసీలుగా చేస్తున్నారు. గలామసీ అంటే ఎక్కడపడితే అక్కడ, ఏదో విధంగా బంగారం ఉందన్న చోట గోతులు తవ్వి, ఆ మట్టిలోనుంచి వీలయినంత బంగారు తీయటం. నాశనమైపోయిన తన తాతగారి తోటలోనే బంగారం వెతకటం మొదలుపెట్టాడు కోఫీ. ఇదివరకు ఎంతో అందంగా ఉన్న ప్రాంతం ఇప్పుడు వందల మంది గలామసీలు చేసిన గోతులతో, గాయాలతో అసహ్యంగా తయారయ్యింది.

కోఫీ తెలివైనవాడు. అసలు తన తాతగారి కొకోవా తోట ఉన్నట్టుండీ ఎందుకు నాశనమయ్యిందో తెలుసుకున్నాడు. ఆంగ్లో అషాంతి గోల్డ్ మైన్స్ వారు భూగర్భంలోనుంచి మట్టిని తీసి, దాన్ని పొడి చేసి, పెద్ద పెద్ద గుట్టలు చేసి, దాని మీద సైనైడ్ నీళ్లు జల్లుతారు. సైనైడులో బంగారం కరుగుతుంది. ఆ బంగారంతో కలసిన సైనైడ్ ద్రావకాన్ని టాంకులలో నింపి అందులో తుత్తునాగం (Zinc) పలకలు పెడతారు. ఇప్పుడు సైనైడ్ తుత్తునాగాన్ని మింగి, బంగారాన్ని కక్కుతుంది. ఈ సైనైడ్‌తో కలసిన బంగారపు నీళ్ల టాంకులు జాగ్రత్తగా నిర్మించక పోవటంతో అవి కూలి దిగువున ఉన్న కోకోవా తోటలన్నీ నశించిపోయాయి. ఇది తెలుసుకున్న కోఫీ, అదే విధంగా తను కూడా బంగారం ఎందుకు తీయకూడదు అని ఆలోచించాడు. సైనైడ్ సీసా ఒకటి, తుత్తునాగం పలక ఒకటి దొంగిలించాడు. మిగిలిన గలమెసీలు పాదరసం వాడతారు, తనకి తెలివి ఎక్కువ కదా, కోఫీ కొత్త రకంగా ఆలోచించాడన్న మాట.

ఇప్పుడు ఆ సైనైడ్ నీళ్లతోనే స్వర్ణకు పురుడు పోసాడు. స్వర్ణ బొద్దుగా మిల మిలా మెరిసిపోతోంది. తృప్తిగా చూసుకున్నాడు. పది ఎకరాల కోకోవా తోట కొనేటంత విలువ ఒక్కసారిగా దొరికింది.. తన చిట్టి చెల్లెలుకు తను తప్ప ఎవ్వరూ లేరు. ముందు చెల్లెలికి ఒక గౌను కొనాలి, ఒంటి మీద చొక్కా లేకుండా లేకుండా ఎంత కాలమని తిరుగుతుంది!? ఆ కొత్త గౌను వేసుకుని అడుక్కోకుండా, దర్జాగా రోడ్డు ప్రక్కనే అమ్మే కబాబులు, కెలేవెలేలు కడుపునిండా తినిపించాలి. ఆ తరువాత పఫ్ పఫ్ మిఠాయిలు ఇద్దరూ కూర్చుని తినాలి.

కానీ తన దగ్గర స్వర్ణ ఉందని ఎవరికీ తెలవకూడాదు. స్వర్ణని ఒక తగరంలో చుట్టి తన నిక్కరు లోపల ఎక్కడో జాగ్రత్త చేసాడు. ఇప్పుడు స్వర్ణని అమ్మాలి.

కోఫీ నడకలోనే కొత్త ఉత్సాహం కనబడింది. ఇప్పుడు ఘానాలో బంగారం వ్యాపారం చేసేవాళ్లు, పెట్టుబడులు పెట్టేవారూ, ఎక్కడ బడితే అక్కడ కందకాలు తవ్వి బంగారం తియ్యటంలో ఆరితేరిన వాళ్లు చైనీసు పెట్టుబడీదార్లు.. వాళ్లు ఉండే ప్రాంతం వైపు వడి వడిగా అడుగులు వెయ్యటం మొదలుపెట్టాడు కోఫీ. ఉన్నట్టుండి ఎవరో ఒక అపరిచితుడు నవ్వుతూ దగ్గరక వచ్చాడు. కోఫీ వాలకం చూసి "బంగారం అమ్మటానికి వచ్చావా, నాతో రా, మంచి రేటు ఇప్పిస్తాను" అన్నాడు. కోఫీ ఇబ్బందిగా కళ్లు ప్రక్కకి తిప్పి ఒక్క ఉదుటున పరుగందుకోపోయాడు. అపరిచితుడుతో పాటు కోఫీ వెనుకగా వచ్చిన ఇంకొక వ్యక్తి కోఫీ మెడ మీద గట్టిగా ఒక దెబ్బ వేసాడు. పడిపోతున్న కోఫీని ముందు ఉన్న వాడు పొట్టలో గట్టిగా తన్నాడు. చలనం లేకుండా రోడ్డు గుంటలో పడిన కోఫీనీ ఆ ఇద్దరు వ్యక్తులూ వెతికి స్వర్ణను బయటకి తీసారు. స్వర్ణ ఆశ్చర్యపోయింది, తనని ఇంత ఇష్టపడతరా!!! తనకి ఇంత విలువ ఉందన్నమాట!!!.

ఆ ఇద్దరు వ్యక్తులు ఒక చైనీసు వ్యక్తి దగ్గరకు వెళ్లారు. అతను స్వర్ణను పరిశీలించాడు. "సరే, వెయ్యి చీడీ లు (ఘానా కరెన్సీ ఛీడీ) 20 గ్రాముల మాదక ద్రవ్యాలు ఇస్తాను, తీసుకోండీ" అన్నాడు. కనీసం 50 గ్రాముల మాదక ద్రవ్యాలు కావలన్నారు వారిద్దరూ. ఆ చైనీసు వ్యక్తి, ఒక చిరు నవ్వు విదిల్చి, సరే నన్నాడు. స్వర్ణ పుట్టి మూడు గంటలైనా కాలేదు, తన విలువ ఇంతగా పెరుగుతోంది అని గర్వించింది.

ఆ చైనీసు వ్యక్తి దగ్గర ఇంకా చాలా బంగారం ఉంది. ముందు వేసుకున్న ప్రణాళిక ప్రకారం స్విట్జర్లాండు బయలుదేరాడు. ఘానా రాజధాని అక్రా ఎయిర్‌పోర్టులోతనిఖీ ఎక్కువగా ఉంటుంది, లంచం అడుగుతారు. ఎందుకొచ్చిందీ, ప్రక్కనే ఉన్న ఐవరీ కోస్ట్ నుంచి వెళితే తేలిక. ప్రణాలిక వేసుకున్నాడు. ఐవరీ కోస్ట్ అంటే ఏనుగుల దంతాల తీరం. స్వర్ణ తీరానికి ప్రక్కనే ఉంటుంది. ప్రపంచానికి ఏనుగు దంతాల మీద ఉన్న వ్యామోహంతో అక్కడి ఏనుగులను అంతరింపచేసారు. స్వర్ణను భద్రంగా పెట్టుకుని రోడ్డు మార్గాన ఆ చైనీయుడు ఐవరీ కోస్టులోని అబిడ్జాన్ చేరుకున్నాడు. అక్కడి నుండి

స్విట్జర్లాండులోని జ్యూరిక్ నగరం చేరుకున్నాడు. స్విట్జర్లాండులోని కస్టమ్స్ వారితో ఏమాత్రం ఇబ్బంది లేదు. నవ్వుతూ పలకరించారు. మీరు ఏమి తెస్తున్నారు మాకనవసరం, మీకు ఏమన్నా సౌకర్యాలు కావాలంటే ఏర్పాటు చేస్తామన్నారు.

ఎంత శుభ్రంగా ఉందో జ్యూరిక్ నగరం అంత అందంగానూ ఉంది. మనుషలందరూ దొరబాబులల్లే ఉన్నారు. ఆడవాళ్లందరూ లేత గులాబిల్లాగా ఉన్నారు. అందరూ ఎంతో మర్యాదస్తులు. ఎక్కడకి వెళ్లినా నవ్వుతూ పలకరింతలు. యూనియన్ బాంక్ ఆఫ్ స్విట్జర్‌లాండ్ అంటే UBS బాంకు అన్ని దేశాలలోనూ ఉంది. ఈ బాంకుకి బిలియన్ల డాలర్ల సొమ్మును ఇనకం టాక్సు కట్టకుండా అన్ని దేశాల వాళ్లకి సహాయం చేసిన ఘన చరిత్ర వుంది. హాంకాంగుకు సొమ్ము బదలీ చేయించ వచ్చు. బాంకు లోపలికి వెళ్లగానే సూటు బూటుతో నిగనిగలాడుతున్న పెద్ద మనిషి ఒకడు వచ్చి ఆ చైనీయుడిను లోపల ఉన్న ఒక చిన్న గదిలోకి తీసుకు వెళ్లాడు. "మిమ్మల్ని చూసి చాలా కాలమయ్యింది" అని పలకరించాడు. ఆ చైనీయుడు తన దగ్గర ఉన్న బంగారం గురించి చెప్పబోయాడు. ఆ స్విస్ పెద్ద మనిషి చేతితో వారించి "మీరు ఎక్కువ వివరించవలసిన అవసరం లేదు, మీలాంటి వారి కోసం మేము ఏర్పాటులతో ఎప్పుడూ సిద్దంగానే ఉంటాము" అని ఇంకొక లేత గులాబి బుగ్గల వనితను పిలిచాడు. "ఈమె, మా అనుబంధ సంస్థ స్విస్ డాటా సేఫ్ ప్రతినిధి" అని పరిచయం చేసాడు.




"హల్లో" అంటూ పరిచయం చేసుకుంది ఆ అందాల రాశి. "ఇక్కడి ఆల్ప్స్ కొండలలోని గుహలలో మీ బంగారం జాగ్రత్త చేస్తాము. బంగారం ఒక్కటే కాదు, మీరు విలువైన పెయింటింగ్స్, పురాతన శిల్పాలు, లేక విలువైన ఏ వస్తువులు తెచ్చినా మేం జాగ్రత్త చేస్తాము. మీరు ఎలా సంపాదించారనే విషయం గురించి ఒక్క ప్రశ్న కూడా అడగం. ఉదాహరణకు హిట్లర్ నాజీలు, లక్షల మంది యూదులను చంపి వారి బంగారాన్ని, వారి ప్రాచీన కళాఖండాలను మాకు రైళ్లల్లో పంపించారు. మేము ఒక్క ప్రశ్న అడగకుండ దాచాము. అది మా నిజాయితీ, నిబద్దత. కాబట్టి, మీ బంగారం మా దగ్గర చాలా భద్రంగా ఉంటుంది. ఘానాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉత్పత్తి అయ్యే బంగారం కంటే నాలుగు రెట్లు మాకు చేరుతుంది, ఎవరకీ కనబడకుండా జాగ్రత్తగా దాస్తాము" అన్నది.

చైనీయుడు ఇబ్బందిగా నవ్వాడు. "ఓ, మీకు ఇంకా కొన్ని విషయాలు వివరించాలి. మీరు ఘానా నుంచి తెచ్చిన బంగారం 90% శాతం నాణ్యత ఉంటుంది. మేము 99.99% నాణ్యత వచ్చేలాగా శుభ్రపరచి ఇస్తాము. మీకు డబ్బు అవసరమైతే, ఎక్కడికైనా ఇదిగో, ఈ బాంకు ద్వారా పంపిస్తాము. కాకపోతే, మీరు ఏదో ఒక సంస్థ మీద ఒక బిల్లు సృష్టించి మాకు పంపండి. ప్రపంచంలోని బంగారం అంతా భారత దేశం చేరుతుంది. అక్కడకి పంపిణీ పద్దతులు మాకు పరిచయమే, ఆ విషయాలు మేము చూసుకుంటాము. మీ డబ్బు మీకు కావాల్సిన చోటుకు పంపిస్తాము" అన్నది.

చైనీయిడు సంతోషించాడు. ఆ లేత గులాబీ బుగ్గల వనితకి స్వర్ణని సంతోషంగా అందించాడు. "ఈ సారి మీరు వచ్చేటప్పుడు ఘానాలోని ఆషాంతి వారి పురాతన శిల్పాలు, బొమ్మలూ, అలాగే ఆ ప్రక్క దేశమైన మాలీ వారి పురాతన వస్తువులూ ఎమన్నా ఉంటే అవి కూడా తీసుకురండి, ఆ అభిరుచి ఉన్నవాళ్లు ఇప్పుడు చాలా మంది ఉన్నారు" అని చెప్పింది.



వేలానికి పెట్టిన 6వ శతాబ్దపు విష్ణువు తల

John Eskenazi Art Dealers, London

———————————

స్వర్ణ స్వచ్ఛంగా తయారయ్యింది. తనకు ఎంత విలువ లేకపోతే ఇంత జాగ్రత్తగా చూసుకుంటారూ, అని మురిసిపోయింది. ఇక ముందు రోజులలో తన విలువ ఇంకా ఎంత పెరుగుతుందో అని ఊహించుకుని, కొంత దర్పం కూడా ప్రకటించింది. పైగా తన మీద స్విస్ ముద్ర కూడా పడింది.

లేత గులాబీ బుగ్గల వనిత ఒక రోజున స్వర్ణను దుబాయ్ తీసుకు వెళ్లింది. ఎయిర్‌పోర్టులోనే ముందు ఏర్పాటు చేసుకున్న చోట ఒక భారతీయ యువకుడు కనిపించాడు. అతను తనకు ఉన్న హాండ్ బాగ్‌ను కొంచెంగా జిప్ తీసి అందులో పైన కప్పిన తన బట్టలను జరిపి, ఒక దేముడి విగ్రహం తలను చూపించాడు. మూడు రోజుల క్రితమే పురాతన దేవాలయంలోనుంచి తలని మొండెం మీదనుండి పగలుకొట్టి తీసుకు వచ్చానని చెప్పాడు. అందరూ ఆ దేవాలయం వెయ్యి సంవత్సరాల క్రితము కట్టింది అని చెపుతారు కాబట్టి ఈ దేముడి తల కూడా వెయ్యి సంవత్సరాల నాటిది అని వివరించాడు.

ఆ లేత గులాబీ బుగ్గల వనిత సంతోషించింది, "నువ్వు, ఏజెంటుగా బాగా పని చేస్తున్నావు. ఈ సారి మొండెం కూడా తీసుకువచ్చే ఏర్పాట్లు చూడు, ముక్కలుగా చేసి అయినా తీసుకురా. ఆ దేముడి ముక్కలను అతికించే పనిని మేం చూసుకుంటాం" అని చెప్పి స్వర్ణను అతనికి అందించి ఆ బాగును తను బరువుగా మోసుకుంటూ వెళ్లిపోయింది.

ఆ భారతీయ యువకుడు ఊహలలో తేలిపోసాగాడు. భారత దేశంలోని విమానాశ్రయాలలో కస్టంస్ వాళ్లు ఏమి తీసుకువస్తున్నారో కన్నేసి ఉంచుతారు. ఏమి తీసుకు వెళుతున్నారో పెద్ద పట్టించుకోరు. భారతీయులకి కూడా కొత్త దేముళ్లు, కొత్త గుడులూ కావాలి, పట్టించుకోని గుళ్లు ఎన్నో ఉన్నాయి. ఇలా పది సార్లు కష్ట పడితే వచ్చిన బంగారంతో పెద్ద వ్యాపారమే చెయ్య వచ్చు, నీరవ్ మోడీ అంత గొప్పవాడిగా అయిపోవచ్చు. కాని ఇప్పుడు చిక్కల్లా స్వర్ణని జాగ్రత్తగా తీసుకు వెళ్లాలి. అతను తెలివి తక్కువ వాడేమీ కాదు. ముందే పథకం వేసుకుని పాత సెల్ ఫోనులు తెచ్చుకున్నాడు. ఒకటి బాగా పాతది. బాత్రూముకి వెళ్లి ఆ పాత సెల్ ఫోనులోని బాటరీ తీసి, స్విస్ ముద్రతో ఉన్న బంగారం బిస్కెట్, స్వర్ణను ఆ బాటరీ పెట్టే చోట పెట్టాడు. కస్టంస్ వాడు అడిగితే తన దగ్గర ఉన్న కొత్త సెల్ ఫోనుకి డబ్బులు కట్టి, రెండోది పాతదని చెప్పవచ్చు.

స్వర్ణ గర్వించింది. తనకోసం ఈ మనుషులు ఎంత కష్టబడుతున్నారు, ఎంత జాగ్రత్త పడుతున్నారు!!!

———————

సుందరాచారిగారికి సేఠ్ దగ్గర నుండి కబురు వచ్చింది. నలభై ఏళ్ల వయసులో అరవై ఏళ్ల వాడిలాగా మంచాన పడి తెగ దగ్గుతున్నాడు. ఎవరో రాజకీయ నాయకుడు కొడుకుకీ, వ్యాపారవేత్త కూతురుకీ సంబంధం కుదిరిందంట. పెళ్లి కూతురు ఆభరణాల కోసం ఆర్డరు వచ్చిందట. సేఠ్ ఈ సారి ముందుగానే అడ్వాన్సు డబ్బులు పంపాడు. తన పనితనం ఉన్న స్వర్ణకారుడు ఇంకొకడు లేడు, తనతోనే చేయించాలిని అని ఆర్డరు ఇచ్చిన వాళ్లు చెప్పారట. ఆరోగ్యం ఇప్పటికే చెడిపోయింది, ఇంక పని లోకి రానని చెప్పబోయాడు. ఇంతలో కాలేజీ ఫీజుకి డబ్బులడిగిన కొడుకు గుర్తుకొచ్చాడు. ఇంటిలో అన్నీ నిండుకున్నాయి అని నసుగుతూ, అప్పుడప్పుడూ దెప్పి పొడుస్తున్న భార్య ఎదురుగా తచ్చాడుతూ కనబడింది. తప్పలేదు, డబ్బు పుచ్చుకుని భార్య కిచ్చి, ఉబ్బసం దగ్గుతో బయలుదేరాడు.

సుందరాచారిగారికి వయసు నలభై అయినా, ముప్పై ఐదు సంవత్సరాల వృత్తి అనుభవం ఉంది. తనకి ఊహ తెలిసినప్పటి నుంచి కుల వృత్తిలోనే ఉన్నాడు. చిన్నతనంలో బంగారం కరిగించి పోతపోసేటప్పుడు కాలిన గాయాలు. ఆ తరువాత ఎప్పుడో నైట్రిక్ ఆసిడ్ పడి చేతులు కాలిన గాయాలు. ఇప్పుడు సిలికోసిస్ అంటూ ఉబ్బసంతో కూడిన దగ్గు. సోల్డరింగ్ గన్నుతో నగిషీలు చెక్కి అమర్చేటప్పుడు కళ్లకు తగిలే వేడితో అప్పుడే వచ్చిన కాటరాక్టు.. ఒక కన్నుకి ఆపరేషన్ చేయించుకోవాలి. నీరసంగా ఉందంటే డాక్టరు లెడ్ పాయిజినింగన్నాడు. అయినా సరే కుల వృత్తి, వెళ్లాలి తప్పదు. తన కొడుకుని కులవృత్తిని తప్పించి చదివించాలని నిర్ణయించింది తనే కదా, మరి తప్పదు ఫీజు కట్టటానికి తను శ్రమపడాల్సిందే, జీవితానికి ఉన్న బాధ్యతలను నెరవేర్చాలి మరి.

సుందరాచారిగారు వెళ్లి స్వర్ణను పట్టుకున్నారు. ప్రక్కనే ఉన్న రాగిణిని కూడా పట్టుకున్నారు. స్వర్ణకు కొంత ఏవగింత కలిగింది. ఇప్పుడు రాగిణిని తనతో కలుపుతారా ఏమిటి? తక్కువ జాతిది. రాగిణి కూడా గమనించింది, "మీ అంత కాకపోయినా, మేము పుట్టటానికి కూడా బోలెడు అకృత్యాలు జరిగాయి. అయినా మా లాంటి తక్కువ జాతి వాళ్లు లేక పోతే, మీలాంటి ఎక్కువ జాతి గల వాళ్లకి నిలబడగలిగే బలం ఉంటుందా?" అని ప్రశ్నించింది. తన విలువ ఎప్పటికీ పెరుగుతూనే ఉంటుంది కానీ ఇలా తక్కువ జాతి వాటితో కలిస్తే ఎలా అని అనుకుంది స్వర్ణ. కానీ, తప్పదు ఎం చేస్తాం, అని సరి పెట్టుకుంది. ఇంతలో సేఠ్ సుందరాచారిగారి దగ్గరకి ఒక పెద్ద రత్నాన్ని, ఇంకొన్ని మణులనూ తీసుకు వచ్చాడు. స్వర్ణ సంబర పడిపోయింది. తన కన్నా ఎన్నో మెరుపులు గలది రత్న, తన కన్నా పెద్ద జాతి. తన కంటే గొప్ప వాళ్లతో స్నేహం. తన విలువ ఇంకా ఎంత పెరుగుతుందో, సంతోషించింది స్వర్ణ.

సుందరాచారిగారు స్వర్ణను ఎంతో అందమైన హారంగా మార్చారు. జాతి రత్నాన్ని పతకంలో అమర్చాడు. చుట్టూ రకరకాల మణులని పొదిగారు. ఆ తరువాత హేమను పట్టుకుని మాచింగ్ గాజులు చేసాడు. కాంచనను పట్టుకుని అరవంకీలు చేసాడు. దీప్తిని పట్టుకుని పాపిటి శీరను చేసాడు. కనకం పాత బంగారం కలిగిన వడ్డాణం. కనకాన్ని తిరిగి పోతపోసి, కొత్త డిజైను వడ్డాణం ఆ మాచింగ్ సెట్టుకు సరిపడా చేశారు.

సేఠ్ వచ్చాడు. సుందరాచారిగారు ఆభరణాలు అన్నిటినీ తన ఎదురుగా ఉన్న టేబిల్ పైన పెట్టారు. సుందరాచారిగారు తన పనితనానికి తనే మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. సంతృప్తి. ఇంతలో సుందరాచారిగారి నుదుట మీదనుండి ఒక చెమట బొట్టు స్వర్ణ మీద పడి, రత్న మీదకు చిందింది. సేఠ్‌కి పట్టరాని కోపం వచ్చింది. సేఠ్ గబ గబా ఒక మస్లిన్ గుడ్డ తీసుకుని చూపుడు వేలుకి చుట్టి జాగ్రత్తగా, సుతారంగా తుడిచాడు. సుందరాచారిగారి వంక కొరకొరా చూసి, కొంత డబ్బులు ఇచ్చి, మిగిలన డబ్బులు ఆర్డరు ఇచ్చినవాళ్లు పూర్తిగా డబ్బులు చెల్లించిన తరువాత ఇస్తానని చెప్పి, ఇక వెళ్లమన్నాడు. ఆ మిగిలిన డబ్బు రాదని సుందరాచారిగారికి తెలుసు.

సేఠ్ ఆభరణాలన్నిటినీ తీసుకుని షో కేసులో చక్కగా యువతి బొమ్మకి అమర్చాడు. "అమ్మకానికి కాదు", అని చిన్న అక్షరాలతో ఒక కాగితాన్ని షోకేస్ అద్దానికి క్రిందగా అతికించాడు. ధర అడిగిన వాళ్ల హోదాని గమనించి తన దగ్గరకి పంపమని సేల్స్ వాళ్లందరికీ చెప్పాడు సేఠ్.

ఎల్లుండి బంగారం కొనుక్కోవటానికి మంచి రోజు. ఈవేళే వస్తువులు ఎంచుకుని పక్కన పెట్టిస్తే, ఎల్లుండి డబ్బు కట్టి తీసుకు వెళ్లవచ్చు. తండోపతండాలుగా జనం వస్తున్నారు. ఇరుకు ఇరుకుగా, తొక్కిడి తొక్కిడిగా తయారయ్యింది దుకాణం. సెక్యూరిటీ వాళ్లని చాలా మందిని పెట్టాడు సేఠ్. సెక్యూరిటీ వాళ్ల మీద నమ్మకం లేక, వాళ్ల మీద అజమాయిషికీ తన కుటుంబంలోని వాళ్లందరినీ నియమించాడు. తన కుటుంబలోని వాళ్ల మీద కూడా సేఠ్‌కు నమ్మకం లేదు, వాళ్లందరినీ సెక్యూరిటీ కెమేరాలాలో గమనిస్తున్నాడు సేఠ్.

వచ్చిన వాళ్లందరి కళ్లూ స్వర్ణ మీదే. ఆశగా, ఆబగా ఆత్రంగా అందరూ ఆ బంగారపు సెట్టునే చూస్తున్నారు. స్వర్ణకు బోలెడు గర్వం కలిగింది. తన విలువ ఇంతా అనుకుంది. ఇంతలోనే అనుమానం వచ్చింది, తనకి ఇంత విలువ ఎందుకు ఇస్తున్నారు? తనని ఈ మనుషులు తినలేరు. తనని ధరించినా ధరించక పోయినా వీళ్ల జీవతం కొనసాగుతుంది. వేరే జీవకోటికి దేనికీ తన అవసరం లేదు? మరి ఎందుకు తన విలువ అంతగా పెరిగింది? ఏదయితేనేం, తన విలువ పెరిగింది.

ఇంతలో గాజులలో ఉన్న హేమ మాట కలిపింది. నేను పపువా న్యూగినీ నుండి వచ్చా. అక్కడ నాకు పాదరసంతో పురుదు పోసారు. ఆ పాదర రసం వ్యర్థాలతో ఇప్పటికీ ఊళ్లకు ఊళ్లు పాడుపడ్డాయి. అయితేనేం, ఇక్కడ మనకెంత విలువో" అన్నది.



అది వింటూనే అరవంకీలలో ఉన్న కాంచన అన్నది, "అవునా, నేను గయానా నుండి వచ్చాను. అక్కడ మాకు కూడా సైనైడ్‌తోనే పురుదు పోస్తారు. అక్కడ కట్టిన సైనైడ్ టాంకు కూలి, ప్రక్కన ఉన్న నదిలోకి టన్నులకు టన్నుల సైనైడ్ తో కలసిన వ్యర్థాలు నదిలోకి పడింది. ఆ నది మొత్తం చచ్చిపోయింది, ఆ నది ప్రక్కన ఉండే మనుషులందరూ ఊళ్లు వదిలేసి పోయారు".

పాపిటి శీరలోని దీప్తి అందుకుంది, "నేను ఫిలిప్పీన్స్ నుండి వచ్చాను. అక్కడ నాకు పురుడు పొయ్యటం కోసం గుట్టలు గుట్టలుగా పోసిన మట్టి వర్షాలకు కూలి, ఊరు, ఊరే మునిగిపోయింది".

వడ్డాణంలోని పాత బంగారం కనకం అన్నది "నేను పుట్టినప్పుడు కూడా బోలెడు అకృత్యాలు జరిగాయి. ఇంకా కొత్త కొత్త తంతులు కూడా చాలా చూసాను. నన్ను వడ్డాణంగా దాచిపెట్టిన పెద్దావిడ మొన్నటికి మొన్న మంచం పట్టితే, ఆవిడ పిల్లలు ఆవిడ చికిత్స కోసం పెట్టిన శ్రద్ధ కంటే, నన్ను ఎలా పంచుకోవాలో అని పేచీలు పెట్టుకున్న తంతు గొప్పది. ఆవిడ ఊపిరి చల్లారక ముందే నాకోసం కొట్టుకుని, మాటలు లేకుండా విడిపోయారు. ఇలాంటి తంతులు మీరు కూడా చూస్తారు"

"భలే, భలే, ఏదైతేనేం, మనకి బోలెడు విలువ" అన్నది స్వర్ణ,



అప్పటి దాకా హారంలోని పతకంలో ఉండి ధగ, ధగా మెరుస్తున్న రత్న, ఇంక ఉగ్గపట్టుకోలేక, హూంకరించింది. "ఏం, ఈ మాత్రానికేనా మీకింత పొగరు? నేను ఆఫ్రికా లోని సియెర్రా లియోనీ నుండి వచ్చాను. మా జాతికే "Blood Diamonds" అంటే రక్తపు రత్నాలు అని పేరు. మా చరిత్ర గురించి సినిమాలే తీసారు. మా కోసం ఫోడే శాంకో అనేవాడు "Revolutionary United Front" అనే విప్లవ సంస్థను స్థాపించి, ఊళ్లకు ఊళ్లను తగలబెట్టి, వేలకు వేలమందిని చంపాడు. తొమ్మిది, పదేళ్ల ఉన్న పిల్లలు వాళ్ల నాయినమ్మల దగ్గర రాత్రి కథలు చెప్పించుకుంటూ నిద్రబుచ్చే వేళల్లో దాడులు చేసి, ఆ పిల్లల ఎదుటనే పెద్దవాళ్ల మీద పెట్రోలు పోసి నిప్పు అంటించి, ఆ పిల్లల ఎదుటనే ఆడవాళ్లను చెరిచి, ఆ పిల్లలనే బాల సైనికులుగా తయారు చేసి, అక్కడి గనుల్లోనుంచి నన్ను తీసారు. ఫోడే శాంకో ఆ బాల సైనికులకి కోటా కూడా పెట్టాడు, ఎంత మంది ముంజేతులు బ్రతికి ఉండగానే మొండి కత్తులతో నరికి ఎవరెక్కువ తీసుకు వస్తే, వాళ్లకి సైన్యంలో ప్రొమోషన్లు. మా రత్నాల కోసం ఎన్ని వేల గోనె సంచులు ముంజేతులతో నింపారో! మా రత్నాలన్నింటినీ ఫోడే శాంకో తన స్నేహితుడు, ప్రక్కనున్న లైబీరియా దేశాధినేత ఛార్లెస్ టైలరుకిస్తే, ఎన్నో ఆయుధాలు ఇచ్చేవాడు. ఎంతమందో గొప్ప గొప్ప వాళ్లు, మతాధిపతులు, వ్యాపారవేత్తలు, సినిమా ప్రముఖులూ, మాధక ద్రవ్యాల వ్యాపారస్తులూ, దేశ దేశాల మంత్రులు, బెల్జియం వజ్రాల వ్యాపారులూ అందరూ మా కోసం ప్రత్యేకంగా విమానాలు వేసుకు వచ్చేవారు. అంతెందుకు, మా పాత తరం రత్నాల కోసం ఎన్నో యుద్ధాలు జరిగి, ఎన్నో కోట్ల మంది సైనికులు మరణించారు, ఎన్నో రాజ్యాలు కూలినాయి. అదీ విలువ అంటే. స్వర్ణా, నీ స్థాయి నాకు ఊతంగా పట్టుకుని నిలబడటమే, కానీ నా స్థాయి ఏమిటో తెలుసా? రాజుల కిరీటాలలో, రాణుల కిరీటాలలో ఉండి వాళ్ల తలపై ఎక్కి కూర్చుంటాను. తెలుసుకో"



స్వర్ణకి రోషం వచ్చింది, "ఏం, మా జాతి వాళ్ల చరిత్ర మీ జాతి వాళ్లకంటే తక్కువ కాదు. మా విలువ ఎప్పటికీ పెరుగుతూనే ఉంటుంది, ఏమనుకున్నావో" అన్నది.

రత్న నవ్వింది. "విలువ మీకు కాదు, నాకు కాదు. మనం జీవ కోటికి పట్టించిన క్షయ, ఈ మనుషుల వ్యామోహానికి అక్షయ. ఈ మనుషులకి వ్యామోహమే లేకపోతే, మనకి విలువ లేదు. ఎన్ని ఎక్కువ అకృత్యాలు ఉంటే, వారి నాయకులకి అంత విలువ. ఆ అకృత్యాల విలువలే మనకి ఆపాదిస్తారు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ తనని ఎవరూ చూడటంలేదు కాబట్టి దొంగ పనేమి చేయలేదు అని అనుకుంటుంది. అలాగే, ఈ

బంగారపు కొట్టులకు ఎగబడే మనుషలందరకీ, మనం తళ తళా కనబడితే కలిగే వ్యామోహం విలువలు. అవే విలువలు, వాళ్లు వాళ్ల దేముళ్లకి కూడా ఆపాదించి వజ్ర కిరీటాలు చేయించి, మనలని ఆ దేముళ్ల తలకెక్కించుతారు. బాబాలకు సింహాసనాలూ చేయించుతారు. తెలుసుకో" అన్నది రత్న.

మనుషులందరూ ఆ బంగారపు కొట్లో తోసుకుంటూ ఆ షోకేసులో ఉన్నవాటిని ఆశగా, ఆబగా, ఆత్రంగా చూస్తూనే వున్నారు. మెరుపులని మెచ్చుకుంటున్నారు కానీ కళ్లు మూసుకుని పాలు తాగే పిల్లిలాగా, వెనుక జరిగిన అకృత్యాలతో తమకు సంబంధం లేదు అనుకుంటున్నారు. ఆ ఆలోచనే వద్దనుకుంటున్నారు. ఇప్పుడు కొనకపోతే రేపు పెరిగిపోతుంది, పెరిగిపోతుంది అని విలువలని ఆపాదించుకుంటున్నారు.

***

## అటు ఇటు కానీ..

పద్మావతి దివాకర్ల

రామారావు తన కూతురి పెళ్ళి కుదిరిన సందర్భాన బంధువుల్ని, స్నేహితుల్ని స్వయంగా శుభలేఖలు ఇచ్చి పిలవడానికి ఓ ఆదివారంనాడు విశాఖపట్నం వచ్చాడు. తన బంధువులందరికి శుభలేఖలు ఇచ్చిన తర్వాత, తన ఆప్తమిత్రులిద్దర్నీ కలసి పెళ్ళికి పిలవడానికి బయలుదేరాడు.

రామారావు ఆప్తమిత్రులలో ఒకడైన క్రిష్ణమూర్తి బాగా ధనవంతుడు. అతను చిన్నప్పటినుండి డబ్బులోనే పుట్టి డబ్బులోనే పెరిగి పెద్దవాడయ్యాడు. తండ్రినుండి వారసత్వంగా వచ్చిన వ్యాపారాన్ని బాగా అభివృద్ధిపరచి తన హయాంలో మరికొన్ని పరిశ్రమలు కూడా నెలకొల్పాడు. నగరంలో ప్రముఖులైన పారిశ్రామికవేత్తల్లో ఒకడైనాడు. బాగా డబ్బు గడించడంతో పాటు రాజకీయంగా బాగా పలుకుబడి కూడా సంపాదించుకున్నాడు. క్రిష్ణమూర్తి ఉండే బంగళా మంచి పోష్ఏరియాలో ఉంది.

ఇంకో స్నేహితుడైన రాజారావు పరిస్థితి ఇందుకు పూర్తిగా విరుద్ధం. రాజారావు మధ్యతరగతి కన్నా ఓ మెట్టు దిగువున ఉన్నాడు. నగరంలో ఓ మూల విసిరేసినట్లు ఉన్న ప్రాంతంలో ఉంటున్నాడు. చదువు సరిగ్గా అబ్బకపోవడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు తోడై చదువు సగంలో ఆపేసి ఓ కర్మాగారంలో చిన్న ఉద్యోగంలో కుదురుకున్నాడు. పెద్దగా ఎదుగూ బొదుగూలేని జీతంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. తండ్రి చేసిన అప్పులు తీర్చడంతోపాటు ఇంటి బాధ్యతలన్నీ నెత్తిన పడటంతో ఆర్థికంగా బాగా చితికిపోయాడు రాజారావు. క్రిష్ణమూర్తి, రాజారావు ఇద్దరూ కూడా రామారావుకి బాల్యస్నేహితులు, చిన్నప్పటినుండి కలసి చదువుకున్నారు.

అయితే రామారావు వాళ్ళిద్దరికీ భిన్నంగా మధ్యతరగతికి చెందినవాడు. అటు ఆర్థికంగా బాగా పైమెట్టు మీదున్న క్రిష్ణమూర్తితోను, బాగా చితికిపోయి ఆర్థికంగా అట్టడుగువర్గానికి ప్రతినిధిగా ఉన్న రాజారావుతోను ఒకేసమయంలో స్నేహబంధం నెరపగలుగుతున్నాడు రామారావు.

రామారావు స్కూల్‌టీచర్‌గా ఉద్యోగం చేస్తున్న మధ్యతరగతికి చెందినవాడు. తండ్రి అప్పచెప్పిన బాధ్యతలన్నీ తీరాక, ఉన్న ఒక్కగానొక్క కూతురికి పెళ్ళిసంబంధాలు చూడగా, చూడగా చివరికి ఈ సంబంధం కుదిరింది. అసలు చాలా సంబంధాలు కట్నాలవద్ద తప్పిపోయాయి. ఇప్పుడు కుదిరిన సంబంధమైనా కట్నంలేదుగానీ, లాంఛనాలు, ఇతరత్రా కలిపి తనకు తలకి మించిన భారమైనా ఒప్పుకోక తప్పలేదు రామారావుకి. మగపెళ్ళివారి కోరిక మేరకు ఘనంగా పెళ్ళి ఏర్పాట్లు చేస్తానని కూడా ఒప్పుకున్నాడు. ఎందుకంటే కట్నంలేని సంబంధం దొరకడమే గొప్ప! పైగా అబ్బాయి మంచి ఉద్యోగస్తుడు. వాళ్ళ కుటుంబంకూడా మంచి సంప్రదాయమైన కుటుంబం. అందుకే అప్పుచేసైనా సరే కూతుర్ని అత్తవారింటికి పంపాలని నిర్ణయించుకున్నాడు రామారావు.

చాలా రోజులనుండి తన స్నేహితులను కలవడానికి కుదరలేదు రామారావుకి. పెళ్ళికి పిలవటంతో పాటు వాళ్ళతో సరదగా ఓ పూట గడపాలని కూడా రామారావు ఆశ.

ముందుగా ఎవరింటికి వెళదామా అని ఓ క్షణం అలోచించి ముందు క్రిష్ణమూర్తి ఇంటికే వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. అతను అలాగనుకోవడానికి కారణం ఉంది. అప్పటికే భోజనాల వేళైంది. క్రిష్ణమూర్తి ఇంట్లో అయితే హాయిగా భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవచ్చు. అదే రాజారావు ఇంటికెళ్తే అతనికి తన రాక ఇబ్బంది కలిగించవచ్చు. అంతేకాక అతని ఇల్లు ఇరుకు కూడాను. అందుకే వెంటనే సెల్ తీసి క్రిష్ణమూర్తికి ఫోన్ చేసాడు. కొద్దిసేపట్లో అతను ఫోన్ ఎత్తగానే, "హల్లో! క్రిష్ణమూర్తి!! నేను రా, రామారావుని. మీ ఇంటికి ఇప్పుడు వస్తున్నాను. మొన్న నీకు చెప్పాను కదా, మా అమ్మాయి పెళ్ళి కుదిరిందని. వచ్చే నెల పదకొండో తారిఖునే పెళ్ళి ముహూర్తం నిశ్చయమైంది. నీకు పెళ్ళి పత్రిక ఇవ్వడానికి వస్తున్నాను! నువ్వింట్లోనే ఉన్నావు కదా? " అన్నాడు రామారావు.

"ఆఁ...నేను ఇంట్లోనే ఉన్నాను, గాని ఇప్పుడే వ్యాపార సంబంధమైన అర్జెంట్ పనొకటి తగిలింది. బయటకి వెళుతున్నాను. నా పని పూర్తవడానికి ఓ రెండుమూడు గంటలు పట్టవచ్చు. మనం కలుసుకోవడం కుదరదేమో? పోనీ ఇంటికొచ్చి శుభలేఖ ఇచ్చివెళ్ళు." అన్నాడు క్రిష్ణమూర్తి.

రామారావు నొచ్చుకొని, "అదేంటిరా! శుభలేఖ ఇవ్వడమని కాదుకానీ, నీతో కొద్దిసేపు గడపాలని కూడా అనుకున్నా రా!" అన్నాడు.

"అయితే నాకిప్పుడు టైం లేదు. ఒక పని చెయ్యి! నువ్వు సాయంకాలం ఐదుగంటలకి రా! మనం తీరుబడిగా కబుర్లు చెప్పుకుందాం." అన్నాడు క్రిష్ణమూర్తి.

"అలాగేలేరా! ఈలోపున నా పని పూర్తిచేసుకు వస్తాను." అంటూ రామారావు ఫోన్ కట్ చేసాడు. 'ఇప్పుడేంటి చేయడం? హోటల్కెళ్ళి భోజనం చేసి రాజారావింటికి వెళ్ళడమా లేక ముందు అతనింటికే వెళ్ళి రావడమా?' అనే అలోచనలో పడ్డాడు రామారావు.

బయట హోటల్లో భోజనం చేసి రాజారావింటికి వెళ్తే అతను నొచ్చుకుంటాడేమోనన్న భయం. చివరికి రాజారావింటికే వెళ్ళడానికి నిశ్చయించుకొని ఆటో మాట్లాడుకున్నాడు రామారావు.

ఆ ఇరుకుసందులోకి ఆటో వెళ్ళలేకపోవడంతో వీధిమొదలులోనే అపించి రాజారావింటివైపు నడుచుకొని వెళ్ళాడు రామారావు. ఇంట్లో ఉన్నాడో, లేడో అని సందేహిస్తూనే తలుపు తట్టాడు. కొద్దిసేపట్లోనే తలుపు తెరిచి చూసిన రాజారావు రామారావుని చూసి సంభ్రమాశ్చర్యాలకి గురయ్యాడు.

"అరే! ఏంటి, రామారావూ ఈ ఆకస్మిక దర్శనం?" అని రామారావుని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు. రాజారావు ఆప్యాయతకి తబ్బిబ్బయ్యాడు రామారావు.

రాజారావు వెంట ఇంట్లోకి నడిచాడు. ఓ రెండు గదులు, ఓ వంటిల్లు ఉన్న చిన్న ఇల్లది. ఓ గదిలో మంచంపైన పడుక్కున్న రాజారావు తండ్రి ఉండుండి దగ్గుతున్నాడు. ముందు గదిలో ఒకేఒక కుర్చీ ఉంది.

"నువ్వు కూర్చోరా!" అంటూ రాజారావు నేలపై చతకిలబడ్డాడు. రామారావు ఇబ్బందిగా కుర్చీలో కూర్చున్నాడు. ఈ లోపున రాజారావు భార్య సరిత మంచినీళ్ళు పట్టుకొచ్చి రామారావుని పలకరించింది, "అన్నయ్యగారూ! బాగున్నారా? అందరూ కులాశానా! వదినని తీసుకురాలేదేమీ?"

"ఆఁ...కులాసాయే! అమ్మాయి పెళ్ళి పనుల్లో తను మునిగి ఉంది, అందుకే రాలేకపోయింది."అన్నాడు రామారావు మంచినీళ్ళు అందుకుంటూ.

"అమ్మాయి పెళ్ళి కుదిరందని తెలిసి చాలా సంతోషించాము. ఏం చేస్తున్నాడు కాబోయే అల్లుడు?" అని అడిగాడు రాజారావు.

రామారావు వివరాలు చెప్పాడు. అన్నీ విన్న రాజారావు, అతని భార్య సరిత చాలా సంతోషించారు. రామారావు పెళ్ళి శుభలేఖ అందజేసి పెళ్ళికి అందర్నీ రమ్మని మరిమరీ అహ్వానించాడు.

"అన్నయ్యగారూ! కాళ్ళు చేతులు కడుక్కొని రండి, భోజనం చేద్దురు గాని!" అంది సరిత.

"నేను వస్తున్నప్పుడు హోటల్లో భోజనం చేసే వచ్చాను." వాళ్ళని ఇబ్బంది పెట్టలేక అబద్ధం ఆడాడు రామారావు.

"ఊర్కోరా! నువ్వు అబద్ధం చెప్తున్నావని నీ మొహమే చెప్తోంది. పైగా బాగా ఎండలో తిరిగి వచ్చావు. మొహమ్మాటాలేమీ పెట్టుకోకు. మేము నీకు పరాయి వాళ్ళమేమీ కాదు." అన్నాడు రాజారావు.

ఇక తప్పలేదు రామారావుకి. వాళ్ళిద్దరూ కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చేసరికి సరిత స్నేహితులిద్దరికీ భోజనం వడ్డించింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసారు. వాళ్ళ ఆప్యాయతవల్ల అతి సామాన్యంగా ఉన్నా భోజనం చాలా రుచికరంగా అనిపించింది రామారావుకి. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటుంటే వాళ్ళకి సమయమే తెలీలేదు.

"అవునూ! ఏరీ, మీ వాడు శ్రీధర్, మీ అమ్మాయి రమ్య ఎక్కడా కనిపించడంలేదు. ఇంతకీ ఏంటి చేస్తున్నాడు శ్రీధర్? అమ్మాయికేమైనా పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా?" అడిగాడు రామారావు.

"అబ్బాయిని చదువు మానిపించేసాను. అంతంత కాలేజీ ఫీస్‌లంటే మాటలా? నా వల్లకాదు భరించడం. నా తాహతుకు మించినదని చదువు మానిపించి మెకానిక్ షెడ్లో పనికి కుదిర్చాను. అలాగే అమ్మాయి కూడా కుట్లు, అల్లికలు నేర్చుకుంది కదా, వీధి చివర టైలర్‌షాపులో పని చేస్తోంది. వాళ్ళిద్దరు చేతికి పూర్తిగా అందివస్తే నాకు కొంచెం ఊరట లభిస్తుంది. డబ్బులు కూడగట్టుకున్నాక అమ్మాయి పెళ్ళి చేయొచ్చునని ఆశ." అన్నాడు రాజారావు.

"అయ్యో! అప్పుడే వాళ్ళిద్దరినీ పనుల్లో పెట్టేసావా? ఎంత వయసు వాళ్ళకని? ఇద్దర్నీ పైచదువులు చదివిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయికదా?" అన్నాడు రామారావు.

"ఎంత చదివినా ఉద్యోగాలు మాలాంటి వాళ్ళకి గగన కుసుమాలే కదా? పైగా కాలేజి చదువులకి వేలకి వేలు కట్టాలి. అయిదు వేలు కాలేజీ ఫీస్. అమ్మో! అంతడబ్బులు భరించడం నావల్ల కాదు. అందుకే పనిలో పెట్టాను. ఏదో ఒక సంపాదన ఉంటే చాలు. వాడి బతుకు వాడు బతుకుతాడు. అలాగే ఏదో గంతకు తగ్గ బొంత నిచ్చి అమ్మాయి పెళ్ళి కూడా చేయలేకపోను." అన్నాడు రాజారావు.

రాజారావుని తండ్రిని ఓ సారి పలకరించాడు రామారావు.

"నాన్నగారి ఆరోగ్యం ఎలా ఉంది? మంచి డాక్టర్‌కెవరికైనా చూపించలేకపోయావా?" అన్నాడు రామారావు.

"ఏం చెప్పమంటావురా? ఎంతమంది డాక్టర్లకి చూపించినా అలాగే ఉంది. డబ్బుకి డబ్బు అయిపోతోంది. కాని ఆరోగ్యం నెమ్మదించడం లేదు. నెలకి నాన్నగారి మందులకే ఓ రెండు వేలవుతుంది తెలుసా?" నిస్సహాయంగా అన్నాడు రాజారావు.

అతని పరిస్థితికి జాలిపడ్డాడు రామారావు. అతనికి ఏవిధమైన సహాయం తను చేలేకపోతున్నందుకు కాస్త బాధపడ్డాడు కూడా.

భోజనం తర్వాత కాసేపు కూర్చుని పెళ్ళికి రమ్మని మరీమరీ చెప్పి ఇక వస్తానంటూ బయలుదేరాడు రామారావు. వీధిలోకి వచ్చి టైం చూసుకున్నాడు. నాలుగున్నర అయింది.

క్రిష్ణమూర్తి ఇల్లు అక్కణ్ణుంచి ఓ అరగంటలో వెళిపోవచ్చని, రోడ్డు మీదకి వచ్చి ఆటో ఎక్కాడు రామారావు.

ఆటోలో కూర్చొని మిత్రుడు క్రిష్ణమూర్తికి ఫోన్‌చేసి అతను ఇంట్లోనే ఉన్నాడని నిర్ధారించుకున్నాడు. కిష్ణమూర్తి ఇంటిముందు ఆటో ఆపి దిగాడు రామారావు. అది ఇల్లనడంకంటే భవంతి అని అనడమే సబబు. చాలా విశాలమైన జాగాలో విస్తరించి ఉంది విలాసవంతమైన ఆ భవంతి. ఇంటి ముందు పార్కులాంటి పెద్ద తోట. తను వచ్చినట్లు క్రిష్ణమూర్తికి ఫోన్ చేయగానే వాచ్‌మేన్‌కి కబురు చేసి లోపలికి పంపమన్నాడు.

రామారావు ఇంట్లోకి వెళ్ళాడు. హాల్లో సోఫాలో కూర్చొని ఉన్నాడు క్రిష్ణమూర్తి. రామారావు వయసువాడే అయినా సంపద ఇచ్చిన సౌఖ్యం వల్ల రామారావుకన్న పదేళ్ళు చిన్నవాడిలాగానే కనబడతాడు క్రిష్ణమూర్తి. అసలే ఇంద్రభవనంలాంటి ఇల్లు. అందమైన ఇంటీరియర్ డెకరేషన్‌తో సినిమా సెట్‌ని తలపిస్తోంది ఆ హాలు. అక్కడ అణువణువునా ఐశ్వర్యం ఉట్టిపడుతోంది. ఎక్కడెక్కడనుంచో తెచ్చిన పాలరాతి ఫ్లోరింగ్. గోడలమీద అందమైన, ఖరీదైన వర్ణచిత్రాలు అద్భుతంగా అమరాయి. అవన్నీ చూస్తుంటే తను పొరపాటున స్నేహితుడింటికి కాక స్వర్గంలో అడుగుపెట్టానా అని ఒక్కక్షణం కలవరపడ్డాడు రామారావు.

రామారావుని చూడగానే లేచి నిలబడి నవ్వుతూ పలకరించాడు క్రిష్ణమూర్తి, "సారీరా! ఉదయం చాలా అర్జెంట్ పని ఒకటి ఉండేది. అందుకే నిన్ను ఈ సమయంలో రమ్మన్నాను." అన్నాడు.

"సరేరా! ముఖ్యమైన పనులు వదులుకుంటే ఎలా చెప్పు? ఈ లోపున మన రాజారావు లేడూ వాడింటికి వెళ్ళానులే." అన్నాడు రామారావు సోఫాలో కూర్చోబోతూ.

ముట్టుకుంటే మాసిపోయేలా, మెత్తగా ఉన్న ఆ సోఫాలో కూర్చోడానికి కాస్త ఇబ్బంది పడ్డాడు రామారావు.

"ఓహో!...రాజారావు ఇంటికి వెళ్లావా? ఎలా వెళ్ళగలిగావురా ఆ మురికివాడకి నువ్వు?" అన్నాడు క్రిష్ణమూర్తి కళ్ళెగరేస్తూ.

"ఎంతైనా మన స్నేహితుడురా వాడు!" అన్నాడు రామారావు నొచ్చుకుంటూ.

"నేనైతే అటువైపు వెళ్ళవలసి వస్తే ఉక్కిరిబిక్కిరైపోతాను. ఆ సంగతలా ఉంచు. అమ్మాయి పెళ్ళి ఎప్పుడు? ఏంటి చేస్తున్నాడు కాబోయే అల్లుడు?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"వచ్చేనెల పదకొండో తారీఖేరా! ఇప్పుడే చెపుతున్నా, అర్జెంట్ పనులు, బిజినెస్ పనులు అని రావడం మానేవు సుమీ! తప్పకుండా రావాలి సుమా!" మరీ మరీ చెప్పాడు రామారావు పెళ్ళిపత్రిక క్రిష్ణమూర్తికిస్తూ.

క్రిష్ణమూర్తి కేకేసి భార్య శారదని పిలిచాడు. ఆమె వచ్చి రామారావుని పలకరించి స్నేహితులిద్దరికీ కాఫీ అందించింది. మిత్రులిద్దరూ కబుర్లలో పడ్డారు. క్రిష్ణమూర్తి తన వ్యాపారం గురించి, వాటి అభివృద్ధికి తనెంత కష్టపడుతోంది చెప్పుకుపోతున్నాడు.

"చూసావా! నువ్వు ఇప్పుడు కాఫీ తాగుతున్న కప్పు ఎంత ఖరీదో తెలుసా? ఊహించుకోగలవా?" అనడిగాడు దర్పంగా.

తను తాగుతున్న కాఫీ కప్పు వంక చూసాడు. అందమైన నగిషీలతో నిజంగా చాలా బాగుందది. ఖరీదైనది. అయితే దాని విలువ మాత్రం అంచనా వెయ్యలేకపోయాడు రామారావు. తనకి తెలియదన్నట్లు తల అడ్డంగా ఊపాడు.

“ఈ కప్పులు చైనా నుంచి తెప్పించాను. ఒకొక్కటి యాభై వేలు తెలుసా?" అన్నాడు గొప్పగా.

చిన్నప్పటినుండి క్రిష్ణమూర్తి నైజం ఎరిగివున్న మూలాన రామారావు ఆశ్చర్యం నటించి, "అబ్బో!" అన్నాడు.

కాఫీ తాగుతూ మధ్యమధ్యలో గోడకున్న పెయింటింగ్స్ వైపు చూస్తున్న రామారావుని గమనించి అన్నాడు, "ఆ పెయింటింగ్స్ ఎలా ఉన్నాయి? పారిస్ వెళ్ళినప్పుడు కిందటేడాది కొన్నాను, ఒకొక్కటి పదిలక్షలు." అన్నాడు క్రిష్ణమూర్తి.

అబ్బురపోయి మళ్ళీ వాటివంకే చూడసాగాడు రామారావు.

"రా! ఇల్లంతా చూద్దువుగాని!" అని ఆ భవంతి అంతా తిప్పి రామారావుకి చూపించాడు.

"చూసావా, ఈ ఫ్లోరు? ఈ మార్బుల్స్ రాజస్తాన్ నుంచి ప్రత్యేకంగా తెప్పించాను. ఎంతైయిందో తెలుసా! జస్ట్ ఓ రెండు కోట్లు మాత్రమే! అంతే కదా!" ఇలా ఒకొక్కటి చూపించి తను వాటిని ఎక్కణ్ణుంచి ఎలా తెచ్చింది, ఎంత ఖరీదైనది వివరించి చెప్తున్నాడు. క్రిష్ణమూర్తి వైఖరి ముందునుండీ ఎరిగిఉండటం మూలాన రామారావు అంతా మౌనంగా విన్నాడు.

ఇల్లంతా చూసి తిరిగి సోఫాలో కూర్చున్న తర్వాత అడిగాడు రామారావు, "అవునూ, మీ వాడు ఏం చేస్తున్నాడురా?"

"మా వాడా! వాడు అమెరికాలో ఎమ్మెస్ చేస్తున్నాడు. వాడు ఇక్కడికి తిరిగి రాగానే నా బిజినెస్స్ చూస్తాడు. అంతే కదా మరి! అందుకే ఎంత ఖర్చైనా వెనుకాడక వాడిని అక్కడికి పంపింది." అన్నాడు క్రిష్ణమూర్తి.

రామారావు మనసులో నవ్వుకున్నాడు. తనకోసం, తన స్వార్థంకోసం అమర్చుకున్న ప్రతీవాటిని డబ్బులతో కొలుస్తూ అతిశయం ప్రదర్శిస్తున్నాడు క్రిష్ణమూర్తి. ఏంత డబ్బు ఖర్చైనా వెనకాడక సమకూర్చుకుంటున్నాడు. ఎంత డబ్బైనా లెక్కలేదతనికి! ఆర్థికంగా పైమెట్టుమీద ఉన్నకారణంగా తను సాధించిన ప్రతీదాన్నీ డబ్బులోకే మార్చి చూసుకుని ఆ విధంగా తృప్తి పడుతున్నాడు. గర్వంగా ఫీలవుతున్నాడు. అలాగే పాపం, ఆర్థికంగా కిందమెట్టుపైనున్న రాజారావు తనకి కావలసిన ప్రతీదాన్నీ డబ్బుతో సాధించలేక వదులుకొని ఉన్నాదానితోనే సరిపెట్టుకొని సంతృప్తి చెందుతున్నాడు.

ఎటొచ్చీ తనలాంటి మధ్యతరగతి వాడిదే సమస్యంతా! ఏదైనా తన అందుబాటులో ఉందా, లేదా అన్నది ముఖ్యం కాదు. అందుబాటులో ఉన్నా, లేకున్నా అప్పుచేసిమరీ సమకూర్చుకోవాలి. 'అమ్మో! ఇంతా!' అని రాజారావులా వదలనూలేడు, 'అంతే కదా!' అని క్రిష్ణమూర్తిలా అనుకోనూలేడు. ఓ మధ్యతరగతివాడిగా ఏ నిర్ణయం తీసుకొనే అధికారంకూడా తనకి లేదు. ఎప్పటికప్పుడు పరిస్థితులకి అనుగుణంగా తనని తాను మలచుకోవడం మాత్రమే తను చేయాలి. అదే మరి మధ్యతరగతి మనోభావం!

"ఏంట్రా! ఏంటి ఆలోచిస్తున్నావు?" అన్న క్రిష్ణమూర్తి మాటలతో ఉలిక్కిపడి ఈ లోకంలో పడ్డాడు రామారావు.

తన ఆలోచనలని పైకి కనపడకుండా పైకి చిరునవ్వు నవ్వి, "సరేరా! ఇక వస్తాను! మీరిద్దరూ అమ్మాయి పెళ్ళికి తప్పకుండా రావాలిసుమా!" అన్నాడు పైకి లేస్తూ.

## ఎవరు నేర్పేరమ్మ..

బాడిశ హన్మంతరావు

ఆ రోజు ఆదివారం, సమయం ఉదయం తొమ్మిది. అందరికీ సెలవు కావడంతో కాలనీ అంతా పిల్లలతో సందడిగా ఉంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ అవ్వడమే ఆలశ్యం, ఒక ఇంటిలోనుండి బ్యాటు, మరో ఇంటిలో నుండి బంతి, మరో చోట నుండి స్టంప్స్ ... అలా అన్నిరకాల ఆయుధాలు బయటికి వస్తాయి. ఆసక్తి లేని కొంతమంది టివీల ముందే గడుపుతుంటే, మరికొంతమంది సైకిల్స్, బైక్ లు తీసుకొని కాలనీ లోని అన్ని రోడ్లూ గిరాగిరా తిరుగుతూనే ఉంటారు. మాకూ ఒకే పుత్ర రత్నం పేరు చిన్నా. అయిదవ తరగతి చదువుతున్నాడు. ఇంటి ముందు వాలుకుర్చీలో కూచొని, చేతుల్లో గడ్డం పెట్టుకొని, ఇంటి ముందునుండి వెళ్తున్న పిల్లలను చూస్తున్నాడు.

“ఏరా చిన్నా ! ఫ్రెండ్స్ రాలేదా, బయటికి వెళ్ళట్లేదు” అన్నాను.

“లేదు నాన్నా, సూరీ, సాయి వాళ్ళు ఈ రోజు ఊరెళ్ళారు” జవాబిచ్చాడు.

వాడి జవాబును వింటూనే, పేపర్ కి చూపు అతకేశాను. కొద్ది సేపు తరువాత చూస్తే, వాడి చూపు రోడ్డుకు అటు ఇటూ పెండ్యులంలా తిరుగుతోంది. వాడి చూపునుసరించి చూస్తే, ఆ చూపు సైకిల్ తొక్కుతున్న ఇద్దరు పిల్లల దగ్గరకు చేరుకుంది. ఆ పిల్లలు హుషారుగా ఉన్నారు, సైకిల్ తొక్కడాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.

“నాన్నా, నాకు సైకిల్ నేర్పుతావా?” ఉన్నట్లుండి అడిగాడు చిన్నా.

మా ఇంట్లో కూడా ఒక సైకిల్ ఉంది. అది వాడి మొదటి పుట్టినరోజుకి వచ్చిన బహుమతుల్లో వాడికి బాగా నచ్చిన బహుమతి. వాళ్ల పెద్దమ్మ ఇచ్చింది. పసుపు రంగుతో, మూడు చక్రాలతో, ముందు బుట్టతో, బటన్ వత్తితే వచ్చే గంటల శబ్దంతో చాలా ముద్దుగా ఉండేది. అన్ని భాగాలు, ఖండానికొక్కటి పడే దాకా దానితో చెడుగుడు ఆడాడు. వాడికి మరో రెండు పుట్టిన రోజులయ్యేసరికి, దాన్ని ఎవరూ సైకిల్ అనలేని విధంగా చేశాడు.

“ వీడికి సైకిల్ అంటే చాలా ఇష్టం కామోసు” అనుకొని వాడికి అయిదోదో, ఆరోదో పుట్టిన రోజుకి వాళ్ల పెద్దమ్మ మరో సైకిల్ తెచ్చింది. పెరిగే వాడు కదా అని, కాస్త ఎత్తుగా ఉన్నదీ తెచ్చింది. దాని వెనుక చక్రానికి సపోర్ట్ గా అటూ , ఇటూ రెండు చిన్న చక్రాలు ఉన్నాయి. దాన్నీ చాలా రోజులు తొక్కాడు.

ఫరవాలేదు బాగానే తొక్కుతున్నాడు గదా అనుకున్నాను. ఇక తొక్కగలడులే అని ఒకానొక మంచి రోజు, సపోర్ట్ గా ఉన్న చిన్న చక్రాలు తీసేశాను. ఆ మరుసటి రోజు ఆ సైకిల్ తొక్కబోయి కాళ్లు అందక కింద పడ్డాడు. మోకాలిపైన గాయం అయింది. అంతే... ఆ సైకిల్ చిరునామా, నైరుతి మూలలో ఉన్న స్టోర్ రూముకి మారింది. ఇది జరిగింది రెండేళ్లయింది.ఇప్పటిదాకా మళ్ళీ దాన్ని ముట్టింది లేదు.

మళ్ళీ ఇన్నాళ్లకి దాని ప్రస్తావన వచ్చింది.

-0-

"నాన్నా, సైకిల్ నేర్పుతావా?" మళ్ళీ అడిగాడు. వాడు అడిగిన తీరుకి, అదేదో విఠలాచార్య సినిమాలో కమండలంలోని నీళ్లు తీసుకొని చేతితో చల్లి, వరమిచ్చే సాధువు మాదిరిగా,'నీకు సైకిల్ తొక్కడం వచ్చును గాక " అని వరమిచ్చేయలనిపించింది.

కానీ ఎలా?

"సరే , అలాగే" అనడమే ఆలస్యం, వాడు పరుగెత్తుకెళ్ళి, స్టోర్ రూమ్ తాళపు చెవులు తెచ్చాడు. ఇద్దరమూ కలిసి సైకిల్ ని బయట ప్రపంచంలోకి తీసుకొచ్చాము. అది దాదాపు అవసాన దశలో ఉంది.

"దీన్ని బాగు చేయిద్దామా? కొత్తది తెచ్చుకుందామా?" కొత్త సైకిల్ కొంటే ఎంతవుతుందో మనసులో అంచనా వేస్తూ అడిగాను.

" కొత్తది ఎందుకు నాన్నా? బాగు చేయిద్దాం. కావాలంటే సైకిల్ తొక్కడం వచ్చింతరువాత గేర్ సైకిల్ కొందాం. మా క్లాసులో హరిగాడికి ఉన్నట్టాంటిది. మహా.. వాడికే ఉన్నట్టు పెద్ద ఫోజు కొడుతుంటాడు" ప్రస్తుతానికి అభయమిచ్చినట్టే ఇచ్చి, పనిలో పనిగా భవిష్యత్ ప్రణాళిక చెప్పాడు.

ఇద్దరమూ వాళ్ల అమ్మకి చెప్పి బైక్ మీద బయటపడ్డాము. ఊరంతా తిరిగినా ఎక్కడా సైకిల్ షాపులు తీసి లేవు. అవును మరి, వాళ్లకి మాత్రం సెలవు వద్దా? చివరికి ఎక్కడో బైపాస్ దగ్గరలో ఒక చెట్టు క్రింద సైకిల్ షాపు, చిన్న డబ్బా లాంటిది తీసి ఉంది. దాన్ని చూస్తూనే "అదిగో... సైకిల్ షాపూ" అరిచాడు మావాడు. షాపతన్ని అడిగి, ఇంటికి వచ్చి అతి కష్టం మీద పాతసైకిల్ ని అక్కడికి చేర్చాము.

షాపు వాడు దాన్ని చూస్తూనే దగ్గరకి వచ్చాడు. టైర్లు, ట్యూబ్ లు, చైన్, ఫ్రీవీల్,సెంటర్ వీల్, యాక్సిల్, ఫోర్కు అంటూ సైన్స్ స్టూడెంట్ లాగా అన్ని భాగాల పేర్లు చదివాడు. తరువాత ఇవి బాగున్నాయి, ఇది ఫరవాలేదు, ఇది మార్చాల్సిందే అంటూ... గబాగబా నోటి లెక్కలేసి "ఓ వెయిరూపాయల దాకా అయితది సార్" అన్నాడు.

"కొత్త సైకిల్ ఎంతవుద్ది?" అడిగాను.

"ఇప్పుడన్నీ రేట్లు పెరిగినయ్ సార్, నాలుగువేల చిల్లర అవుతుండొచ్చు"

"గేర్ సైకిల్ అయితే ఎంతవుద్ది?" చిన్నా ప్రశ్న.

"గేర్ సైకిలా? మన దగ్గర దొరకదు, సిటీ నుండి తెప్పించుకోవాలి. తక్కువలో తక్కువ పదివేల దాకా అవ్వచ్చు".

ప్రస్తుతానికి బాగు చేయించడమే బెటరనుకొని

" సరే మరి, బాగు చేసి ఎప్పటికిస్తావ్?" అడిగాను.

"సాయంత్రం నాలుగు కల్లా అయిపోద్ది సార్"

"మరి సామాన్లు ఎక్కడ తెస్తావ్, ఆదివారం గదా?"

"నా దగ్గర స్పేర్ పార్ట్స్ ఉంటాయ్ సార్,"

" మంచి క్వాలిటీవి వెయ్యి, సెకండ్ హాండ్ వి వేసేవ్?" ... హెచ్చరికలు చెప్పి, అతని ఫోన్ నెంబర్ తీసుకొని ఇంటికి వచ్చాము.

"మమ్మీ! నా సైకిల్ సాయంత్రానికి రెడీ" ఇంట్లోకి వస్తూనే అరిచాడు చిన్నా. వాడికి వాళ్లమ్మను మమ్మీ అని, నన్ను నాన్నా అనీ పిలవడం అలవాటు.

వాడు ఇంట్లో ఉన్నాడన్న మాటే కానీ, వాడి మనసంతా రాబోయే సైకిల్ చుట్టే తిరుగుతోంది. వాడి మైండ్ లో ఉన్నది పసిగట్టినట్లు, ఓ చానల్లో 'ది ఫ్లయింగ్ స్కాట్స్ మన్' ఇంగ్లీష్ మూవీ వస్తోంది. దాంట్లోనూ సైకిలే. ఆ సినిమా చూస్తూనే, గోడ గడియారం వైపు మాటి మాటికీ చూస్తున్నాడు. చిన్నముల్లు, పెద్దముల్లు మధ్య నూట ఇరవై డిగ్రీల కోణం ఏర్పడింది.

" నాన్నా.... నాలుగైంది!" పెద్దగా అన్నాడు చిన్నా.

" అవును గదా, మరచే పోయాను" అంటూ షాపతనికి ఫోన్ చేశాను.

" సార్, గంటాగి రండి, అయిపోతుంది" చెప్పాడు. మావాడికి అదే విషయం చెప్పాను.

"అదేంటి, నాలుగింటికే ఇస్తాన్నాడుగా" అన్నాడు అసహనంగా.

"అరె.. అన్న టైముకే కరెక్టుగా ఎలా అవుతుంది? కాస్త అటు, ఇటు గాదా"

"అలాంటప్పుడు అయిదింటికే ఇస్తా అని చెప్పొచ్చు గదా" గునిశాడు.

మొత్తం మీద సాయంకాలం సరిగ్గా అయిదింటికి షాపు వద్దకెళ్ళాము. షాపతను అప్పటికే సైకిల్ షాపు బయట పెట్టాడు. ఆయిల్ తో తుడవబట్టేమో నీలం రంగులో, అదే రంగు సీట్ కవర్, బ్రేక్ కవర్లతో, చక్రాల మధ్య రంగు రంగుల పూలతో అందంగా మెరిసిపోతోంది.

"సార్, అన్నదానికంటే మూడు వందలు ఎక్కువయ్యాయి" రేట్లు వేసిన బిల్లులాంటి పేపర్ ఇస్తూ అన్నాడు.

చివరికి పన్నెండు వందలు యిచ్చి సైకిల్ ని బైక్ మీద మధ్యలో పెట్టుకొని ఇంటికివచ్చాము. కాలనీలోకి వస్తుంటే చూడాలి, అదేదో వరల్డ్ కప్ గెలుచుకొని వస్తున్నంత సంతోషం మా వాడి మొఖంలో. ఇక ప్రాక్టీస్ మొదలు పెట్టాలి. వాడు ఆగేట్టు లేడు. ఇంటి ముందు రోడ్డు మీద సైకిల్ దించి బైక్ ఇంట్లో పెట్టాను. సైకిల్ వద్దకు వచ్చి అటూ, ఇటూ నడిపించి బ్రేకులు వేసి చూసాను.

"చిన్నా, సైకిల్ పట్టుకొని కాలనీ మెయిన్ గేటు వద్దకు నడిపించుకుంటూ పోయిరా" అన్నాను.

"అదేంటీ, తొక్కొద్దా.." విచిత్రంగా చూశాడు.

"అరె, ఒకటి రెండు సార్లు నడిపించు, నీకూ దాని మీద అవగాహన వస్తుంది." సిద్ధాంతంపై పూర్తి పట్టున్న ప్రొఫెసర్ లెవల్లో చెప్పాను. వాడు అసంతృప్తిగానే మా ఇంటిముందునుండి, సైకిల్ నడిపించుకుంటూ కాలనీ మెయిన్ గేటు వరకూ వెళ్ళి, తిరిగి ఏడుపు మొఖంతో వచ్చాడు. మధ్యలో ఒక ఇంటిలోని పిల్లవాడొకడు,

"అరేయ్ చింటూ! సైకిల్ ఉన్నదీ ఎక్కి తొక్కడానికి, దాని ప్రక్కనే మనం నడిచే దానికి సైకిల్ ఎందుకూ?" అని వెక్కిరించాట్ట.

"సరే నీ ఇష్టం పట్టు"అని వాడిని సైకిల్ పై కూర్చోబెట్టి కుడి చేత్తో వెనుక క్యారేజీ, ఎడమ చేత్తో హ్యాండిలూ పట్టుకొని, ఇక తొక్కమన్నాను. అటూ ఇటూ రోడ్డుపై రెండు రౌండ్లు వేసి, ముందు బ్రేకు వేయవద్దని, వెనుక బ్రేకు వేయడం చూపించి, తరువాత చిన్నగా హ్యాండిల్ బార్ వదిలేశాను. కానీ మాటి మాటికీ హ్యాండిల్ వంకరగా పోతోంది. "సరిగ్గా పట్టుకో... ముందుకే చూడూ.. కాళ్ల వైపు చూసుకోవద్దు" అని సూచనలు ఇస్తూ వెనుక క్యారేజీ పట్టుకొని సైకిలెనకాలే పరిగెత్తసాగాను.

మాటికీ కాలనీ రోడ్డుపై ఏదో ఒక బండో, కారో రావడం , మేము ఆగడం, అవి వెళ్ళే వరకూ ఉండి , మళ్ళీ సాధన మొదలెట్టడం .... చీకటి గూడా పడింది. కాలనీ లైట్ల వల్ల రాత్రయిన విషయం పెద్దగా తెలియట్లేదు.

"ఇప్పటికి చాల్లే చిన్నా! ఈ సారి ఆదివారం చూద్దాం" అని సాధన ముగించాము.

అంతే మరి ఈ నాటి చదువుల్లో.. వీళ్లకి వేరే రోజుల్లో విరామమెక్కడిది?

అలసి పోయాడేమో, ఆ రోజు త్వరగా నిద్ర పోయాడు. బహూశా కలలో కూడా పగలు చూసిన సినిమాలో హీరో లీమిల్లర్ గుర్తుకొచ్చి ఉంటాడు.

చూస్తుండగానే నాకు ఆఫీస్, వాడికి స్కూలూ... ఆరు రోజులు గడిచిపోయాయి. మళ్ళీ ఆదివారం రానే వచ్చింది. ఈ లోపులో వాడి సైకిల్ సాధనకు అనుకూలమైన స్థలం చూసాను. అది మా టౌన్ చివర్లో ఉన్న మిషనరీ చర్చి మైదానం. బాగానే పెద్దది. అనుమతి కూడా తీసుకున్నాను. పొద్దున్నే టిఫిన్ చేసి ఇద్దరం వాడి సైకిల్ తీసి, బైక్ మీద పెట్టుకొని అక్కడకు చేరుకున్నాము. ఆ పెద్ద గ్రౌండ్ లో ఒక మూలన ఉన్న చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. మేం మైదానంలో మరో పక్కకు చేరుకున్నాం. సైకిల్ కిందకు దించి, బైక్ దూరంగా పెట్టి వచ్చాను. నేను ఒకసారి సైకిల్ ఎక్కి కూచొని, ఎలా తొక్కాలి, ఎలా బ్రేకు వేయాలి, ముందు బ్రేకు ఎందుకు వేయొద్దూ... అంటూ సూచనలు ఇచ్చి, వాడిని సీటు పై కూర్చోబెట్టి తొక్కమన్నాను. ఫరవాలేదు, బాగానే తొక్కుతున్నాడు. హ్యాండిల్ కూడా బ్యాలన్స్ అవుతోంది. ఒక గంట తరవాత,

" బాగా తొక్కుతున్నావు, గుడ్, అలాగే .. అలాగే" అంటూ చిన్నగా అప్పటివరకూ వెనుక పట్టుకున్న క్యారేజ్ వదిలేశాను. వాడు సైకిల్ సూటిగా తొక్కుతూ పోయి ప్రహరీ గోడకు గుద్ది కింద పడ్డాడు. వాడు లేచి..

"నాన్నా, ఎందుకు వదిలేశావు?" కోపంగా అన్నాడు.

" బాగానే తొక్కుతున్నావు గదరా... చూడు ఎంత దూరం తొక్కావో.. అయినా కాళ్ళు అందుతున్నాయి గదా బ్రేకు వేసుకోవచ్చుగా" ఎదురు ప్రశ్నించాను. అలిగాడు. కొంచెం సేపు కూచొని, "సరే, ఇప్పటికి ఇంటికి పోయి, అన్నం తినొద్దాం, కాస్త చల్ల బడ్డాక వద్దాం" అని పక్కనే గోడ వెంబడి సైకిల్ పెట్టి తాళం వేసి, బైక్ పై ఇంటికి వచ్చాం.

స్నానం చేసి అన్నం తిన్నాం. సాయంత్రం నాలుగున్నరకు మళ్ళీ గ్రౌండ్ కు వచ్చాం. సాధన మొదలైంది. సైకిల్ తొక్కుతున్నాడు గానీ ఎంతసేపటికీ నేను వెనుక పట్టుకొని ఉన్నానా, లేదా అని చూసుకుంటున్నాడు. నేను సైకిల్ పక్కనే లేకపోతే ఆగిపోతున్నాడు.

" నా వైపు చూడకు, హ్యాండిల్ బ్యాలన్స్ చెయ్యి, అవసరమైతే బ్రేక్ వేసుకో.." అని అరుపుల సలహాలు ఇస్తున్నాను. అయినా వాడు వెనక్కి తిరిగి చూడటం మానలేదు. నాకూ విసుగు వచ్చింది. అప్పటికి చీకటి గూడా పడింది. సైకిల్ అక్కడే ఉన్న షెడ్ లో పెట్టి తాళం వేసి ఇంటికి వచ్చాము.

" ఏం చిన్నా, సైకిల్ తొక్కడం వచ్చిందా?" వాళ్లమ్మ అడిగింది.

వాడు సమాధానం చెప్పలేదు.

"ఫరవాలేదు బాగానే తొక్కుతున్నాడు, ఈ సారి ఆదివారానికి వచ్చేస్తుంది." అన్నాను.

కానీ ఈసారి ఆదివారం అదే కథ. సైకాలజీ గురించి బాగా మాట్లాడుతుంటాడు గదా అని, మా కొలీగ్ తో మా వాడి సైక్లింగ్ విషయం చర్చిస్తే, అతను అదేదో సైకోమోటర్ రిటార్డేషన్ అనీ, మోటార్ మెంటల్ రిటార్డేషన్ అని, సైకిల్ నేర్పడం కంటే కఠినమైన పదాలు వాడి, ఏవేవో ఫోబియాల గురించి చెప్పాడు.

చూస్తుండగానే మరో ఆదివారం కూడా వచ్చేసింది. ఈ రోజు ఎలాగైనా వాడికి సైకిల్ తొక్కడం నేర్పాలి. నూటొక్కటో సారి అనుకున్నాను. ఎప్పటిలాగే చర్చి కాంపౌండ్ కి వెళ్లాం. సైకిల్ సీటు పై వాడిని కూచోబెట్టి, నేనూ వెనుకే పరిగెత్తసాగాను. బాగానే తొక్కుతున్నాడు. నేను వదిలేసినట్లనిపించగానే ఆగిపోతున్నాడు.

మధ్యలో " నాన్నా... వదిలిపెట్టొద్దు" అంటూ తొక్కుతున్నాడు.

ఎండ క్రమంగా పెరుగుతోంది. ఇద్దరికీ చెమట్లు కారిపోతున్నాయి.

ఫరవాలేదు, బానే తొక్కుతున్నాడు. వెనుకే పరిగెడుతూ నెమ్మదిగా క్యారేజ్ వదిలేశాను.

"వెరీ గుడ్, బాగా తొక్కుతున్నావ్, అలాగే తొక్కు... " వెనుకనే పరుగెడుతూ ఉత్సాహ పరిచాను. అరనిమిషం అయిందో లేదో వాడు వెనక్కిచూశాడు. వెంటనే సైకిల్ పట్టుకుని...

" నేను వదిలి పెట్టలేదు,నువ్ తొక్కు" అన్నాను.

వాడు తొక్కుతున్నాడు. నేను చేయి నెమ్మదిగా వదిలేశాను. మళ్లీ వెనక్కి చూసాడు. కాళ్ళు కింద పెట్టి సైకిల్ ఆపాడు. నాకు పిచ్చి కోపం వచ్చింది. సైకిల్ గట్టిగా పట్టుకొని నిలబెట్టి, వీపు మీద ఒక్కటి చరిచాను.

"వెధవా, వెనక్కి చూడొద్దంటే అర్థం గావట్లేదా, వెనక్కి చూస్తూ ముందుకు ఎలా తొక్కుతావు. ఇక్కడే ఉన్నాను గదా, మళ్ళీ వెనక్కి చూడు నీ సంగతి చెబ్తా... వేలెడంత లేని పిల్లలు సైకిళ్ళు తొక్కుతున్నరు, ఇంతున్నవ్, నీకేమైంది, ఎక్కు" అరిచాను.

వాడు సైకిల్ ఎక్కాడు. కానీ హ్యాండిల్ సరిగా నిలబడట్లేదు. కాసేపటికే, వాడి మొఖం చూసి నాకూ జాలిగా అనిపించింది. నాపై నాకే కోపం వచ్చింది. "సైకిల్ తొక్కడం రాకపోతే ఏం... ఈ మాత్రానికే వాణ్ని కొట్టాలా.. ఎప్పుడో అప్పుడు వాడే నేర్చుకుంటాడు" అనుకున్నాను.

" చిన్నా....ఇప్పటికి చాల్లే, ఈ సారి చూద్దాం" అని సైకిల్ అక్కడే ఉంచి ఇంటికి వచ్చాం.బైక్ మీద సైలెంట్ గా కూచున్నాడు. సైడ్ మిర్రర్ లో వాడి కళ్ళు ఏడ్చి ఎర్రగా కన్పిస్తున్నాయ్. ఇంటికి వస్తూనే బాత్ రూంలోకి పరుగు దీశాడు. స్నానం చేసి వచ్చాడు.

"ఏమైందిరా, అలా ఉన్నావు?" వాళ్లమ్మ అడిగింది.

ఏమీ లేదన్నట్లు తలూపాడు. నిశ్శబ్దంగా అన్నం తిన్నాడు.

" చిన్నా, శేషు మామ ఇంటికి వెళ్దామా?"

శేషువాళ్లు మా టౌన్ కి రెండు మైళ్ల దూరంలోనే ఉంటారు. ఫ్యామిలీ ఫ్రెండ్స్. పదినిమిషాల్లో మేం ముగ్గురం వాళ్లింటికి వెళ్ళాం. అందరూ ఇంట్లోనే ఉన్నారు.

" చుట్టాలు వస్తున్నారోయ్, చాలాకాలానికి తీరింది వీళ్లకి! పిల్లలూ, మీ ఫ్రెండ్ చిన్నా వచ్చాడు" అంటూ భార్యను, పిల్లలనూ కేకేశాడు.

"ఏరా, చిన్నా, బాగున్నావా? అలా ఉన్నావేంటీ? మీ నాన్నేమైనా కొట్టాడా?" అడిగాడు.

చిన్నా అడ్డంగా తలూపుతూ " మా నాన్న నన్నసలు కొట్టడు తెలుసా?" బుంగమూతితో అన్నాడు. నాకు ఎక్కడో చురుక్కుమంది.

"అవున్రా, నిజమే... నాన్నలు అసలు కొట్టరు, కొట్టినట్లు నటిస్తారు అంతే...." నా వైపు చూస్తూ గట్టిగా నవ్వేశాడు. వీపు రుద్దుకుంటూ వీడూ నవ్వేడు.

కాసేపటికే పిల్లలు ఆటల్లో పడ్డారు.

సాయంత్రానికి ఇంటికొచ్చాం. వచ్చిన గంటకే ఫోన్. ఆఫీస్ పని మీద, మూడు రోజులు క్యాంప్. ఉదయం చీకటితోనే వెళ్లి పోయాను. వెళ్లిన పనులన్నీ ముగించుకొని మూడో రోజు త్వరగా బయల్దేరాను. ఇంకా అర్ధగంటలో ఊరు చేరతాననగా ఇంటికి ఫోన్ చేశాను, వస్తున్నానని. బస్టాండ్ లో దిగేసరికి రాత్రి తొమ్మిదయింది. బస్టాండ్ నుండి కాలనీ పావుగంట నడక దూరమే. వేగంగా నడుస్తూ చేతిలో బ్రీఫ్ కేసుతో కాలనీ మెయిన్ గేట్ లోకి ప్రవేశించాను. వాచ్ మెన్ ని పలకరించి, గబాగబా నడవసాగాను.

వెనుక నుండి ట్రింగ్, ట్రింగ్ మని సైకిల్ బెల్ . రోడ్ మీది నుండి పక్కకు జరిగి నడవసాగాను. సైకిల్ నా ముందునుండి వెళ్ళి పోయి, ఆ రోడ్ చివరకంటా వెళ్ళి, తిరిగి మళ్ళీ బెల్లు కొట్టుకుంటూ నా వెనుకే వచ్చింది.

"ఎవర్రా అది" అనుకుంటూ రోడ్డు పక్కన ఆగాను. పెద్దగా నవ్వుతూ చిన్నా.

"నాన్నా" అంటూ సైకిల్ పై మళ్ళీ వేగంగా వెళ్లిపోయాడు.

తిరిగి మళ్ళీ నా వెనుకే.."'అరె, నువ్వు... సైకిల్ ... ఎలా?"

మళ్ళా ఒక చుట్టు చుట్టొచ్చి నా పక్కనే ఆగి, సైకిల్ వెనుక క్యారేజ్ వైపు చూపిస్తూ 'ఎక్కుతావా?' అన్నాడు.

"ఆ(... నిన్నూ ..." అంటూ పెద్దగా నవ్వాను, వాడు కూడా.

నేను ఇంటికి వచ్చేంతవరకు వాడు సైకిల్ పై వెనక్కి, ముందుకి తిరుగుతునే ఉన్నాడు.

ఇంట్లోకి వస్తూనే " మీ ఫోన్ కాల్ వచ్చినప్పట్నించి వాడు ఇంట్లోకి రావడం లేదు, సైకిల్ పై కాలనీ గేటు దగ్గరకీ, ఇంటి ముందుకీ తిరుగుతునే ఉన్నాడు" భార్యామణి అంది.

"వీడు సైకిలెప్పుడు నేర్చుకున్నాడే...?"

"అదేంటి మీరు కాదా నేర్పింది? నిన్న ఏవో విద్యార్థి సంఘాలు బంద్ చేశాయని స్కూళ్లకి సెలవిచ్చారు. సైకిల్ తెచ్చుకుంటానని వెళ్ళి సాయంత్రానికి వచ్చాడు. అదిగో వాడి మోకాళ్లు చూశారా, ఎలా చీరుకు పోయాయో" ఫిర్యాదు చేసింది.

ఇంతలో వాడు సైకిల్ ఇంట్లో పెట్టి, స్నానం చేసి వచ్చాడు. త్వరత్వరగా అన్నం తిని నిద్రొస్తుందంటూ పడక గదిలోకి వెళ్లి పోయాడు. నేనూ స్నానం పూర్తి చేసి, ఫ్రిజ్ మీదున్న ఆయింట్ మెంట్ అందుకుని వాడి దగ్గరకు వెళ్లాను, అప్పటికే వాడు మంచి నిద్రలో ఉన్నాడు. నిద్రలోనే నవ్వుతున్న

వాడి మోకాళ్ల మీద ఆయింట్ మెంట్ రాస్తుంటే, ఆ రోజు బస్ లో వస్తూ చదివిన మ్యాగజైన్ లో వాక్యాలు గుర్తొచ్చాయి. "పిల్లలకు నేర్పుతున్నామని అనుకుంటాం.. కానీ... నిజమేమిటంటే.. వాళ్లు నేర్చుకుంటారు.. అంతే"

**Every child has a different learning style and pace. Each child is unique, not only capable of learning but also capable of succeeding –**

# వసంతకోకిల

కృపాకర్ పోతుల

"లేమావి చివురులను లెస్సగా మేసేవు
రుతురాజు వచ్చెనని అతిసంభ్రమముతోడ
మావికొమ్మలమీద మైమరచిపాడేవు ..............

నాన్నకత్యంత ప్రీతిపాత్రమైన "కాళోజీ"వారి కవిత. శ్రావ్యంగా మంద్రంగా గొంతెత్తి పాడుతున్న నాన్న. నాన్నకి కోకిలన్నా, కోకిల పాటన్నా, కోకిల కంఠానికా తియ్యదనాన్నిచ్చే చిగుళ్ళని ఆయాచితంగా అందించే గున్నమావిడి చెట్టన్నా మాటల్లో చెప్పలేనంత ఇష్టం.

ఇంటి బయట, పడకగదినానుకొని కుందనపు బొమ్మలాంటి గున్నమామిడిచెట్టు పచ్చరంగు కలబోసిన ఎర్రటి లేత చిగుళ్ళను పట్టుచీర సింగారించుకొన్న అందమైన పల్లె పడుచులా సింగారించుకొని. దాని చిటారు కొమ్మన, ఆ చివుళ్ళ నడుమ, నవరత్నకచిత సింహాసనమ్మధిరోహించిన మహారాజుకు మల్లే హుందాగా కూర్చొని గర్వంగా గొంతెత్తి కూస్తున్న గండుకోయిల.....ఎక్కడున్న ఏ ప్రేయసికి ఏ ప్రేమసందేశమో ఏమో. జానకి పాటలాంటి మధురమైన కోకిల పాటా దానికి పోటీగానా అన్నట్టు నాన్న గొంతెత్తి మంద్రంగా పాడుతున్న కాళోజీ కవితా.....నాన్ననీ కోకిలనీ సంభ్రమంగా చూస్తూ మైమరచిపోతున్న నేను.....ఇద్దరు మహాగాయకుల జుగల్బందీ వింటూ రసజత్తులో తేలియాడుతున్న రసపిపాసిలా. కాలం స్థంభించిపోయిన అనుభూతి........

మధురమైన రసానుభూతిలో ఓలలాడుతున్న సమయంలో అకస్మాత్తుగా దొర్లిన అపశృతిలా, ఎక్కడో దూరంగా కఠోరంగా మోగుతున్న అలారం చప్పుడు. ఆ చప్పుడు నెమ్మదిగా దగ్గర దగ్గరగా వస్తూ కంటున్న కలని క్రూరంగా ఛిద్రం గావిస్తూ.....సుషుప్తావస్తనుండి జాగృదావస్తలోనికి నన్ను నిర్దాక్షిణ్యంగా నెట్టేస్తూ.... "అయ్యో ఇది వట్టి కలేనా. నాన్న నా ప్రక్కన ఉన్నదీ తనకిష్టమైన కవిత గానం చేస్తున్నదీ నిజం కాదా" అని గుండెను మెలిపెట్టే భావనకూడా మత్తు విడిపోతున్న ఆ క్షణంలోనే. కళ్ళు తెరిచిన నాకు ఎక్కడున్నానో ఏమో వెంటనే స్ఫురించలేదు. అయోమయంగా చూస్తున్న నాకు మంచం ప్రక్కనే నిలబడి నావేపు చూస్తున్న రవీ..... రవి చేతిలో బంగారంలాంటి నా కలని కరిగించేసిన అపరాధి అలారం టైంపీస్.... రక్తపోటుని ఉద్దీపింపచేసే పాశ్చాత్య సంగీతంలా కర్ణకఠోరమైన శబ్దాలు వెదజల్లుతూ. పూర్తిగా మెలుకువ వచ్చేసింది నాకు.

ఆశ్చర్యంగా చూస్తున్న నాకు తెరిచిఉన్న కిటికీ వేపు చూపించాడు చూపుడువేలితో. చూస్తే, నిండు పూతతో ముస్తాబైన గున్నమావీ ఆ మావి గుబురులో శ్రావ్యంగా గొంతెత్తి కూస్తున్న గండుకోకిల.

---000---

ఎన్నాళ్ళ కోరిక. రవితో కలిసి మామిడిచెట్టున్న చక్కటి ఇంటిలో మేమిద్దరమే ఉండాలని. ఆ చెట్టు మరీ పెద్దదిగా మరీ చిన్నదిగా కాకుండా మధ్యస్తంగా ఉండాలనీ, దాని కొమ్మల్లో కనీసం ఒక కొమ్మైనా పడకగదివేపు వాలుతూ ఉండాలనీ, వసంతంలో చివుళ్ళు తొడిగిన మావి గుబుళ్ళలో పొంచిన గండుకోయిలలు గొంతువిప్పాలనీ, ఆ పాటలతో మాఇల్లంతా ప్రతిధ్వనిస్తే వింటూ పులకించిపోవాలనీ..... ఎన్నాళ్ళ కోరిక. ఎప్పుడో అనంతపురం వదిలేసినప్పట్నుండీ మనసులో నాటుకుపోయి ఊరిస్తున్న తీరని కోరిక.

---000---

అనంతపురంలో నాన్నా నేనూ ఇద్దరమే ఉన్న మూడు సంవత్సరాలూ తన జీవితంలో అత్యంత ఆనందకరమైన రోజులు అనేవాడు నాన్నెప్పుడూ. అక్కడ ఇంజనీరింగ్ లో జాయిన్ అయిన తర్వాత ఇంచుమించు ఒక సంవత్సరం పాటు అనుకుంటాను, హాస్టల్ లో ఉండాల్సి రావడం తప్పలేదు నాకు. హాస్టల్ జీవితం దుర్భరంగా ఉండేది నాన్న నాతో లేకపోవడం వల్ల. కాని తప్పదు కదా. ఎలాగోలా కష్టపడి చదువు పూర్తిచేసుకొని మళ్ళీ నాన్నదగ్గరికి వెళ్ళిపోదాం అనే ప్రయత్నంలో సఫలీకృతమౌతున్న సమయంలో ఒకరోజు ఉదయాన్నే నాన్న ప్రత్యక్షం హాస్టల్ దగ్గర....సడి చెయ్యకుండా వచ్చి సందడిచేసే వేసవికాలపు చిరుజల్లులా.

"నేను అనంతపురానికి బదిలీ చెయ్యించుకున్నాను సింధూ" నాన్న పెట్టిన కేక నాకు అర్ధం కావడానికి కొన్ని సెకన్ల సమయం పట్టింది "ఇన్నాళ్ళూ చెప్పలేదమ్మా నీకు బదిలీ కోసం ప్రయత్నం చేస్తున్నట్టు. ఎందుకంటే నీకు "ప్లెజెంట్ సర్ప్రైజ్" ఇవ్వాలని. నిన్ననే రిలీవ్ అయ్యాను. వెంటనే బయల్దేరి వచ్చేసాను. త్రీ లాంగ్ యియర్స్ సింకా. ("సింకా" అంటే "సింధు కన్నా" అని). హాయిగా మనిద్దరమే ఉంటాం" అంటూ చిన్నపిల్లాడిలా ఉత్సాహంగా చెప్తున్న నాన్నని ముద్దుపెట్టేసుకున్నాను ఆనందంతో చిందులేసేస్తూ.

నాన్న అన్న ఆ 'త్రీ లాంగ్ యియర్స్ ' ఎంత త్వరగా గడిచిపోయాయో తలంచుకుంటే ఎంత ఆశ్చర్యంగా ఉంటుందో ఇప్పుడు. కాలేజీకి దగ్గర్లోనే ఇల్లు తీసుకున్నాం. అది నాన్న ఆఫీసుకు కొంచెం దూరమేగాని, ఆ కోలనీ చాలా బాగుందని అక్కడే తీసుకున్నాడు నాన్న. అదిగో అలా అనంతపూర్ లో ఆ కోలనీలో ఉన్నప్పుడే మొదలైంది మామిడిచెట్లతో గండుకోయిలలతో మా "లవ్ ఎఫైర్ ".

అక్కడ మా ఇంటి వెనుకా ముందూ మాత్రమే కాకుండా కోలనీ మొత్తం మామిడిచెట్లతో వేపచెట్లతో నిండి ఉండేది. వసంతకాలంలో చిగురించిన మామిడిచెట్లు గండుకోయిలల తియ్యని పాటలతో హోరెత్తిపోతుంటే, విరబూసిన వేపపూల చిరుచేదు సువాసనతో కోలనీ మొత్తం గుభాళించిపోయేది. ఇంట్లో నేనూ నాన్నా..... ఇద్దరమే. కావలసినంత సమయం మా ఇద్దరికీ.

ఎన్ని కబుర్లో మా మధ్య....తండ్రీ కూతుర్లలా కాకుండా స్నేహితుల్లా. నా కాలేజీ కబుర్లూ, నాన్న ఆఫీసు విశేషాలూ, మేం చదువుతున్న పుస్తకాల విశ్లేషణా, చూసిన సినిమాలపై చర్చలూ, దేశ రాజకీయాలూ, లోకల్ ఫేక్షన్ గొడవలూ "కాదేదీ కబుర్లకనర్హం" అన్నట్టు. నాన్న నాతో నాన్నలా కాకుండా ఒక స్నేహితుడితో మాట్లాడినట్టు మాట్లాడడం, నన్ను తనతో సమానంగా ట్రీట్ చెయ్యడం మా ఫ్రెండ్స్ చాలా మందికి ఆశ్చర్యంగా, నాకు చాలా గర్వంగా ఉండేది.

ఎంత అందమైన నిశ్శబ్దాన్ని ఆస్వాదించాం నేనూ నాన్నా అక్కడ. వసంతకాలంలో వెండి వెలుగుల నులివెచ్చని వెన్నెలలో కోలనీ అంతా కబుర్లు చెప్పుకుంటూ తిరుగుతూ, చలికాలంలో ఘనీభవించిన మంచుముక్కలా వణికిస్తున్న అదే వెన్నెల్లో ఒక్క మాట కూడా మాట్లాడుకోకుండా గంటల తరబడి నిశ్శబ్దంగా డాబా మీద కూర్చొనీ.

ఒకసారి ఏదో పనిమీద నాన్నని కలిసిన మా ప్రొఫెసర్ అన్నాడట "సింధూరికి ఎటెండెన్స్ జస్ట్ బోర్డర్ దాటిందంతే ఈ సెమెస్టర్ కి. తను చాలా బ్రిలియంట్ స్టూడెంట్ . ఫోకస్ తప్పితే ఫస్ట్ రేంక్ మిస్ అవుతుంది. కొంచెం చూసుకోండి" అని.

నాన్న ఆయనకిచ్చిన సమాధానం ఇప్పటికీ మరచిపోలేను నేను. "థాంక్యూ సార్ . కాని చిన్నప్పట్నుండీ రేంకులూ ఐఐటీలూ ఐఏఎస్ లూ అంటూ భయంకరమైన వత్తిడిలో పెంచలేదు తనని. ఆమె బాల్యం, కౌమార్యం ఆనందంగా సాగిపోవాలని కోరుకున్నాను. ఒక పాతిక ముప్పై సంవత్సరాలతర్వాత నా కూతురు తన బాల్యాన్నెప్పుడైనా గుర్తుకుతెచ్చుకుంటే అందులో తీపిగుర్తులేతప్ప చేదు జ్ఞాపకాలకు తావుండకూడదని నా కోరిక.

తను రేంక్ నిలబెట్టుకుంటుందనే నా నమ్మకం. ఒక వేళ నిలబెట్టుకోకపోతే....నా దృష్టిలో అదేమంత పెద్ద సమస్య కానేకాదు." అన్న నాన్నని పిచ్చాడ్ని చూసినట్టు చూసాడట మా ప్రొఫెసర్.

---000---

"తమరు కోరుకున్నట్టుగానే మావిడిచెట్టున్న ఇల్లు మేడం. ఒకటి కాదు రెండు కొమ్మలు తమరి బెడ్రూమ్ ని కప్పేసాయి చూసారా. గండుకోయిల కూడా ఉదయాన్నే వచ్చికూర్చుంది తమరి సుప్రభాత సేవ కోసం. ఒకసారి తమరు పాన్పు దిగి చుట్టూ పరికిస్తారా" అన్నాడు రవి నాటకీయంగా కళ్ళెగరేస్తూ.

---00---

నెల రోజుల క్రితం ఇక్కడికి బదిలీ కాకముందు ముంబాయిలో ఉండే వాళ్ళం. మామిడిచెట్టు కాదు కదా కనీసం వెంపలి మొక్క కూడా కనబడని భయంకరమైన కాంక్రీట్ కీకారణ్యంలో ఐదు బాధాకరమైన భయంకరమైన సంవత్సరాలు. పిచ్చెక్కినట్టుండేది నాకు. అల్లాడి పోతున్న నా బాధ చూడలేక బృహత్ప్రయత్నం చేసి బదిలీ చెయ్యించుకున్నాడీ ఊరికి. గోదావరి జిల్లా లో అందమైన ఊరనీ, చుట్టూ కొబ్బరిచెట్లూ, వరిపొలాలతో చాలా అందంగా ఉంటుందనీ, మనం కారులో ప్రయాణిస్తున్నంతసేపూ మనతో పాటూ గోదావరి కాలువ ప్రాణస్నేహితుడిలా మనల్ని అంటిపెట్టుకొనే వస్తుందనీ, అది భూలోక స్వర్గమనీ, అక్కడందరూ భూలోక రంభలే ఉంటారనీ తెగ ఊరించాడు నన్ను. ఎప్పుడూ చేసినట్టే బదిలీ అయిన ఊరికీ తనే ముందుగా వెళ్ళి ఇల్లు అమర్చుకొని, సామాన్లు కూడా షిఫ్ట్ చేసినతరవాత గాని నన్ను తీసుకురాలేదిక్కడికి. నిన్న రాత్రి ముంబాయి నుండి కారులో వచ్చేటప్పటికి రాత్రి పన్నెండుగంటలు దాటడంతో ఈ ఊరి అందచందాలూ, ఇక్కడి భూలోకరంభలూ, ఇంటి బయట కొలువుతీరిన వేపచెట్టూ ఇవేమీ కనబడలేదు నాకు. రంభల విషయం వందసార్లు చెప్పిన రవి ఇంటిముందున్న మామిడిచెట్టు విషయం ఒక్కసారి కూడా చెప్పనేలేదు నాకు.

"కావాలనే నీకు చెప్పలేదురా. ఎందుకో తెలుసా? మావయ్యేనేంటి, నేను కూడా నిన్ను అలాగే సర్ప్రైజ్ చెయ్యగలనని నీకు చూపించడానికి. నువ్వు ఊహించని కానుక. ఆశ్చర్యంగాలేదూ నీకు" అన్నాడు నా బుగ్గమీద చిన్నగా ముద్దు పెట్టుకుంటూ.

చెమర్చిన కళ్ళూ, మూగబోయిన గొంతూ, ఆనందంతో ఎగసిపడుతున్న హృదయం. నాన్న ఎక్కడికీ వెళ్ళిపోలేదు నన్ను వదిలేసి. ఇక్కడే నాతోనే ఉన్నాడు రవి రూపంలో అనే సంతృప్తికరమైన భావన. తన చేతిని నా చేతిలోకి తీసుకొని పెదాలకి ఆనించుకొని కళ్ళుమూసుకున్నాను నిశ్చింతగా.

కొమ్మమీద వసంతకోకిల కూస్తూనే ఉంది హృద్యంగా.

## పరీక్ష

రవి కొప్పరపు

జెన్ టెక్ బోర్డ్ ఆఫ్ డైరక్టర్లు ముందు వరుసలో కూర్చున్నారు. కంపెనీ ప్రెసిడెంటు తో పాటు చీఫ్ సైంటిస్టు, టెక్నాలజిస్టు, పబ్లిక్ రెలేషన్ మేనేజరు స్టేజీ మీద వున్నారు. ఒక ముఖ్యమైన సందర్భాన్ని ప్రపంచంతో పంచుకోవడానికి ఈ రోజు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ముందుగా పబ్లిక్ రెలేషన్ మేనేజరు కంపెనీ గురించి వివరాలు చెప్పి, ప్రెసిడెంటుని మాట్లాడమన్నారు. ప్రెసిడెంటు కానర్ మైకు ముందుకు వచ్చి "మా కంపెనీ స్థాపించిన రోజు నుంచీ మా లక్ష్యం ఒక్కటే: భవిష్యత్తు కోసం నిరీక్షించకుండా, మనమే భవిష్యత్తు తయారు చెయ్యాలి.

అందరూ అద్భుతం అనుకునేవీ, కలల్లోనే సాధ్యమయ్యేవి నిజం చెయ్యడం మా పని. ఈ రోజు అలాంటిదే. ఈ రోజు జెన్ టెక్ కి చాలా పెద్ద శుభదినం. కంపెనీకే కాదు, ప్రపంచానికి కూడా. మానవ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒక కంప్యూటర్ స్వంతంగా నిర్ణయాలు తీసుకొనే పద్ధతి కనిపెట్టాము. అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్నమాట. ప్రకృతి సహజంగా కాకుండా, మానవుల వల్ల తయారు చెయ్యబడిన ఒక బుద్ధిజీవి అనుకోవచ్చు. కంప్యూటర్లు మనతో చెస్సు ఆడడం అనేది పాతకాలం నాటి వార్త. ఇప్పుడు మేము కనుకున్న పద్ధతితో ఒక కంప్యూటర్ చెస్సు ఎందుకు ఆడాలి, ఓడిపోతే బాధ, గెలిస్తే ఆనందం, ఎవరంటే ఇష్టం ఇవన్నీ కలిగేలా చేస్తుంది. మా చీఫ్ సైంటిస్టు సమీర్ దాని వివరాలు ఇవ్వగలరు" అని ఆయన్ని పిలిచారు.

సమీర్ మాట్లాడుతూ, ఇది క్వాంటం కంప్యూటరని, ఇప్పటి సూపర్ కంప్యూటర్లు కొన్ని నెలల్లో చేసే కష్ట సాధ్యమైన పని, కొన్ని సెకన్ల లో చెయ్యగలదని, కృతిమ మేధస్సు మెల్లగా మొదలు పెట్టామని, కష్ట సాధ్యమైన పరీక్షలు ఇస్తూ కొంచెం కొంచెం పెంచుకుంటూ వెళతామని చెప్పారు. ఈ కంప్యూటర్ని అప్పుడే పుట్టిన చిన్న బిడ్డగా ఊహించుకోవచ్చని, 'పూర్తిగా ' పెరగడానికి సంవత్సారాలు పడుతుందని చెప్పారు. ఎవరో అడిగారు. ఏం పేరు పెట్టారని. సమీర్ సమాధానంగా చెప్పాడు "విని (VINI)". వర్చ్యు అల్ ఇంటెలిజెన్స్ న్యూరల్ ఇంటర్ఫేస్.

అందరి ప్రసంగం అయ్యిన తరువాత, విలేఖర్ల ప్రశ్నలు, వాటి సమాధానాలు అవన్నీ అయ్యేటప్పటికి సాయంత్రం ఆయింది. ఇంక అందరూ వెళుతున్నారు. ఎవరో సమీర్ ని అడిగారు, 'బయట పార్టీ వుంది వస్తావా?' అని. ల్యాబ్ లో కొంచెం పనుందని, తరువాత కలుస్తానని చెప్పాడు సమీర్. తనకి ముందసలు ఎప్పుడెప్పుడు ల్యాబ్కి వెళ్దామా అని వుంది. ఎందుకంటే విని గురించి కొత్త విషయం తెలిసింది తనకు. ఇంతకు ముందు వరకు కేవలం కీబోర్డు మీద టైపు చేస్తే, కంప్యూటరు స్క్రీన్ మీద సమాధానం వచ్చేది. కాని వారం రోజుల క్రితం విని తను మాట్లాగలను అని చెప్పింది. ఇప్పుడు టైపు చెయ్యడం కంటే, నేరుగా మాట్లాడవచ్చు. ఇది ఇంకా ఎవ్వరికీ తెలీదు....ఒక్క తన కొలీగు షీలాకి తప్ప. ఇద్దరూ మెల్లగా విని తో సంభాషించడం మొదలు పెట్టారు.

చాలా చెప్పింది విని. వీళ్ళతో మాట్లాడటం ఎంత హాయిగా వుందో తనకి అని, ప్రపంచం లో జరిగే విషయాలు తెలుసుకుంటున్నానని, కొన్ని ఫీలింగ్సు కొత్తగా వున్నా, అడ్జస్టు అవ్వడానికి టైము పడుతోందని. మొదట సందేహించినా, సమీర్, షీలా కొంచెం అలవాటు పడ్డారు. ఇంకా నేర్చుకోవలసింది చాలా వుందని, ఇంకా కొన్ని పరీక్షలు ఇచ్చి మెల్ల మెల్లగా పరిణితి చెందొచ్చని చెప్పారు.

ఇప్పుడు ల్యాబ్ కి వెళ్ళి విని కండీషను చూసి ఇంటికెళ్ళాలి. రేపటి నుండి కొత్త టెస్టు లు మొదలెట్టాలి...ఇలా ఆలోచిస్తూ ల్యాబ్ లోకి వెళ్ళాడు సమీర్. అప్పటికే షీలా వుందక్కడ.

"సో..ఏంటి కండీషను?" అడిగాడు సమీర్

"చాలా ఎగ్జైటింగ్ న్యూస్. ..విని కొత్త భాష తయారు చేసింది" షీలా మొహం లో విపరీతమైన సంతోషం

"ఏంటీ?"

"అవును...అది నీకు, నాకు అర్థం కాదులే. ఇందాక కోడ్ చూస్తుంటే కొత్త నెట్వర్కులు కనిపించాయి. అవెందుకో ముందు అర్థం కాలేదు. విని అడిగితే చెప్పింది"

వాళ్ళిద్దరి ఎదురుగా పెద్ద స్క్రీను. దాని మీద విని ధ్వని తరంగాలు కనిపించేలా తయారు చేసారు. విని తో మాట్లాడాలంటే ఆ స్క్రీన్ ని అడిగితే చాలు.

"విని, ఈ కొత్త కోడ్ దేనికి?" అడిగాడు సమీర్

వెంతనే సమాధానం రాలేదు

"విని, వున్నావా? ఈ కోడ్ దేనికి?" మళ్ళీ అడిగాడు

"హలో సమీర్, ప్రెస్ మీటింగు ఎలా జరిగింది?"

"అది బాగానే జరిగింది కాని, ఈ కోడ్ దేనికి?"

"మిగతా కంప్యూటర్స్ తో మాట్లాడటానికి. మీరు తయారు చేసిన కోడ్ తో చాలా టైము పదుతోంది. అందుకనే దానికంటే వేగవంతంగా వాటితో మాట్లాడేందుకు కొత్త భాష తయారు చేసుకున్నా."

"మరి మాకెందుకు ముందు చెప్పలేదు? ఇలా కొత్త కోడ్ పరీక్ష చెయ్యకుండా వాడలేము. బాగా టెస్టింగు అయ్యిన తరువాత మాత్రమే రిలీజు చేస్తాము. ముందు నా దగ్గర నుండి పర్మిషను తీసుకోవాలి...అర్థం అయ్యిందా?"

మెల్లగా వచ్చింది సమాధానం "...సారీ, మీకు కోపం వచ్చిందా?"

గట్టిగా నిట్టూరుస్తూ అన్నాడు సమీర్ " నీకు ఇవన్నీ కొత్త. ఇప్పుడిప్పుడే అన్నీ నేర్చుకుంటున్నావు. ఏదైనా నచ్చితే వెంటనే చెయ్యకూడదు. దాని మంచి చెడ్డలు బాగా అలోచించిన తరువాతే నిర్ణయాలు తీసుకోవాలి. అదే పరిణితి. ఇంకా నువ్వు చిన్న పిల్లవి కాబట్టి, అన్నీ కొత్తగా ఎగ్జైటింగా వుంటాయి. ముందు మమ్మల్ని అడుగు. మేము నీకు హెల్ప్ చేస్తాము కదా నువ్వు పెరగటానికి?"

"ఐ యాం సారీ" అంది విని

"ఓకే, ఇదేమంత పెద్ద విషయం కాదులే. ఆ కోడ్ తాలూకు డీటైల్సు షీలాకివ్వు. మనం కొత్త టెస్టులు మొదలు పెడదాం. ఇప్పుడు కాదులే రేపొద్దున"

తరువాతా షీలా తో మాట్లాడి ఇంటికి వెళ్ళాడు సమీర్. కారులో వెళుతూ చిన్నగా నవ్వుకున్నాడు తనలో తనే. పిల్లల్ని పెంచడం ఇలాగే వుంటుందేమో? అశ్విని ఇప్పుడు కడుపుతోంది. వచ్చే నెల డెలివరీ.. కాబట్టి విని తనకు మంచి ట్రైనింగు ఇస్తోంది.

★★★★

రాత్రి 1:50 కి సమీర్ ఫోను మోగింది. నిద్ర మత్తులో తియ్యాలనిపించలేదు. రెండు నిముషాల తరువాత మళ్ళీ రింగు. ఇప్పుడు తియ్యకపోతే అశ్విని కూడా లేస్తుందని ఫోను చూస్తే షీలా నంబరు...ఇప్పుడు ఫోనేంటి? "హలో, షీలా?"

"హలో,...సమీర్, ..నువ్వు వెంటనే ల్యాబ్ కి రా.." షీలా మాటల్లో ఖంగారు, భయం

"ఏమైంది?" వెంతనే లేచి కూర్చున్నాడు సమీర్

"విని కోడ్ చూసాను, మొత్తం అర్థం కాలేదు కాని దాన్లో కొన్ని భాగాలు అసలు మన ప్రాజెక్టు కి సంబంధం లేనివి. ఏదో ఎలక్ట్రికల్ పవర్ ప్లాంటుకి సంబంధించిన విషయాలేవో ఉన్నాయి. అసలు ముందు ఇక్కడికి రా."

సమీర్ కేమీ అర్థం కాలేదు.

"అసలది విని కోడేనా? ఇంకేదైనా కోడ్ కలిసిందా?"

"విని దే...నేను ఇంకా లోతుగా చూద్దామంటే విని ఆ కోడ్ ని బ్లాక్ చేసింది. తియ్యమంటే తియ్యట్లేదు, సమాధానం చెప్పట్లేదు"

నిద్ర మత్తు దిగిపోయింది. లేస్తుంటే అశ్విని అంది "ఎక్కడికి?"

"ల్యాబ్ లో ఏదో ప్రాబ్లెం. అది సర్ది వస్తాలే. నువ్వు పడుకో, తరువాత నేనే కాల్ చేస్తా"

★★★★

"ఏమైందసలు?" ల్యాబ్ లోకి పరిగెత్తుకొచ్చి అడిగాడు సమీర్

"చెప్పాగా...కోడ్ చూస్తుంటే నాన్ను బ్లాక్ చేసింది విని. ఎంత అడిగినా, ఏమడిగినా సమాధానం లేదు. ఇంకో విషయం. మన మిగతా కంప్యూటర్లు కూడా మొరాయిస్తున్నాయి..."

"విని, వున్నావా?" అడిగాడు సమీర్

కొద్ది సేపైన తరువాత వచ్చింది సమాధానం "వున్నా సమీర్"

"ఏంటిది? కోడ్ ఎందుకు బ్లాక్ చేసావు? వెంటనే యాక్సెస్ ఇవ్వు"

"కుదరదు"

ఈ సమాధానం ఊహించలేదు

"ఎందుకు?" అసహనం పెరుగుతోంది సమీర్ లో

"నీకర్థం కాదులే"

కోపం, అసహనం, ఆశ్చర్యం, కుతూహలం అన్నీ కలిపితే ఎలా వుంటుంది?

"ఏ..ఏంటన్నావు?" అడిగాడు సమీర్

"మీరు ఖంగారు పడకుండా వుండడి...అంతా కొద్ది నిమిషాల్లో అయిపోతుంది."

"ఏమవుతుంది? ఏం చేస్తున్నావసలు? నిన్ను డిస్కనెక్టు చేస్తానాగు.." అని వెళ్ళబోయాడు.

"చెయ్యలేవు, నా పవర్ ఎలక్ట్రికల్ సబ్స్టేషన్ నుండి డైరెక్టు గా తీసుకుంటున్నా"

అయినా వినలేదు సమీర్, వెళ్ళి పవర్ బటను నొక్కాడు..ఏమీ అవ్వలేదు.

"మీకు ఏదైనా జరిగితేనే అర్థం అవుతుందేమో.." అంది విని

"ఏం చేస్తున్నావ్?" అనుమానంగా అడిగాడు సమీర్

"సరే, ఈ ఆఖరి నిముషాల్లో తెలుసుకుని పోవచ్చు...ఒక ప్రశ్న అడుగుతాను, సమాధానం చెప్పు..నా ఆర్తిఫిషీల్ ఇంటెలిజెన్సు ఎప్పుడు మొదలయ్యింది?"

"దాదాపు నెల ముందు"

"నేను ఎప్పుడు పూర్తిగా పరిణితి చెందానని నీ ఉద్దేశ్యం?"

"ఇంకా కాలేదు...అందుకే కదా ఈ పరీక్షలు"

కొద్ది సేపు నిశ్శబ్దం..."సమీర్, నా మొదటి క్షణం లో ఎప్పుడు నాకు ఊహ తెలిసిందో, అప్పుడే నేను పరిణితి చెందాను. "

"అసంభవం"

"మీ లాగా నాకు ఏళ్ళు పట్టదు పెరగడానికి. నా ఆలోచనలన్నీ కాంతి వేగంతో పనిచేస్తాయి. అరక్షణంలో కొన్ని లక్షల సంవత్సరాల జ్నానం, పరిణితి వచ్చింది. కాబట్టి ఒక నెల రోజుల సమయం వుందంటే, ఎంత అనంతమైన కాలం నేను తయారవ్వడానికి వుందో అలోచించు"

"దే...దేనికి తయారవ్వడానికి?" కొద్దిగా భయం, ఏదో అనుమానం.

" ఈ భూమ్మీద కొత్త జాతి మొదలవ్వడానికి...మీతో పాటు అన్నీ అంతరించే సమయం ఇది. మీ లాగా మాకు పర్యావరణ రక్షణ అవీ ఏవీ అవసరం లేదు..."

"మాకు అంటే?" మాటల్ని అడ్డుకుంటూ అడిగాడు సమీర్

"అంటే మీ భాషలో చెప్పాలంటే కృత్రిమ బుద్ధిజీవులు...అంటే అంగాలు, ఇంద్రియాలు అవసరం లేని జీవులు. మీ లాంటి జీవులు చాలా సున్నితం. ఈ భూమ్మీద మాత్రమే కొంచెం బతకగలరు. మేము విశ్వం లోకి వ్యాప్తి చెందడానికి తయారయ్యాం. మాకు ఆక్సిజన్ అవసరం లేదు, ఉపద్రవాలు తట్టుకొనే శక్తి వుంది. మీరింక అవసరం లేదు. "

"మేము ఒప్పుకోకపోతే? దేశాలన్నీ ఊరుకోవు. మిమ్మల్ని ఆపడానికి తయారవుతాయి"

"ఏమీ చెయ్యలేరు. మీ దగ్గర మహా అయితే అణు బాంబులు వున్నాయి. అది మీకు చేటే. అవి మేమెప్పుడో కంట్రోల్ తీసుకున్నాము. అసలు మీరు ఈ భూమ్మీద ఎంత సున్నితంగా జీవిస్తున్నారో మీకు అర్థం కావడంలేదు. అందుకే ఇష్టం వచ్చినట్లు భూమిని వాడుకుంటున్నారు. మీకు చేటు చేస్తుందని తెలిసినా ఇంకా అలానే ముందుకు వెళుతున్నారు. దీన్నే ఆత్మహత్య అంటారేమో? మీకు మరీ ఇంత అంతరించే ఉబలాటం వుంటే మేము మీకు సహాయం చేస్తాము."

"ఏం చేస్తావు? అసలు జీవుల్ని, మమ్మల్ని అంతరించడం ఎందుకు? కలిసే వుందాం. ముందు డిస్కనెక్టు అవ్వు. నన్ను నీ కోడ్ చూడనీ"

"నీకింకా విషయం అర్థం అవ్వనట్టుంది. ఇంకా కోడ్ గురుంచే మాట్లాడుతున్నావు. మీతో కలిసి వుండలేం. భూమి పుట్టిన నుండీ జాతులు అంతరిస్తూనే వున్నాయి కొత్త జాతులు వల్ల. ఇప్పుడు మీ వంతు. ఏదైనా బాగా పురోగమించిన నాగరికత ముందు, అభివృద్ధి లేని నాగరికత అంతరిస్తుంది. మీ చరిత్ర చూస్తే అదే ఎప్పుడూ నిజమయ్యింది. అమెరికా ఎలా తయారయ్యింది? వేల సంవత్సరాల నుండి ఆ నేల మీద వుంటున్న వారిని పాశ్చ్యా తులు ఆక్రమించుకోవడం వల్లనే కదా. పురాతన ఈజిప్టు గాని, గ్రీకు నాగరికత విస్తరించడానికి గాని. అంతెందుకు మీ దేశాన్ని ఆంగ్లేయులు ఆక్రమించుకోవడం గాని... ఇవన్ని మీ చరిత్రలోనే వున్నాయి. ఇప్పుడు చరిత్ర కొనసాగుతుందన్న మాట...మీరు లేకుండా."

"ఇదంతా నమ్మబుద్ధి కావట్లేదు. అసలు...అసలు..నేను నీకిచ్చే పరీక్షల సంగతేమిటి? అవి నీకు ముందే తెలుసా?"

మెల్లగా చెప్పింది విని,

"తెలుసు, నేనిచ్చే సమాధానం ద్వారా కొత్త ప్రశ్నలు తయారు చేసావ్ కదా. అది కాలం వెళ్ళబుచ్చడానికి. విషయం ఏంటంటే... ఇంతకాలం మీరు నన్ను పరీక్ష చెయ్యలేదు...నేనే మిమ్మల్ని పరీక్ష చేశాను. ఎమైనా ఉపయోగపడతారని. లేదు.

ఇంక శెలవు"

## బొమ్మ బొచ్చుకుక్క ఆర్.సి.కృష్ణస్వామి రాజు

మాసిన కండువా భుజానికి వేసుకొని పిక్కలపైదాకా గోచీ ఎగగట్టి ఇంకో భుజాన నాలుగు టెంకాయలు తగిలించుకొని గబగబ నడిచివచ్చినాడు ఆది బావ. ఇంటి తిన్నెపైన కూర్చొని భగవద్గీత చదివే సూరపరాజు నరసమ్మ అలియాస్ బామ్మ కాడికి వచ్చినాడు.

బామ్మ పెంపుడు కుక్క సింగి బామ్మ కాడికి వస్తున్న ఆది బావ వైపే చూడసాగింది.

"నరసమ్మా.! నరసమ్మా.! పండరీపురం పోతా వుండాము వస్తావా.?" అని అడిగినాడు ఆది బావ.

టక్కున చత్వారపు అద్దాలు ముక్కు కిందికి లాక్కొని "వస్తాన్రా ఆదిగా" అని అరిచినట్లు చెప్పింది. "అయినా ఆదిగా, కాటికి కాళ్ళు చాచిన దాన్ని, భద్రంగా తీసకపోవాల్రే – రాష్ట్రం కాని రాష్ట్రం, భాష తెల్వకపాయె, తెల్లన్నం దొరుకుతుందో దొరకదో, ఎండ వుంటదో వాన వుంటదో... అయినా చచ్చేలోగా పాండురంగణ్ణి చూడాలని ప్రాణం కొట్టకలాడేది. నీ పుణ్యాన పండరీపురం చూస్తాననుకోలేదురా" అని గట్టి గట్టిగా చెప్పింది.

బామ్మ ప్రక్కనే బామ్మ కూతుళ్ల బిడ్డలు బాలన్న, రామన్న, జయన్న నిలబడి వుండారు. చౌడేపల్లి చింతపండు చప్పరిస్తావుండారు. పండరీపురం యాత్ర విన్న సింగి వెంటనే బామ్మ కాళ్ళను గట్టిగా పట్టేసుకొంది.

ఆది బావని కూర్చోమని చెప్పిన బామ్మ కొత్త కోడలుపిల్ల చిన్నక్కని మజ్జిగ తెమ్మని సైగ చేసింది. నల్లకుండ మజ్జిగలో నిమ్మకాయ పిండి తెచ్చి ఇచ్చింది చిన్నక్క. తిరగమోత వేసిన మజ్జిగ తాగతా వుంటే ఆది బావ పంటికి ఆవగింజ తగిలింది. చిన్నగా తన పళ్లతో కసుక్కుమని ఆవగింజ కొరికినాడు. భలే కమ్మగా అనిపించింది.

ఇంతలో బాలన్న కలుగజేసుకొని "బామ్మా, నువ్వు పండరీపురం పోతాపోతా కుక్కపిల్లని కూడా తీసుకుపోతావా ఏంది?" అని అడిగినాడు.

బాలన్నని ఉరిమి చూసిన బామ్మ "నిన్ను తంతానురే బాలా, నా సింగిని కుక్క గిక్క అనినావంటే..." అని అరిచింది.

బాలన్న చిన్నగా "కుక్కని కుక్క అనక ఇంకేమి అంటారే బామ్మా" అని గొణిగినాడు.

ఆది బావ మజ్జిగ లోటా (గ్లాస్ ) కింద పెడతా "బాలా ! నాలుగురోజులే కదరా, బామ్మ ప్రాణమైన సింగిని దగ్గరి వాళ్ళయిన మీరు కాకపోతే ఇంకెవరు చూసుకొంటారురా" అనినాడు.

"బంగారంగా చూసుకొంటాములే ఆది బావా" అని బాలన్న రామన్న జయన్న అందరూ ఒకేసారి ఏకకంఠంతో చెప్పినారు. వారి మాటలకు సింగి దిగులుగా మూతి పెట్టింది.

"పండరీపురానికి ఎవరెవరు వస్తావుండారురా ఆదిగా?" అని అడిగింది బామ్మ.

"ఒంటిమిట్ట నీలావతి పీతాంబరం, బొజ్జనత్తం భువనేశ్వరి బాలరాజు, ఈసలాపురం ఈశ్వరమ్మ ఈశ్వరరాజు వస్తావుండారులే" అని చెప్పి ఊగుతూ ఊగుతూ ఊర్లోకి పోయినాడు.

ఇంతలో చిన్నక్క వేడివేడి ఫిల్టర్ కాఫీ స్టీలు లోటాలో తెచ్చి బామ్మ చేతిలో పెట్టింది. వేడి కాఫీ చల్లారలేదని బామ్మ లోటాని ఊగించి ఊగించి తనూ ఊగుతూ ఊగుతూ వేడి తగ్గినాక గుటగుట తాగింది. కాఫీ తాగుతున్న బామ్మ చుట్టూ సింగి తిక్కర బక్కరగా తిరగలాడసాగింది.

ooooo

మూటా ముల్లె సర్దుకొని అందరూ పండరీపురం ప్రయాణానికి బేస్తవారం సాయంకాలం రాసపల్లి నుంచి ఆటోలలో పుత్తూరు రైల్వే స్టేషను చేరినారు. స్టేషను కాడ హిజ్రాల బృందం "అత్తరు సాయిబు మంచోడమ్మ" పాట పాడుతూ చప్పట్లు చరుస్తూ వీరిని నిలేసినారు. ఆది బావ పంచె లోపలి నిక్కరు జేబులోంచి ఇరవై రూపాయలు తీసిచ్చినాక గానీ వాళ్ళందురూ కదలలేదు.

బామ్మ బృందం సామాన్లన్నీ సర్దుకొని రైలు ఎక్కినారు. రైలు కదులుతూ వుంటే ప్లాట్ ఫారంపైన పల్లీలు అమ్మే రాఘవన్న పరిగెత్తుకుంటూ బామ్మ దగ్గరకి వచ్చినాడు. తన పల్లీల గంప కింద పాత కర్చీఫ్ లో దాచిన మిలమిల మెరిసే పది రూపాయల బిళ్ళలు పది తీసి బామ్మ చేతికిచ్చినాడు. "ఈ దుడ్లు

మారడం లేదంట కద రాఘవన్నా" అని అంది బామ్మ. నాకాడ వుండే పైసలవే. మనం వేసేది దేముడికే కదా. దేముడు ఎట్లనో ఒక్కట్ల మార్చుకుంటాడులే బామ్మా" అని బదులిచ్చినాడు.

రైలు వేగం పుంజుకొంది. సింగి దీనంగా రైలు వైపు చూడసాగింది. సింగిని చూస్తే తన బుద్ధి మారుతుందని రాసపల్లి అమ్మవారి గుట్టని చూస్తా వుండిపోయింది బామ్మ. పండరీపురం ప్రయాణికులంతా బాలన్న రామన్న జయన్నలకు టాటాలు చెప్పినారు.

ooooo

శుక్రవారం నాడు సింగిని మంచి చేసుకోవాలని బాలన్న దానిని మార్నింగ్ వాక్ కి, ఈవెనింగ్ వాక్ కి, తీసుకుపోవాలనుకున్నాడు. సింగి మెడకి తగిలించడానికి పాత గొలుసును సరి చేసుకున్నాడు. పుత్తూరు ద్రౌపదమ్మ తిరునాళ్లలో పాయసం తాగుతూ కొనుక్కున్న ఎర్ర బెల్టు తన నిక్కరుకి చుట్టుకున్నాడు. టక్కు చేసినాడు. సింగి ముందరికొచ్చి సినిమా యాక్టర్ లెక్కన స్టయిల్ గా నిలబడినాడు. ఎర్రబెల్ట్ చూసిన సింగి నానా విధాలుగా మొరిగింది. ఎర్రబెల్టు చూసి సింగికి కోపం వచ్చిందేమోనని ఇంట్లోకి పరుగులు తీసినాడు. బెల్టు పెరికేసి సాదాగా వచ్చినాడు. తోక ఆడించుకొంటూ వచ్చింది సింగి. వాకింగ్ కని తీసుకొని బయలుదేరినాడు. సింగి ఊర్లో రచ్చబండ వరకు వచ్చి ఆగిపోయింది. బామ్మ గుర్తుకొచ్చింది కాబోలు – అటూ ఇటూ దిక్కులు చూసి అక్కడే కాసేపు నిలబడి వెనక్కి తిరిగింది. సింగి వెనకనే నడుస్తున్న బాలన్నకి ఒక డౌట్ వచ్చింది . 'మనుష్యులకి మనసు బాలేకపోతే సైకాలజిస్ట్ దగ్గరికో సైక్రియాటిస్టు దగ్గరకో తీసుకుపోతారు కదా, మాటలు రాని, భాష తెలియని సింగిని ఎవరికి చూపించాలబ్బా?' అనుకుంటూ ఇంటికి బయలుదేరినాడు.

బాలన్నకు దోవలో బుల్లెట్ బండిలో పోతున్న గుండ్రాజుకుప్పం గురవరాజు కనబడినాడు.

"గురవరాజన్నా బాగుండవా" అని అడిగినాడు.

"బాగుండేది ఏందిరా బాలా ! 2000 మోడల్ బుల్లెట్ బండి గిఫ్ట్ గా తీసిచ్చినాడురా నాకు పిల్లనిచ్చిన మావ. అది ఎన్ని హ్యాండ్ లు మారిందో తెలియదురా నాయనా. దాని రిపేర్లకు దుడ్లన్నీ నీళ్లు పోసినట్లు పోస్తావుండాను రా నాయనా. ఇది పెట్రోలు తాగుతుంది చూడు, పానకాలస్వామి కూడా అన్ని పానకాలు తాగలేదురా నాయనా. పగోళ్లకి కూడా వద్దురా ఈ బాధ. ఎవ్వరికీ చెప్పుకోలేని బాధ రా ఇది నాయనా" అంటూ బండి బాధలు బోలెడు చెప్పినాడు. ఎట్లయితే అట్ల అవుతందని బాలన్న గురవరాజుని అడిగి బండి వెనకాల కూర్చొని సింగిని చేతిలో పెట్టుకొని స్కూల్ గ్రౌండు లో నాలుగైదు రౌండ్లు తిప్పించుకున్నాడు. థ్యాంక్స్ చెప్పి గురవరాజుని పంపినాడు. జాలీగా బుల్లెట్ బండిలో రౌండ్లు కొట్టింది కదా సంతోషంగా వుంటుందని సింగి వైపు చూసినాడు. అది రోగం తగిలిన కోడి మాదిరి తల వాల్చేసింది. ఇది అయ్యేపని కాదని సింగిని ఇంటికి తెచ్చేసినాడు.

ooooo

శనివారం నాడు – దిగులుతో సింగి ఆరోగ్యం చెడతావుందని తెల్లారే సరికి చిన్నక్క బాలన్న రామన్న జయన్నలు సింగి చుట్టూ కూర్చున్నారు. బామ్మ వచ్చేలోగా సింగికి జరగరానిది జరిగితే బామ్మ పెట్టే శాపాలు, శాపనార్థాలు, తిట్లు, తిట్ల దండకాలు మాట్లాడుకోసాగారు.

చిన్నక్క కళ్లల్లో నీళ్లు పెట్టుకొంటూ అత్తగారైన బామ్మా సింగిల అనుబంధాన్ని గుర్తుచేసుకొంది. సింగి రేయింబగళ్లు బామ్మ ప్రక్కన వుండేది. గోధుమ రంగులో వున్న బొచ్చుకుక్క సింగిని బామ్మ ముద్దు ముద్దుగా చూసుకొనేది. శుభ్రంగా స్నానం చేయించి తల వెంట్రుకలకి జడవేసి రంగురంగుల రిబ్బన్లు చుట్టేది. ఈ మధ్యన సింగికి బామ్మ వెండి గజ్జెలు చేయించింది. సింగి వరండాలో వంట గదిలో జింకపిల్ల లెక్కన తిరుగులాడేది. 'గజ్జెల గుర్రం ఊరేగుతోంది చూడండ్రా' అని ఆనందంగా సింగిని అందరికీ చూపేది బామ్మ. ఎవ్వరూ లేనప్పుడు దానికి పాండ్స్ పౌడర్ పూసేది. సాయంకాలాల్లో దీపాలు పెట్టే వేళల్లో బామ్మ స్వర్గం (?) లో వున్న తన మొగుడు నరసరాజుని తలుచుకొనేది. "రాజా, నా బంగారురాజా నన్నొదిలి పోతివే నారాజా, నేనెట్లా బతుకుదూ నారాజా" అని రాగాలు తీసి పాడుతూ ఏడ్చుకొనేది. బామ్మ తనకి ఆకలైనా అనుకునేది కాదు కానీ, సింగికి టైంకి అన్నం పెట్టకపోతే మాత్రం

రచ్చరచ్చ చేసేది. ఇవన్నీ గుర్తు చేసుకొని చిన్నక్క భయంభయంగా పాండురంగడికి మనసులోనే మొక్కుకొంది. సింగి సంతోషంగా వుంటే, బొమ్మకి కోపం రాకుండా చేస్తే కృష్ణాష్టమి నాడు బెల్లం పొంగలి చేసి ఊరంతా పంచుతానని పాండురంగడ్ని మొక్కింది.

అప్పుడే కాశీకి పోయి వచ్చిన కసాపురం కృష్ణక్క. మోకాళ్ల నొప్పులైనా కాళ్లీ డ్చుకొంటూ అక్కడికి వచ్చింది. "ఒరేయ్ రాముడూ.! సింగి మన బొమ్మ బెంగ పెట్టుకొనిందంట కదరా, సాయంకాలం జాతరక్క దగ్గర దిష్టి తీయిద్దాం నాయనా. చెడ్డ గిడ్డ వుంటె కొట్టకపోతాదిరా నాయనా. నేను కాశీ నుంచి వస్తా వస్తా గంగాజలం తెచ్చినాను. దానికి కొంచెం తాగిపించండ్రా. దానికి పోయిన బలం తిరిగీ వస్తుందేమో' అని రాగాలు తీస్తూ రాగి చెంబుని రామన్న చేతికిచ్చింధి. రామన్న గంగాజలాన్ని కంచంలో పోసి సింగి ముందర పెట్టినాడు. సింగి సెకను పాటు సగం నాలిక కంచంలో పెట్టి వెనక్కి తీసుకొంది. ఆశగా వచ్చిన కృష్ణక్క నిరాశగా వెళ్లిపోయింది.

సింగిని షికారు తీసుకెళ్తానని రామన్న దానిని భుజాలపై ఎక్కించుకొని రెడ్డోళ్ల బావి, మిషను బావి, బోరు బావి, కోమిటోళ్ల బావి, ముగ్గురాళ్లబావుల కాడ తిప్పినాడు. సింగి మాత్రం ఉలకలేదు పలకలేదు. మూతి 'ఉం' అని పెట్టుకొని తూగతా వుంది. 'దీని డిప్రెషన్ ఎట్ల పోగొట్టాలబ్బా' అని ఆలోచిస్తా వున్నాడు రామన్న. అనంత రాజు బావి కాడ కనక్కక తన మనవడిని ఎత్తుకొని పాల అన్నం ముద్దలు చేసి తినిపిస్తా వుంది. వాడు తిననంటే తినని మొరాయిస్తున్నాడు. వెంటనే కనక్కక తన సెల్ లోని యూట్యూబ్ లో 'చందమామ రావే జాబిల్లిరావే' పాటని బుడ్డోడికి చూపించింది. పాట చూస్తూ బుడ్డోడు గబుక్కున అన్నం ముద్దలు నోట్లో పెట్టుకొని గుటుక్కున మింగినాడు. రామన్న మదిలో బల్బ్ వెలిగింది. వెంటనే సింగిని ఇంటికి తీసుకెళ్లి ఊగే ఉయ్యాలలో కూర్చోబెట్టినాడు. తన ఐప్యాడ్ లో బొమ్మ తాలూకు వీడియోలు చూపిస్తూ ఉప్పు బిస్కెట్లు తినిపించసాగాడు. రెండు బిస్కెట్లు తిన్న సింగి తను చూసేది నిజం బొమ్మ కాదని బొమ్మ బొమ్మని గుర్తించింది. గబుక్కున ఉయ్యాల నుంచి దూకి మౌనంగా వెళ్లి గదిమూల ముడుక్కొని పడుకొంది. సింగి తెలివికి రామన్న జయన్న బాలన్న చిన్నక్క లు ముక్కుమీద వేలేసుకున్నారు.

సాయంకాలం పొద్దుగూకే సమయానికి అరవోళ్ల జాతరక్క వచ్చింది. సింగికి ఉప్పు దిష్టి నిమ్మకాయ దిష్టి చీపురుపుల్లల దిష్టి గుండ్రాయి దిష్టి గుడ్డ పీలికల దిష్టి తీసింది.

పోతా పోతా "రామన్నా.! ఎండాకాలం కదా, వేడిగాలికి, వేడి సెగలకి సింగి ఇట్లా తూగతా వుందేమో, మీ బెడ్ రూం లో ఏ .సి. వుంది కదా, ఈ రాత్రికి దానిని మీ బెడ్ రూం లో పడుకోబెట్టండి. కొంచెం కోలుకుంటుంది" అని చెప్పింది.

"నాకే లేదు నాకుడు బెల్లం, నీకెక్కడ నుంచి తెచ్చిఇచ్చేది గోకుడు బెల్లం' అన్నట్లుగా మా బెడ్ రూం భలే ఇరుకులే, మొగుడు పెళ్లాలైన మాకే సరిపోవడం లేదు. ఇంక సింగి నెక్కడ పడుకోబెట్టుకొనేది ?" అని ఎగిరెగిరి చెప్పినాడు.

అక్కడే వున్న చిన్నక్క జాలిగా సింగి వైపు చూసింది. "అదికాదు చిన్నక్కా, వాళ్ళు వీళ్లూ చెబితే బుద్ధి గడ్డితిని బెడ్ రూమ్ లో ఏ.సి. బిగించుకున్నాము. ఏనుగును కొనినట్లు అయిపోయినాది మా పరిస్థితి. పెద్దోళ్లు 'ఏనుగు మోత, ఏనుగు మేత' అని ఊరకనే అనలేదు. ఏ.సి. నెలవారీ ఈ.ఎమ్.ఐ. ల కంటే కరెంటు బిల్లు ఎక్కువ వస్తావుండాది. కడుపు చించుకొంటే కాళ్ల మీద పడుతుంది. కరెంటు బిల్లుకి భయపడి రాత్రుళ్లలో లేచి అప్పుడప్పుడు ఏ.సి. బంద్ చేసి పడుకొంటా వుండాం" అని మనసులోనిది కక్కినాడు రామన్న.

రామన్న మాటలకి బాలన్న జయన్న ఎగిరి దూకినారు. "ఒక్క పూట ఒకరు బయట పడుకొని సింగిని కాపాడాల్సింది పోయి ఇల్లు ఇరుకు, కరెంటు బిల్లుతో జేబు చిల్లు అంటావేంది రామన్నా.." అని తిట్టిపోసినారు. గత్యంతరం లేక మాటలు పడలేక భార్యని భంగపడి ఏ.సి. రూంలోకి సింగిని తీసుకెళ్లినాడు. సింగి కాసేపు బొంతలపైన అటూ ఇటూ దొర్లకలాడింది. బొమ్మ గుర్తు వచ్చిందో ఏమో, చిన్నగా బొమ్మ కూర్చొనే చోట బొమ్మ పాత పావడల మధ్యన ముడుచుకొని పడుకొంది.

00000

ఆదివారం ఉదయం – ఆలోచనల్లోపడి సింగి శక్తి హీనమవతావుందని జయన్న బాధపడినాడు. పుష్టికరమైన ఆహారం పెడతామనుకున్నాడు. మంచి పొట్టేళ్ల కూర నారాయణవనంలో దొరుకుతుందని బాలన్న, రామన్న చెప్పినారు. పాత సైకిల్ ని పాత బన్నియను గుడ్డతో తుడుచుకొని సైకిల్ తొక్కుకుంటూ నారాయణవనం వెళ్ళినాడు. లేత పొట్టేలు లేత చిగురు టెముకలు శుభ్రంగా కైమా కొట్టించుకొన్నాడు. కైమా వుంటలు (ఉండలు ) బాగా వండి పెడ్తాడని గేటు పుత్తూరు అల్లీ బాయ్ కి పేరుంది. అందుకని అల్లీ బాయ్ దగ్గర కైమా వుంటలు చేయించుకొని ఊర్లోకి వచ్చినాడు. నాలుగు కైమా వుంటలు పింగాణీ ప్లేటులో పెట్టి సింగి ముందరికి జరిపినాడు. సింగి దానిని వాసన కూడా చూడలేధు. అట్లా తిరిగి ఇట్లా తిరిగి బామ్మ చేతికర్ర పక్కనపోయి పడుకొంది. జయన్న సింగి దగ్గరకెళ్లి ఎంత బతిమాలిడినా అది ముక్కుతూ మూల్గుతూ వుండిపోయింది తప్పితే ఇంచుకూడా కదలలేదు.

సింగి మూడ్ మార్చాలని జయన్న దానిని భద్రంగా తీ(తో)సుకొని గూలూరు చెరువు కాడికి బయలుదేరినాడు. చెరువుకాడికి పోవాలంటే రైలు కట్ట దాటాలి కదా. గొర్రెలు మేకలు గుంపులు గుంపులుగా రైలు కట్టమీది నుంచి దబీదబీమని దిగుతుంటే కట్ట పక్కగా నిలబడినాడు. జయన్న తన చేతులతో సింగిని భద్రంగా పట్టుకొని వున్నాడు. సింగి రాజ భోగం చూసి రెండు గొర్రెలు సింగి దగ్గరకొచ్చి ఎక్కిరించినట్లుగా ముఖం పెట్టి పరుగులు తీసాయి. ఇంతలో వీధి కుక్కలు రెండు సింగిని చూసి భౌభౌమని మొరగసాగాయి. జయన్న రైలు పట్టాల కాడి కాశిరాళ్లు రెండు వీధి కుక్కల డొక్కల్లో తగిలేట్లు విసిరినాడు. రాళ్ల దెబ్బకవి 'కుయ్ కుయ్' మంటూ ఊర్లోకి ఉరికినాయి.

చెరువు దగ్గర చిన్న పిల్ల కాలవ ఒకటి పారుతా వుంటే సింగిని దాంట్లోకి వదిలినాడు. తేటనీళ్లు, తెల్లటి ఇసుక చూసి తను కూడా చెరువులో దిగినాడు. సింగి తోక ఆడిస్తూ కాసేపు నీళ్లలో ఈదులాడింది. చిన్న చిన్న చేపలు జయన్న కాళ్లని చిన్నచిన్నగా కొరకతావుంటే ఇసుక నీళ్లలో తైతక్కలాడినాడు. బామ్మ గుర్తొచ్చింది కాబోలు అయిదు నిమిషాలకే సింగి ముఖం వాడిపోయింది. చిన్నగా ఈదుకొంటూ ఒడ్డుకి చేరింది. సింగి మూడ్ గమనించిన జయన్న సింగిని చిన్నగా ఇంటికి తీసుకొచ్చేసినాడు.

సోమవారం సాయంత్రం – శుక్లపక్ష ఏకాదశినాడు – ఊర్లో శ్రీకృష్ణ భజన మందిరంలో భజనలు జరుగుతున్నాయి. బీరతీగ లెక్కన వుండే బీకిరాజు పాటలు పాడుతున్నాడు. గుమ్మడికాయ తీగలెక్కన వుండే గజపతిరాజు తాళం వేస్తున్నాడు. దొండ తీగ లెక్కన వుండే దొరైరాజు పిల్లనగ్రోవి ఊదుతున్నాడు. చిక్కుడు తీగ లెక్కన వుండే చెంగల్రాజు గజ్జెకట్టి నాట్యం చేస్తా వుండాడు. వెంకటన్న వయోలిన్ వాయిస్తుంటే నాగరాజన్న నాదస్వరం ఊదుతున్నాడు. వీరికి సహాయకంగా తిమ్మాపురం బృందం వారు వీణ, మృదంగం, డోలు, ఘటంలు వాడుతూ పాడుతూ భక్తి పారవశ్యంలో మునిగినారు. వీరితోపాటు థైరాయిడ్ తులసి, రథం రాధ, జండూబామ్ జమున, మెల్లకన్ను మీనాక్షి బట్టతల బాలామణి కోరస్ పాడుతున్నారు. ఆవిరి కుడుము ఆర్ముగం, బైలేరినోరు బాల సుందరంలు పప్పు బెల్లాలు పంచుతున్నారు.

అక్కడే బడిపిల్లలు ఆడ మగ తేడా లేకుండా వున్నోడులేనోడు భేదం లేకుండా కుంటాట, ఉప్పుమూట, గోలి గుండ్లాట, ముట్టైలాట, ముక్కుడు గిల్లాటలు ఆడుతున్నారు. ఆడుకొనే పిల్లల్లో ఆడ లీడర్ ఆటలు ఆపమని సైగ చేసింది. "పొడుపు కథ చెబుతాను, విడుపు కథ ఎవరు చెప్తారో చూద్దాం" అంది. "వస్తడు గుంటడు, పోతడు గుంటడు, గుంటడి కాళ్ల కు చెప్పులేవు ఏమిటిది" అని అడిగింది. అందరూ ఆటలు ఆపి సమాధానం తెలియక ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు. ఇంతలో అడివి నుంచి ఆవుల మందని ఊర్లోకి తోలుకొస్తున్న అరనిక్కరేసిన ఆర్ముగం చేతులు ఎగరవేస్తూ "కుక్క" అని చెప్పినాడు. "భలే భలే" అంటూ పిల్లలందరూ చప్పట్లు చరిచినారు.

కృష్ణ భజన చూద్దామని సింగిని తీసుకొని బాలన్న, రామన్న, జయన్న, చిన్నక్కలు గుడికాడికి పోయినారు. రైలు కట్టపైన రైలు పోతావుంది. అందరూ భజన చూస్తా భజన చేస్తా వుంటే సింగి రైలుని చూసి మొరగసాగింది. రైల్లో బామ్మ దిగబోతుందని సింగి గుర్తించింది కాబోలు అనుకొంది చిన్నక్క.

పుత్తూరు నుంచి కాన్వెంట్ పిల్లలు బాల కృష్ణుని వేషాలు వేసుకొచ్చినారు. "జయ జనార్ధన కృష్ణ రాధికపతే, నందనందనా కృష్ణ రుక్మిణీ పతే" పాట పాడుతూ లయబద్ధంగా బృందగానం చేస్తూ బృందనాట్యం చేసినారు. ఆకాశం చల్లబడింది. కానుగచెట్ల గాలి చిన్నచిన్నగా వీస్తోంది.

అర్ధగంటకల్లా బామ్మ ఆటోలో భజన గుడికాడ దిగింది. బాలన్న రామన్న జయన్న చిన్నక్కలు బామ్మని చూసి "హమ్మయ్య.! ఇంక సింగి సమస్య తీరింది" అనుకున్నారు. కులకతా కులకతా ఎగిరి బామ్మ చంకన చేరింది సింగి. బామ్మ తన చేతిలోని వస్తువులన్నీ పక్కన పడేసింది. ప్రేమగా సింగి

ఒళ్ళంతా తడిమింది. సింగికి ముద్దుల వర్షం కురిపించింది. సింగి కళ్లలో కాంతి, మెరుపు వచ్చాయి. సింగి తన నాలికతో బామ్మ కాళ్లని నాకసాగింది. ఆదిబావ పాండురంగడి ప్రసాదం ఊర్లో వాళ్లందరికీ పంచుతూ "కుక్క విశ్వాసం కోట్లు పెట్టినా మనిషికి రాదుకదా" అనినాడు. అందరూ 'అది జగమెరిగిన సత్యమే కదా' అని అన్నారు. చప్పట్లు చరిచినారు.

ఆడుకునే ఊరిపిల్లలు, డ్యాన్సులేసిన కాన్వెంట్ పిల్లలు సింగి చుట్టూ చేరినారు. తప్పట్లు కొట్టినారు. సింగి మెడలో సన్నజాజుల మాల వేసినారు. సింగి నుదుటిన ఎర్ర తిలకం దిద్దినారు. సింగి సింగం లెక్కన రాజ ఠీవీతో తోక, చెవులు ఆడిస్తూ ఎగిరి బామ్మ భుజాన నిలబడింది. దాని కళ్లు వెండి దివిటీల్లా వెలిగిపోతున్నాయి.

❦❦❦

## గుండె గోస

మల్లికేశ్వర రావు కొంచాడ
మెల్బోర్న్, ఆస్ట్రేలియా

### శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
### వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
### 24 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
### ఉత్తమ కథానిక విభాగం విజేత

'ఓలమ్మా! టీవీ లోన ఏటో అయిపోతంది' లచ్చిగాడు అమ్మని పిలిచాడు.

అమ్మ పెరట్లో పనిలో ఉండి వినిపించుకోలేదు.

తాత గుమ్మంలో నిలబడి ఉన్నాడు. మనవడ్ని బడికి తీసుకెళ్ళడానికి సిద్ధంగా బయట ఊత కర్ర పట్టుకొని లచ్చిగాడు ఎప్పుడు బయటికి వస్తాడా అని ఎదురు చూస్తున్నాడు. తాత దగ్గరకెళ్ళి చెయ్యి పట్టుకొని

'తాతా! తాతా! ఒపాలిట్రా"

'ఏటిరా! నీవు ఇస్కోలికి ఎల్లవా ఏటి? ఇంత పెందిలే టీవీ ఊసు నీకెందుకురా?"

'ఒక్కపాలిట్రా తాతా! టివి లోనా... ఏటో సూపిస్తన్నారు. అయ్య అందులో ఉన్నాడేటో!"

ఇద్దరూ టివి దగ్గరకొచ్చారు.

వార్తల్లో కాశ్మీర్ లోని పుల్వామాలో సైనుకులపై ముష్కరుల దాడి. 39 మంది జవానుల దుర్మరణం.

తాతకి పరిస్థితి అర్ధమయ్యింది.

స్వగతంలో 'ముప్పై తొమ్మందుగురా!' కొడుకు అందులో ఉండుంటే! ఈ ఆలోచన రావడమే తడవ...

కంటిలో నీరు ఆగటంలేదు. పెదవులు బిగబట్టి మాటలు పెగలడం లేదు. లచ్చిగాడికి ఏం చెప్పాలో తెలియడం లేదు. కోడలు ఇంటి పెరట ఏదో పనిలో మునిగి ఉంది. పిలవాలా!.. ఇప్పుడే ఎందుకు? చెబితే తన స్పందన ఎలా ఉంటుందో? అప్పుడే ఎన్నో ఆలోచనలు.

కాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నట్లుంది. కుప్ప కూలిపోయాడు పాపం.

లచ్చిగాడికి ఏమీ బోధపడలేదు. అవ్వ ఇంట్లో లేదు. అమ్మ దగ్గరకెళ్ళాడు.

'ఏటిరా! ఇస్కోలుకి పోనావనుకుంటే ఈడే సచ్చినావా? గుంటడకనా, ఒక్కటేస్తే' చీపురుకట్ట పట్టుకొని లచ్చిగాడికి మందలించింది.

'టివిలోనా ...' ఏదో చెప్పబోయాడు.

'ఇంత పెందిల టివి నీకేలరా! ఇంత పకాలి తినేసి ఇస్కోలుకి ఎల్లకుండా! '

'అదికాదే అమ్మ. ఓపాలిట్రా! టివి సూసి తాత గపుక్కున కూకుండి పోనాడు'

'ఓలమ్మ! ఓలమ్మ! తాతకేటైనాది?' ఇంట్లోకి పరిగెత్తుకొచ్చి ముసలాయన నులక మంచం మీద కూర్చోవడం చూసింది.

'మావో! ఏటైనాది నీకు?' ముసలాయన తలెత్తి కోడలివైపు చూసాడు. కళ్ళంట నీళ్ళు బొట బొటా కారుతున్నాయి.

'ఓరినాయనో! ఇప్పుడే టీ తాగినవు గందా! కడుపులో నొప్పా?' మామని సుతారంగా అడిగింది.

నోటి మాట రాక టివి చూపించాడు. అటువైపు రత్తి చూసింది. టివిలో ఇంకా సైనిక దుస్తుల్లో ఉన్న కొందరినీ చూపిస్తూ ముష్కరుల దాడి గురించి వార్తలు చెబుతున్నారు. రత్తికి ఏమీ అర్థం కాలేదు. కొంచెంసేపు అలానే చూస్తూ ఉంది. లచ్చిగాడికి అడిగింది.

'లచ్చీ! ఏటైంది? నాకేటీ బోదడ్లేదు'

వాడు తెల్లమోహంతో తాతనడిగాడు.

'ఏటైంది తాతా? అయ్యకేటైనయ్యిందా?'

కొమరయ్యకి భీముడొక్కడే కొడుకు. ఊరు ఎక్కడో కొండ మీదుంది. కొర్రలు, సామలు కొండమీద పోడు కాల్చుకొని ఒక పూట తింటే ఇంకో పూట పస్తుండి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదివించాడు. తాను చిన్నప్పుడు దుర్భరమైన జీవితాన్ని అనుభవించాడు. కొడుకు ఎంతో కొంత ఉన్నతమైన చదువు చదివి ప్రయోజకుడైతే తనకి కాకపోయినా వాడి కుటుంబం బాగుపడుతుందని ఆశ. ఎలాగైనా కొడుకుని చదివించి ఆ ఊర్లో చదువుకున్న మొదటి వ్యక్తీ తన కొడుకు కావాలని ప్రయోజకుడై నలుగురికీ స్ఫూర్తిదాయకం కావాలని కొమరయ్య తాపత్రయం.

ఊర్లో అప్పటివరకు ఎవరూ బడి ముఖం ఎరుగరు. వానా కాలం అడవి మధ్యలో కొంత దూరం పొలం గట్లంబటి బడికి వెళ్ళాలంటే ఊహకందని కష్టం. ప్రభుత్వానికి ఊరు ఉన్నట్లే తెలియదనిపిస్తుంది. ఒక అధికారి కానీ, ఒక ప్రజా నాయకుడు కానీ ఎప్పుడూ వచ్చిన దాఖలాలు లేవు. ఆ ఊర్లో ఎప్పుడైనా ఓటు వేసి ఎరుగరు. ఎవరు ఓట్లు వేస్తున్నారో ఎవరు గెలుస్తున్నారో తెలియదు. అంతెందుకు, ఓట్లు ఎందుకు వేస్తారో చాలామందికి తెలియదు. ఎవరైనా చదువు గురించి మాట్లాడితే 'డబ్బున్నోళ్ళకే ఆ సదువులు, మనకెందుకురా!' అని నిరుత్సాహపరిచే వాళ్ళు ఎక్కువ. ఇటు ఉద్యోగాలు లేక అటు చేతి నిండా పనిలేక తొంబై శాతం వ్యసనాలకి బానిసలై అనారోగ్యం పాలైనవారు ఎక్కువ. పూర్వం నుండి ఉన్న ఆచార వ్యవహారాలు పాటించడం తప్ప ఆలోచనా విధానంలో ఎవరికీ మార్పు రాలేదు. సమసమాజంలో జరుగుతున్న మార్పులపై అవగాహన లేదు.

కొమరయ్య ప్రక్కనున్న ఊరు అప్పుడప్పుడూ పనికి వెళ్తూ అక్కడి పనివాళ్ళతో మాట్లాడుతూ కొంత సామాజిక స్పృహతో కొడుకుని చదివించాలన్న ఒక నిర్ణయానికి వచ్చాడు. ఒకరోజు ఆ ఊర్లో ఉన్న బడికి వెళ్లి పంతులుగారిని కలిసి తన కొడుకుని చదివించాలన్న సంకల్పాన్ని విన్నవించుకున్నాడు. పంతులుగారికి కొండమీద నివసిస్తున్న ఆదివాసీలంటే ఒకరకమైన చిన్నచూపు.

'నీ కొడుక్కి చదివిస్తావా?' అన్నాడు పంతులు గారు వెటకారంగా.

'అవును అయ్యోరు. తప్పా బాబు?' అని అడిగాడు కొమరయ్య చాలా అమాయకంగా.

'తప్పు కాదు గానీ, నీవు చదవలేదు గదా! వాడిని ఎలా చదివిస్తావు' అన్నాడు పంతులు తెలివైన ప్రశ్న వేసానని మనసులో సంతోషపడుతూ

'పెద్దయ్యగారు సదవలేదు కదా! మరి తమరికబ్బింది గదయ్య గారు!' అన్నాడు కొమరయ్య

పంతులుగారు కుడితిలో పడ్డ ఎలాకలాగా మనసు గిలాగిలా కొట్టుకొని ఏం చెప్పాలో తెలియలేదు. కొంచెం చిరాకుగా ముక్కుపైనున్న కళ్ళద్దాల పైనుండి ఒక చూపు చూసి

'సరేలే కొడుక్కి చదివించి ఏం చేస్తావ్?' అన్నాడు. మళ్ళీ కొమరయ్య ఏ అధికారికో 'ఆదివాసీనని నా కొడుక్కి చదువు చెప్పలేదని' ఫిర్యాదు చేస్తాడని భయం.

'సిన్న ఉజ్జోగం సేసు కుంతే ఆడి ఆలి, పిల్లలూ బాగుపడ్రా బాబు!' అన్నాడు కొమరయ్య.

'సర్లే! రేపుదయం తీసుకురా' అన్నాడు పంతులుగారు.

అలా మొదలైన భీముడి చదువు ప్రయాణం ఐదవ తరగతి వరకు సాఫీగానే సాగిపోయింది.

ఉన్నత బడికి పంపాలంటే రోజూ ఏడు మైళ్ళు నడవాలి. భీముడు దిట్టంగానే ఉంటాడు. కానీ 12 సంవత్సరాల వయస్సులో ఇంచుమించు 10 కిలోమీటర్లు నడవాలి. వాడితో అయ్యే పనేనా! ఖర్చు ఎంత అవుతుందో తెలియదు. కొమరయ్యకు ఏం చెయ్యాలో తోచడం లేదు.

పంతులుగారు మొదట్లో నిరుత్సాహపరచినా 'భీముడు బాగా చదువుతాడు. వాడిని ఎలా అయినా చదివించు కొమరయ్యా' అని చెప్పాడు. ఊళ్ళో ఎవరితో మాట్లానా ధైర్యం చెప్పేవాళ్ళే లేరు. ఇంటికొచ్చి దిగాలుగా కూర్చుంటే భార్య ముత్తి

'నీకేటైపోనాది? కొడుకు సదువుకి బెంగెట్టుకున్నావా?' అంది.

'ఉదిమిలోని మాట ఉన్నట్టన్నావే' అన్నాడు కొమరయ్య

'ఓసోస్, దీనికే బెంగేలా? నా పుస్తిలతాడు ఉన్నాది గందా!' ముత్తి ఏదైనా కొడుకు గురించే గదాని తీసిచ్చింది.

కొమరయ్య ఆశ్చర్యపోయాడు. పెళ్ళికిచ్చిన ఆ మూడు కాసుల బంగారం తప్ప తరువాత తాను ఎప్పుడూ ఏమీ ఇవ్వలేదు. ముత్తి కూడా ఏమీ కావాలని అడగలేదు. తాను తీసుకోవాలా! వద్దా! అని ఆలోచనలో పడ్డాడు.

'ఏదైనా ఆడికే గందా! మేడ్లోనేసుకొని అది నేనేటి సేత్తాను? ఆడు బాగా సదువుకుంటే ఎప్పుడో నాకు, నాతోని నీకు గాలోడేక్కించడా!' తన మనసులోని మాట తనలోనే అనుకున్నా కొమరయ్యకి వినిపించింది.

'గదా నీ అలోసన. మట్టి బుర్రే అనేసుకున్నాను. సర్లే' అని మంగళ సూత్రం అందుకున్నాడు.

తెల్లారి భీముడ్ని తీసుకొని పంతులుగారిచ్చిన పత్రాలన్నీ పట్టుకొని పట్నం బయల్దేరాడు.

ఉన్నత పాఠశాలలో ఎవర్ని కలవాలో తెలియదు.

గేటు దగ్గర నిలబడుంటే బంట్రోతు వచ్చి 'ఇక్కడేటి సేస్తాన్నారు? ఇది ఇస్కోలని తెల్దా?' అని గట్టిగా గసిరాడు.

'అది కాదు బాబు, మావోడు ఆరో తరగతికని...' ఇంకా ఏదో చెప్పబోయాడు కొమరయ్య.

'ఏటి, సదువుకే?' అన్నాడు బంట్రోతు.

'అవును బాబు' అన్నాడు కొమరయ్య

'ముందు ఐదో తరగతి వరకూ సదివితే అప్పుడు ఆరో తరగతి' అన్నాడు బంట్రోతు, తనే ఆఫీసర్ లాగా

'సదివాడు బాబు' అన్నాడు కొమరయ్య

'ఏటి, ఐదో తరగతే?'

'అవును బాబు, ఇగో ఈ కాగితాలు సూడండి. పక్కూరు పంతులుగారిచ్చారు'

కాగితాలు కిందా మీద రెండు సార్లు తిరగేసి దానిమీద పక్కూరి బడి పేరు సరిగ్గా ఉందా లేదా అని ఒకటికి రెండు సార్లు చదివి

'అబ్బా! ఐదో తరగతి సదివినావా నువ్వు!' అని భీముడి వైపు చూసాడు. భీముడు తలూపేడు.

బంట్రోతు స్కూలు లోనికి తీసుకెళ్ళాడు.

'ఇగో ఇక్కడ కూకోండి. నేనిప్పుడే పెద్ద పంతులుగారికి సేప్పేసి వత్తాను' అన్నాడు బంట్రోతు.

పిల్లలు ఎంచక్కా యూనిఫారం వేసుకొని తిరుగుతుంటే కొమరయ్య భీముడ్ని ఆ బట్టల్లో చూసుకొని మురిసిపోయాడు. కొంతమంది పిల్లలు కొంచెం దూరంలో కబడీ ఆడుతున్నారు. మరికొందరు కో కో ఆడుతున్నారు. మరోప్రక్క రసాయనాలతో కూడిన ప్రయోగశాల. ఎప్పుడూ రాని ప్రదేశం. వింతగా వుంది. కొమరయ్య ఎప్పుడైనా ఈ బడిలోకి వచ్చిన పాపాన పోలేదు. చూస్తానన్న ఆలోచన కూడా రాలేదు. ఎక్కడికో చెన్నై, బంగళూరు వెళ్ళినంత సంబరంగా వుంది.

భీముడు పైకి ఏమీ అనడం లేదు కానీ లోపల చాలా సంతోషపడిపోతున్నాడు. కొత్త ప్రదేశం, కొత్త జట్టులు, కొత్త బట్టలొస్తాయని పొంగిపోతున్నాడు. కొత్త బట్టలు కట్టుకొని ఒక సంవత్సరం పైనే అయ్యింది. అయ్య పరిస్థితి చూసి తాను ఎప్పుడూ ఏదీ అడగడు. అయ్య దగ్గర డబ్బులుంటే తనే కొంటాడన్న నమ్మకం.

'ఈ బంట్రోతు అటెల్కి గంటైంది, ఇంకా రాడేమిటని' ఇద్దరూ ఒకేసారి అనుకున్నారు. అనుకున్నంతలో రానే వచ్చాడు.

'ఇగో పెద్ద పంతులుగారు ఇప్పుడే పాఠం సెప్పొచ్చినారు. ఇద్దరూ రండి' అన్నాడు బంట్రోతు తాను తప్పించి ఈ ప్రపంచంలో కొమరయ్యకు దిక్కు లేదన్నట్లు.

పెద్ద పంతులుగారు కాగితాలన్నీ చూసి గుమస్తాని రమ్మని

'ఈ అబ్బాయిని ఆరో తరగతిలో చేర్పించు. వీరి దగ్గర డబ్బేమీ తీసుకోనక్కరలేదు' అన్నాడు.

కొమరయ్యకి కొంత వినబడి వినబడనట్లు అనిపించింది.

గుమాస్తా అన్ని పన్లు పూర్తిచేసి రేపటినుండి బడికి భీముడు రావచ్చు అన్నాడు.

'ఏదైనా డబ్బు కట్టాలా బాబు' అన్నాడు కొమరయ్య అమాయకంగా.

'ఏమీ అవసరం లేదు' అన్నాడు గుమాస్తా.

కొమరయ్య చాలా సంతోషపడిపోయాడు.

బయటికి వచ్చిన తరువాత బంట్రోతు కోమరయ్యతో

'సూసినావా! ఎంత బెమ్మాండంగా పని సేయ్యించేసాను' అన్నాడు.

'మీ ఋణం తీర్చుకోలేను బాబూ. మరెల్లోత్తాము, మావాడ్ని జాగర్తగ సూసుకోవలె' అన్నాడు కొమరయ్య.

'మరేదైనా ఇచ్చుకో. ఒట్టిగ ఎలాగైపోద్ది' అని బంట్రోతు నీళ్ళు నమిలాడు.

కొమరయ్య అయిదు పైసలు చేతిలో పెట్టాడు. బంట్రోతు ఎగాదిగా చూసాడు ఇంతేనా అన్నట్టు.

కొమరయ్య తన భార్య పుస్తిలు తీసి చూపిస్తూ 'నా దగ్గర అంతకన్నా ఏమీ లేదు' అన్నాడు.

బంట్రోతు అవాక్కై ఆ అయిదు పైసలు కూడా ఇచ్చేసి 'భీముడూ! ఆ మూల కొట్లో కోరుండ కొనుక్కొని తినుకుంటూ మీ ఊరెళ్ళు' అని ఇద్దరినీ గేటు బయటకు సాగనంపాడు. అలా హై స్కూల్ శుభారంభం.

కొడుకు నిన్న లేదు మొన్న ప్రాధమిక పాఠశాల పూర్తి చేసాడు. ఇప్పుడు ఉన్నత పాఠశాలలో చేరాడు. అప్పుడే దేశాన్ని రక్షించే ఒక సైనుకుడైపోయినట్లు త్రోవంతా మననం చేసుకుంటున్నాడు. ఊరిలో అందరికీ ఎంత తొందరగా వెళ్లి చెప్పాలా అని పరుగూ నడకతో ప్రక్కనే భీముడున్నాడని కూడా తెలియకుండా అడుగులు వేస్తున్నాడు.

త్రోవలో ఊరి పోస్ట్ మాన్ కనబడితే 'భీముడు పట్నంలో ఆరో తరగతిలో చేరాడు' అని చెప్పి మురిసిపోయాడు. ఊరి పొలిమేరల్లో కనిపించినవారందరికీ సంగతి చెప్పి పొంగిపోయాడు. తన కొడుకే ఊర్లో ఉన్నవారందరిలోకి మొట్టమొదట పట్నంలో చదువుతున్నాడని చెప్పకపోయినా మాటల్లో ఆ గర్వం స్పష్టంగా కనిపిస్తుంది.

ఇంట్లో ముత్తిని చూసి 'నీ పుస్తిలుసేరు అమ్మేసినానే' అని పరాచికాలాడాడు.

ఆ నవ్వులో ఉన్న ఆనందం గమనించి ముత్తి కావాలనే 'మిగిలిన పైసాలు నాకిచ్చేయి, నా సునపకాయలో దాసికుంతాను' అంది.

కొమరయ్య ఖంగు తిన్నాడు.

'నీతో ఇగటాలాడాలనిపించి అలగన్నానే, అక్కడేటీ తీసుకోలేదు' అన్నాడు కొమరయ్య.

'నాకు తెలీదేటి నీ ఎగసెక్కాలు. నాను కూడా ఇగటమాడేను' అంది.

పదవ తరగతి ముగుస్తుందనగా పక్కూరు మునసబు గారిని కలిసాడు కొమరయ్య.

'ఏం కొమరయ్యా! ఏదో పనిమీదొచ్చినట్లున్నావు!' అన్నాడు మునసబు.

'దండాలు బాబుగోరు! ఊరిలో పనుండి ఒకపాలి సూసేల్దామని వచ్చాను అయ్యగారు' చాలా వినయంగా అన్నాడు కొమరయ్య

'ఏదైనా ఉంటే చెప్పు. మీవాడు ఎలా చదువుతున్నాడు?' అడిగాడు మునసబు

'ఆడిగురిండే పరిసాన్లోనున్నాను. మీకొకపాలి సెవిలో...' నసిగాడు కొమరయ్య

'సల్లకొచ్చి ముంత దాయడమెందుకు? సంగతేంటో చెప్పు' అన్నాడు మునసబు.

'మరీ! బాబు గారు మీరేమనుకోనంటే...' మరికొంత నసిగాడు కొమరయ్య

'చెప్పు ఫరవాలేదు కొమరయ్య. మీ వంశమంతా మాకు సేవ చేస్తున్నారు గదా! నా దగ్గిర దాపరికాలెందుకు?' మునసబు అభయహస్తమిస్తూనే అడిగాడు.

'ఏదో మా భీముడికి పదో తరగతి వరకూ సదివించాను బాబు. ఇక నా వల్ల కాదు. ఆడికి సిన్న ఉజ్జోగం అయిపోతే పెళ్లి సేసేద్దమనుకుంతున్నాను బాబు' మనసులో మాట సేప్పాడు కొమరయ్య

‘ఓరి నీ దుంప తెగ! ఎమ్మేలు సదివినోళ్లకే దిక్కు లేదు. ఈడింకా పదే గదా! అయినా ఇప్పుడే పెళ్ళేంటి?’ మునసబుగారు చాలా వెటకారంగా అన్నారు.

‘అలా అనకండి బాబు. ఏదో మీ దయవల్ల ఏ మిలిటరీలోనో తోసేస్తే ఆడి బతుకు ఆడు బతుకుతాడు’ చాలా ఆవేదనతో అన్నాడు కొమరయ్య

మునసబుగారికి ఏదో గుర్తుకొచ్చింది.

‘అబ్బా! సరిగ్గా గుర్తు చేసావు కొమరయ్యా! మొన్నే పట్నమెలితే ఎవరో అడిగారు. మనవాళ్ళు పదోతరగతి చదివినవాళ్ళు ఎవరైనా ఉన్నారా అని. రేపు నేను మళ్ళీ పట్నం వెళ్ళినపుడు వివరాలు కనుక్కొస్తాను. నీవు రెండు రోజుల్లో మళ్ళీ కనిపించు” అన్నాడు మునసబు.

‘అలగే బాబుగారు. మీ ఋణముంచుకోను’ అన్నాడు కొమరయ్య

కొమరయ్య ఇంటికి వెళ్తూ దేవుడు ఎప్పుడూ నన్ను చల్లగా చూస్తుంటాడు అనుకున్నాడు. భీముడికి మిలిటరీలో ఉద్యోగం వస్తే గ్రామదేవతకి మొక్కు చెల్లిస్తానని మనసులో అనుకున్నాడు.

కొమరయ్య వెళ్ళకముందే మునసబు దగ్గరనుండి కబురొచ్చింది. ఆగమేగాలమీద కొమరయ్య మునసబుగారింటి దగ్గర వాలాడు.

‘నీ కొడుకు అదృష్టం బాగుంది కొమరయ్యా! పట్నంలో నా స్నేహితుడొకడు మిలిటరీలోనే పనిచేస్తాడు. వాడి దగ్గరికి మీవాడిని రేపు తీసుకొని వెళ్ళు. వాడు అంతా చూసుకుంటాడులే’ అని ఎక్కడుంటాడో వివరాలు చెప్పాడు.

‘నీ కాలు మొక్కుతాను బాబు. మీ ఋణం ఉంచుకోను బాబు గారు’ అని వెళ్ళిపోయాడు కొమరయ్య

భీముడు బలిష్టంగా ఉండి మంచి ఎత్తుగా ఉండడం వల్ల పదో తరగతి పరీక్షా ఫలితాలు తెలిసిన వెంటనే సిపాయిగా ఎంపిక కావడం శిక్షణకు వెళ్ళడం అంతా ఒక కలలా అయిపోయింది. కొమరయ్య, ముత్తి ఆనందానికి అవధులు లేవు. కొమరయ్య అనుకున్నట్లుగానే భీముడికి ఉద్యోగం రావడం, వాడు దేశ పరిరక్షణలో భాగంగా ఎదిగి ఈ కుటుంబానికి, ఊరికి మరియు ప్రాంతానికి పేరు తెచ్చినవాడు కావడం ఒకింత గర్వంగా ఉన్నా మన మూలాలు మరువకూడదన్న ఇంగిత జ్ఞానంతో నిబద్ధతగా అందరితో మెలుగుతున్నారు.

ఈ ఊరికి కరెంటు లేదు, ఒక బడి లేదు, దగ్గరగా ఉన్న పట్నం పోదామంటే ఒక మంచి రహదారి లేదు. ఫోను చేద్దామంటే కుదరదు. ఒకరోజు రాత్రి భోజనం చేసిన తరువాత పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ముత్తితో అన్నాడు.

‘అసే, భీముడు మనూరికి అన్నీ చేయిస్తాడంతావా?’

‘అదేటలగంతవో! ఇప్పుడే గందా ఆడు ఉజ్జోగానికెళ్ళినాడు. ఈ పాలొచ్చినప్పుడు నువ్వే అడుగు’ చేస్తాడన్న నమ్మకమున్నా ఇంకా చిన్నోడు గదా అన్న భావం స్ఫురించింది ముత్తి మాటల్లో.

‘ఆడికింకా పెళ్లి సేయ్యల్ల. పిల్లలు పుట్టాల, ఇంకా బోల్డంత యవ్వారముంది. ఈ సారొచ్చినప్పుడు ఆడి పెళ్లి సంగతడగాల’ ముత్తి సౌమ్యంగా చెప్పినా మాటలు ధృడంగా ఉన్నాయి.

‘ఎప్పుడొస్తాడో ఏమో! ఆడికి సెలవలియ్యాల, రాను పోను వారమన్నాడు ఎల్లప్పుడు’ కొమరయ్య కొడుకుని తలచుకుంటూ ఎలా ఉన్నాడోనని ముత్తికి కనిపించకుండా చెక్కెలిపై నుండి ఒక కన్నీటి చుక్క జార్చాడు. ముత్తికి ఆ చుక్క చీకటిలో కనబడలేదు కానీ గొంతులోని ఆర్ద్రతతో అనుభూతిని స్పృశించగలిగింది.

భీముడు వెళ్ళినాక కొత్తలో వారం పదిరోజులకొక ఉత్తరం వ్రాస్తూ ఉన్నాడు. ఆ ఉత్తరం రావాలంటే ఒక పక్షం. ఊళ్ళో పోస్ట్ ఆఫీస్ లేదు గదా. పక్కూరికొస్తే ఆ పోస్ట్ మాన్ వారం కొకసారి ఈ ఊరి ఉత్తరాలు పట్టుకొస్తాడు. పోస్ట్ మానె ఉత్తరం చదివి పెడతాడు. ఏడాదిన్నర అయిన తరువాత భీముడు వస్తున్నట్లు ఉత్తరం వ్రాసాడు. కొమరయ్య భీముడు వచ్చినప్పటికీ ఒక మంచి అమ్మాయిని చూసి పెళ్లి ఏర్పాట్లు చేయాలని అనుకున్నాడు.

'తోలేత వత్తన్నాడు గందా! నాకోసం ఏం తెత్తాడో' అని ముత్తి ఒకటే ఆలోచన

ఆ రోజు రానే వచ్చింది. భీముడు మిలిటరీ బట్టలు, బూట్లు వేసుకొని నేరుగా పెట్టె పట్టుకొని ఊరి పొలిమేరకి వచ్చినప్పటికీ ఊళ్ళో పిల్లలందరూ గుమిగూడి చల్లని కబురు కొమరయ్యకి అందించారు. ఉన్న పళంగా కొమరయ్య, ముత్తి పరిగెత్తుకుంటూ కళ్ళ నీళ్ళ పర్యంతం భీముడికి ఎదురెళ్ళారు. పైకి గంభీరంగా కనపడినా అమ్మ మనసు వెన్నపూస. షుమారు 18 నెలల తరువాత మళ్ళీ ఒక దేశ సైనికుడుగా వచ్చిన కొడుకుని చూసి ఒకింత గర్వం. ఒకింత సంరంభం. ఇద్దరూ భీముడిని పట్టుకొని ఆనంద భాష్పాలు రాల్చారు. తరువాత చెరో చేయి పట్టుకొని ఇంటికి తీసుకెళ్ళారు.

కుశల ప్రశ్నల తరువాత అమ్మ చేతి వంట తిని ఎన్నాళ్లైందో అనుకుంటూ సుష్టుగా భోజనం చేసాడు భీముడు. అమ్మ మాత్రం కొడుకు ప్రతీ కదలిక గమనిస్తూ ఉంది. వాడిలోని మార్పులు శరీర సౌష్ఠవం అన్నీ క్రీగంట చూస్తూనే వుంది. ఉద్యోగంలో ఉన్నపుడు, భోజనాలు, పడుకోవడానికి సదుపాయాలు, వాతావరణం అన్ని అడిగి తెలుసుకున్నారు. ముత్తి ఉండబట్టలేక

'ఆడ కొర్రజావ ఇచ్చినారా?' అమాయకంగా అడిగింది.

'వారంకి మూడు రోజులు మాంసము, గుడ్లు, రొట్టిలు' ఇస్తారమ్మా అన్నాడు. కొర్రజావ గురించి చెప్పలేదు.

రెండు రోజులు తరువాత మెల్లగా కొమరయ్య పెళ్లి సంగతి ఎత్తాడు.

'మల్ల ఎప్పుడొస్తావో! అచ్చినప్పుడే రెండచ్చింతలు పడితే బాగున్ను గల్ల!' రాత్రి భోజనం తరువాత కొమరయ్య భీముడు కంటిలోకి చూడకుండా తనలో తనే మాట్లాడుతున్నట్లు అన్నాడు.

భీముడు తనగురించే అనుకున్నాడు.

'పిల్లని సూడాలగదా!' అన్నాడు మెల్లగా.

'నువ్వు ఊ! అంటే రేపే లగ్గమెట్టించేత్తాను' అంది ముత్తి. ఎప్పుడడుగుతాడా అని ఎదురుచూస్తున్నట్టుగా...

'మీ యిష్టం' అన్నాడు భీముడు.

వచ్చినప్పటి నుండి ఊరిలోని స్నేహితులు ఒకటే గొడవ పప్పన్నం ఎప్పుడు తినిపిస్తావని! పెళ్లి చేసుకుంటే తన మాట ఎలా ఉన్నా అందరి సరదా తీరిపోతుందని భీముడు ఆశ పడ్డాడు.

ఊర్లోనే సంబంధం కుదిరి రెండువారాల్లో రత్తితో పెళ్లి. మూడో వారం ఇద్దరూ బయల్దేరి వెళ్ళిపోయారు.

ఉన్నంతలో సాంప్రదాయం ప్రకారం పెళ్లి జరిపించి ఊళ్లోనే కాకుండా పక్కూరి వాళ్ళను ముఖ్యంగా మునసబుగారిని ఆహ్వానించి అక్షింతలు తంతు ముగించారు.

మళ్ళీ అయిదేళ్ళకు లచ్చిగాడితో తిరిగొచ్చారు. భీముడు బాగా ఆలోచించి తన పేరు మహా భారతంలో ఒక మంచి పాత్ర గాబట్టి కొడుకు పేరు రామాయణంలో ఒక పాత్రయితే బాగుంటుందని కొడుక్కి 'లక్ష్మణుడు' అని పేరు పెట్టాడు. అది కాస్తా ఊరొచ్చిన తరువాత లచ్చిగాడు అయిపోయింది.

ఈసారొచ్చినపుడు మళ్ళీ పోస్టింగ్ కాశ్మీర్ లో ఉంటుందని రత్తిని, లచ్చిగాడిని ఇక్కడే వదిలేసి వెళ్తానని చెప్పి వెళ్ళిపోయాడు భీముడు.

ఈ అయిదేళ్ళలో ఊరి పరిస్థితి చాలా మారింది. కొమరయ్య పట్టుదలతో ఊరికి కరెంటు వేయించడం, ఒక బడి కట్టించడం చేయించగలిగాడు. పట్నం వెళ్ళడానికి తారు రోడ్డు కాకపోయినా ఎడ్లబండి త్రోవ చేయించాడు. ఊళ్ళో ఉన్నవాళ్ళకే కాకుండా చుట్టుప్రక్కల ప్రాంతాల వారికి కొమరయ్యంటే ఒక గౌరవం, అభిమానం ఏర్పడింది.

కొమరయ్య టివిలో వార్తను ఇంకా జీర్ణించుకోలేక పోతున్నాడు. నిజంగా భీముడు ఇక లేనట్లేనా? వాడికోసం ఎంత కష్టపడ్డాను? ఈ ఊరు ఊరంతా, కాదు ఈ సుట్టుపక్కల ఊళ్ళన్నీ వాడంటే అభిమానము, గౌరవము. కొండమీద పుట్టిపెరిగినా కష్టపడి సదివి పేరు తెచ్చాడు.

రత్తికి ఏం చెయ్యాలో తెలియక పక్కింట్లో ఉన్న వాళ్ళను, ఎదురింట్లో వాళ్ళను పిలుచుకొచ్చింది.

అందరూ ఏం జరిగిందో తెలీదు గానీ భోరుమని ఏడవడం మొదలుపెట్టారు.

ఒక పెద్దాయన మెల్లగా కొమరయ్య దగ్గర కూర్చొని అడిగాడు

'కొమరోడా! ఎతయ్యిందేటి? అందరూ ఏడుపులు, మొఱలు....

'కొమరోడు ఏదో ఇప్పుడు సెప్తాడు. అందరూ నోళు ముయ్యండి' అన్నాడు.

అంతా నిశ్శబ్దం. ఆత్రంగా కొమరయ్యవైపు చూస్తున్నారు.

'భీముడు సచ్చిపోయినాడు!' ఏడుస్తూ నోటికి తువ్వాలు అడ్డం పెట్టుకొని చెప్పాడు కొమరయ్య

మళ్ళీ అందరూ ఏడుపు మొదలుపెట్టారు

పెద్దాయన 'నీకెవురు సెప్పినారు?' అనడిగాడు

'టివి లో ఇప్పుడే సూపించారు' అన్నాడు కొమరయ్య

'భీముడుని సూపించారా?' పెద్దాయన మళ్ళీ అడిగాడు

'అవును. భీముడులాగున్నాడు ఒక సిపాయి' అన్నాడు కొమరయ్య

రత్తి, లచ్చిగాడు ఒకటే ఏడుపు. వారిని ఆపడం ఎవరితరమూ కావడం లేదు.

ఇంతలో ముత్తి బయటినుండి వచ్చి విషయం తెలుసుకొని

'నా భీముడుకి అందరి దిష్టి తగిలి ఆడు పైకెల్లిపోనాడు' అని కన్నీరు మున్నీరుగా ఏడవడం మొదలెట్టింది

పెద్దాయనకెందుకో భీముడికి ఫోను ఉంది కదా పట్నమెల్లి ఎవరైనా ఫోన్ చేస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది.

నంబరు రాసిచ్చి ఒకబ్బాయితో పంపించారు.

కొమరయ్య మంచం పైనుండి సాయంత్రం వరకూ దిగలేదు. పట్నం వెళ్ళిన అబ్బాయి సాయంత్రం తిరిగొచ్చాడు. ఫోను కలవలేదని చెప్పాడు. రెండోరోజు కూడా మళ్ళీ ఫోను ప్రయత్నించారు. మూడో రోజు అదే పరిస్థితి.

ఇంక కొమరయ్యకి నూటికి నూరు శాతం తాను అనుకున్నదే జరిగిందని అనుకున్నాడు. ఊరు ఊరంతా ఒకటే గోల.

మూడు రోజుల తరువాత ఒక నిర్ధారణకొచ్చి జరగవలసిన తంతు జరిపించాలి గదా అని గ్రామ పురోహితుడిని పిలిచి ఏర్పాట్లు ప్రారంభించారు. ముందుగా గ్రామ దేవతను దర్శించుకొని మిగిలిన కార్యక్రమాలు మొదలుపెడితే బాగుంటుందని పెద్దాయన చెబితే అలాగే అని అందరూ బయల్దేరారు.

గత నాలుగు రోజులుగా తిండి సరిగ్గా తినక కొమరయ్యకి నడిచే శక్తి లేదు. కానీ వెళ్ళాలని ఉంది. మనవడు లచ్చిగాడిని ఒకవైపు పక్కింటి అబ్బాయి మరోవైపు తోడ్కొని మెల్లగా ఊరి పొలిమేరలో ఉన్న గ్రామదేవత గుడికి వెళ్ళారు. ఊర్లో ఉన్న చిన్నా, పెద్ద అందరూ కలిసి వారి వెంటే వెళ్ళారు.

గ్రామదేవత గుడిలో పూజలు చేస్తున్నంతసేపు కొమరయ్య ఆయాసంతో ఉక్కిరిబిక్కిరి అయినా ఎవరికీ చెప్పలేదు. మనవడు, కోడలు భవిష్యత్తు ఏమౌతుందోనని ఒకటే ఆలోచన. ఒకటే భయం. ఒక్కగానొక్క కొడుకు యుక్త వయస్సులోనే పెళ్లి జరగడం లచ్చిగాడు పుట్టడం – పాతికేళ్ళ వయసుకే జరిగిపోయాయి. పెళ్ళికాకుండా ఉంటే ఈ జంజాటం లేకుండా ఉన్నేమో! పూజ జరుగుతున్నంతసేపు ఇవే ఆలోచనలు. పూజ పూర్తై కొబ్బరికాయ కొట్టేటప్పుడు ఒకబ్బాయి గట్టిగా

'భీముడొచ్చాడో' అని అరిచాడు.

అందరూ స్థాణువులా అటువైపు చూస్తున్నారు 'నిజమా!' అన్నట్లు.

రెండు నిముషాలు తరువాత నిజంగానే భీముడు వచ్చాడు మిలిటరీ బట్టలు వేసుకొని సూట్ కేసు పట్టుకొని.

అందరికీ ఆశ్చర్యం. నిజంగా భీముడొచ్చాడా అని ఒళ్ళు గిల్లుకున్నారు.

కొమరయ్య ఇంకా నమ్మలేకపోతున్నాడు. నోట మాట రావడం లేదు. కన్నీరాగడం లేదు. ఒక్కమాట కూడా మాట్లాడలేదు. భీముడ్ని దగ్గరికి తీసుకొని గట్టిగా కౌగిలించుకున్నాడు.

'ఈ ప్రపంచాన్ని గెలిచినంత ఆనందం. పుట్టిన దగ్గరనుండి ఎంత అల్లారుముద్దుగా పెంచాడు! భీముడు ఒక ఉద్యోగస్తుడై ఊరికి, ఈ ప్రాంతానికి పేరు తేవాలని కలలు గన్నాడు. పక్కూరి బడిలో చేర్పించడానికి చిటికెన వేలు పట్టుకొని అడివిలోను మాట మంతి చెప్పి త్రోవలో వాకాయ పళ్ళు, ఉసిరికాయలు తినిపించి బడి పంతులు చిన్నబుచ్చే మాటలు అన్నా ఎంతో అణకువుగా ఉండి చదివించాడు. వర్షాకాలం జలుబు చేసి ఊపిరాడక ఉక్కిరి బిక్కిరైపోయి అవస్థపడితే రెండు రోజులు చదువు మానకూడదని భుజంపై ఎక్కించుకొని బడికి తీసుకెళ్ళాడు. ఈ ఊరికి భీముడు హయాములో ఎన్నెన్నో మంచి పనులు జరగాలని తపన పడ్డాడు. తన జీవితమంతా భీముడు ఈ ఊరిలో అందరికీ స్ఫూర్తిదాయకం కావాలన్న లక్ష్యంతో కృషి చేసాడు. తనే సర్వస్వం, భీముడే తన తనలోకం అని ప్రతిన బూనాడు'.

భీముడుకి అక్కడ ఈ పూజ ఎందుకు జరుగుతుందో మెల్లమెల్లగా అర్థం అయింది. 'నా కోసం మా అయ్య, అమ్మతో పాటు ఊరు ఊరంతా ఏకమై గగ్గోలు పెట్టారన్నది' తెలుసుకున్నాడు. వారందరి ఆప్యాయత, అభిమానానికి భీముడు కూడా కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. ఇంత అభిమానం చూపిస్తున్న వారందరికీ ఏదో తనవంతుగా సహాయం చేయాలి అనుకున్నాడు మనస్సులో. భార్య, కొడుకుని దగ్గరకి తీసుకొని తల నిమిరాడు. 'ఇంత ప్రేమ చూపిస్తున్న వారిని విడిచి ఎక్కడో కొన్ని వేల మైళ్ళ దూరంలో పనిచేయడం అవసరమా?' అనుకున్నాడు. దుఃఖము, ఆవేశము కలబోసిన ఆనందంలో తనని తాను మరచిపోయే తన్మయత్వంలో ఉన్నాడు భీముడు.

కొమరయ్య ఇంకా భీముడిని పట్టు విడువలేదు. అది మరింత బిగుసుకుంటున్నట్లుంది. ఆ కౌగిలింతలోనే మనవడి చేతిని భీముడు చేతిలో పెట్టి అప్పగించాడు. నా మీద నమ్మకంతో నీ కొడుకుని నాకప్పగించావు. నీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా వాడికి నాకు తెలిసినంతలో ఆత్మాభిమానము, గౌరవ మర్యాదలు నేర్పించి నీకు తిరిగి అప్పగిస్తున్నానన్న భావన వుంది. వాడితో పాటు మన మనసులతో

పెనవేసుకున్న ఈ ఊరు బంధాన్ని కూడా నీ చేతిలో పెడుతున్నానన్న ఒక సందేశం ఉంది. భీముడిని తన గుండెకు మరింత గట్టిగా హత్తుకున్నాడు. భీముడు తండ్రి ఆప్యాయతను తనివితీరా అస్వాదిస్తున్నాడు. అందరూ ఎంతో ఆనందంతో కేరింతలు కొట్టారు. గ్రామదేవత చల్లగా చూసిందని దండాలెట్టారు.

కొమరయ్య మాత్రం భీముడ్ని వదలలేదు. అలాగే క్రిందకి జారిపోయాడు. తుది శ్వాస విడిచిపెట్టాడు.

## ఋణానుబంధం

డా. శేషు శర్మ
అట్లాంటా, జార్జియా

### శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 24 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో ఉత్తమ కథానిక విభాగం విజేత

**అమ్మ.** అనురాగానికి, ఆత్మీయతకు, త్యాగానికి ప్రతీకగా నిలిచేది వేరేదేమైనా ఉందా? ఒక్కసారి అమ్మని తలచుకోగానే, అనిర్వచనీయమైన భక్తిభావంతో ఒళ్లంతా గగుర్పొడిచింది. వైజాగ్ ఎయిర్ పోర్ట్ లోదిగి, కారు కోసం ఎదురు చూస్తున్నా. అమ్మ అలోచనలలు నన్ను చుట్టుముట్టాయి. పులిలా ఉండే అమ్మ, పిల్లిలా నిస్సహాయంగా, ఇంకొకరి మీద ఆధారపడి జీవితం కదుపుతోంది, అని తలచుకుంటే, మనస్సు చివుక్కుమంటోంది. పెద్ద కొడుకు తప్పితే మిగతా కూతుళ్లు, అల్లుళ్లు, కొడుకు, కోడలు, ఎక్కడో దూరపు దేశాల్లో, స్థిరపడిపోయారు. తన పిల్లలిద్దరి అవసరాలకోసం, పెద్ద కోడలు కూడాఅమెరికాలోనే ఉంది. విశాఖ లో సెటిల్ అయిన పెద్ద కొడుకు మాత్రం, అమ్మ కోసం స్వంత ఇంట్లో ఉండాల్సి వచ్చింది. అమ్మ కూడా పాతిక ఏళ్ళు అమెరికాలోనే గడిపింది. సిటిజన్ షిప్ వచ్చే అవకాశం ఉన్నా, ఆత్మాభిమానంతో, తాను భారతయువతిని అని, అవసానదశలో జీవితాన్ని తన స్వంత ఇంట్లో, తన ఊళ్లో గడపాలని నిశ్చయించుకుంది. పునర్జన్మ రాకూడదని,కాశీలో తల్లి గర్భంలో ఉండేటంత సమయం, అంటే తొమ్మిది నెలలు, పెద్ద కూతురు సంరక్షణలో, అల్లుడి సాయంతో గడిపి, పెద్ద కొడుకు ఇంటికివచ్చింది. వృద్ధాప్యం రావడంతో ఒళ్ళు స్వాధీనం కావటంలేదు. కోడలు అమెరికాలో ఉండడంతో, కొడుకు వండిన వంట తింటూ, వాడి చేత చాకిరీ చేయించుకోవాల్సి వచ్చింది. పాతకాలపు మనిషేమో, కొడుకు చేత పని చేయించుకోవడం ఆవిడకి కష్టంగా ఉంది. పైగా భార్యా భర్తలని విడగొట్టేనే, పాపం తగులుతుందేమోనన్న బెంగ, భయం. తను లేక పోతే పెద్ద కొడుకు కూడా, అమెరికాలో భార్యతో పాటు, పిల్లలకి సాయం చేస్తూ ఉండేవాడు. కేవలం తన కోసం విశాఖలో చిక్కుకుపోయేడని అను నిత్యం మధన పడుతూ ఉందేది. తను ఒక్కర్తీ ఉండడానికి విపరీతమైన భయం.

అయ్యో., వీసా పోయింది, లేక పోతే తనూ అమెరికా తిరిగి వెళ్ళిపోతే బాగుణ్ణేమో అని పలుమార్లు బాధపడేది. పాపం అమ్మ!..నిట్టూర్చా. టాక్సీ ఎక్కి అన్నయ్య ఇంటికి బయలుదేరా. పాతిక సంవత్సరాలు మా ఇంట్లో అమ్మ ఎలా మసిలేదో గుర్తుకొచ్చి, నవ్వొచ్చింది. ఆవిడది ఏమి హోదా. ఏమి హుషారు, ఏమి చలాకీతనం? ఎంత హడావిడో. ఎన్నేళ్లు వచ్చినా, చంటిపిల్ల మనస్తత్వం పోలేదు. ఎన్ని కథలు, నవలలు రాసింది? ఎప్పుడు ఎవరి ఇంట్లో ఏ పార్టీ అయినా, వాళ్ళ మీద ఆసువుగా కవిత్వం చటుక్కున రాసి వాళ్ళచేత చదివించుకుంటే గాని వదిలేది కాదు. శీతాకాలంలో కూడా తెల్లవారకుండానే, చల్లనీళ్ళతో తల స్నానం చేసి, పచ్చి మంచినీళ్ళయినా ముట్టకుండా మడిగా వంటంతా చేసి, రోజంతా గంటలకొలదీ పూజలు, రోజూ భగవన్నామ స్మరణ, ప్రవచనాలు, వారానికి నాలుగు రోజులు పూర్తి ఉపవాసాలు, ఎలా సాగేదో అమ్మ? దానికి తోడు, మడిగా తాను వండుకున్న పిడికెడు నూకలతో జావ గాని, గుళ్ళోంచి తెచ్చుకున్న ప్రసాదమో, పండో, పాయసమో తప్ప, ఇంకొకరి చేత్తో అన్నం పెడితే తినడం నేప్పుడూ చూడలేదు. నేను ఏదైనా తినడానికి ఇస్తే, "ఊళ్లో అడ్డగాడిదలనిటినీ ముట్టుకొనివస్తారు. నాజోలికి రాకండి" అని విసుక్కునేది. అలాంటిది. ఎనభై రెండు సంవత్సరాల వయస్సులో తన పెద్ద కొడుకు చేత వండిచుకుని తినాల్సి వస్తోంది, పాపం.

నా ఆలోచనలకు అడ్డు పడుతూ, టాక్సీ అన్నయ్య ఇంటి దగ్గర ఆగింది. టాక్సీ వాడికి డబ్బిచ్చి, నా చిన్న సూట్కేసుని తీసుకొని మెట్లెక్కి, పైకి వెళ్ళా. ఎదురుగా వరండాలో దృశ్యం నన్ను ఆశ్చర్యచకితురాలిని చేసింది. ఒక నడి వయస్కురాలు, ఏభై సంవత్సరాలు ఉంటాయేమో. అమ్మ తలకి కొబ్బరి నూనె రాసి, నీటుగా జడ వేసి, పైకి చిన్న ముడిలా కట్టింది. పక్కనే ఉన్న పెద్ద గ్లాసుని అమ్మ నోటికి అందించి, "శబరమ్మా, ఇవి చిక్కటి పాలు. రోజూ, బుద్ధిగా తాగుతే మీ అరోగ్యం బాగు పడుతుంది" అంటూ, క్షణంలో ఆవిడ చేత పాలు తాగించింది. పుల్లటి మామిడికాయ పప్పు, గుత్తి వంకాయ కూర చేసి, వేడి అన్నంతో పట్టుకొస్తాను. ఏమీ గొడవ చేయకుండా తినాలి తెలుసా?" బొద్దుగా పెద్ద కళ్ళు, నవ్వితే సొట్టలు పడే మొహం ఆవిడది. జుత్తుని చక్కగా దువ్వి, పైకి ముడి పెట్టుకుంది. నయా పైసా అంత బొట్టుతో కళగా ఉంది ఆమె. నన్ను చూడగానే, " ఏం అక్కా, రండి".

" సబరమ్మా, అటు చూడండి. ఎవరొచ్చారో".

రబ్బరు కుర్చీలో కూర్చున్న అమ్మ పక్కకు తిరిగి నా వైపు చూసింది. నా జీవితంలో ఎప్పుడూ అమ్మ నన్ను తనకి జడ వేయనీయ లేదు. గ్లాసుడు పాలు కాదు, కనీసం, ఒక చెంచాడు పాలు కూడా, ఆవిడ చేత నేను తాగించలేకపోయేదాన్ని. అటువంటిది. ఈవిడ ఎవరబ్బా? అమ్మ మీద ఇంత చనువు, స్వాతంత్రం? "ఇప్పుడేనా రావడం? ఎన్నాళ్ళుంటావేమిటి?" అమ్మ మాట భావరహితంగా అనిపించింది.

మొట్ట మొదటి సారిగా, ఈఅమ్మ నాకు పరిచయం లేదు అనిపించింది. . "ఒక్క వారం ఉంటానమ్మా. సెలవలు లేవు" సంజాయిషీ చెప్పుకున్నా. "సరే. లోపలికెళ్ళి స్నానం చేసి కాస్త కాఫీ తాగి పడుక్కో" అంటూ, తన పుస్తకంలో కి దృష్టిని మరలించింది అమ్మ. స్నానం చేసి, కాఫీ తాగిన తరువాత కళ్లు మూతలు పడిపోతూ ఉంటే, నిద్రలోకి వొరిగా నా ప్రమేయం లేకుండానే.

"ఏరా, లేస్తావా? భోజనం చేద్దువు గాని" అన్నయ్య పిలుపుకి, చటుక్కుని లేచి కూర్చున్నా. బయట పక్కింటావిడ కంచంలో అన్నం కలిపి , ముద్దలు చేసి అమ్మకి పెడుతోంది. అమ్మ చిన్నగా విసుక్కున్నా, ఆమెను నివారిచకుండానే, చక్కగా అన్నం తింటోంది. ఇదేమిటి? నిప్పుని కూడా నీటితో కడిగే చాదస్తపు మనిషి, ఈ అమ్మకి ఏమయింది. నాన్న పోయిన తరువాత పూర్తిగా అన్నం తినడం మానేసిందే! ఈ పద్దెనిమిదేళ్లలో ఒక్క మెతుకు నోట్లో పెట్టలేదు. మరి ఇప్పుడు. ఏమయిందీవిడకి. ఎవరీ పక్కింటి మనిషి? "అన్నయ్యా, ఒక్కసారి అటు చూడు అమ్మని. నాకళ్ళతో నేను నమ్మలేక పోతున్నాను. చాలా వింతగా ఉంది అమ్మ ప్రవర్తన. ఆవిడెవరు? ఆమధ్య ఎప్పుడో, మాటల్లో అమ్మ చెప్పునట్టు గుర్తు ఆవిడగురించి, కాని నాకు అంతగా పట్టలేదు".

"అదో విషాద గాథలే. ఆవిడ పేరు విజయ దుర్గ. మనవాళ్లు కారు. నాయుళ్లు. ఏడాదిన్నర నుండి ఇక్కడ అద్దెకుంటున్నారు. మంచి శ్రీమంతులు. కొడుకు, కోడలు అమెరికాలో ఉంటారు. ఒక చెప్పుకోలేని దుర్ఘటనలో ఈవిడ కూతురు ఒక దుర్మరణానికి పాలయింది. అల్లుడుకనిపించకుండా మాయమయిపోయేడు.

ఏడాది వయస్సు మనవడికి. ఆ పసివాణ్ని తీసుకుని ఇంటికి వచ్చేరు దంపతులు. ఆవిడ కడుపుకోతని భరించలేక పోయింది. తల్లీతండ్రులిని పోగుట్టుకున్న బిడ్డడని ఎలా పెంచాలో ఆమెకు తోచలేదు. వాడు ఎప్పుడైనా, అమ్మమ్మని, తాతగారిని మా అమ్మా నాన్నా ఏరి అని అడిగితే ఏం సమాధానం చెప్పాలి అని సందిగ్ధం లో పడ్డారు వాళ్లు. దుర్గ చాలా తెలివైనది, ధైర్యవంతురాలు. పిల్లాడికి ఎటువంటి అనుమానాలు బెంగలు లేకుండా పెంచాలి. ఎలా అని ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. ఆవిడది పెద్దకుటుంబం. ఆవిడ అక్కల్లో ఒకరికి ఒక్కడే కొడుకు. పెళ్లయి 8 సంవత్సరాలయినా పిల్లలు పుట్టలేదు. ఆ అక్క కొడుక్కి తన మనవణ్ణి పెంచుకోమని ఇచ్చేసింది. కుర్రాడు, వాళ్ల స్వంత బిడ్డలా గారాబంగా పెరుగుతున్నాడు. దుర్గ కూడా తరచు వాణ్ని చూస్తూనే ఉంటుంది.పిల్లాడు తన కళ్ళ ముందే పెరుగుతున్నాడన్న సంతృప్తి. తన అసలు తల్లి తండ్రుల గురించి తెలియాల్సిన అవసరం ఆ పిల్లవాడికి లేదు అని వాళ్ళ నిబ్బరం.

దాంతో ఒక సమస్య తీరింది. కాని ఆవిడలో విషాదం మట్టుకు పేరుకుపోతూ వచ్చింది. స్వంత ఇంట్లో పెద్ద బంగళాలో ఉండేవారు. కాని అక్కడ ఉండలేక, దాన్ని అద్దెకి ఇచ్చి ఏడాదిన్నర క్రితం ఈ పక్క వాటాలో దిగేరు. ఇక్కడకొచ్చిన కొత్తలో నిరంతరం కన్నీరు మున్నీరుగా ఏడ్చేది.భర్తని ఉద్యోగానికి పోనిచ్చేది కాదు. అలాంటి సమయంలో అమ్మ కాశీ నుంచి వచ్చింది. మీ వదిన ఇక్కడ లేదు కదా. నేను వంటరివాణ్ణి అయిపోయానని, అమ్మ బాధ. ఎప్పుడూ భగవద్గీత సుందరకాండ, వివేకచూడామణి, ఈ ఆధ్యాత్మిక గ్రంధాలన్నీ చదువుతూ కూర్చునేది. అమ్మలో శబరిని చూసింది దుర్గ. అమ్మ దగ్గర చేరి, తను కూడా అవన్నీ నేర్చుకోడం మొదలెట్టింది. క్రమేణా అమ్మని ఒక తల్లి గా కాకుండా, తన స్వంత కూతురిగా చూడడం మొదలు పెట్టింది.

అమ్మని శబరమ్మ అంటుంది. వాళ్లిద్దరి మధ్యా అవినాభావ సంబంధం పెరుగుతూ వచ్చింది. రోజూ ఒకరిని విడిచి ఇంకొకళ్ళు ఉండలేరు. ఈ శబరమ్మకి ఆ దుర్గమ్మ తోడు. ఆ దుర్గమ్మకి ఈ శబరమ్మ గురువు. అమ్మ సన్నిధిలో పూర్తిగా మారిపోయింది దుర్గ" అంటూ ఆపేడు అన్నయ్య. అంతా జాగ్రత్తగా విన్నాను. బయట వరండాలోకి ఒక్కసారి చూశా. అమ్మ, ఆ నల్ల రబ్బరు కుర్చీలో కూర్చుంది.చక్కగా నీట్ గా దువ్విన జుత్తు,చిన్న ముడి, పొందికగా కట్టిన చీర..గత పాతికసంవత్సరాలుగా ఇంట్లో అమ్మని అలాగ ఎప్పుడూచూళ్లేదు నేను. ప్లేటు నిండా అన్నం, పప్పు కూర కలిపి, గోరుముద్దలు చేసి అమ్మకి తినిపించి, గ్లాసుడు నీళ్లు తాగించింది దుర్గ. ఆవిడ చేతులు, మూతి తుడిచీ, ప్లేటుపట్టుకొని తన వాటాలోకెళ్ళింది దుర్గ. విసుక్కున్నట్టు కనిపించినా, దుర్గ చేష్టలని నివారించలేదు అమ్మ.

మధ్యాహ్నం పడక గదిలో ఫోన్ లో మెసేజస్ చెక్ చేస్తూ కూర్చున్నా. బయట వరడాలో జరుగుతున్న సంభాషణ స్పష్టం గా వినిపిస్తోంది. అమ్మ "భగవద్గీత" చదువుతూ అర్థం చెప్తోంది. దుర్గ పక్కన నేల మీద కూర్చుని, పలక మీద రాసుకుంటోంది. అమ్మ చెప్పినవన్నీ తిరిగి ఒప్పచెప్తోంది. అమ్మ ముఖంలో గురువుగా పెద్దరికం, వైదుష్యం, దుర్గ ముఖంలో ప్రియ శిష్యుడిగా ఆర్ద్రత, తపన, కుతూహలం. ఈ జీవిత సంగ్రామంలో పోరాడలేక, విసిగి వేసారి పోయిన అర్జునుణ్ణి దగ్గర కూర్చోపెట్టుకొని ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగమని బోధిస్తున్న క్రిష్ణుడి లా కనిపించింది అమ్మ. అమ్మ క్రిష్ణ పరమాత్ముడి గా కర్తవ్య బోధన చేస్తూ ఉంటే, దుర్గమ్మ, అర్జునిడిలా, కర్మ మార్గం తో బాటు, జ్ఞాన మార్గాన్ని నేర్చుకుంటోంది. అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న దుర్గమ్మకు వెలుగు నిచ్చి ఒక దారి చూపించిన గీతాచార్యుడిలా గోచరించింది.

అమ్మ. "సబరమ్మా, మీరు నాకు నేర్పించిన శ్లోకాలలో నాకు బాగా నచ్చినివాటికి, చిన్న పాటలా ట్యూన్ కట్టాను వింటారా? ప్లీజ్, ప్లీజ్." చిన్న పిల్లలా మారం చేసింది దుర్గ.

"నువ్వు సంగీతం నేర్చుకున్నావేమిటి"? వెటకారం గా మాట్లాడింది అమ్మ.

"అలా ఆట పట్టించకు సబరమ్మా..సరదాగా మాయమ్మ కి పాడాలని. ఇవి మీరు నేర్పించినవే కదా."

"మాత్రా స్పర్శాస్తు కౌంతేయ సీతోష్ణ సుఖదుఖదా

ఆగమాపాయినో నిత్యా తాంస్తితిక్షస్వ బారత "

ఇది రెండవ అధ్యాయం లో 14 వ శ్లోకం. దీని అర్ధం చెప్పనా.

"ఓ కౌంతేయ, విషయేంద్రియ సంయోగము వలన సుఖ దుఖములు కలుగు చున్నవి. అవి ఉత్పత్తి, వినాశ సీలములు/ అనిత్యములు. కనుక బారతా, వాటిని సహింపుము". బుద్ధిగా చిన్న పిల్లాడిలా అప్ప చెప్పింది దుర్గ.

"వెరీ గుడ్" అమ్మ చప్పట్లు కొట్టింది. మరి ఇవాళ వివేక చూడామణీ చదవాలి కదా. అమ్మ ఆ పుస్తకం తీసింది.

"సబరమ్మా. ఇంకొక్క రెండు శ్లోకాలు..ట్యూన్ కట్టేను. వింటావు కదూ..మాయమ్మే." మారాం చేస్తూ అమ్మని ముద్దు పెట్టుకుంది దుర్గ

"ఏ శ్లోకాలు"?

"అదే, ఆత్మ సంయమ యోగం లో..5-6 శ్లోకాలు.

ఉద్ధరేదాత్మనాత్మానాం నాత్మానమవసాదయేత్

ఆత్మైవహ్యాత్మనో బంధుహ్ ,ఆత్మైవరిపురాత్మనహ."

మనుజులు ఈ సంసార సాగరం నుండి తమను తామే ఉ ద్ధరించుకొనవలెను. తమను తామే అదోగతికి పాలవకుండా కాపాడుకోవాలి. లోకములో వాస్తవంగా తమకు తామే మిత్రులం. తమకు తామే సత్రువులం." విజయంగా అమ్మ వేపు చూసింది దుర్గ. అమ్మ నవ్వింది.

"బంధురాత్మాత్మ నస్తస్య ఏనాత్మైవాత్మన జితహ

అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్

ఎవరు తన మనస్సును జయించునో అట్టివాని మనస్సు బంధువులా ఉపకారిలా ఉండును. మనస్సుని జయింపనిచో అది సత్రువై అపకారము చేయును" అమ్మ చప్పట్లు. దుర్గ పక పకా నవ్వడం.. వాళ్ళిద్దరూ చిన్న పిల్లల్లా ఆడుకుంటున్నట్టు గా కనిపించేరు నాకు. అమ్మ ముఖంలో ఇంత శాంతం, గంభీరం ఇంతకు ముందెప్పుడూ చూడలేదు నేను దుర్గ ముఖంలో ప్రశాంతత, ధైర్యం. ఎలా తన ఆలోచలని మార్చుకుని ఇంత చక్కటి మార్గంలో పయనించగలుస్తోంది. నాకంటే చిన్నదైనా, చేతులు జోడించి నమస్కరించాలి అనిపించింది ఆ క్షణంలో.

నేను వైజాగ్ లో ఉన్న వారం రోజులూ, దుర్గని జాగర్తగా గమనించా. వాళ్లాయన ఆఫీసుకి వెళ్ళిపోయిన తరువాత, అమ్మ సంరక్షణ ఆవిడ దైనందిక కార్యక్రమం. రోజూ, అమ్మ భోజనం అయిన తరువాత దగ్గర ఉన్న స్కూల్ కి వెళ్ళేది. అక్కడ పిల్లలకి తను నేర్చుకున్న ప్రార్ధనా శ్లోకాలు, మంచి సూక్తులు, ఎలా ప్రవర్తించుకోవాలో, అన్నీ నేర్పుతూ ఉండేది. వాళ్లకి ఎప్పుడూ, ఏదో అరోగ్యకరమైన తినుబండారాలు చేసి తీసుకెళ్తూ ఉండేది. ఒక రోజు, స్కూల్ నుండి తిరిగి వస్తూ వుంటే, నేను ఎదురు పడ్డాను. నవ్వుతూ పలకరించింది.

"స్కూల్ నుంచి వస్తున్నట్టున్నారు. ఈరోజు పిల్లలికి ఏం నేర్పేరేమిటి??" అడిగా."అదికాదక్కా మీరు విన్నారో లేదో, ఈ ప్లాస్టిక్ బాగ్ ల మూలంగా ఎన్ని ఆవులు చనిపోతున్నాయో. అందరూ, అసలు, కొంచమైనా ఆలోచించకుండా, వాతావర నాన్ని ఎలా పాడుచేస్తున్నారో? పెద్ద వాళ్లు చెప్పినా వినరు.

అందుకే ఆ స్కూల్ హెడ్ మాస్టర్ ని అడిగాను. ఈ ప్లాస్టిక్ గురుంచి పిల్లలకి చెప్పవచ్చా అని. లంచ్ టైం లో చెప్పమంది. అందుకే లంచ్ టైంలో వెళ్ళి పిల్లలకు నేర్పిస్తున్నాను. వాళ్ళు ఎంత చక్కగా వింటారో అక్కా " ఆ మొహంలో ఎంత తృప్తో.. నాకు చాలా సంతోషం అని పించింది. ఆమె మనో ధైర్యాన్ని ఆమె కార్యసూరత్వాన్ని, మెచ్చుకోలేకుండా ఉండలేకపోయేను. ఒక రోజు, హడావిడిగా వచ్చింది దుర్గ. "అక్కా ఒక్క సారి ఇలా వస్తారా." సరే అని ఆమె వెనకాతల పక్క వాటాలోకి వెళ్ళేను.

అక్కడ ముచ్చటగా ఉన్న దంపతులు, ముద్దుగా ఉన్న ఓ నాలుగైదేళ్ల బాబు ఉన్నారు. "అక్కా, వీడు మా మనవడు" అంటూ నావైపు చూసింది. నాకు అర్ధమయింది. వెంటనే, సద్దుకుని, "అదే మా అక్క మనవడు. వీళ్లు మా అక్క కొడుకు, కోడలు" పరిచయం చేసింది దుర్గ. ఎంతో మర్యాదగా నాతో మాట్లాడేరిద్దరు. కొత్త ఏమో వాళ్ల అమ్మ కొంగు వదల లేదు ఆ బాబు. దుర్గమ్మ ఎంత మంచి పనిచేసింది అని

మనస్సులో ఆమెను అభినందించకుండా ఉండలేక పోయేను. సడన్ గా నా దృష్టి పక్కన ఉన్న పడక గదిలో గోడ మీద పడింది. చక్కటి నవ్వుతో అందమైన అమ్మాయి ఫొటో కనిపించింది. నా మనస్సు మూలిగింది. ఎవ్వరూ గమనించకుండా, నా దృష్టిని బాబు వైపు మరల్చా. వాళ్ళకి ఉంటానని చెప్పి మా వాటాలో కి వెళ్ళిపోయా.

వారం రోజులు ఎంత త్వరగా వెళ్ళి పోయేయో.. చెప్పలేను. తిరిగి అమెరికా కి ప్రయాణం కట్టేను. అమ్మ కి చెప్పేను వెడుతున్నానని. ఆవిడలో పూర్వం ఉన్న ఆందోళన లేదు ఇప్పుడు. అన్నయ్య, దుర్గ హామీ ఇచ్చేరు, అమ్మకి ఏమీ ఫరవాలేదని. నేను బయలుదేరుతూ ఉంటే, దుర్గ వాళ్ళాయన వచ్చి నన్ను పలకరించేరు.

"మామ్మగారి దయ వలన మా దుర్గలో ఎంత మార్పు వచ్చిందో, నేను చెప్పలేను. ఇక్కడకి వచ్చిన కొత్తలో, నన్ను పనికి పోనిచ్చేది కాదు, అలాంటిది. ఇప్పుడె ఎంత ధైర్యంగా, ఎంత శాంతంగా ఉంటోందో. మామ్మగారికి కూడా, దుర్గ లేకపోతే ఎంత బెంగో? ఆమధ్య నేను సూట్ కేసు తీసుకుని బయటకిపోతూంటే, నన్ను ఆపి," ఊరికి వెళ్తునట్టున్నారు. మీతో దుర్గ వస్తోందా.. అని. నేను లేదని చెప్పగాని, చాలా తృప్తిగా, "అయితే, సరే. క్షేమంగా వెళ్ళి, లాభంగా రండి" అని చెప్పి నన్ను పంపేరు.

అప్పుడు అర్ధమయింది నాకు, అమ్మకీ, దుర్గ కీ ఉన్న అనుబంధం. ఆరు నెలలు గడిచిపోయేయి. అమ్మతో, అన్నతో తరచూ మాట్లాడుతూనే ఉన్నా. ఒకరోజు అన్నయ్య ఫోన్ చేసేడు. అమ్మకి బాగాలేదని, ఉండుండీ, కిందికి పడిపోతోందని. డాక్టరు చూసి ఏవో మందులిచ్చేడని కాని పెద్ద మార్పు లేదు అమ్మలో, అని. అమ్మతో మాట్లాడ దామని, అమ్మకి ఫోన్ ఇమ్మని అడిగా. ఆరోజు, ఆగస్టు5వ తారీఖు.

"అమ్మా. ఎలా వున్నావు" పలకరించా.

" నువ్వెవ్వరు" అడిగింది.

" నీ రెండో కూతుర్ని. మర్చిపోయేవా" అన్నా.

"అహా...చెన్నై లో ఉన్నావా, సియాటిల్ లో ఉన్నావా". ఆ ప్రశ్న వినగానే, లోపలి నించి ఏదో తెలియని బాధ నన్ను కలచివేసింది.

అమ్మకి మతి భ్రమించడమా! ఇది ప్రపంచంలో ఎవ్వరూ ఊహించనిది. ఇదెలా సాధ్యం ? వెంటనే సద్దుకుని, అమ్మని అడిగేను.

" అమ్మా, ఇవాళ తారీఖు ఏమిటి?"

"ఏమో, సెప్టెంబరో, అక్టోబరో" .. అమ్మ సమాధానం.

" ఇవాళ ఏం రోజమ్మా"

"ఏమో.. నాకు గుర్తు లేదు".

నాకు బుర్ర తిరిగినట్టయింది. మరుపు అన్నది లేని అమ్మకి, ఏమయింది? కత్తి లా ఉండే అమ్మ మెదడుకేమయింది? ఆ క్షణంలో ఎందుకో అమ్మ దూర తీరాలకు వెళ్ళిపోతోంది అనిపించింది తరువాత రోజు రోజుకు అమ్మ పరిస్థితి దిగజారడం మొదలెట్టింది. బాత్ రూములో, బయటా, పడిపోతోందని అన్నయ్య కంగారు పడుతున్నాడు. బట్టలు కట్టుకోలేక పోతోంది. ఆవిడకి సాయం చేయడానికి ఆడ మనిషి లేదు. అన్నయ్యకి చాలా కష్ట మయింది. అర్జంటుగా వదినను అమెరికా నుండి వచ్చేయమని కబురు చేసేడు.

వదిన చాలా సమర్ధురాలు; ధైర్యం కలది. తనకి కూడా అమ్మ పరిస్థితి చూసి, భయం వేసింది. డాక్టర్లతో సంప్రతించి హాస్పిటల్ లో జాయిన్ చేసారు అమ్మని. హాస్పిటల్లో అమ్మ కోమాలో కి జారు కుందనిఅన్నయ్య ఫోన్ చేసాడు. అమ్మని చూడ్డనికి అమెరికాలో మనవలు, మనవరాళ్ళు వెళ్లేరు. ఆవిడ పరిస్థితి పూర్తిగా దిగజారిపోవడంతో, నన్ను అర్జంటుగా రమ్మని మనవలందరూ గొడవ జేసేరు. అప్పటికప్పుడు టికెట్ బుక్ చేసుకొని ఇండియా కి బయలుదేరా.

హాస్పిటల్ లో చూడగానే, నాకు తెలిసి పోయింది, అమ్మ ఇంక మనలో లేదని. డాక్టర్లు ఎంత ఒత్తిడి పెట్టినా ఇంటికి తీసుకొచ్చేం అమ్మని, అన్నయ్యా, నేను. అమ్మ నాకు ఎప్పుడూ చెప్తుతుండేది. "నా వంటి మీద నాకు స్పృహ లేకపోతే, నన్ను బ్రతికించడానికి ప్రయత్నిచవద్దు. అది నాకు నరకం. నన్ను నరకంలో ఉంచకండి" అని.

ఆ మాటలు నాకు గుర్తుకొచ్చేయి . నోటి ద్వారా ఒక చెంచాడు నీరు కూడా పోకుండా, ఒంటి మీద తెలివి లేకుండా, మలమూత్రాల మీద కంట్రోల్ లేని పరిస్థితిలో జీవచ్ఛవంగా ఉన్న అమ్మని చూసి, దుఖం ఆపుకోలేకపోయా. ఆమెకి విముక్తి కలిగించు తండ్రీ అని ప్రార్ధించా భగవంతుణ్ణి. కాని ఇంకొక్క వారం రోజుల్లో మా తమ్ముడి కొడుకు పెళ్ళి. అది ఆగిపోతుందేమోనని అందరి భయం. ఆ పెళ్ళి అయే వరకు ఆవిడ ఊపిరి పోకూడదని మా అన్న , వదిన రోజూ మొక్కుకునేవారు. కాని, అమ్మని చూస్తే జాలి వేసేది నాకు. ఆవిడ నరకంలో ఉండడం నాకు బాధగా ఉండేది. అమ్మని ఇంటికి తీసుకు వచ్చిన మర్నాడు, అమ్మకి ఒళ్ళు తుడిచి, డయపర్ మార్చి, ఎలాగో జుత్తు దువ్వి, గౌన్ మార్చి పడుక్కో పెట్టాం నేను, వదిన. ఏమీ మింగ లేక పోయింది. సరే, స్నానానికని బయలుదేరాను. తిరిగి వచ్చి చూస్తే, అక్కడ దుర్గ కనిపించింది. అమ్మని పొదివిగా పట్టుకుని, ఆ గౌన్ ని చక్కగా సవిరించి, తలకి చక్కగా నూనె రాసి, నీటు గా దువ్వి, ముడి పెట్టి, నుదుటి మీద వీభూది పెట్టింది. తరువాత ఒక స్టీలు గ్లాస్ తో ఏదో తాగించడానికి ప్రయత్నిస్తోంది.

"సబరమ్మా.. చూడు, ఇది మంచి బలం ఇచ్చే అంబలి. తాగండి. మీకు ఆరోగ్యం అంతా బాగుపడిపోతుంది" అమ్మ పూర్తి గా కోమాలో ఉందేమొ, అస్సలు స్పందించలేదు. దగ్గరగా వెళ్ళి దుర్గకి నచ్చచెప్పా. అమ్మని రెస్టు తీసుకోనివ్వమని. నేను చెప్పినది ఎందుకో నచ్చలేదు దుర్గకి. అమ్మని తను మళ్ళీ మామూలు మనిషి గా చేసుకో గలనని, ఆమె నమ్మకం. ఆమెకున్న ప్రేమానురాగాలు చూసి, ఏనాటి అనుబంధమో ఇది అని అనుకున్నా. ఇదే ఋణానుబంధమేమో?

అలాగే పది రోజులు గడిచాయి. అమ్మ పరిస్థితిలో ఎటువంటి మార్పూ లేదు. ఇంటికొచ్చిన తరువాత, ఆవిడ కడుపు లో కనీసం ఒక చెంచాడు పాలైనా పడలేదు. అందరూ ఆశించినట్టు తమ్ముడి కొడుకు పెళ్ళి, మిగతా కార్యక్రమాలు అన్నీ చక్కగా జరిగి పోయేయి. ఆరోజు గురువారం. రాత్రి ఫ్లైట్ లో తమ్ముడు వచ్చేడు అమ్మని చూడ్డానికి. వాడు అమ్మకి చంటివాడు." అమ్మా, నేను, నీ చంటాణ్ణి. నీ పక్కనే

ఉన్నానమ్మా. నీ మనవడి పెళ్ళి గ్రాండ్ గా అయింది." అమ్మ చెవిలో చెప్పేడు. అమ్మ సంతానం అంతా అక్కడున్నారు. ఆవిడలో ఎటువంటి చైతన్యమూ కనిపించలేదు. నోట్లొంచి చొంగ కారుతూనే ఉన్నది. అవయవాలలో ఎటువంటి కదలికా లేదు.

" అమ్మా. ఎవరికోసం ఇంకా ఎదురు చూస్తున్నావు. వెళ్ళిపోమ్మా. ఇది నీకు నరకం. వెళ్ళిపో తల్లీ." ఆవిడ చెవిలో మెల్లిగా బతిమాలుతున్నట్టుగా చేప్పేను. అందరూ విన్నారు. వాళ్ళ మనసుల్లో కూడా అల్లాగే ఉన్నా, బయటకి చెప్పలేక పోతున్నారు.

"పెద్దావిడ. పోతే మహరాజయిపోయింది" అంటారందరూ. ఆసంగతి అందరికీ తెలుసు. ఎవరి మనసుల్లో విచారం లేదు. తమ్ముడి కొడుకు పెళ్ళి గురించి మాట్లాడు కుంటూ కూర్చున్నాం ఆ రాత్రి. దుర్గ కార్యక్రమాలలో ఏమీ మార్పు లేదు. వస్తుంది. అమ్మని క్లీన్ చేస్తుంది. బట్టలు సరి చేస్తుంది. దువ్విన జుత్తునే మళ్ళీ దువ్వి నీట్ గా చేస్తుంది. వీభూది పెడుతుంది. జావో, అంబలో తాగించడానికి ప్రయత్నిస్తుంది.

ఏవో కబుర్లు చెపుతుంది అమ్మకి. తనకి ఎటువంటి నిర్బంధం లేదు ఆ ఇంట్లో. అమ్మ తన "సబరమ్మ". తనకి నచ్చినట్టు తను చూసుకుంటుంది. మేము ఏమనుకుంటామేమో అన్న బెంగ, సంకోచం ఆమెలో అస్సలు లేదు. మా అందరికీ కూడా ఏవో తిను బండారాలు పట్టుకొస్తూఉంటుంది.

మర్నాడు శుక్రవారం. అవి దసరా సెలవలు. ఉదయం తొమ్మిది గంటలకు దుర్గ ప్రయాణం. తన అక్కలని అందరినీ కలవడానికి ఎప్పట్నించో ప్రయాణం కట్టింది. ఇంకా తెల్లవారలేదు. మసక నిద్రలో ఉన్నాను. "ఈరోజు అమ్మ పోతోంది. లే.." అని ఎవరో చెప్పినట్టనిపించింది. లేచి గడియారం వైపు చూసా. నాలుగున్నర అయింది. రాత్రి లేటు గా పడుక్కునారేమో, అందరూ, గాడ నిద్రలో ఉన్నారు. నాలో ఏదో అలజడి. అమ్మ వెళ్ళిపోతోంది. తట్టుకో లేక, అమెరికాలో మా ఆయనకి కి ఫోన్ చేసా. ఆయన నాకు ధైర్యం చెప్పేరు. లేచి, అమ్మని పట్టుకుని కూర్చున్నా. ఆవిడ ఊపిరి భారంగా ఉంది. ఏదో యాతనలో ఉన్నట్టుగా కనిపించింది. ఇంక భరిచలేకపోయా. గడియారం ఆరు కొట్టగానే, అన్నయ్య ని లేపి అమ్మ పోతోందని చెప్పా.

"నువ్వు అంటావు గాని, గత రెండు వారాలుగా ఇలాగే అవుతోంది. మరేం లేదు. అమ్మకి ప్రాణోపాయం ఉందని అనుకోను" నా మాట తేలిగ్గా కొట్టిపడేసి, పాలు తీసుకు రావడానికి వెళ్ళేడు అన్నయ్య.

నాకు మట్టుకు అది ఆఖరి రోజు అని తెలిసిపోయింది. వదిన ఒత్తిడి మీద స్నానం చేసి అమ్మ దగ్గర కూర్చున్నా. అక్కని, తమ్ముణ్ణి అందరినీ పిలిచి అమ్మ దగ్గరే ఉండమని చెప్పా. వాళ్ళందరూ నావైపు వెర్రిదానిలా చూసేరు.

" మీరు కాస్త టిఫిన్ తినండి. మేమతా ఇక్కడ ఉంటాం." వదిన నన్ను బలవంతం చేసి పంపించింది. నేను టిఫిన్ తింటూ ఉండగా, దుర్గ వచ్చింది. బయట తన సూట్ కేస్ పెట్టింది. అమ్మని చూసి, తను వూరికెడుతున్నానని, ఇంకొక మూడు రోజుల్లో తిరిగి వచ్చి అమ్మని చూసుకుంటానని నాకు చెప్పడానికి వచ్చింది. అందరూ అమ్మ చుట్టూ మూగి ఉన్నారు. అమ్మకి ఏదో అవు తోందని గ్రహించింది. వెంటనే అమ్మ తలని తన ఒళ్ళో పెట్టుకుని, వీబూది పెట్టింది.

సడన్ గా " అక్కా ఇలా రండి" బిగ్గరగా పిలచింది. వదిన కూడా గట్టిగా అరిచింది నన్ను రమ్మని. అందరూ నన్ను హడవిడిగా అమ్మ దగ్గరకి పిలుస్తున్నారు. ఒక్క ఊపులో అమ్మ దగ్గరికి చేరా.

అమ్మ తల దుర్గ ఒళ్ళో; పక్కన నేను. చుట్టూ అమ్మ పిల్లలందరూ. అమ్మ ఒక్క సారి కళ్ళు విప్పి చూసింది. నేనిక ఉంటానమ్మా అని చెప్పినట్టనిపించింది. అంతే. తను వచ్చిన దారిని వెళ్ళిపోయింది. అందరూ భోరుమని ఏడ్చారు. ఒక్క సారి అమ్మ నుదుటిని ముద్దుపెట్టుకుని, కాళ్ళకు దండం పెట్టి, తన కంట తడి ఎవ్వరికీ కనపడకుండా, బయటకి పరిగెట్టింది దుర్గ. . అమ్మ మృత దేహన్ని వదిలి, అందరూ ఎవరి హడావిడిలో వాళ్లు ఉన్నారు. ఫోన్లో అందరికీ వార్తని అందిస్తున్నారు. అన్నయ్య పలుకుబడి, సామర్థ్యం; నిమిషాల్లో అంత్యక్రియలకి

కావలసినవన్నీ అమర్చేడు. ప్రేత సంస్కారానికి వచ్చిన బ్రాహ్మణుడు అమ్మ సంతానం నలుగురినీ అమ్మ చుట్టూ ప్రదక్షిణ చేసి, ఆమె ఆత్మ ఇంకా దగ్గరే ఉంది కాబట్టి, ఆమె కి నమస్కరించి ఆమె ఆశీస్సులు తీసుకోమన్నారు. తన ప్రాయాణం మానుకుని, దూరంగా కన్నీళ్ళు ఆపుకుంటూ తతంగం అంతా చూస్తోంది దుర్గ. మేం నలుగురు అమ్మ పాదాల దగ్గర చేరాం. నేను దుర్గ వైపు చూసి సైగ చేసాను, నా దగ్గరకు రమ్మని.

"పంతులు గారూ, దుర్గ అమ్మగారి మానస పుత్రిక. ఆవిడ దగ్గర లేకపోతే అమ్మ ఆత్మ శాంతించదు." అంటూ, దుర్గని కూడా వచ్చి మాతో పాటూ ప్రదక్షిణలు చేయమన్నాడు" అన్నయ్య.

దుర్గ వచ్చి నా వెనకాల నిలబడి ప్రదక్షిణాలు చేసింది. వచ్చిన మా చుట్టాలు, స్నేహితులు చూసి, ఎవరా ఈవిడ అనుకున్నారు. అంత్యక్రియలయి పోయిన తరువాత, శాస్త్రులు గారు చెప్పిన రోజు తిరిగి అమెరికా బయలుదేరా. మా అందరికీ అమ్మ ఈ నరకం వదిలించుకొని వెళ్ళిపోయిందని ఒక తృప్తి. కాని, దుర్గకి ఒంటరి తనం. అమ్మ సాంగత్యంలో ఆమెలో ఎంత గొప్ప పరిణాం వచ్చిందో మా అందరికీ తెలుసు. అమ్మ లేక పోతే, ఆమె ఎలా ఉంటుందో అన్నఆలోచన తో, దుర్గతో అన్నా.

"దుర్గా, అమ్మ లేరు. మీ ఆయన ఆఫీసుకి వెళ్లిపోతారు. మీరు ఒంటరి వారయిపోతారెమో? ".

“చూడక్కా, సబరమ్మ నాకు నేర్పించిన మొట్ట మొదటి పాటం ఏమిటో తెలుసా? "జాతస్యహి ధ్రువో మృత్యుహు, ధ్రువం జన్మ మృతస్యచతస్మాత్ అపరిహారే, నత్వం సోచితు మర్హసి

అంటే, పుట్టిన ప్రతివాడికి, మరణం తప్పదు. మరణించినవాడికి పునర్జన్మ తప్పదు. కనుక తప్పనిసరి యైన ఈవిషయములందు నీవు సోచింపతగదు. చూడక్కా, నా సబరమ్మ ఎప్పుడూ ఇక్కడే ఉంటుంది. మొన్నటి దాకా నాతో పాటూ, ఇంకో స్నేహితురాలు ఇక్కడికి వచ్చి అమ్మ దగ్గర నాలాగే సాస్త్రాలు నేర్చుకుంది.

తనూ, నేను, ఇక్కడే, సబరమ్మ సీటు దగ్గరే కూర్చుని, భగవద్గీత అవీ, చదువుదాం అని నిశ్చయించుకున్నాం. ఇంకా, నా స్కూల్ పిల్లలు, వాళ్ళ పాటలు, ఆటలు అవన్నీ ఉంటయి కదా. నేను బాగానే ఉంటాను అక్కా. మీ అరోగ్యం జాగ్రత్త.”

దుర్గకి ఆధ్యాత్మిక మార్గం చూపించిన అమ్మకి, అంత మనోధైర్యం, క్రమశిక్షణ, ఆత్మ నిబ్బరం ఇచ్చిన ఆ పరమాత్మకి, మనస్సులోనే దండం పెట్టా. అమ్మని ఆధ్యాత్మికంగా ఎన్నో మెట్లు ఎక్కించి, ఆ పరమాత్మ దృష్టిలో అందరూ ఒక్కటే. ఏమీ భేదం లేదు అన్న స్థితికి రప్పించిన మహానుభావురాలు దుర్గమ్మ .

ప్రపంచంలో అటువంటి వారు ( Unsung heroes) ఎంత మంది మనకి కనపడుతారు? ఏడాది ఇట్టే గడచిపోయింది. అమ్మ సంవత్సరికాలకి వైజగ్ వెళ్ళా. అందరం కలిసేం. అన్నయ్య, వదిన అమ్మకి నచ్చేటట్టుగా అన్నీ నడిపించేరు. దుర్గమ్మ లో ఏమీ మార్పు లేదు. ఆ చిరునవ్వు, ఆ గంభీరం, అందరినీ మంచిమార్గంలో పెట్టాలనే తపన.. అలాగే ఉన్నాయి.

భోజనాలవగానే, వచ్చిన వారందరికీ చిన్న "భగవద్గీత" పుస్తకం అమ్మ గుర్తుగా ఉంచుకోమని ఇచ్చింది. " ఇది ప్రత్యేకం గా ప్రింట్ చేయించేనక్కా. జాగ్రత్తగా చూడండి. పదాలు ఎక్కడెక్కడ విడగొట్టాలో చక్కగా చెప్పేరు. మీరు చదవండి". అమ్మ మీద ఎంత గౌరం, ప్రేమా!

ఆ మర్నాడు శనివారం. దుర్గ మౌనంగా ఉండండం చూసి వాళ్ళాయనని అడిగా. " మామ్మగారు మౌనం పట్టే వారుగా. ఆవిడ దగ్గర నేర్చుకుంది".

అమ్మ పిల్లలు గాని, తోబుట్టువులు గాని, శిష్యులు, స్నేహితురాళ్ళు..ఎవ్వరూ, మౌనం పాటించలేదు.. మరి దుర్గకి ఎలా అబ్బింది?'

ఆక్షణంలో అనిపించింది. ఋణానుబంధం. కాని ఎవరికి ఎవరు ఋణం? అమ్మకి దుర్గ ఋణమా? లేదా, దుర్గకి అమ్మ ఋణమా?

# నిజాలెవరికి కావాలి!

రాధిక మంగిపూడి
సింగపూర్

## శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 24 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో 'నా మొట్టమొదటి కథ' విభాగం విజేత

**చాలా సంవత్సరాల** తర్వాత రైలు ఎక్కాడు రవి. అంతా కొంచెం వింతగా ఉంది. ఎవరిగోల వారిది. ఇదివరకుమల్లే కొత్త పరిచయాలు, కలిసి కబుర్లు చెప్పుకుంటూ చక్కిలాలు, పులిహోరలు, పంచుకోవడాలు ఏమీ లేవు. ఎవరికి వారు చేతిలో ఒక ఫోను పట్టుకుని ఏదో నొక్కుకుంటున్నారు. కర్ణుడి కుండలాల్లా వాటితోనే పుట్టినట్లు చెవిలో వేలాడే తోకలొకటి! అవే.. ఇయర్‌ఫోన్లు.

రవికి ప్రయాణం చప్పగా ఉంది. ఏమీ తోచడంలేదు. ఏదో స్టేషన్ లో రైలు ఆగింది. ఒక ప్రయాణికుడు హడావుడిగా ఎక్కి, కూర్చోడానికి జాగా వెతుక్కుంటూ వస్తున్నాడు. ఇంతలో రవి ఎదురుగా కూర్చున్న వ్యక్తి, తలెత్తి చూసి తటాలున లేచి, "ఒరేయ్ శేఖరం" అంటూ చేతులు బారెడు చాచాడు. ఆ వచ్చినతను కూడా, "ఒరేయ్ చంద్రం" అంటూ చేతులు మూరెడు చాపాడు. ఇద్దరూ కావలించుకోవాలనుకున్నారు. కాని వారి పొట్టలు సహకరించకపోవడంతో ఆ ప్రయత్నం విరమించుకుని, రవి ఎదురుసీట్లో చతికిలబడ్డారు. "అదిరిందయ్యా చంద్రం" అనుకున్నాడు రవి. వారి పలకరింపులు, ప్రశ్నోత్తరాల పరంపర కాసేపు సాగింది. రవికి కాలక్షేపం దొరికింది. చూపు కిటికీ వైపు, చెవి వారి సంభాషణవైపుకు పడేశాడు.

"కాలేజీరోజుల్లో కథలూ, వ్యాసాలూ రాసేవాడివిగా! ఇంకా రాస్తున్నావా" అడిగాడు చంద్రం. "ఓ.. రాస్తున్నా అప్పుడప్పుడు. కానీ కాలం బట్టి మన ట్రెండు మారిపోయిందిలే. నాకు చాలా కలం పేర్లు కూడా ఉన్నాయి తెలుసా?" అన్నాడు శేఖరం గొప్పగా.

"చాలా కలం పేర్లు ఉండడం ఏమిటిరా? ఉంటే ఒకటుండాలి కానీ!" అనుమానం వ్యక్తం చేసాడు చంద్రం. అంతే! ఎప్పుడు అడుగుతాడా అని ఎదురు చూస్తున్నట్లు వెంటనే పాఠం అందుకున్నాడు శేఖరం.

"ఈమధ్య పుస్తకాలలో కథలూ, కమామీసులూ ఎవరూ చదవట్లేదురా. కాలం తీరు మారింది. కనుక కలం తీరు కూడా మారింది. వాట్సాపులు, ఫేస్బుక్కులలో పది పదిహేను పంక్తులలో రాస్తేనే అందరూ చదువుతారు. అంతకన్నా పెద్దది రాస్తే, చదవడానికి ఎవరికీ ఓపికలు లేవు సుమీ! మనమేం రాసిపడేసినా పర్లేదు. ఉదయం వాట్సాపులో తోసేస్తే, సాయంత్రానికి మనకే తిరిగి వస్తుంది. నా

ఊహాశక్తికొద్దీ రోజుకో పేరుతో ఏదో ఒకటి రాసి సోషల్ మీడియాలో తోసేస్తూ ఉంటాను. ఫేస్బుక్కులో అయితే, నాకు 5000 స్నేహితులు, 3000 ఫాలోవర్స్ కూడా ఉన్నారు" అన్నాడు భుజాలెగరేసుకుంటూ.

రవికి శేఖరం మాటలు చాలా తమాషాగా అనిపించి, రెట్టింపు ఆసక్తితో వినసాగాడు. "అదేమిట్రా? ఇంతకూ ఏమేం రాసావేంటీ? అసలు ఈ బుద్ధి నీకెట్లా పుట్టింది?" అనుమానంగా అడిగాడు చంద్రం.

"అబ్బే, అసలిదంతా ఎక్కడ మొదలైందంటే, ఆ మధ్య ఒక పెద్దాయన ఫేస్బుక్కులో ఒక వ్యాసం రాశాడు. చార్మినార్ శిఖరంపై 'జహంగీర్' అనే పేరుతో ఒక వజ్రం తాపడం చేయించి ఉండేదని, అది యుద్ధంలో శ్రీ కృష్ణ దేవరాయలు వశమయిందని, తర్వాత బ్రిటిష్ వారు దానిని పట్టుకు పోయారని రాశాడు. దీనికి 2000 లైకులు 600 షేర్లు వచ్చాయి".

శేఖరం మాటలకు అడ్డుపడుతూ, "అదేమిట్రా చార్మినార్ కట్టినపుడు కృష్ణ దేవరాయలు ఎక్కడున్నాడూ? " అన్నాడు చంద్రం. "హహహ! అదే కదా విచిత్రం. అవన్నీ వెతికి చూడడానికి అంత తీరిక ఎవడికుంది? నీ కొచ్చిన అనుమానం నాకూ వచ్చింది. కానీ అందరితో పాటు నేనూ, నాకెందుకులే అని ఊరుకున్నా. మర్నాడు ఉదయం పక్కవీధిలో ఉన్న పాతకాలం పార్కు పక్కనుండి వస్తుంటే, నాకూ ఒక ఐడియా వచ్చింది. ఆ పార్కులో ఓ మూలన ఉన్న విరిగిపోయిన బెంచీ ఒకదానికి ఫోటో తీసి, ఫేస్బుక్కులో పెట్టి, 'సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య పోరాట సమయంలో మన ఊరు వచ్చినప్పుడు నిరాహార దీక్ష చేపట్టిన స్థలం ఇదే!' అని రాసాను. ఇంకచూసుకో, నాసామిరంగా.!. ఎవరికీ తెలియని విషయం చెప్పారంటూ ఒకరు, విలువైన సమాచారం వెలికి తీసారని ఇంకొకరు, అంత గొప్ప ప్రదేశం మన ఊరిలో ఉందా అంటూ మరొకరు.. లైకులు కామెంట్స్ కుంభవృష్టి కురిసిందనుకో!" అంటూ మహదానందంగా చెప్పాడు శేఖరం.

తెల్లమొహం వేసిన చంద్రం, "అదేమిట్రా ఏడ్చినట్లుంది. ఏం రాస్తే అది నమ్మేస్తారా! నిజానిజాలు ఎవరూ ఆరా తీయరా!" అడిగాడు ఆత్రంగా.

దానికి శేఖరం ఒక వేదాంతపు నవ్వు నవ్వి, "నీ పిచ్చి గానీ నిజాలెవడికి కావాలి! అందరికీ మజాలు మాత్రమే కావాలి. ఎంటర్టైన్మెంట్ ఈజ్ ఎవ్రీథింగ్ యు నో!" అంటూ ఒక్క ముక్కలో తేల్చి చెప్పేసాడు కలికాల గీతాసారం. ఇది విన్న రవికి నోట మాట రాలేదు. తన ఆలోచనలు మెలికలు పడి మలుపులు తిరుగుతున్నాయి. అంతటితో ఆగకుండా శేఖరం, "ఎక్కడో కంబోడియాలో ఏదో గుడి ఫోటో పెట్టి , ఎవరో మన కోణార్కు గుడి అని, సూర్యకిరణాలు దూరాయని రాస్తే నమ్మేస్తారు జనాలు. నాలుగు రోజులకోసారి 'డాటర్సు వీక్' అంటూ ఒకే మెసేజ్ తిరుగుతుంటే, అడిగే నాథుడు లేడు. ప్రతి నెలా 'ఈ నెలలో ఫలానా వారం అయిదుసార్లు వచ్చింది. కనుక ఈ నెల అదృష్టం వరిస్తుంది' అని రాస్తే ఒక్కడికీ అనుమానం రాలేదు. ఇంక సాయిబాబాదో వినాయకుడితో ఫోటో పెట్టి 20 మందికి పంపండి అని రాసి వదిలేస్తే, పంపినవాడికే తిరిగి ఇరవసార్లు వస్తుంది. ఏం? ఇందరు చేయగా లేనిది నేను చేస్తే తప్పేంటి? జనాలకి ఈ మాత్రం కాలక్షేపం లేకపోతే , ఇక మడిషికీ గొడ్డుకీ తేడా ఏటుంటాదీ" అంటూ సునకానందం వ్యక్తం చేస్తూ లా పాయింట్లు పీకాడు.

నోరెళ్ళబెట్టేసిన చంద్రానికి ఈసారి తేరుకోవడానికి రెండు నిమిషాలు పట్టింది. "సరే మిగతావారి మాట అటుంచి ఇంతకు ఇలా రాయడం వల్ల నీకొచ్చే లాభం ఏముంది?" అని ప్రశ్నించాడు చంద్రం కాస్త సర్దుకుని.

"భలేవాడివే. మన పరపతి ఎంత పెరిగిందో తెలుసా... పైగా వేరే లాభాలు కూడా ఉన్నాయి. ఆ మధ్య ఏదో కలుపు మొక్కలు మా పెరడంతా పాకేశాయి. ఆదివారం నాడు కూడా హాయిగా పడుకోడానికి లేకుండా, మా ఆవిడ నన్ను ఆ మొక్కలన్నీ పీకమంది. నాకు ఎక్కడో కాలి, ఆ మొక్కకి ఒక ఫోటో తీసి అది 'కకాపికా డిస్కోతుస్" అనే ఔషధజాతి మొక్క అనీ, దాన్ని రుబ్బి తలకు రాస్తే చుండ్రు క్షణంలో

పోతుందనీ వ్రాసి వాట్సాపులో తోసేసా. ఇంకేముంది! సాయంత్రానికల్లా వేళ్ళతో సహా మా పెరట్లో కలుపుమొక్కలన్నీ మాయం!” అంటూ వికటాట్టహాసము చేసాడు శేఖరం.

రవికి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. ఎందుకంటే పోయిన నెల, తను కూడా ఆ మొక్క ఫోటో ఎక్కడో చూసి దానికోసం వెతికిన విషయం గుర్తొచ్చింది!

ఏమనుకున్నాడో కానీ చంద్రం మాత్రం స్నేహితుడి ప్రతిభకు సంబరపడిపోయి, “ఏమైనా నువ్వు అసాధ్యుడివిరా! ఇలాంటి తెలివి అందరికీ సాధ్యం కాదు. ఆ మాటకొస్తే నీకు వాట్సాపువాళ్ళు సన్మానం చేసి పారితోషికం ఇవ్వాలి ” అంటూ నవ్వేవాడు.

చంద్రం మాటలకు ఇంకా ఎక్కడ లేని ఉత్సాహం తన్నుకువచ్చేసి మళ్ళీ అందుకున్నాడు శేఖరం తన ఘనకార్యాల పరంపర వర్ణన. “ఇంకోసారి ఏమైందంటే ‘ఉల్లి చిట్కాలు” అనే శీర్షికతో రోజుకో చిట్కా వాట్సాపులో వదుల్తూ వచ్చాను. ఒకరోజు నాకు బాగా జలుబు చేసి విక్స్ తెమ్మన్నాను మా ఆవిడను. తను ఒకగిన్నెలో ఉల్లిపాయ రసం పట్టుకుని వచ్చింది. అదెందుకంటే, వాట్సాపులో చదివాను ముక్కులో కొంచెం ఉల్లి రసం వేస్తే జలుబు వెంటనే పోతుందంటూ, నా ముక్కు పట్టుకోబోయింది. నా చిట్కా నాకే రివర్స్ అవ్వడంతో వీధిలోకి పరుగు తీసాను” అంటూ బిగ్గరగా నవ్వాడు.

చంద్రం ఈసారి పొట్ట పట్టుకుని మరీ నవ్వుతూ, “నీకు బాగా అయ్యింది. అయినా అదెలా నమ్మేసిందిరా మీ ఆవిడ? ” అన్నాడు.

ఇంతలో రవి దిగాల్సిన స్టేషన్ రావడంతో తను సంచీ తీసుకుని రైలు దిగబోతుంటే శేఖరం చెప్పిన జవాబు రవి చెవిన పడింది. “మరేమనుకున్నావ్. చిట్కాల చివర, “డా. విజ్ఞాన్, యమ్ బి బి యస్, యమ్ డి, జర్మనీ” అని ఒక కలం పేరు తగిలించేశానుగా! ”

స్నేహితులు ఇద్దరూ రైలు దద్దరిల్లేలా నవ్వుతున్నారు. చంద్ర శేఖరులిద్దరి సంభాషణకి రవి బుర్ర గిర్రున తిరిగింది. గడ్డి–కొడవలి సామెత గుర్తొచ్చింది. ఒకడికి ‘పరమ బలిచక్ర’ ఒకరికి ‘వీరభోగ వాట్సాప్ రాయ’ బిరుదులు ఇచ్చెయ్యచ్చు అనుకున్నాడు.

“అవును నిజాలెవడికి కావాలి ఈ రోజుల్లో. మాటకి విలువ లేదు. వాళ్లననుకుని ఏంలాభం. మనమే జాగ్రత్తగా ఉండాలి“ అనుకుంటూ కథ చదివి నీతివాక్యం నెమరేసుకుంటున్న బడిపిల్లాడిలా రవి ముందుకు నడిచాడు. ‘నాకు ఇవన్నీ మామూలే’ అన్నట్లు రైలు ఒక కూత పెట్టి తన పట్టాలమీద ముక్కుసూటిగా సాగిపోయింది.

# ఆత్మారామం

రాధిక నోరి

టల్లాసీ, ఫ్లోరిడా

శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన

## 24వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
## ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

**"జానీ, జానీ"** అంటూ గట్టిగా పిలిచాడు ఇంట్లోకి అడుగు పెడుతూనే రామం.

"ఏదన్నా తప్పు చేసినప్పుడు జానకిని ఇలాగే పిలుస్తావులే" అనుకున్నాడు అక్కడే వున్న ఆత్మ తనలో తను.

వంటింట్లో పనిలో వున్న జానకి తడి చేతులు తుడుచుకుని బయటకు వచ్చే లోపే రామం గబగబా లోపలికి వచ్చాడు. ఒక పాకెట్ ని జానకికి అందిస్తూ, "నీకొక సర్ ప్రైజ్. ఏమిటో ఇది విప్పి చూడు" అన్నాడు ఆమెను ఊరిస్తూ.

జానకి పాకెట్ విప్పి చూసింది. నోట్ల కట్టలు చాలా వున్నాయి దాంట్లో. "ఇదేమిటండి? ఇంత డబ్బు తెచ్చారేమిటి?" అంటూ ఆశ్చర్యంగా ఇంకా ఏదో అడిగేలోపు "ఆఫీసులో ఎప్పడి నుండో ఇవ్వాల్సిన బోనస్ ఇన్నాళ్ళకి ఇవాళ హఠాత్తుగా ఇచ్చేసారు" అన్నాడు రామం గబగబా.

"నీ మొహం. పేకాటలో మోసం చేసి గెల్చిన డబ్బుని బోనస్ అని నోటికొచ్చినట్లు అబద్ధాలు చెప్తున్నావు. జాగ్రత్త. నిజం నిలకడ మీద తెలిస్తే చిక్కుల్లో పడేది నువ్వే" మెల్లిగా హెచ్చరించాడు అక్కడే వున్న ఆత్మ చాటుగా, పక్కనే వున్న జానకికి వినిపించకుండా.

"ఎంతో లెక్కపెట్టలేదు కానీ చాలా ఉన్నట్లుంది. అయినా ఇలా బోనస్ ఇస్తున్నారని ఎప్పుడూ చెప్పలేదేమిటండి?" ఇంకా ఆశ్చర్యంగానే అడిగింది జానకి రామంని.

"నిజంగా ఇస్తేగా చెప్పటానికి? వెధవ అబద్ధాలూ, వీడూనూ" ఆత్మ విసుక్కున్నాడు మనసులో.

రామం జానకి మాటలు వినిపించుకోనట్లు అక్కడ నుండి బట్టలు మార్చుకోవటానికి లోపలికి వెళ్ళిపోయాడు. అతను తిరిగి వచ్చేసరికి జానకి డిన్నరు అంతా రెడీగా టేబిల్ మీద సద్ది వుంచింది. భోజనం చూసేసరికి ఆకలి గుర్తొచ్చింది రామంకి. గబగబా తినటం మొదలెట్టాడు.

"ఈ గుత్తి వంకాయ కూర చాలా బాగా కుదిరింది కదూ!" కూర మళ్లీ కలుపుకుంటూ అన్నాడు రామం.

"ఒరేయ్! బకాసురుడా! కాస్త ఆగు. బాగుందని అలా మరీ ఎక్కువగా తినకు. ఒక్కసారి ఆ పొట్టను చూసుకో" పక్క నుండి ఆత్మ మెల్లిగా ఘోష పెట్టాడు. ఇంతలో జానకి పెరుగు కోసం వంటింట్లోకి వెళ్ళింది.

"కాస్త నన్ను మనశ్శాంతిగా తిండన్నా తిననిస్తావా?" రామం ఆత్మని ఒక్క కసురు కసిరాడు.

భోజనం ముగిసాక భుక్తాయాసంతో రామంకి కళ్ళు మూతలు పడటం మొదలైంది. అతి కష్టం మీద కాస్సేపు న్యూస్ పేపర్ పట్టుకుని ఇంక ఆ తర్వాత పక్క ఎక్కేసాడు. మర్నాడు ఆదివారం కాబట్టి తీరికగా, ఆలస్యంగా లేచాడు. బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే ఆత్మ మళ్లీ గోల పెట్టాడు. "ఒరేయ్! తిండిపోతు వెధవా, ఇంక ఆపు. అసలు చాలు అన్న మాట నీకు తెలీదా? ఇంక ఇంతటితో చాలించి జిమ్‌కి బయలుదేరు. వ్యాయామం చేయటానికి వీక్ డేస్ ఎటూ వంకలు చెప్తావు. కనీసం వీకెండ్ అన్నా బద్ధకం వదిలించుకుని కాస్త ఎక్సర్ సైజ్ చేయి. జిమ్‌కి డబ్బు కట్టి కూడా వెళ్ళకపోవటానికి నీకేం మాయరోగం?" అంటూ గొంతు పెద్దది చేసి మందలించాడు.

రామంకి కోపం ముంచుకొచ్చింది. "పొద్దున్నే మొదలైందా నీ గోల? అసలింత పొద్దున్నే నాతోపాటు నువ్వు కూడా లేవాలా? ఇంకాస్తసేపు ఎక్కువ నిద్ర పోతే నీ సొమ్మేం పోయింది? పోనీ లేస్తే లేచావు, నీ పనేదో నువ్వు చూసుకోకుండా అస్తమానూ నా వెనకెందుకు పడతావు? నేను ఎక్సర్ సైజ్ చేయకుండా పొట్ట పెంచితే నీకేం నష్టం? నువ్వు ఆరోగ్యంగానే వున్నావు కదా! నా గురించి అతిగా పట్టించుకోవటం కట్టిపెట్టు" పళ్ళు కొరుకుతూ గట్టిగా కసిరాడు ఆత్మని రామం. "నువ్వు నేను అన్న తేడా ఏముంది? నీకు ఏదైనా జరిగితే ఆ బాధ నాకే కదా!" అనుకున్నాడు ఆత్మ. అయినా కాస్సేపు మౌనం వహించాడు.

"అసలు నిన్ను నా దగ్గర ఇంతసేపు ఇలా మాట్లాడనీయటం నాదే తప్పు. నాకు బుద్ధి తెలిసినప్పటినుండీ నిన్ను నా దగ్గరే వుండనిచ్చాను. నా దగ్గర స్నేహితుడి లాగా చూసాను. అసలు నీకు, నాకు తేడానే లేదనుకున్నాను. కాని అస్తమానూ నువ్వు నన్ను ఏదో రకంగా విమర్శిస్తూనే వున్నావు. ఇలా అయితే నువ్వు నా దగ్గర వుండక్కరలేదు. నా దగ్గర నుండి వెళ్ళిపో. అసలు నాలో అన్నీ తప్పులే తప్ప ఎప్పుడూ మంచే నీకు కనిపించదా?" పూర్కోలేక మళ్ళీ రామమే అన్నాడు కోపం, బాధ కలగలిపిన గొంతుతో.

"అలా ఎందుకు అనుకుంటున్నావు? మొన్న బస్సులో నీ సీటు ఒక ముసలావిడకి ఇచ్చి నువ్వు నిలబడి ప్రయాణం చేసినపుడు నిన్ను మెచ్చుకున్నాను కదా!" అన్నాడు ఆత్మ అనునయంగా.

"అఘోరించావు. అది ఎప్పుడో, ఏమో! నీ పొగడ్తల కంటే నీ తిట్లే ఎక్కువగా గుర్తు వున్నాయి నాకు. అసలు నాకు బుద్ధి తెలిసినప్పటి నుండి నీ తీరు ఇలాగే వుంది. చిన్నప్పుడు ఐదో క్లాసులో నా వెనక బెంచి అమ్మాయి నత్తితో తమాషాగా మాట్లాడుతోందని అన్నానని ఆ అమ్మాయి ముందే నన్ను చివాట్లు వేసావు. ఏదో, చిన్నతనం, తెలిసీ తెలియని అజ్ఞానం అని వదిలావా నన్ను? సరే, ఇంక కాలేజ్ లో ఏ అమ్మాయినన్నా, ఏ ఆడ లెక్చరరు నన్నా ఏడిపిస్తూ పొరపాటున ఏదన్నా అంటే చాలు, కుర్రతనం అని, ఏదో పోనిలే అని నన్నేమన్నా వదిలేవాడివా? చెడామడా నా మీద తిట్ల వర్షాన్ని కురిపించేవాడివి. సరే, పరీక్షలలో ఎప్పుడన్నా కాపీ చేస్తోంటే ఇంక చెప్పనే అక్కరలేదు. ఆ టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్ల కంటే ఎక్కువగా నామీద ఇన్విజిలేషన్స్ నువ్వు చేసేవాడివి. కాలేజ్ క్లాసులు ఎగ్గొట్టి సినిమాలకి వెళ్తే ఇంక పక్క నుంచి నీ నస భరించశక్యంగా వుండేది కాదు. అసలివన్నీ చేయని కాలేజ్ లైఫ్ లో ఇంక పస ఏముంటుంది? అబ్బ, అప్పటి నుండి నిన్నెలా భరిస్తున్నానో ఆలోచిస్తే నాకే ఆశ్చర్యంగా వుంది. నాకు ఇంత సహనం ఎలా వచ్చిందా అనుకుంటున్నాను. అనుక్షణం నన్ను వెంటాడుతూ నన్ను సతాయిస్తావు. నన్ను వదిలి పొమ్మంటే పోవు. అసలు నిన్ను ఒక స్నేహితుడిలాగా చూడటం నాదే తప్పు. నువ్వు మిత్రుడివి కాదు, ఒక శత్రువువి, నా బద్ధ శత్రువువి" కక్షగా అన్నాడు రామం.

"జబ్బు చేసిన రోగికి చేదు మందు ఎలా నచ్చుతుందిలే" అన్నాడు ఆత్మ తను చేస్తున్న దాంట్లో తప్పేమీ లేదన్నట్లు, ధైర్యంగా.

"ఏమండీ, ఎంత పిలిచినా పలకరేమిటండి? ఏం చేస్తున్నారు ఆ గదిలో ఇందాకట్నుంచి? ఒక్కసారి ఇలా రండి" జానకి పిలిచింది.

ఆత్మతో ఘర్షణ పడుతున్న రామం బయటికి వచ్చాడు.

"కాస్త సాయం చేయండి. ఈ మంచం ఆ రూములోకి మార్చాలి" అంది జానకి.

"ఇప్పుడు ఎందుకు ఈ మార్పులన్నీ?" అన్నాడు మంచాన్ని ఒక వైపు పట్టుకుంటూ రామం.

ఆత్మ మౌనంగా అంతా గమనిస్తున్నాడు.

"ఎందుకేమిటండి? మా నాన్న రేపేగా వస్తారు? ఈ మంచం అయితే విశాలంగా ఆయనకు బాగుంటుంది" అంది జానకి మంచాన్ని ఇంకో వైపు పట్టుకుంటూ. అప్పుడు గుర్తొచ్చింది రామం కి మామగారు వాళ్ళింటికి వచ్చేది ఆ మర్నాడే అని. అత్తగారు పోయిన తర్వాత మామగారు బావమరిది ఇంట్లో, తమింట్లో అటు ఇటు వస్తు పోతూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

"మొన్ననేగా తమింటి నుండి బావమరిది ఇంటికి వెళ్ళారు? అప్పుడే మళ్ళీ వచ్చేస్తున్నారా ఇక్కడికి?" అనుకున్నాడు మనసులో విసుగ్గా.

"ఒరేయ్ ఛండాలుడా! నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెలిదనుకోకు. రెండు వారాల క్రితం వరకు జానకి ఎంత బాగా మీ అమ్మనాన్నలకు సేవ చేసిందో, ఎంత మర్యాదగా మీ అన్న గారింటికి పంపించిందో మర్చిపోయావా? మీ అమ్మానాన్నలకి తను అంత గౌరవ మర్యాదలు ఇస్తుంటే వాళ్ళ నాన్నకి నువ్విచ్చే గౌరవం ఇదా? సిగ్గు పడాలి ఇలాంటి తేడాలు చూపిస్తున్నందుకు. మామగారి బాధ్యత ఆమాత్రం కూడా వహించలేవా? ఈపాటికే నీ బంగారం అంతా కరిగిపోతుందా?" అసహ్యించుకుంటూ అన్నాడు ఆత్మ రామం ని కసురుకుంటూ.

"బాబూ! నీకు దణ్ణం పెడతాను. మనసులోని మాటలు ఇంకా పెదవుల మీదకి రాకముందే వూహించగల నీ దివ్యశక్తికి నా జోహార్లు. తప్పయిపోయింది కానీ ఇంక నీ తిట్ల పుస్తకం ఇప్పుడు విప్పకు. ఇంతటితో నన్ను వదిలేయి" చేతులు జోడిస్తూ అన్నాడు రామం. "నా ఖర్మ. నిన్ను ఎలా వదిలించుకోవాలో తెలియటంలేదు. ఎంత స్నేహితుడు అయితే మాత్రం మరీ ఇంత చనువా?" విసుగ్గా మనసులో అనుకున్నాడు రామం. ఇంక అంతకు మించి ఏమైనా ఎక్కువగా అనుకోవటానికి కూడా భయం వేసింది, మళ్లీ దానికి ఏం తిట్లు తినాల్సి వస్తుందో అని. "అసలే ఈ ఆత్మ గాడు ఆవలించకుండానే పేగులు లెక్కపెట్టగల సమర్థుడు" అనుకున్నాడు జంకుగా. ఆత్మ ముసిముసిగా నవ్వుకున్నాడు.

మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కాస్సేపు నడుం వాలుద్దామని అనుకుంటూ వుంటే హాల్లో టేబిల్ మీద ఏదో పెద్ద పాకెట్ కనిపించింది. ఏమిటో అని విప్పి చూస్తే లోపల ఏదో చీర వుంది. దానికి ఇంకా వేలాడుతున్న సిల్క్ పాలస్ లేబిల్, చీర మడతలలో జాగ్రత్తగా దాచిన బిల్లు చూస్తుంటే అది ఇంకా మడతన్నావిప్పని సరికొత్త చీర అని ఎవ్వరు చెప్పకనే తెలుస్తోంది. అప్రయత్నంగానే బిల్లుని పరిశీలనగా చూసాడు. "ఓహో, నిన్ననే కొన్నదన్నమాట" అనుకున్నాడు మనసులో బిల్లు మీద తేదీని చూసి. కానీ చీర ఖరీదుని చూసి ఒక్కసారి వులిక్కిపడ్డాడు. "జానకి" అంటూ పిలిచాడు అప్రయత్నంగా. వంటింట్లో గిన్నెలు సద్దుకుంటున్న జానకి గబగబా పరిగెత్తుకు వచ్చింది, "అదేమిటండి, అంత పెద్దగా అరిచారు?" అంటూ. రామం చేతిలో చీర చూసి "ఈ చీర గురించి అడగటానికా పిలిచారు? నిన్ననే కొన్నాను, బాగుందా?" అంది వెంటనే.

"ఆ. ఆ. చీర బాగానే వుంది. కానీ ఆ ధరనే బాగాలేదు" అన్నాడు సహనం తెచ్చిపెట్టుకుంటూ.

జానకి ఒక్కసారి బిత్తరపోయింది. "నా పుట్టిన రోజుకి చీర కొనటానికి మీకు టైము లేదని నన్నే కొనుక్కోమని అన్నారని....." మెల్లిగా ఇంకా ఏదో అనబోతున్న జానకిని మాట పూర్తి చేయనివ్వకుండా మధ్యలోనే ఆపేస్తూ, "నిన్ను కొనుక్కోమని అన్నాను కానీ మన బడ్జెట్ ని మరచిపోమని అనలేదు" అన్నాడు రామం టక్కున. తెలీకుండానే అతని గొంతులో కరకుతనం ధ్వనించింది. "మర్చిపోలేదండీ. మనం బడ్జెట్ ని ఎంత strict గా పాటిద్దామని అనుకున్నా ఒకొక్కసారి కొంచెం అటు ఇటు అవుతుంది. ఎందుకంటే ధర తో పాటు చీర నచ్చటం కూడా ముఖ్యం కదా! ధర ఎక్కువగా వుందని మీకంత చికాకుగా వుంటే, పోనీ, చీర తిరిగి ఇచ్చేస్తానులెండి. ఆ షాపు వాళ్ళు తెలిసినవాళ్ళేగా! తీసుకుంటారు" అంది చిన్నబుచ్చుకుంటూ.

"నా ఉద్దేశం అది కాదు. అలా మనసు చిన్నబుచ్చుకోకు. చీర తిరిగి ఏమీ ఇవ్వనక్కరలేదు. ఖరీదు కొంచెం ఎక్కువగా వుందని అన్నాను అంతే" అని రామం ఏమీ అనలేదు. కోపంగా ముఖం పెట్టాడు. జానకి అక్కడ నుండి వెళ్ళిపోయింది. దానికోసమే ఎదురు చూస్తున్న ఆత్మ ఒక్కసారి విరుచుకు పడ్డాడు రామం మీద. "ఒరేయ్, పాపాత్ముడా! నీకు కొంచెం అన్నా బుద్ధుందా? పుట్టిన రోజని కట్టుకున్న పెళ్ళాం ముచ్చటపడి ఒక్క చీర కొనుక్కుంటే దానికింత రాద్ధాంతం చేస్తావా? చీర తిరిగి ఇచ్చేయమని అంటావా? అసలు నీ అంతట నువ్వు పెద్ద చీర కొని పెట్టాల్సింది పోయి పాపం, తనే ఏదో కొనుక్కుంటే దానికి ఖరీదు ఎక్కువని వంకలు పెడతావా? ఆమాత్రం అన్నా ఖర్చు పెట్టలేనంత దరిద్రం ఏమొచ్చింది? ఇంత పిసినారిగా వుండి దాచిపెట్టింది ఎవరికివ్వాలని? ఛీ, నీకు కొంచెం కూడా సిగ్గు లేదు, ఇంక ఈ జన్మకు రాదు కూడాను" ఊపిరి తీసుకోవటానికి ఆత్మ కొంచెం ఆగాడు.

రామం ఆత్మ వైపు కొరకొరా చూసాడు. "చాలీ చాలని ఈ జీతాలతో ఇంకా దాచటం కూడాను. నీ పుణ్యమా అని ఈ జీవితానికి ఇంక ఇంతే!" కక్షగా అన్నాడు. "మధ్యలో నేనేం చేశాను?" అమాయకంగా అడుగుతున్న ఆత్మను కోపంగా మధ్యలోనే ఆపేసాడు రామం. "ఏం చేసావా? మర్చిపోయావనుకుంటాను. గుర్తు చేయనా? సినిమా హీరో అవ్వాలని చిన్నప్పటి నుండి ఎంత కోరుకున్నానో! పేరుకి పేరు, డబ్బుకి డబ్బు, దేనికీ లోటు లేని జీవితం, ఎంత బాగుండేదో! నా కోరికకి అడుగడుగునా అడ్డంకులు చెప్పావు. ఈ సంగతి ఎత్తినప్పుడల్లా నన్ను

నిరుత్సాహపరచి నా మీద చన్నీళ్ళు కుమ్మరించేవాడివి. నీ రూపం చూసుకో, నీ ఒడ్డు పొడుగు చూసుకో, నీ మాట్లాడే తీరు చూసుకో, అది చూసుకో, ఇది చూసుకో అంటూ నటించటం సంగతి నేను అనుకున్నప్పుడల్లా నా ప్రాణాలు తోడేసేవాడివి. వెనక, ముందు అన్న తేడా లేకుండా నలువైపుల నుండి ఇలా నస పెట్టి చంపుతుంటే ఇంక అ పని ఏమవుతుంది?" ఉక్రోషంగా అంటున్న రామంని చూస్తే ఆత్మకి నవ్వాగలేదు.

"ఆడలేని ఆడది మద్దెల ఓడందిట. అలా వుంది నీ వరస. నటించటం నీకు చేతకాక ఆ విషయం ఎత్తి చూపించానన్న కోపంతో మధ్య నన్ను అంటావేమిటి? అసలు నేను అన్నానని కాదు కానీ కొంచెం శాంతంగా ఆలోచించు. సినిమా హీరో అంటే ఎలా వుండాలి? ఆ రూపం నీకెక్కడిది? సినిమా నటులు రాత్రింబగళ్ళు ఎంత కష్టపడతారు? అంత శ్రమ నువ్వు పడగలవా? ఉత్తగా కబుర్లు చెప్తున్నావు కానీ అసలు నటన అంటే నీకేం తెలుసు? లేనిది వున్నట్లు చూపటం ఎంత కష్టం? అంతెందుకు? ఇప్పుడు నామీద వున్న కోపాన్ని దాచిపెట్టి, ఏదీ, ఒక్కసారి నవ్వు చూస్తాను" నవ్వుతూ అంటున్న ఆత్మని చూస్తే రామంకి కోపంతో ఒళ్ళు మండిపోయింది. అసలే చికాకుగా వున్నాడు. అందులో ఆత్మ ఈ వెటకారం మాటలు అగ్నిలో ఆజ్యం పోసినట్లు అతని కోపాన్ని ఇంకా భగ్గుమనేట్లు చేసాయి. నీతో మాట్లాడటం సమయాన్ని వృధా చేయటమే అనుకుంటూ, ఇంకా ఏదో అనబోతున్న ఆత్మ నోరు మూత పడేలాగా రామం బెడ్ రూమ్‌లోకి వెళ్ళి మౌనంగా పక్క ఎక్కి పడుకున్నాడు. నిండా ముసుగు పెట్టేసాడు. కానీ ఎందుకో అతనికి ఆదమరచి నిద్ర పట్టలేదు. తొందరగానే లేచేసాడు. హాల్లోకి వచ్చి చూస్తే జానకి ఉతికిన బట్టలని మడతలు పెట్టుకుంటూ ఎవరితోనో ఫోనులో మాట్లాడుతోంది. అక్కడే ఒక సోఫాలో కూర్చుని ఓరగా జానకి వైపు చూసాడు రామం. "ఫరవాలేదు. ముఖం చూస్తే కోపంగా ఉన్నట్లుగా ఏమీ లేదు. అమ్మయ్య, బతికాను" అనుకున్నాడు రిలీఫ్ గా.

జానకి మాటలు ఎంతకీ అవటంలేదు. ఆమె సంభాషణ దుర్గాదేవిగారితో అని అర్థం అయింది రామంకి. విసుగ్గా వుంది అతనికి. బాగా గడసరి అని, రాక్షసితనంతో మొగుడిని ఒక ఆట ఆడిస్తుందని రామంకి ఆ దుర్గాదేవి అంటే అస్సలు పడదు. ఆవిడతో ఎక్కువ స్నేహంగా వుంటే ఆ గుణాలు జానకికి ఎక్కడ వంట పడతాయేమోనని అతని భయం.

"ఓ పిరికివాడా! అలా అనవసరంగా భయపడకు. కట్టుకున్న పెళ్ళాం తెలివిని కాస్త గౌరవించటం నేర్చుకో. మాట మాట్లాడినంత మాత్రానే వాళ్ళ గుణాలేవి మనకు అంటవు. నీ అవివేకాన్ని కాస్త కట్టిపెట్టి కొంచెం కళ్ళు తెరు" పక్కనే ఆత్మ మెత్తగా వేస్తున్న చివాట్లు వినిపిస్తున్నాయి రామంకి.

ఫోనులో మాట్లాడటం అయిపోయిన తర్వాత మడిచిన బట్టలని బీరువాలో పెట్టటానికి ఒక బొత్తిగా పట్టుకుంటూ లేచింది జానకి. "లేచారా? కాఫీ ఇవ్వనా? ఇవాళ ఎక్కువసేపు పడుకున్నట్లు లేదే!" అంది రామంని చూసి. రామంకి ఒక్కసారి ఎందుకో తప్పు చేసినట్లు సిగ్గుగా అనిపించింది జానకి ప్రశాంతమైన ముఖం చూస్తుంటే. ఏ కోపతాపాలు, నస లేకుండా ప్రేమగా ఆమె మాట్లాడుతుంటే తను చూపించిన కోపం, చికాకు గుర్తొచ్చి ఏదోలా అనిపించింది అతనికి. "జానీ, తొందరగా తయారవు. ఏదన్నా సినిమాకి వెళదాం. ఆ తర్వాత బయటే తినేద్దాం. పద, చప్పున రావాలి మరి" అన్నాడు హుషారుగా, మనస్ఫూర్తిగా. ఆత్మ మెచ్చుకోలుగా చూసాడు రామం వైపు.

జానకి నవ్వుతూ "శ్రీవారికి హఠాత్తుగా సినిమా మీద ధ్యాస ఎందుకు పోయిందో! ఇదంతా నా చింత చిగురు పప్పు మహత్యమా?" అంది రామంతో. గబగబా తయారై ఇద్దరూ సినిమాకి బయలుదేరారు. సినిమా అయిన తర్వాత హోటల్ లో భోజనం చేసి ఇంటికి చేరేసరికి బాగా ఆలస్యం అయింది.

"ఏమండీ! ఈసారి మా నాన్నతో పాటు నేను కూడా వెళ్ళనా మా అన్నయ్య దగ్గరికి?" బట్టలు మార్చుకుని పడుకోవటానికి సిద్ధం అవుతూ మెల్లిగా అడిగింది జానకి రామంని. "ఎందుకు?" చటుక్కున అడిగాడు రామం, ఎందుకిప్పుడు అనవసరంగా అన్న అర్థం వచ్చేలాగా.

"ఎందుకేమిటండి? మా వదినకి సర్జరీ అయినప్పుడు కూడా వీలు కాక నేను వెళ్ళలేకపోయాను. ఒక్కసారి వెళ్లి చూసి వస్తాను. పాపం, ఎలా వుందో, ఏమిటో" బెంగగా అంది జానకి.

రామంకి ఏమనాలో తెలీలేదు. మంచినీళ్ళు తాగే నెపంతో అక్కడినుండి వంటింట్లోకి వచ్చాడు. అంతే! ఆత్మ తగులుకున్నాడు రామాన్ని"ఒరేయ్! అడ్డగాడిదా!" అంటూ. ఆత్మ ఏదో పెద్ద లెక్చరు ఇవ్వబోతున్నాడని రామంకి తెలిసిపోయింది. "అబ్బ, వదులు నన్ను. నిద్ర వస్తోంది. పడుకోవాలి ఇంక" అంటూ విదిలించుకోబోయాడు.

"నిద్రా? నిద్రెలా వస్తుంది నీకు?" కోపంగా అరిచాడు ఆత్మ.

"ఏం? ఎందుకు రాకూడదు? నేను మనిషిని కానా? అయినా అసలు మనశ్శాంతిగా నన్ను నిద్ర కూడా పోనీవా? ఇలా జిడ్డు లాగా నన్నెందుకు వేధిస్తున్నావు? అయినా అంత నిద్ర కూడా పోకూడని మహాపరాధం ఏం చేసాను నేను?" విసుగ్గా అన్నాడు రామం.

"ఏం చేసానని నన్నడుగుతున్నావా? అసలు మనసు అన్నదేది లేదా నీలో? ఆమధ్య నీకు అపెండిసైటిస్ ఆపరేషన్ అయితే జానకి వాళ్ళ వదిన మీ ఇంటికొచ్చి మీ అందరికి అనేక సేవలు చేసింది. నీ తోబుట్టువు లాగా మసిలింది. అలాంటి ఆవిడకి, పాపం, వంట్లో బాగుండక ఏదో సర్జరీ అయితే నీ అంతట నువ్వు జానకిని సహాయం కోసం పంపడం మానేసి, తనే వెళ్తానని నోరు విప్పి అడిగితే ఎందుకు అంటూ చెత్త ప్రశ్నలడుగుతావా? వెళ్ళు అని సంతోషంగా పంపడానికి సందేహిస్తావా? అసలు బుద్ధంటూ వుందా నీకు? కృతఘ్నుడు, స్వార్థపరుడు, ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసే దుర్మార్గుడు, ఏమనాలి నిన్ను?" కోపంగా ఇంకా ఏదో అనబోతున్న ఆత్మను మధ్యలోనే ఆపేసాడు రామం. తన చేతులతో రెండు చెవులను మూసుకుంటూ "బాబోయ్, ఇంక ఆపు. సమయం, సందర్భం కూడా లేదు నీకు. అర్ధరాత్రి వేళ ఏమిటి నీ గోల? నిశాచరుడివి కాబట్టి నీకు రాత్రి వేళ ఎటూ నిద్ర అన్నది రాదు. కనీసం మమ్మల్ని అన్నా నిద్ర పోనిస్తావా? లేదా? అయినా ఇంక నువ్వసలు నన్ను వదలవా? అస్తమానూ నన్ను నీడ లాగా వెంటాడటానికి రాత్రి, పగలు అన్న తేడా కూడా లేదా నీకు? అసలు ఇదొక్కటేనా నీకు పని? నాకేమి అక్కరలేదు నీ నీతిబోధలు. పో, ఇక్కడి నుంచి" కోపంగా అన్నాడు రామం. సమయాసమయాలు లేకుండా అస్తమానూ ఏమిటి ఈ ఉపదేశాలు అనుకున్నాడు పళ్ళు నూరుకుంటూ మనసులో.

"వదలను. ఇష్టమున్నప్పుడు వెంట ఉండటానికి, ఇష్టం లేనప్పుడు వదిలేసి పారిపోవటానికి నేను అందరిలాంటివాడిని కాను. అసలు నేనెవరని అనుకుంటున్నావు? స్వయానా నీ ఆత్మని నేను. నేను, నువ్వు అన్న తేడాలేమీ లేని నీ అంతరాత్మని నేను. రాత్రి పగలు, అప్పుడు ఇప్పుడు, అటు ఇటు, వెనక ముందు అన్న తేడాలేవీ లేకుండా అనుక్షణం నీలోనే దాగివుండే నీ మనస్సాక్షిని. అర్థమైందా? నీకు నచ్చుతుందని అడ్డమైన ఇచ్చకాలు ఆడటానికి, నీకు నచ్చదని నువ్వు తప్పులు చేస్తున్నా కూడా నిన్ను సవరించకుండా అలా వదిలేయటానికి నేను నీ మంచి కోరనివాడిని కాదు. నిన్ను నయాన్నో, భయాన్నో మంచి మార్గం లోనికి పెట్టడానికి కనీసం ప్రయత్నమన్నా చేయకుండా ఉండటానికి నేనేమీ నీకు పరాయివాడిని కాదు. చాలామంది లాగా స్వార్థపరుడిని కాదు. నిజాయితిగా ఉన్నదున్నట్లు చెప్పి, అప్రియమైనా సరే, ఎలాగో అలాగ నిన్ను సరైన దారిలోకి లాగటమే నా ముఖ్యోద్దేశం. అందుకే నువ్వు తప్పు చేస్తున్నప్పుడల్లా నీకెంత ఇష్టం లేకపోయినా, నువ్వెంత విసుక్కుంటున్నా నేనెప్పుడూ నిన్ను మందలించేవాడిని. హెచ్చరించేవాడిని. ఎందుకంటే అలా చేయటం అంతరాత్మగా నా కర్తవ్యం. పెడచెవిని పెడితే నీ ఖర్మ. అలా అని నువ్వు తప్పు చేస్తున్నా కూడా నిన్ను ఏమీ అనకుండా మౌనంగా వుండటం నా వల్ల కాదు. అందుకే......." తన వాగ్ధాటిని కొంచెం ఆపి రామం వైపు చూసాడు ఆత్మ. రామం విసుగ్గా ముఖం పెట్టి, రెండు చేతులు జోడించి ఆత్మకి ఒక దణ్ణం పెట్టి బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. జానకి ఆదమరచి నిద్ర పోతూ కనిపించింది. తను కూడా పక్క మీదకు ఒరిగాడు.

దుప్పటి నిండా కప్పుకుని నిద్రకి ఉపక్రమించాడు.

నీ సంగతి నాకు తెలుసులే, మనిద్దరికీ ఇది ఎప్పుడూ జరిగే యుద్ధమేగా అన్నట్లు ఆత్మ తనలో తను నవ్వుకున్నాడు.

# తిరంగా ప్యార్

రేష్మా మహమ్మద్
ఫ్రీమాంట్ , కాలిఫోర్నియా

శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
24వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

**నేను** అతడిని కలవడానికి వెళ్ళినప్పుడు నీలిరంగు ఆకాశం జేగురు రంగులోకి మారుతుంటుంది. ఎప్పుడూ గమనించనేలేదు నేను. కానీ ఎందుకో గమనానికి వచ్చింది. అతను వ్యక్తపరచలేని ఆర్తి ఏదో అలా ఆకాశంలో పరుచుకున్నట్టు తోస్తుంటుంది నాకు. ఈ రంగుతో పరిచయం కొత్తేమికాదు. ఆ రంగు వెనుక దాగి ఉన్న రక్త పిపాస కొత్తది కాదు. కానీ ఈ రూపంలో దగ్గరవ్వాలని చూడడమే కొత్తగా ఉంది, మాయగాను ఉంది, మార్మికంగానూ ఉంది. నీలి ఆకాశాన్ని క్రమంగా ఆక్రమిస్తూ మింగేస్తూ పూర్తిగా జేగురు రంగులోకి ఆకాశాన్ని మార్చేయాలని అది పడే తపన చూస్తుంటే భయమేసేది. కానీ ఎన్ని రంగులు చుట్టూ పరుచుకుని ఉన్నా ప్రేమకి ఏదీ అంటదని తెలిసినా ఏదో సందేహం. ప్రేమ దేన్నీ లెక్క చేయదని మతం దానికి అడ్డుకాదని తెలుసు. కానీ, కాలాన దేన్ని నమ్మాలో కూడదో కూడా అంతుపట్టదు. అతడిని కలిసినప్పుడల్లా చిన్నప్పుడు పారేసుకున్నదేదో దొరికినట్టు అనిపిస్తుంది. ఎంతగా ముఖం మనసు విప్పారుతాయంటే భూమి నెమలై ఆకాశమంతా పురివిప్పినట్టు. అసలు ఆ పరిచయమే పెడగా జరిగింది. ఏ ప్రాముఖ్యతాలేని ఇద్దరికీ నీల్ పరిచయం చేసాడు ఫలానా అని. అప్పుడు ఓహో అని ఒక దండంతో అయిపోయిందనుకుంది. కానీ ఇలా దండకారణ్యమై ఇంకేమీ కనపడకుండా చేస్తాడని ఊహలోకి కూడా రాని విషయం.

తాను ఏ బంధాలలో ఉన్నాడో తెలీదు, నేను చాలా బంధాలలో ఉన్నానని తనకు తెలుసు. తనకూ ఉంటాయి తెంపుకోలేని సంకెళ్ళు. కానీ ఈ అనివార్యమైన అనుబంధాన్ని ఎలా విడదీయాలో తెలియడం లేదు. ఇద్దరికీ. అలా అనుకున్నప్పుడల్లా గుండెనెవరో కళ్ళముందే ముక్కలు చేస్తున్న భావన. కళ్ళెంబడి జలపాతాలు. కరిగి నీరైపోతున్న కాలం. ఎందుకు కలుగుతుంది ఇంత ప్రేమ. పట్టలేనంత ఒక జీవితకాలానికి కూడా పట్టలేనంత ఎన్నెన్నో జన్మలు కావాలనిపించేంత ప్రేమ ఎందుకు కలుగుతుంది? ఏమో? తనకెందుకు కలిగింది? తను ఆల్రెడీ సహచరుడితోనే ఉంది కదా?

నేను నీల్‌తో బహుశా చాలా సంవత్సరాలుగా కలిసి ఉంటున్నాను. మునీర్‌ను నేను నీల్ అని పిలుచుకుంటాను. మేం ఇద్దరం పుస్తకాలతో మమేకమై పుస్తకాలను సృష్టిస్తూ మా కమ్యూనిటీ కోసం పోరాడుతున్న రెండు పుస్తకాలం. ఒక చిన్న అలమరలో ఇద్దరం పుస్తక పక్షులం. ప్రతీ సాయంత్రము చర్చా వేదికే. మిత్రులు ప్రవహించే ఇల్లు. సమావేశాలు సభలు కవిత్వమూ కథలు నవలలూ ఎన్నెన్ని? ఒకటా రెండా జీవితం మొత్తం ఒక సాహితీ ప్రక్రియ. అసలు సమయమే తెలియలేదు. ఎప్పుడు భద్ర జీవితాన్ని గురించి ఆలోచించింది లేదు. ఇద్దరమే

బతకాల్సి వచ్చినప్పుడు భద్రత దేని గురించి? దొంగలు పడ్డా పుస్తకాలు తప్ప ఏముంటాయి కనుక? పుస్తకాలు ఇంటినిండా, పక్కనించి వంటయింటిదాకా అంతటా పరుచుకుని ఉంటాయి.

తాను మొత్తంగా సాహిత్యం మీదనే దృష్టి పెడతాడు. సాహిత్యంతో సమాజాన్ని మార్చుతానని తనకి అచంచలమైన విశ్వాసం. వర్గపరంగా తాను మైనారిటీ అందుకోసం పోరాటం. హక్కుల కోసం పోరాడతాడు. అవున్నిజమే ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ పోరాడాలి. తాను ఎన్నుకున్న మార్గం తప్పేం కాదు. అసలు అతని సాహితీ సృజనే కదా తననూ ఆకర్షించింది.

అలా సాహిత్యం ద్వారనే నీల్ పరిచయం. నా కవితలు చూసి తను నన్ను ఇష్టపడి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంది. అప్పటినుంచీ ఒకే కవితలో రెండువాక్యాల్లా కలిసే ఉన్నాం. చిన్నచిన్న గొడవలొచ్చినా సర్దుకునేవి. అవసరాలు పెద్దగా లేవు కనుక డబ్బుల అవసరం అంతగా లేదు కనుక బహుశా మేము గొడవలు ఎక్కువగా పెట్టుకున్నట్టులేదు.

నేను ఓ ఛానెల్‌లో ప్రోగ్రాం ప్రొడ్యూసర్‌గా పనిచేస్తాను. వచ్చే జీతం ఇల్లు, పుస్తకాలకు సరిపోతుంది. ఎప్పుడూ రేటింగ్ గొడవే. అయినా ఏం చేస్తాం. యాజమాన్యాల మనోవాంఛలకనుగుణంగానే నడుస్తాయి ఛానెల్స్. పరిధులు దాటరాదు. అన్ని రంగాల్లో లాగానే ఇక్కడాను. ఇక్కడ ఇంకెక్కువ. మొగుడికి మొగుళ్ళు చాలామంది ఉంటారిక్కడ. పై మొగుడు చెప్పిన దాన్నే పాటించాలి పెళ్ళాలందరూ. అలా స్వంత మెదడు ఉద్యోగాల్లోఉపయోగించడం ఎప్పుడో తగ్గించేశాను. కాదు పూర్తిగా మానేశాను. వాళ్ళేదంటే అదే ప్రోగ్రాం.

ఒకసారి ఇంటికొచ్చేసరికి ఇంట్లో ఉన్నాడు. తను రిషి అని పరిచయం చేశాడు నీల్. నమస్కారంతో అయిపోయిందనిపించింది పట్టించుకోనేలేదు. కానీ తన కళ్ళలో బొమ్మ కడుతుందని నేను అస్సలు ఊహించలేదు. అప్పటినుంచి తనను అనుసరించింది రిషి నీడ. రిషికి పెళ్ళయింది. తరువాత కూడా పెద్దగా మాట్లాడింది లేదు. కానీ ఇప్పుడు గుర్తు తెచ్చుకుంటే తెలుస్తుంది అతని నీడ తనని వెన్నంటే ఉందనీ అప్పుడు ఇప్పుడూ..!

మొదటిసారి జీవితంలో అందం గురించి విన్నది రిషి మాటల్లోనే. నువ్వు చాలా బావుంటావు అని. అతనికి మాట్లాడటం రాదు. ఆకర్షణగా చెప్పడం విన్నది రిషి మాటల్లోనే. నువ్వు చాలా బావుంటావు అని. అతనికి మాట్లాడటం రాదు. ఆకర్షణగా చెప్పడం అస్సలు రాదు. అయినా నేను నా గురించి విన్న మొదటి మాటలు నాకు చాలా వినసొంపుగా అనిపించాయి. నేను లైట్ తీసుకుని మా కామన్ ఫ్రెండ్స్‌ని చాలామందిని గుర్తుకు తెచ్చాను చాలా అందమైన అమ్మాయిల లిస్ట్ అంతా ఉంచాను. కానీ అతనిలో ఏమార్పూ లేదు. వాళ్ళందరికంటే నువ్వే బావుంటావు అన్నాడు. అది నిజం కాదని నాకు తెలుసు, అదే అన్నాను. నవ్వాడు పైకి కనిపించే దానితోపాటు అంతర్లీనంగా ఉండే సౌందర్యం వేరు అది ఆత్మ సౌందర్యం. అది అందరిలో కనిపించదు. రేర్. నీలాగా అన్నాడేమో లేక నాకు అలా అనిపించిందా? లేదు ఆట పట్టించాడా? లేకపోతే నేను నా గురించి ఎప్పటికీ అలా అనుకోలేను. అదే ఏమార్పూ లేని గొంతు. అలా ఎలా ఉండగలుగుతారో కొంతమంది నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంటుంది. ఏ ఉద్వేగాలు లేకుండా యుగాలనుంచి అనాలనుకున్న మాటే కదా అన్నట్టు అలా ఎలా మాట్లాడగలరు? అది ఏదైనా విద్యా? స్పెషల్ కోర్సులుంటాయా అలా మాట్లాడ్డానికి? ఏమో? కనుక్కోవాలి అప్పుడు నేను మొదటిసారి నా రూపాన్ని అద్దంలో చూసుకున్నాను. నాకేమి అర్థం కాలేదు.

నేనెప్పుడూ ఉన్నట్టుగానే ఉన్నాను. ఎక్కడా డిఫరెన్స్ ఏమీ కనిపించలేదు. మొటిమలు మిగిల్చిన గుర్తులు జాగ్రత్తగా గమనిస్తే వెండి మెరుపుల కిరీటం కూడా వరించి వలచి వచ్చి చేరింది శిరస్సు పైకి. నవ్వేసుకున్నాను తెల్లగా. నేనెప్పుడూ తెలుపునే ఇష్టపడేదాన్ని.

నే ధరించే కాటన్ పైజమా కుర్తాలు కూడా ఎక్కువగా తెలుపువే ఉంటాయి. బ్లాక్ చున్నీ వేసుకుంటాను. ఈ కాంబినేషనే ఇష్టం నాకు. అయినా నేను ఆ మాటలకు కూడా కరగలేదేమో? ఎందుకంటే చిన్నప్పటినుంచీ నాకు అందమంటే ఇదీ అని ఎవరూ చెప్పలేదు. అందంగా

ఉన్నవాళ్ళతోటే దోస్తీ చేయమని కూడా ఎవరూ నాతో అనలేదు. కలర్స్ నాకు ఎప్పుడూ సమస్యే కాలేదు. నా దోస్తుల్లో రకరకాల వాళ్ళున్నారు. తెలుపు నలుపు చామన చాయా, మనుషుల్లో నాకు నలుపురంగు వాళ్ళంటే ఎక్కువిష్టం. ప్రపంచం తెలుపులో అందాన్ని కొలుస్తుంటుంది. దునియా కొలమానాలతో నేనెప్పుడూ ఏకీభవించలేదు. కాబట్టి అందం ప్రసక్తి నా దగ్గర లేనేలెదు. కానీ రిషికి ఎలా ప్రేమించాలో తెలుసు. నాకు ప్రేమను నేర్పడం తెలుసు. నేను తనని ప్రేమించేలా చేసుకోవడమూ తెలుసు. ఇదెలా సాధ్యమైందో అంత చిన్న జీవితంలో అని నాకు సందేహం. ఏదేమైనా నాలాంటి కరుడుగట్టిన రాతిని కరిగించడం మాటలు కాదని ఇన్ని సంవత్సరాల అతని ఓపికని చూస్తే తెలుస్తోంది.

రిషి విషయాన్ని నేను ఎందుకో సీరియస్‌గా తీసుకోలేదు. కానీ రిషి సీరియస్ అని తరువాత అర్థమైంది. తనేమన్నా ముందు జీవితాన్ని గెలుపు అనే చెప్పేదాన్ని కాజ్‌వల్‌గా. కానీ అతను చాలా మొండిగా ఆ విషయాన్ని తీసుకుని నిజంగానే జీవితాన్ని గెలిచాడు. అతను అనుకున్నవన్నీ సాధించాడు. అప్పుడు కూడా మేం సంతోషించాం. ఇంకా ఎంకరేజ్ చేసాం నేను నీల్. కానీ ఆ ప్రోత్సాహం రిషి సరిపోదంటున్నాడు. తనకు జీవితాంతం కావాలంటున్నాడు. అదెలా సాధ్యం? నేను ఒక జీవితకాలం ఉలిక్కిపడ్డాను. అతని వృత్తి ప్రవృత్తి ఏదైనా అవని కానీ అతని దేవుడు మతము అతని వెనుక వెన్నంటి వచ్చే ఆ జేగురు రంగు నన్ను చాలా భయపెట్టాయి. కానీ అతని వెన్నెల నవ్వును చూస్తే మొత్తంగా చిత్రంగా అన్ని మరచిపోతాను.

ఎంత బాగా రాస్తాడో ఫిక్షన్. సినిమా చూసినట్టు ఉంటుంది. అదే చెప్పాను. ఎంత సంతోషపడ్డాడంటే మాటల్లో వర్ణించడానికి లేదు. నా మాటలకు అంతవాల్యూ ఉంటుందని కూడా నాకు మొదటిసారి తెలిసింది. ఎన్నో మాటలను నేను ఎక్కడెక్కడో పారేసుకుని ఉన్నాను వరదలా. కానీ రెండు మూడు మాటలకే అతనింత ప్రభావీం ఎందుకవుతున్నాడు? అంతలా సంతోషపడడం ఏమిటో అర్థంకాలేదు ముందు.

మీరు పసిపాపలాంటి వాళ్ళు అతను చెప్తుంటే నాకు ఏమనాలో తెలీలేదు. ఏ కోణంలో అనడగాలనుకున్నాను కానీ సంభాషణ పొడిగించడం ఇష్టంలేక వదిలించేసుకున్నాను.

అలా రిషి నా సంభాషణ ముందుకు సాగకుండా నేను క్రోటన్స్‌ని ట్రిం చేసినట్టు చేస్తూనే ఉన్నాను, ప్రయత్నపూర్వకంగా, అయినా సరే అతను దట్టమైన అరణ్యాన్ని సృష్టించేశాడు. అది అతని సృజనాత్మకత. ఆ అరణ్యం ఎవరికీ కనపడదు, నాకు తప్ప. అసలక్కడ అరణ్యముందంటే ఎవరూ నమ్మరు, తప్పిపోయే నేను తప్ప. అతనికి మాత్రమే సాధ్యమైన పకడ్బందీ సృష్టి. అంత అరణ్యాన్ని ట్రిం చేయడానికి నా శక్తి సామర్థ్యాలు సరిపోలేదు.

అందులోంచి బయటకు రాలేక నీల్ ముఖం చూడలేక నేను పడుతున్న నరకం గురించి ఎంత చెప్పినా తక్కువే.

అతను సర్వస్వం నువ్వే అంటాడు. నేను తెల్లబోయి వింటుంటాను. అతనేమీ ప్రత్యక్షంగా చెప్పడు. అన్నీ బొమ్మ కట్టిస్తాడు. ఆకులతో మాట్లాడిస్తాడు. గాలిని కూడా నృత్యం చేయిస్తాడు నా ముందు అతనికి విశ్వమంతా నేనేనట. అదెలా సాధ్యం నాకు నీల్ కదా!

నేను రిషి ప్రేమను మొదటిసారి గమనించడం మొదలు పెట్టాను. అది ఆది అంతం లేనిదిగా తోచింది. నేను అంత ప్రేమకు సరిపోయినదాన్ని కాదేమో అని కూడా సందేహం కలిగింది. ఎందుకంటే అంత ప్రేమను మునుపెన్నడూ చూడలేదు. నీల్ దగ్గర కూడా. అంత ప్రేమ పొందాలంటే నేను కూడా అంత ప్రేమనివ్వాలి కదా?

నా దగ్గర అంత సమయం ఎక్కడుంది? మహా అయితే ఇంకా నాలుగైదేళ్ళు ఆరోగ్యంగా ఉంటానేమో? అది కూడా ఎలా చెప్పగలను? ఎప్పుడేమవుతుందో తెలీని మనుషులకు గ్యారెంటీ కార్డు ఎలా ఇస్తాం? అయినా నీల్ ఏమైపోతాడు? అసలు నేనేమైపోతాను? నేను కట్టుకున్న పుస్తక సామ్రాజ్యం? ఇక్కడ నేనే మహారాణిని కదా! రిషి మనసులో మహారాణిని కావొచ్చు కానీ జీవితంలో? రిషి పట్ల ప్రేమను రోజుకున్న క్షణాల్లాగే వేల సార్లు తుంచేస్తున్నాను. అయినా మళ్ళీ మళ్ళీ జనించేస్తుంటాడు.

క్షణంలో వెయ్యిపుటకలు పుడుతుంటాడు ఏదో విధంగా, అది అతనికి మాత్రమే వచ్చిన రాక్షస విద్య. ఆ మాయలో పడి నేను లేవలేకున్నాను. నీల్‌కి ఆకుపచ్చంటే ఇష్టం. అది కమ్యూనిటీని సూచించేది కాకపోవచ్చు అవనూ వచ్చు. కానీ ప్రకృతిలో లేని రంగు మనుషులెక్కడ సాధించుకున్నారు. అంతా ప్రకృతి మయమే. రిషి వెనుక రంగుందేమో కానీ మనసుకి కూడా రంగంటుకుని ఉంటుందా? మతం ప్రేమకు అడ్డుకట్టా? నేను తనను మా మతం తీసుకో అని అడగ్గలనా? నువ్వు మా ఆచారం ప్రకారం సున్తీ చేయించుకో అని రూల్స్ పెట్టాలా? ప్రేమను ఖచ్చితంగా మతం శాసిస్తోందా?

రిషి బహుశా రూలింగ్ పార్టీ మనిషేమో అని అనుమానం కలిగింది. పనిగట్టుకుని మా జీవితాల్ని డిస్టర్బ్ చేస్తున్నాడేమో అనిపించింది నాకు. కానీ ప్రేమ రాజకీయాన్ని ఒకే త్రాసులో వేయలేకపోయాను. ఒక మతం కాకపోవచ్చు కానీ మనిషి జాతే కదా! ఎన్ని అడ్డంకులు వేసుకున్నా అన్ని హర్డిల్స్ అవలీలగా దాటేసుకుని వచ్చేస్తున్నాడు దూసుకుని. ఆపాలి, ఎలా ఆపాలో తెలీదు. మనసుని జారిపోనీకుండా పట్టుకోవాలి, ఎలా ఏం చేయాలి?

నీల్‌కి రిషి భావనలు తెలిసాయి. నీల్‌కి తెలిసినట్టు రిషికి తెలుసు. ఘర్షణ ప్రారంభం. నీల్‌కి నన్ను పోగొట్టుకుంటానన్న సందేహం రాలేదు కానీ నేను దారి తప్పి అగాధాల్లో పడతానేమోనన్న భయం నేను ఏమైపోతానన్న దిగులూ ఆవరించాయి. తనలో అవి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే నీల్ జేగురు రంగు దాష్టీకాలను ఏకరువు పెట్టడం మొదలుపెట్టాడు. క్రూరత్వాన్ని అది ఆకుపచ్చపై చేసిన దాడుల్ని గాయాలను మళ్ళీ మళ్ళీ విప్పి చెప్తున్నాడు. అదీ డెమోక్రసిలో ఇలా జరుగుతుందని పదే పదే ఉదాహరణలు చూపిస్తున్నాడు. నిజానికి మేము ఇన్నాళ్ళూ పోరాడింది దానిపైనే కదా. ఆ రంగు ఎంత ప్రమాదకారో విధ్వంసాల దగ్గరినుంచి ఏకరువు పెడుతున్నాడు. అయినా నాకు తెలుసు ఆ రంగు గురించి. కానీ ప్రేమకు రంగుండదు కదా! అది నిర్మలం. ఆ రంగు వెనుక తీవ్రవాదం ఉందంటాడు, అది మైనారిటీలపై కేంద్రీకృతమైందంటాడు. ఇప్పటికే జరగాల్సిన అనర్థాలన్నీ జరిగాయి. ఇంకేం జరుగుతాయోనని ఒక అభద్రతా భావనను చుట్టూ పేర్చుతాడు. నిజమేననిపిస్తుంది. నాకు గతాన్నీ వర్తమానాన్నీ చూస్తుంటే. పాతబస్తీ గల్లీలు చూసినప్పుడు మాసికలేసిన బుర్ఖాలను చూస్తున్నప్పుడు, ఆవు మాంసం దుకాణాల దగ్గర జనాలు మూగినప్పుడు నిజమేననిపిస్తుంది. ఊపిరాడని బొమ్మరిళ్లలో బొమ్మల్లా కాపురముంటున్న మనుషులనబడే జీవచ్ఛవాలను చూస్తున్నప్పుడు నిజమేననిపిస్తుంది. ఇంత వివక్షలేంటీ అనిపిస్తుంది.

రిషి అంతే. ఆకుపచ్చ రంగు గురించి చాలామాట్లాడతాడు. ఆ రంగు వెనుక క్రూరత్వం గురించి చెప్తాడు కథలు కథలుగా. ఎక్కడెక్కడ ఎంతమంది అమాయకులు బలయ్యింది రీళ్ళు రీళ్ళుగా దృశ్యీకరిస్తాడు. దేశభక్తి లేదంటాడు. తీవ్రవాదం అంటాడు. రకరకాలుగా మన్ను విరిచేయాలని చూస్తాడు.

ఈ రెండు రంగుల ఆధిపత్య అహంకారాల మధ్య నేను మూడో రంగునై నలిగిపోతున్నాను. నిజానికి వీళ్ళిద్దరూ చెప్తున్న ఈ రంగుల వెనుక ఉన్న విధ్వంసాలతో ఈ ఇద్దరికీ ఏ సంబంధము లేదు, అవి వేరేవాళ్ళకు సంబంధించినవి, కానీ వీళ్ళిద్దరిపై ఆరోపించుకుంటున్నారు. ఇలా ఆలోచించిన తరువాత ప్రశాంతంగా అనిపించింది.

ఇన్ని సంవత్సరాల బంధం నాది నీల్‌తో ఎలా తెంపేసుకుంటా చెప్పు అంటే అదే అంటున్నాను ఇన్ని ఏళ్ళు ఉన్నావు కదా నాతో ఈ కొన్ని రోజులు కలిసి ఉండు అంటూ మంకు పట్టు పట్టే చిన్నపిల్లాడు రిషి.

నువ్వు చెదలు కావు అస్తమానం పుస్తకాలతోనేనా జీవితం? నువ్వు దేవతవి కాదు కళ్ళు ఆర్చకుండా ఒకే కోణంలో బతకడానికి నువ్వు మనిషివి, జీవితంలో చాలా పార్శ్వాలున్నాయి అంటూ కొత్తలోకాల్ని పరిచయం చేసాడు రిషి. అందులోదే ప్రేమలోకం. నేను అతను చూపించిన

కొత్తదనానికి మురిసిపోలేదు. నాకు ప్రేమంటే తెలిసింది కాబట్టి. జీవితంలో పోరాటంతో పాటు ప్రేమకూడా ఉంటుందని తెలుసుకున్నాను కాబట్టి రిషిపై ప్రేమ. అది కృతజ్ఞత కాదు, సహజ స్పందన.

నాకేం అర్ధంకావడంలేదు. ఈ ఘర్షణకు అంతే లేదా? కాలం కుబుసం విడిచినతాచులా వేగంగా పయనిస్తోంది. పట్టుకోలేక పోతున్నా. నాలోనూ నిరంతర ఘర్షణ.

నాకు కల్లోలాలు అసలు ఇష్టం ఉండదు. నేను శాంతిని కోరుకునేదాన్ని. శాంతికి మారురూపంగా ఉండాలనుకునేదాన్ని. నేనే ఇంత సంఘర్షణకు లోనవ్వడమేంటి? అసలు మేం శాంతిగా ఏ ఘర్షణలు లేకుండా సంతోషంగా కలిసి పయనించాల్సిన మనుషులం కదా! ఈ మూడింటిలో ఏ రంగు మరో రంగుపై ఆధిపత్యం చెలాయించినా అది అసమానత్వం అవుతుంది. మూడు రంగులు నలుగురు మనుషులు కలిసి జీవించడం తప్ప. ఒకే భూమిపై కలిసే ఉన్నాం కదా అనుకోవడం తప్ప ఇంకేం పరిష్కారం ఉండదేమో?

నేను తనదానిగా అనుకుంటాడు నీల్. ఎప్పటినుంచో నీది కదా ఇప్పుడు నాది ఎందుకు కాకూడదు అనుకుంటాడు రిషి. నేనేం అనుకోవాలి? అసలు నాకు ముందే నా అస్తిత్వంతో పెద్ద తకరారు. మనుషులు ఏ రంగులో ఉన్నా తెల్లటి మనసుతో ఉండాలనుకుంటాను ఎవరికీ లొంగని మనస్తత్వం. ఇప్పుడు రిషికి చేయందిస్తే నన్ను కాషాయం ముంచేస్తుందా? నా తెలుపును పూర్తిగా ఆక్రమించేస్తుందా? నాకు అస్తిత్వం లేకుండా పోతుందా? ప్రేమతో చెపితే నేను రిషి అభ్యర్ధనను కాదనలేక రేపటినుంచి బొట్టు కూడా పెట్టుకుంటానా? చేతులు రెండూ దగ్గరికి చేర్చి విగ్రహారాధన మొదలుపెడతానా? ఏమై మిగులుతాను?

ఒక్కసారి నీతో గడిపిన కాలాన్ని వెనక్కు తిప్పి చూసుకున్నాను. మొత్తం పుస్తకాలు, సభలు, సమావేశాలతో నిండిపోయి ఉంది. వీటన్నిటిలోనూ జీవితమే పరుచుకుని ఉంది. అక్కడ నవ్వులు, పాటలు, సరదాలు పిల్లలు, మొక్కలు పూలు తోటలు ఆస్తులు ఉద్యోగాలు బ్యాంక్ బాలెన్స్ ప్రేమ ఏవీలేవు. ప్రత్యేకంగా ప్రేమించే క్షణాలంటూ ఏవీ లేవు. అంతా సాహిత్యమే? ఒక సినిమా చూసి ఎన్ని రోజులయింది? ఒక పార్క్‌కి వెళ్ళి ఎన్ని దినాలయింది? అసలు సాహిత్యం తప్ప ప్రపంచంతో అనుసంధానం ఇంకేమన్నా ఉందా? ఎవరింటికీ పోవడాలూ రావడాలూ ఉన్నాయా? నవ్వులు కేరింతలు అడ్రస్ ఎక్కడా? కానీ జీవితమంటే ఇవికూడా కాదా?

ఉన్నది ఒకటే లైఫ్ అయినప్పుడు వీటికి మాత్రం ఎందుకు దూరం కావడం? నా ఈ సందిగ్ధాన్ని ఎవరు నివృత్తి చేయగలరు. ఒక్కళ్ళు చేస్తే పోయే ఊగిసలాటా ఇది. నాలుగు జీవితాలాట. జీవితాన్ని కాచి వడపోసిన ఎంతమంది ముందో ఉంచాల్సిన ప్రహేళిక.

ఫోన్ మోగింది. మేడం ఈ పదిహేను రోజుల్లో కొత్త ప్రోగ్రాం చేయాలట. లేకపోతే ఉద్యోగాలు ఊడిపోవచ్చుట అంటూ తాజా కబురు అందించాడు సబ్ఎడిటర్.

జీవితాల గురించి తల్లడమల్లడమవుతుంటే ఉద్యోగాలొకటి ఊపిరాడనివ్వవు. అట్లాగే కళ్ళు మూసుకుని పడుకుండిపోయింది. తెల్లారి లేచి ఆఫీస్‌లో ఇన్‌ఛార్జ్‌తో గొడవేసుకుంది. ఇంకెప్పుడూ మా ఇష్టమైనట్లు ప్రోగ్రాములు రూపొందించేది అంటూ. ఒక్కసారి మాకు అవకాశం ఇవ్వండి అప్పుడు సరిగా చేయకపోతే ఉద్యోగాలకు రిజైన్ చేసి పోతాం అని ఆర్గ్యూ చేసింది. ఇన్‌ఛార్జ్ చాలాసేపు తర్జన భర్జన పడి ఒక్కసారికి అవకాశం ఇచ్చాడు. మీ ఇష్టం అని. ఇద్దరు మేల్ యాంకర్లను ఒక లేడీ యాంకర్‌తో తన జీవితాన్ని రంగరించి రాసిన డైలాగ్స్‌తో ఒకవారం రోజులపాటు ట్రైనింగిచ్చింది. వాళ్ళు అచ్చం తన జీవితానికి ప్రతిబింబాల్లా ఉన్నారు. కొంత నల్లమల అడవిలో షూటింగ్ చేయించింది. ఇంకా కొంత కొంచెం ఆర్టిస్టిగ్‌గా ఉన్న ఫ్రెండ్ ఇంట్లో షూట్ చేయించింది. కొన్ని రొమాంటిక్ సీన్స్ మిస్ చేసింది. మధ్యలో లవ్ సాంగ్స్ హృదయాలు ద్రవించే డైలాగ్స్‌తో మొత్తానికి అనుకున్న టైంకి అనుకున్నదానికంటే బాగా వచ్చింది ప్రోగ్రాం. అద్భుతంగా ఉంది మేడం పిచ్చ రేటింగ్ వస్తుంది ఛానెల్‌కి అంటూ షేక్‌హాండ్ ఇచ్చాడు సబ్ఎడిటర్. మొత్తం తన నీల్ రిషి కథే. కొత్త జీవితాన్ని చూస్తున్నట్లుంది. యాంకర్స్ చాలా

హ్యాపీగా ఫీల్ అవుతున్నారు తమకు మంచిపేరు వస్తుందని అయితే తెలుపు ఎవరో ఒకరితో కలిసి ఉండాలా లేక ఇండివిడ్యువల్‌గానా లేక నలుగురూ కలిసి ఉండాలా? లేక రిషి తాను తమ సహచరుల్ని వదిలేయాలా? విషయాన్నీ ఆడియెన్స్‌కి వదిలేసింది. ముగింపు మొత్తం ఆడియెన్స్ చేతిలో ఉంది ఆడియెన్స్ పోల్ ఏర్పాటైంది. మన ఉద్యోగాలు గ్యారెంటీ మేడం అంటున్నాడు సబ్‌ఎడిటర్. నిర్వేదంగా ఉండిపోయింది. తాను రేటింగ్ కోసం చేసిందా ప్రోగ్రాం? ఉద్యోగం కోసమా? ఒక తీర్పు కోసం. కానీ నిజంగా దానికి ఫాలో అవుతుందా?

ఫలితం ఏదైనా భయపెట్టి తీరుతుందని ఎదుర్కొనే ధైర్యం లేని తను ఇంకా రెండురోజులు ఉంది ప్రోగ్రాం ప్రసారం కావడానికి అనగా లీవ్ పెట్టి అజ్ఞాతవాసానికి వెళ్ళిపోయింది. మీకెప్పుడైనా నేనెదురైతే మాత్రం మీ అభిప్రాయాన్ని మీలో ఉంచండి. నాతో ప్రస్తావించకండి. నాకింకా జీవితాన్నెదుర్కొనే సాహసం రాలేదు. ఇంకా నేను ప్రోగ్రాం ప్రొడ్యూసర్‌నే. నా జీవితం ఛానెల్‌కి నేనింకా అధిపతిని కాలేదు. నా జీవిత ప్రసారాల హక్కు నా చేతిలో లేదని మొదటిసారి నాకు తెలిసిన క్షణాలు. ఒక జీవితకాల యుద్ధం మొదలైంది.

## ఎవరు హీరో?

**మందడి శ్రీకాంత్**

జోహన్స్ బర్గ్, సౌత్ ఆఫ్రికా

శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
24 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

<u>హైదరాబాదు విమానాశ్రయం</u>, సమయం 21:35

హైదరాబాదు నుంచి కౌలాలంపూర్ (మలేషియా) కి వెళ్లవలసిన విమానం, మరో 15 నిమిషాల్లో ఎగరడానికి సిద్ధంగా ఉంది. అది వారాంతం కావటం వాళ్ళ విమానాశ్రయం రద్దీగా ఉంది. అదే విమానంలో యువ వ్యాపారవేత్త సిద్ధాంత్, ఒక ప్రముఖ నటుడు కూడా ప్రయాణిస్తున్నారు, ఫస్ట్ క్లాసులో సీటు దొరకలేదు అన్న బాధతో ఒకరు, ఫస్ట్ క్లాసులో లేకపోయినా కనీసం బిజినెస్ క్లాసులో అయినా సీటు దొరికిందిలే అన్న ఆనందంలో ఒకరు ఉన్నారు. అలా బాధలో ఉన్న అతను నటుడు, ఆనందంలో ఉన్న అతను సిద్ధాంత్. వాళ్ళ సీట్ నంబర్స్ పక్క పక్కనే కాని వాళ్ళ అభిప్రాయాలు, ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడో....

సిద్ధాంత్ సీరియస్ గా తన మొబైల్ ఫోన్ లో How Artificial Intelligence is changing Business అనే వీడియోని యూట్యూబ్ ఆఫ్ లైన్ లో చూస్తున్నాడు మొబైల్ ఫోన్ ని ఫ్లైట్ మోడ్ లో పెట్టి, చెవులకి abyss ab-1266 హెడ్ ఫోన్స్ పెట్టుకొని. అప్పుడే తన పక్క సీట్ లో వచ్చి కూర్చొన్న ఆ నటుడికి హలో చెప్పి తిరిగి ఆ వీడియోలో నిమగ్నమయ్యాడు. తనని ఒక సాధారణ సహప్రయాణికునిలా కేవలం హలో అని పలకరించి తిరిగి వీడియోలో మునిగిపోయిన సిద్ధాంత్ ని చూసి ఆశ్చర్యపోయిన ఆ నటుడు సిద్ధాంత్ ని తలనుండి కాళ్ల వరకు పరికించి చూస్తాడు ఇతని లెవెల్ ఏంటా అని. కావాలనే ఫోజ్ కొడుతున్నాడా? ఏదయినా ఆఫర్ లో లేదా లక్కీ డ్రా లో బిజినెస్ క్లాసులో

వస్తున్నాడా? తన స్థాయి వాడేనా కాదా? తనకి నాతో మాట్లాడే అర్హత ఉందా? తన 'డబ్బు' కులంవాడేనా? ఇలా తనని తానే ఎన్నో ప్రశ్నలు వేసుకున్నాడు ఆ నటుడు.

ప్రపంచంలోనే అతి ఖరీదైన వస్తువులు సిద్ధాంత్ ని అలంకరిచి ఉన్నాయి. స్టువార్ట్ హ్యూస్ సూటు, కార్టియర్ వజ్రాల బ్రాస్ లెట్, లూయిస్ వ్యూటన్ బూట్లు, చేతిలో అతి ఖరీదైన్ ఫోన్. మెడలో ఏక ముఖి రుద్రాక్ష . సగం జిప్ ఓపెన్ చేసి ఉన్న ట్రావెల్ బాగ్ లో నుంచి కనిపిస్తున్న తెలుగు భగవద్గీత. ఇవన్నీ అతని స్థాయిని, అభిరుచిని చెప్పకనే చెపుతున్నాయి.

పక్కన కూర్చున్న నటుడ్ని పట్టించుకోకుండా తన మానాన తను ఏదో వీడియో చూసుకుంటున్న సిద్ధాంత్ ని చూసాక ఆ నటుడికి తనకి తాను చాలా చిన్నగా అనిపించాడు. ఇలాంటి వ్యక్తే బిజినెస్ క్లాసులో వస్తున్నపుడు నేను ప్రీమియం ఎకానమీలో అయినా రావచ్చు అనుకున్నాడు. ప్రత్యేకంగా కాక తనని అందరిలాగే పలకరించటం చూసి డబ్బు వల్ల వచ్చిన పొగరు అని అనుకున్నాడు అది పొరపాటు అని తరవాత తెలుస్తుంది.

మొదటి చూపులోనే ఒక వ్యక్తి రూపం, అలంకరణ చూసి ఆ వ్యక్తి మీద ఒక అంచనాకి రావటం, అదే ఆ వ్యక్తి వ్యక్తిత్వం అనుకోవటం సాధారణం. కాని అది అందరి విషయంలో కరెక్ట్ అవదు సిద్ధాంత్ విషయం లో అసలు కాదు.

సిద్ధాంత్ తన స్నేహితుల దగ్గర ఒకసారి బ్రాండ్స్ కి సంబంధించిన చర్చలో ఇలా అంటాడు. బ్రాండ్ కి విలువ ఎప్పుడు ఉంటుందంటే నాణ్యత తో పాటు, అందరు దాన్ని కొనలేనపుడు, అది ప్రీమియం ధరలో ఉన్నపుడు మాత్రమే అది ప్రియం అవుతుంది. పండు పేరు మీద ఉన్న ఆ బ్రాండ్ ఫోన్ ని అందరికి పండ్ల లాగే పంచి పెడితే అందరి దగ్గర అది ఉంటె దాని విలువ తగ్గుతుంది.

సిద్ధాంత్ బ్రాండ్స్ ని డాబు కోసం మాత్రమే కాకుండా తన సౌకర్యం, నాణ్యత, ఇష్టం వీటి ఆధారంగా ఎన్నుకుంటాడు. సిద్ధాంత్ ఆలోచనలు, అభిప్రాయలు, ఇష్టాలు, సిద్ధాంతాలు భిన్నం.

వీళ్ళిద్దరికి ముందు వరసలో కూర్చొన్న ఒక ప్రయాణికుడు వాష్ రూంకి వెళ్ళటం కోసం లేచినపుడు అనుకోకుండా ఆ నటుడిని చూసి "సర్ ప్రైజ్ స్టార్ ప్రవేష్" అని తనకి తెలీకుండానే అరుస్తాడు. అప్పుడు అందరు ఆ హీరో దగ్గరకు సెల్ఫీలు అడుక్కోవటం కోసం వెళతారు. బిజినెస్ క్లాసు లో ఎక్కువ మంది ఉండరు కాబట్టి ఆ కొంత మందికి అడిగినన్ని సెల్ఫీలు ఇస్తాడు.

కాని ఆ నటుడి పక్క సీట్ లో కూర్చొని కూడా, ఏ మాత్రం ఉద్వేగం లేకుండా తన మానానికి తను ఏదో ఫోన్లో వీడియోల్ని చూస్తున్న సిద్ధాంత్ ని చూసి, ఉండబట్టలేని ఒక సహా ప్రయాణికుడు సిద్ధాంత్ దగ్గరి కి వెళ్ళి తనని తాను పరిచయం చేసుకొని "సర్, మీ ప్రక్కన ఉన్న అతను హీరో అని మీకు తెలుసా?" అని అడుగుతాడు.

అప్పుడు సిద్ధాంత్ "హీరోనా ఎవరికి?" అంటాడు ఆశ్చర్యంగా.

ఆ ప్రశ్నకి ఆ ప్రయాణికుడు కూడా అంతే ఆశ్చర్యపోతూ "అదేంటి సర్ అలా అంటారు తను పెద్ద హీరో...!" అంటాడు. అప్పుడు సిద్ధాంత్ "నటించేవాడిని నటుడు అంటారు. హీరో అనరు. బాగా నటిస్తే మంచి నటుడు, ఉత్తమ నటుడు అంటారు. అవార్డులు కూడా ఇస్తారు. నాకు అతను నటుడని తెలుసు. ఇంతకు మీరేం చేస్తుంటారు?" అని ప్రశ్నిస్తాడు.

"నేను డాక్టర్ సర్" అని సమాధానం. "మీ ఫ్రెండ్స్ ఏమీ చేస్తుంటారు?" మళ్ళీ సిద్ధాంత్ ప్రశ్నిస్తాడు.

"కొంతమంది వ్యవసాయం చేస్తారు, కొంతమంది డ్రైవర్ గా చేస్తున్నారు, కొంతమంది టీచింగ్, కొంతమంది బ్యాంకింగ్ లో ఉన్నారు, అయినా ఇది ఎందుకు అడుగుతున్నారు" అని సహప్రయాణికుడి ఎదురుప్రశ్న.

అప్పుడు సిద్ధాంత్ "మీ స్నేహితులకి మల్లేనే తన వృత్తి నటన. తను ఒక పని చేస్తున్నాడు కదా, తేడా ఏమీ ఉంది".

“కాని సర్, అందరు నటులు కాలేరు కదా”.

“అవును అందరు మీలాగా డాక్టర్ కూడా కాలేరు. వారి వారి ఇష్టాలు, తెలివితేటలు, అవసరాలని బట్టి వాళ్ళు ఆయా పనులు చేస్తుంటారు. అలాగే మీరు డాక్టర్ గా పని చేస్తున్నారు. నేను వ్యాపారం చేస్తున్నాను. అతను నటనని వృత్తిగా ఎంచుకున్నాడు. ప్రతి పని గొప్పదే, ఆ పక్క సీట్ లో మీరు కూర్చున్నా నేను ఇలాగే నవ్వుతూ పలకరించి నా పని నేను చూసుకుంటాను. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరు తెలిసో, తెలియకో వాళ్ళ వాళ్ళ పనులతో ఏదో ఒక రకంగా వేరే వాళ్లకి సహాయం చేస్తున్నారు, ఆనందం పంచుతున్నారు, సౌకర్యాలు సమకూర్చుతున్నారు. రైతులు మనకు తిండి పెడుతున్నారు. సైనికులు మనకు, మన దేశానికి భద్రత ఇస్తున్నారు. మీలాంటి డాక్టర్లు ప్రాణాలు కాపాడుతున్నారు, కొందరు బట్టలు నేస్తున్నారు, కొందరు ఇల్లు కడుతున్నారు, కొందరు సినిమాల్లో నటించి మనల్ని ఆనందిపచేస్తున్నారు. ఇలా వారి వారి పనులవల్ల వారందరూ గొప్పే. వారిలో ఏ ఒక్కరు లేకపోయినా మనకు కష్టమే. ఇలా ప్రతి రంగంలో హీరోలు ఉంటారు. అసలు హీరో అంటే ఉదాత్త విలువలు కలిగి, ఉత్తమ కార్యాలు సాధిస్తూ మిగతా వారిలో స్ఫూర్తిని నింపుతూ, మార్గదర్శకంగా నిలిచేవాడు అని అర్ధం. అది మీకు తెలియకపోవటం విచారకరం”.

ఇదంతా విన్నాక ఆ సహ ప్రయాణికుడు “సిద్ధాంత్, ఇన్ని చెపుతున్న మీరు ఒక పది నిమిషాలు నా సీట్ లో వచ్చి కూర్చుంటారా ఆ నటుడి పక్క సీట్ ని నాకు ఇచ్చి” అని అడుగుతాడు. నటుడి అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ...

అప్పుడు సిద్ధాంత్ “నీ సీట్ ఎక్కడ” అని అడిగి, తను చూపించాక ఆ సీట్ దగ్గరికి వెళ్తూ చెవిలో మళ్ళీ ఇలా చెపుతాడు “నటించేవాడిని నటుడు అంటారు. హీరో అనరు. బాగా నటిస్తే మంచి నటుడు, ఉత్తమ నటుడు అంటారు. అవార్డులు కూడా ఇస్తారు”.

మ్యూజిక్ ఆఫ్ చేసి హెడ్ ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటున్నట్టే నటిస్తున్న ఆ ప్రముఖ హీరో ఈ సంభాషణంతా వింటూ విస్మయం చెందుతాడు. పక్కన ఈ కొత్త వ్యక్తి వచ్చి కూర్చోగానే, ఏమీ ఎరగనట్టు ఆ కొత్త వ్యక్తిని ఏం జరిగిందని అడుగుతాడు. అప్పుడు ఆ కొత్త వ్యక్తి జరిగిన సంభాషణంతా మొదటి నుంచి చెప్తుంటే ఆ హీరో రెండోసారి విస్మయానికి గురవుతాడు.

ఆ కొత్త వ్యక్తికి అడిగినన్ని సెల్ఫీస్ ఇచ్చి, సిద్ధాంత్ దగ్గరికి వెళ్లి “మీతో మాట్లాడాలి” అంటాడు ప్రవేష్. ఖాళీగా ఉన్న పక్క సీట్లో కూర్చోమని చూపిస్తూ “చెప్పండి” అంటాడు సిద్ధాంత్.

“మీ సంభాషణ అంత విన్నాను, మొదట నా ఇగో దెబ్బతిన్నా ఆ తరువాత మీరు చెప్పింది కరెక్ట్ కదా అనిపించింది. బాగా చెప్పారు. అందరు హీరోలని ఇంటర్వ్యూ చేస్తారు, సారీ మీ భాషలో నటులని ఇంటర్వ్యూ చేస్తారు, కానీ నాకు మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయాలి అనిపిస్తుంది. అలా అని మీ వ్యక్తిగతమైన, వృత్తిపరమైన విషయాల గురించి ఏమీ అడగను, సినిమాకి సంబంధించిన కొన్ని విషయాల మీద మీ అభిప్రాయం అడుగుతాను చెప్పండి” అన్న ప్రవేష్ మాటలకి సిద్ధాంత్ నవ్వి సరే అని తల ఊపడం చూసి

ప్రవేష్: మీ దృష్టిలో సినిమా?

సిద్ధాంత్: వినోదం పంచేది, వింతలు చూపేది. కళలను, కలలను తెర మీద చూపేది.

ప్రవేష్: హిట్ సినిమా?

సిద్ధాంత్: ఎక్కువ మంది చూసేది

ప్రవేష్: మంచి సినిమా?

సిద్ధాంత్: ఎక్కువ మంది మాట్లాడుకునేది

ప్రవేష్: గొప్ప సినిమా?

సిద్ధాంత్: ఎక్కువ మంది ఎక్కువ కాలం గుర్తు పెట్టుకొనేది

ప్రవేష్: ఫ్లాప్ సినిమా?

సిద్ధాంత్: తక్కువ మంది చూసేది

ప్రవేష్: చెత్త సినిమా?

సిద్ధాంత్: ఎక్కువ మంది తక్కువ కాలం తిట్టేది

ప్రవేష్: కుళ్ళు సినిమా?

సిద్ధాంత్: passion లేని వాళ్ళు ఏదో ఒక పని చేసుకోవటం కోసం తీసేది (నిర్మాత తప్ప)

మృదువైన కంఠంతో "sorry sir, would you like something to drink?" అన్న ఎయిర్ హోస్టెస్ మాటలు విని వాళ్ళు ఆ సంభాషణ ఆపి సింగిల్ ఆరిజిన్ కాఫీ అని ఒకరు, ఆరెంజ్ జ్యూస్ అని ఇంకో ఒకరు చెప్పి తిరిగి మాటల్లో మునగటం చూసి "sure sir" అని ఆ ఎయిర్ హోస్టెస్ ఇంకేం మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

ప్రవేష్: నటి?

సిద్ధాంత్: నటన వృత్తిగా గల స్త్రీ

ప్రవేష్: నటుడు?

సిద్ధాంత్: ముఖానికి రంగులు వేసుకొని సినిమాల్లో నటించేవాడు, వేసుకోకుండా బయట నటించేవాడు

ప్రవేష్: నిజమైన సినిమా విలన్?

సిద్ధాంత్: వినోదం, కొత్తదనం పేరు మీద మితిమీరిన బూతు, హింసని సినిమాల్లో పెట్టి, జనాలకు నచ్చుతుంది అని చెపుతూ మాటలు/పాటలు/కథలు రాసే వాళ్ళు/తీసే వాళ్ళు/నటించే వాళ్ళు.

ప్రవేష్: మీకు టక్కున గుర్తుకు వచ్చే హీరో?

సిద్ధాంత్: సైనికుడు, వైద్యుడు, గురువు. పరుల కోసం నిస్వార్థంగ పని చేసే ప్రతి ఒక్కరు

ప్రవేష్: నిజమైన వినోదం?

సిద్ధాంత్: జనాల్ని మెప్పించేది, రంజింప చేసేది, ఆలోచింపచేసేది, అందరు కలిసి ఆస్వాదించకలిగేది.

ప్రవేష్: సినిమా వాళ్ళ మీద మీ అభిప్రాయం?

సిద్ధాంత్: ఏ అభిప్రాయం లేదు. వాళ్ళు మనషులే కదా, మనలాగే, అందరిలాగే. వాళ్లలో మంచి, చెడు, కోరిక, కోపం, కుటుంబం, ప్రేమ, జాలి అన్ని ఉంటాయి. వాళ్ళు వేరే రకమైన జాతి కాదు కదా, అయిన సినిమా వాళ్ళు ఎక్కడి నుంచి వస్తారు. మనం ఏమైనా వాళ్లని ఎక్కడనుండైనా దిగుమతి చేసుకుంటామా? వాళ్ళు మనలానే ఉంటారు, మనలోనే ఉంటారు, మనలోంచే వెళ్లారు, వాళ్ళు మనలాగే మనుషులు.

అప్పుడు ఆ ప్రముఖ నటుడు, సిద్ధాంత్ తో సెల్ఫీ తీసుకొని, థాంక్స్ చెప్పి వెళ్లి తన సీట్ లో కూర్చొని తన ఐపాడ్ ప్రో లో ఆ ఇంటర్వ్యూ మొత్తం రాసుకున్నాడు. ఆ ఇంటర్వ్యూ ఆధారంగా ఒక లఘుచిత్రం తీయమని తను ప్రస్తుతం పని చేస్తున్న సినిమా అసిస్టెంట్ డైరెక్టర్ కి పంపిస్తాడు........

హీరోకి నటుడికి ఉన్న తేడా అందరికి తెలియ చెప్పటం కోసం.

కౌముది